సవ్యాఖ్యాన శతకసాహిత్య పరంపర - 3

యథావాక్కుల అన్నమయ్య ప్రణీతము -

సర్వేశ్వర శతకము

వ్యాఖ్యాత

డా॥ ముదిగొండ వీరభద్రయ్య

సంపాదకులు

శ్రీ చల్లా సాంబిరెడ్డి



శ్రీ పావని సేవా సమితి ప్రచురణ నెం.3
సవ్యాఖ్యాన శతక సాహిత్య పరంపర - 3

ద్వితీయ ముద్రణము - 2002 ఎప్రియల్ ప్రతులు - 1000

SARVESWARA SATAKAMU	-	Devotional poems on Lord Sarveswara - Well known Telugu Satakamu by Yathavakkula Annamayya.
With commentary by	-	Dr. Mudigonda Veerabhadrayya
Divine Blessings by	-	Sivasri Nirmala Sankara Sastry Aaradhyulu Garu, President, Sri Sivamahapeetham, Hyderabad.
Edited by	-	Sri Challa Sambi Reddy
Published & Rights reserved by	-	Sri Pavani Seva Samithi (Reg) Sri Sai Nilayam - S.R.T. 270 Sanathnagar - Hyderabad- 18 (A.P.), Phone: 3702898.
Title page Drawing	-	Gangadhar
Price	-	**Rs. 50/-**
Type Setting at	-	G.V.Graphics, Gandhi Nagar, Hyderabad - 500 080. Phone: 636053.
Printed at	-	Sri Sai Ram Printers, Hyderabad - 500 004, Phone. 232316.

నా జీవన లతికా వికాసానికి పాదుచేసి ప్రోదిచేసి ఆదుకొని
పల్లవితాదిదశలకు తెచ్చి పరిమళింపజేసిన
వాత్సల్య రస సింధువులు, ప్రియబంధువులు
శ్రీ మెట్టు వెంకటప్పారెడ్డి లీలాకుమారి,
శ్రీ మెట్టు సుందరరామిరెడ్డి సరోజినీదేవి
పుణ్య దంపతులకు
హార్దిక కృతజ్ఞతాభివందనాలతో

- చల్లా సాంబిరెడ్డి

ఓం నమో భగవతే రుద్రాయ
శ్రీ మేధా దక్షిణామూర్తయే నమః
శ్రీ మహా గణాధిపతయే నమః

శివశ్రీ॥ నిర్మల శంకరశాస్త్రి ఆరాధ్యులు
సర్వమంగళా-శివశంభు ఆనంద సదనము (120)
184/ఎ, 6వ రోడ్డు, వెస్ట్ మారేడుపల్లి,
సికిందరాబాద్ - 500 026.

స్వాభిప్రాయము

ఆంధ్రదేశమున మహాత్ములు, కవులు, పండితులు, యోగులు అనేకలు జన్మించి తమ తమ ప్రతిభలతో లోక కళ్యాణము నొనఁ గూర్చిరి. ఇట్టి పురుషోత్తములలో శివశ్రీ" యథా వాక్కుల అన్నమయ్యగారు అగ్రగణ్యులై ఆరాధ్య శేఖరులు నై యుండిరని వారి యీ సర్వేశ్వర శతక రచన వలన విదితమైనది. అన్నమయ్యగారు సంస్కృతాంధ్ర భాషా కోవిదులని ఈ శతకము వలన బోధపడును. వీరి కాలమునకే శ్రీ శివాద్వైత సిద్ధాంతము ప్రచారములో నుండెనని యీ శతకము వలన నిర్ధారింపవచ్చును.

యథావాక్కుల వారు, తమ పద్యములలో, తఱచు గా శివభక్తి ప్రాశస్త్యమును, శివభక్తుల మహిమను ప్రశంసించిరే గాని, మహేశ్వరుని రూప గుణ లీలా వైచిత్ర్యము నెక్కువ కీర్తింప లేదు. లింగధారణమును ప్రస్తావించుచు మహేశ్వరార్చనను గొప్పగా నుడివిరి. ఇష్టప్రాణభావ లింగ నిర్వచనము స్ఫుటముగా లేదు. పంచాచారములను చతుఃషష్టిశీలములను దశావధానములను వారికి వివరించుటకు నవకాశము లేకుండినది. 72వ పద్యమున సాధన చతుష్టములో గల ముముక్షను అపవర్గఫలాకాంక్షా నిరసనముగా నిందు నిరాకరించుట కవి గారి శివభక్తి యొక్క పరాకాష్ఠయని చెప్పవచ్చును. 74వ పద్యములో నుపాసనారహితమగు కేవల వాక్యార్థ జ్ఞానము నిష్ప్రయోజనం బగునని కవి నిరూపించుట శ్లాఘనీయమైనది. 111వ పద్యమున నిష్టలింగార్చన ఘనతను కవి అలంకారికముగ చెప్పిరి. కవియుద్దేశించిన దానిని వ్యాఖ్యాత చక్కగా వివరించిరి.

-ఇష్టలింగ ధారణముననే ప్రాణ భావలింగధారణ విధి యిమిడి యున్నది. ఇష్టలింగ ధారణమును నిరాకరించి, ప్రాణభావ లింగములను ధరించు విధి, యెందును లేదు.

కాన ఇష్టలింగ ధారణమే విధి విహితమని తెలియనగును. పరులు చెప్పెడు అంతర్లింగ ధారణముఁ గూర్చి, విధి, యెచ్చోటను గానరాదు. ఇష్టలింగ ధారణముతో, తత్కాలమున అంతర్దృష్టి కలుగకున్నను - కాలక్రమమున లోచూపుగల వాడై, ప్రాణలింగమును శివపంచాక్షరీ మహామంత్రాను సంధానము ద్వారా భావలింగమును పొందవచ్చును.

ఇష్టలింగము - ఆనందరూపమనియు

ప్రాణలింగము - చిద్రూపమనియు

భావలింగము - సద్రూపమనియు

గుర్తించి, లింగత్రయము నుపాసించినచో, సచ్చిదానంతమయుడగును. సత్త్వము, చిత్త్వము ఉన్నవేను. ఆనందమాత్ర లబ్ధికై ఇష్టలింగధారణము అనివార్యమైనది.

ఈ శతకమున కవి "శివోఽహం" విషయమును కొన్ని పద్యములలో ప్రస్తావించిరి. ధ్యానములో "శివోఽహం" భావన అనివార్యము ముఖ్యమునగుటచే ముక్త దశయందు రానున్న శివసాదృశ్యము బద్ధ దశయందు భావింపఁ దగియున్నది. శివాద్వైత సిద్ధాంతములో "శివోఽహం" భావన ముఖ్యమైనదని శ్రీ కంఠ భాష్యమున తెలుపబడినది.

శ్రీ చల్లా సాంబిరెడ్డి (బి.ఏ., ఎల్.ఎల్.బి.) గారిచే ప్రేరితులై వ్యాఖానాపేక్షములగు ననేక పద్యములకు ఓపికతో పదార్థమును, భావమును, విశేష వివరణమును వ్రాసిన శివశ్రీ ముదిగొండ వీరభద్రయ్య గారుభయభాషా ప్రవీణతను చూపెట్టిరి. శివశ్రీ ॥ శివయోగివర్యులగు ముదిగొండ శంకరారాధ్యుల వారి జీవిత విశేషములను మహిమలను, వీరు "శివయోగి" అను పేరున (196?లో) రచించిన గ్రంథము నింతకు పూర్వమే చదివి సంతోషించితిని.

ఈ శతక వ్యాఖ్యానమున శ్రీ నీలకంఠీయ బ్రహ్మ సూత్రభాష్యాంశములను, నా సహస్రకమలార్చనము నందలి శ్లోకార్థముల నుదాహరించి పద్యార్థమునకు మెఱుగు పెట్టిన సుధీమణులు వీరు. ఈ 142 పద్యములను మూడు రోజులు చదివి వ్యాఖ్యాత యొక్క ప్రతిభను, కవిగారి శివభక్తి ప్రౌఢిమను గుర్తింపనైనది. ఇయ్యది శ్రుతి స్మృత్యాగమ పురాణాభియుక్తి సూక్తుల నవలంబించి రచింపబడుటచే, శివభక్తులందరు దీనిని ప్రత్యహము చిత్త శుద్ధితో పఠించి కృతార్థులు కాగల రనియు, వ్యాఖ్యాత దీనిని వివరించి, ఇహమున పలుకుబడిని, పరమున శివానుగ్రహ పాత్రతను పొందిరనియు, దీనిని

పరామర్శింప నవకాశము లభించినందున, నాకును పరమార్థ లాభము చేకూరెననియు భావించు చున్నాను.

దీనిని ప్రకాశింపఁ జేయు పుణ్యాత్ములు, చల్లా సాంబిరెడ్డి గారు, శ్రీ పావని సేవా సమితివారు, కడుంగడు ఉత్తములై శివభక్తి ప్రచారముఁ జేయుట ముదావహమైనది. పరమేశ్వరుని సర్వేశ్వరునిగా భావించి, సర్వేశ్వర మకుటమున రచింపబడిన యీ శతకమునకు, శబ్దార్థ పరిజ్ఞానములేని కించిజ్ఞులకు నర్థమగునట్లు శ్రీ ముదిగొండ వీరభద్రయ్య గారు వ్యాఖ్యానమును వ్రాయుట అపూర్వమని గుర్తించి ఆ చంద్రతారార్కము శివభక్త జనపాత్యమగునట్లు, శ్రీ రాజరాజేశ్వరుని ప్రార్థించుచున్నాను.

నిర్మల శంకరశాస్త్రి,

28.1.1999

శ్రీ బహుధాన్య-

మాఘ. శు॥ ద్వాదశి

గురువారం-శా.శ.1920

కలియుగ గతం 5099.

శ్రీ శివాయ గురవే నమః

ముందుమాట

యథావాక్కుల అన్నమయ్య పరమ శివభక్తుడైన కవి. శివపారమ్యాన్ని తెల్పుతూ ఈ సర్వేశ్వర శతకాన్ని వారు రచించారు. ఇది పేరుకే శతకం కాని ఇందులో వారు రాసిన పద్యాలు 142. అందుకే కావచ్చును - అన్నమయ్య గారు తన యీ రచనను స్తుతి అన్ని ఒక చోటా, స్తవమని మరొక చోటా అన్నాడు తప్ప శతకం అని అనలేదు. ఐనా ఈ రచన జరిగిన నాటినుంచి నేటి దాకా ఇది శతకం గానే ప్రఖ్యాతి పొందింది.

సర్వేశ్వర శతకంలోని సర్వేశ్వరుడు, ఏదో ఒక క్షేత్రంలోని దేవుడుగా ఈ శతకంలో కనిపించడు. శ్రీశైల మల్లికార్జున స్వామి అని కొందరి తలంపు. కాని దీనికి ఆధారాలు లేవు. ఈ శతకంలో శ్రీగిరి పేరుతో శ్రీశైల ప్రస్తావన ఒక్క పద్యంలో (28వది) మాత్రమే చేశారు అన్నమయ్య. ఈ పద్యంలో కూడా ఆయన శ్రీగిరి మొదలైన తీర్థాలను భక్తితో చూస్తే పాపాలు పోతాయనగా మరి సాక్షాద్భక్తులనే చూస్తే నరుల పాపాలన్నీ పోవా? అని శ్రీశైలంకన్నా శివభక్తుల ఆధిక్యాన్నే తెలిపారు. ఈ రచనలోని సర్వేశ్వరుడు అన్నింటికీ ఈశ్వరుడనే అర్థంలోనే తప్ప ఏదో ఒక్క క్షేత్రంలోని ఈశ్వరుణ్ని బహుశః ఉద్దేశించింది కాదు. అంటే కాళహస్తీశ్వర, దాశరథీశతకాల లాంటిది కాదు.

అన్నమయ్య ఈ శతక రచన ద్వారా శివభక్తిని ఉద్బోధించారు. సాధారణంగా శతకాలలో కవులు తమ ఆత్మకథా ఘట్టాల సూచన అక్కడక్కడ చేస్తారు. ఈ రచనలో అలాంటిది జరుగ లేదు. కేవలం చివరి నాలుగు పద్యాలలో మాత్రమే అన్నమయ్యగారు తను ఈ కృతిని రచించిన కాలం, తన గురువు పేరూ, ఊరు, కులమూ, శాఖా, తన కృతిలో నిక్షేపించిన కొన్ని లక్షణాలూ - తెలిపారు. ఇవి కాక మిగిలిన 138 పద్యాలూ, శివభక్తికి సంబంధించిన అనేక పార్శ్వాలను తెలుపుతూ రాశారీ కవి.

ఈ శతకం పైకి అమాయకంగా కన్పిస్తుంది. ఇందులో కేవల శివభక్తే ఉన్నది తప్ప శాస్త్రాంశాల వంటివి లేవేమో ననిపిస్తుంది మామూలు వాళ్లకు. కాని కాస్త తెలిసి చదివితే అన్నమయ్య కవి ఈ రచనలో కొన్ని 'విశిష్ట శివాద్వైత' మనే తాను పుట్టిన శ్రౌతశైవశాఖ యొక్క అభిప్రాయాలను స్పష్టంగా ఇమిడించి రాశారు. అలాంటి అభిప్రాయాలున్న కొన్ని పద్యాలకు వ్యాఖ్యానంలో వాటిని గుర్తిస్తూ ఈ ప్రచురణలో ఎత్తి చూపడం జరిగింది.

ఈ శతకంలోని శివభక్తి విషయం కూడా విశిష్టమైంది. శ్రీమద్రామానుజుల శ్రీ విశిష్టాద్వైత మతంతో కొన్ని చోట్ల దీనికి సాదృశ్యాలున్నా, ఇందులోని శైవమూ, శివభక్తీ అనూచానంగా వస్తున్న శైవుల జీవన విధానంతో ముడిపడి ఉన్నది. అష్టావరణాలూ, త్రివిధమలాలూ, షల్లింగాలూ, లింగత్రయమూ, పంచాచారాలూ - ఇవన్నీ శ్రౌతశైవ, వీరశైవ మతాలలో ప్రత్యేకంగా ఉన్నవి. ఇక్కడి భక్తి విధానం ఈ పరిభాషతో ప్రకటితమవుతుంది. ఈ లక్షణాలను కొన్ని పద్యాలకు చేసిన వ్యాఖ్యానంలో చూడవచ్చును. ఐతే సర్వ మతస్థులకూ భక్తివిషయికంగా ఉండే సాధారణ లక్షణాలు కూడా ఈ స్తుతి రచనలో కవి చెప్పక పోలేదు. నవవిధ భక్తులని ఏవి భాగవత పురాణం ద్వారా ప్రఖ్యాతంగా లోకంలో వ్యాప్తి పొంది ఉన్నాయో - వాటిని ఈ శతకంలోనూ చూస్తాము. అన్నింటికీ మించి కవికి ఈశ్వరుని మీద ఉన్న అసదృశ ప్రేమను ప్రతి పద్యంలోనూ చూస్తాము. ఈ ప్రేమనే కదా నారద భక్తి సూత్రములు 'సా త్వస్మిన్ పరమప్రేమ రూపా' (2) అని సూత్రీకరించాయి! ఈ ప్రేమ పునాదిగా ఈశ్వరుని (1) శ్రవణం (2) కీర్తనం (3) స్మరణం (4) పాదసేవనం (5) అర్చనం (6) వందనం (7) దాస్యం (8) సఖ్యం (9) ఆత్మనివేదనం - అన్న తొమ్మిది రీతులుగా భక్తి ఉంటుంది. వీటిని కవి తన యీ రచనలోని అనేక పద్యాలలో స్పష్టంగా చూపించారు. ఐతే వీటి నన్నింటికీ నేపథ్యంలో శ్రౌత శైవ ఆచార వ్యవహార పద్ధతులు మాత్రం దన్నుగా ఉంటాయి.

ఈ భక్తి రచనలో కొట్ట వచ్చినట్లుగా కన్పించే మరొక ముఖ్య అంశం ఈశ్వరానుగ్రహ విషయం. భగవద్గుణ, శ్రవణ కీర్తనలు చేయడానికైనా, మరి దేనికైనా కూడా, ఈశ్వరానుగ్రహం ఉండితీరాల్సిన అంశం. నారద భక్తి సూత్రాలు కూడా 'ముఖ్యతస్తు మహత్ కృపయైవ భగవత్ కృపాలేశాత్ వా' అని అంటున్నాయి. అన్ని మతాలూ భక్తిని గురించి చెప్తూ ఈ అంశాన్ని అత్యంత ప్రధాన విషయంగా భావిస్తున్నాయి.

అన్నమయ్య గారు స్పృశించిన మరొక సాధారణ భక్తి లక్షణం భగవంతునికీ భగవంతుని భక్తులకూ భేదం లేదనడం. నారద భక్తి సూత్రాలు "తస్మిన్ తజ్జనే భేదాభావాత్" అని మాత్రమే అంటే అన్నమయ్య గారూ, ఆయన అనుసరించిన శైవమతాలూ ఈశ్వరునికన్నా కూడా ఈశ్వర భక్తుణ్ణి పై స్థానంలో నిలిపినవి! ఈ స్తోత్ర శతకంలో ఈ అంశాన్ని తెలిపే పద్యాలు అనేకం ఉన్నాయి.

ఈ శతకంలో విశిష్టంగా కన్పించే ఇంకొక ముఖ్యాంశం సంగత్యాగం - దుస్సంగ త్యాగం, దీన్నీ మనం 'దుస్సంగః సర్వథైవ త్యాజ్యః' అన్న సూత్రంగా నారద భక్తి సూత్రాలలో

చూస్తాము. భక్తగోష్ఠీ విషయం అన్నమయ్య అనేక పద్యాలలో చెప్పారు. సత్సంగ మహిమ, భక్తమతాలన్నీ సాధారణంగా చెప్పేవే. దుస్సంగాన్ని విడవమని కూడా అందరూ చెప్పే సాధారణ విషయమే. 'కామ క్రోధ మోహస్మృతి భ్రంశ బుద్ధి నాశ కారణత్వాత్' అని నా.భ. సూత్రాలు చెప్పుతున్నాయి. కామక్రోధాదులు. దుస్సంగం వల్ల కల్గుతాయి. కాబట్టి దుస్సంగాన్ని వద్దంటున్నారు. అసలు శివభక్తి అరిషడ్వర్గాన్ని జయించిన వాడికే కల్గుతుందంటూ

— *"కామోద్రేక విజృంభణంబును సమగ్రక్రోధమున్ లోభమున్*
వ్యామోహంబు మదంబు మచ్చరము దీవ్రంబైన పంచేంద్రియో
ద్దామాటోపము గ్రాఁచి పెంపెసగు తత్త్వజ్ఞానికిం గాక తా
సామాన్యాత్ముల కేల నూలుకొను నీ సద్భక్తి! సర్వేశ్వరా!" (62)

కవి రాస్తారు. మరి దుస్సంగం వీటిని జయింపనీయదు కదా. ఇట్లాగే సద్భక్తునికి సదాచారాన్ని కూడా లక్షణంగా చెప్తారు అన్నమయ్య. 'అహింసా సత్యశౌచ దయాస్తిక్యాది చారిత్ర్యాణి పరిపాలనీయాణి' అని నా.భ. సూత్రాలు చెప్తుండగా అన్నమయ్య గారు -

— *సత్యం బెప్పుడుఁ దప్పఁడేనియు దురాచారుండు గాఁడేని యౌ*
చిత్యం బేమఱఁడేని దుర్జనుల గోష్ఠిం బొందఁడే భక్త సాం
గత్యం బాదటఁ బాయఁడేని మదన గ్రస్తుండు గాఁడేని నీ
భృత్యుండాతఁడు మూఁడు లోకములలోఁ బెంపొందు సర్వేశ్వరా!

అని సరిగ్గా అదే భావాన్ని (మరికొన్ని జోడించి) చెప్పారు. ఐతే శివభక్త పక్షపాతంతో ఒక పద్యంలో కవి శివభక్తుడు ఎక్కడైనా వక్రుడై నడిచినా దానికి కలుషించడం ఎందుకు? 'నిర్మల గంగా పృథుల ప్రవాహం ఎన్ని వంకలుగా బాఱినన్ దాని నొండు పలుకంగా జన్నె! (33) అని ఎంతో కవితాత్మకంగా సమర్థిస్తాడు. కాని మరొక పద్యంలో శివార్చనలో మొదటి పువ్వు సత్యమనీ, రెండవ పువ్వు దయాగుణమనీ, తృతీయ పుష్పం భక్తియోగ విధానమనీ సరిగ్గా నారద సూత్ర సదృశంగా చెప్తారీ కవి (95.ప.).

ఈ రచనలో కొన్ని పద్యాలు శివభక్తునికన్నా తీర్థ క్షేత్రాల వల్ల అధిక ప్రయోజనం ఉండదనీ, అసలు ఆ తీర్థాలకు మహిమ శివభక్తుల వల్లనే కల్గిందనీ చెప్తాయి. ఈ అంశం కూడా సాధారణంగా అన్ని భక్తమతాలూ, నా.భ. సూత్రాలూ చెప్పేవే. భక్తి సూత్రాలీ విషయాన్ని ఇట్లా చెప్పాయి - "తీర్థీకుర్వన్తి తీర్థాని, సుకర్మీ కుర్వన్తి కర్మాణి, సచ్ఛాస్త్రీ కుర్వన్తి శాస్త్రాణి' మహాభక్తులు తీర్థాలకు కూడా పవిత్రతను కలిగిస్తారు. సర్వ కర్మలనీ పావనం చేస్తారు. సర్వశాస్త్రాలకూ ప్రామాణికతను కల్గిస్తారని అర్థం.

అసలు భక్తుణ్ని చూస్తే చాలు తీర్థాలలో క్రుంకాల్సిన అవసరం లేనంతగా ఈ మతం భావిస్తుంది.

అన్నమయ్య గారిది కాయిక వాచిక మానసిక భక్తి. ఈ త్రివిధ భక్తులనీ ఈ శతకంలో 'కవితాత్మకంగా ప్రపంచించారు. భక్తి విషయకంగా అన్నమయ్యగారి ఈ సర్వేశ్వర శతకం ఒక విశిష్ట పంథాను తెలుగు సాహిత్యానికి చూపింది. భక్తియోగాన్ని ఆకర్షకం చేసి తెలుపుతూనే ఈ శతకం శైవతత్త్వ రహస్యాలను కూడా అంతే ఆకర్షణతో తెలిపింది. శ్రీ నీలకంఠ భాష్యస్థ విషయాలను అలవోకగా ఈ శతకంలో అన్నమయ్య కవి కవిత్వీకరించారు.

అష్టావరణాలలోని గురువు, మంత్రం, జంగమార్చనలను గురించి ఎంతో మంచి పద్యాలనీ శతకంలో రాశారు. భగవంతునికీ భక్తునికీ భేదం లేదనే సామాన్య భక్తి లక్షణమే ఈ మతంలో జంగమార్చనగా వైశిష్ట్యాన్ని సంతరించు కొన్నది. బసవన్న ప్రబోధించిన వీరశైవ మతంలోనూ దీని ప్రాధాన్యం అంతా ఇంతా కాదు - ఇట్లాగే శైవులకు తప్పని సరి విధి అయిన శాంభవ దీక్ష విషయంకూడా ఇందులో ఉన్నది. శివలింగార్చన, పంచాక్షరీ మంత్రజపం, గురుభక్తి, జంగమార్చనలన్న శైవమత ముఖ్యాంశాలను చక్కగా తెలిపిన తొలి శతకాలలోఇది ప్రధాన శతకం. ఈ శతకానికి విలక్షణత కూడా ఇందువల్లనే వచ్చింది. శాంభవ దీక్షను పొందిన కవి రాస్తున్నప్పుడు తప్పనిసరిగా మనకు కనిపించే సౌలభ్యం ఈ శతకంలో గుర్తించ గల్గుతాము. దూదికొండ సోమనారాధ్యుడనే గురువు వద్ద శివ దీక్ష పొందిన వాడే అన్నమయ్య.

సర్వేశ్వర శతక రచన కొన్ని చోట్ల ఎంతోప్రౌఢంగానూ, మరికొన్ని చోట్ల ఎంతో సరళంగానూ కన్పిస్తుంది. కొన్ని పద్యాలలో అన్వయ కాఠిన్యమూ లేకపోలేదు. కొన్ని చోట్ల భాషలో ఆనాటి వ్యావహారికత ఎంతో 'తీయగా' చోటు చేసికొన్నది.

— *"కానీ దార సమన్వితుండు మిగులంగా నీఁడు కందర్పునిన్*
గోనీ మానవ కోటిలో మరులు పైకోనీడు మోహంబునున్
రానీ రాజిత రాజ్య వైభవము పై రానీడు గర్వంబునున్
లో నీవైన మహాత్ముడన్యమునకున్ బోనీడు సర్వేశ్వరా!" (128)

అన్న పద్యంలోని క్రియల్ని గమనించాలి. కొన్ని పద్యాలలో విలక్షణ శైలిని అన్నమయ్య ఆవిష్కరించారు. -

— *"ఏయే వేళల నే వయస్సున నరుండే భూమి నేయూరిలో*
నేయే కర్మము నాచరించు నశుభంబేనిన్ శుభం బేని, దా"

అని మొదటి రెండు పాదాలుండగా వీటికి సమతూకంగా తక్కిన రెండు పాదాలను

— *"ఆయా వేళల నా వయస్సున నరుండా భూమి నా యూరిలో*
నాయా కర్మఫలంబు లెల్ల కుడుచున్ సొంతంబు సర్వేశ్వరా!" (126)

అని రాస్తారు! ఈ పద్యం ఇట్లా ఎంతో హృద్యరీతితోనూ, శిల్పంతోనూ ఉన్నది. 119వ పద్యం కూడా సరిగ్గా ఇట్లాంటిదే. కొన్ని చోట్ల అన్నమయ్య కవి పాదాల మధ్యన విరిచిన విరుపులు ఎంతో మధురంగా అన్పిస్తాయి -

"సకలాధీశ్వరులై గణాధిపతులై సర్వజ్ఞులై, నిత్యులై
అకలంకాత్మకులై మహామహిముల్రై, యంభోజగర్భాండ ర
క్షకులై యుండుదు రెల్లవారును."

అన్న పద్యంలో మనం ఎంత కావాలనుకున్నా అంతా కలిపి ఏకధాటిగా చదువలేం. ప్రతి క్రీగీటు దగ్గరా తప్పని సరిగా ఆగాల్సిందే. అలాంటి ప్రతి విరామమూ ఈ పద్యానికి అందాన్ని సాధించింది. ఇదే పద్యంలో శేషభాగం దీనికి పూర్తి వ్యతిరేకం.

"... (భవత్సద్భక్తి) నానాగణా
ధిక లీలా విధినంతరంగముల వర్తింపంగ (సర్వేశ్వరా!) (109)

ఈ భాగంలోని రచనలో మనం ఆపాలన్నా ఆపలేము! రెండు విభిన్నశైలులు ఒకే పద్యంలో ఇట్లా చోటు చేసికొని రచనకు అందాన్ని పెంచాయి. ఇట్లాంటి పద్యరచన ఈ కావ్యంలో కొన్ని చోట్ల కన్పిస్తుంది.

ఈ శైలీ వ్యవహారంతో పాటుగా కవితాధర్మం కూడా ఈ శతకంలో ఉత్తమ స్థాయిలో కన్పిస్తుంది. నిజానికి ఈ కవితా ధర్మమే ఇందులో కవి ప్రపంచించిన భక్తికీ, శివతత్త్వానికీ ప్రాణంగా నిలిచింది. ఈ ధర్మమే ఈ శతకాన్ని తెలుగు సాహిత్యంలో విలక్షణ రచనగా గుర్తింపు పొందేటట్లు చేసింది. ఒక పద్యంలో కవి - గురుమంత్రమనే ధనుస్సులో ఆత్మఅనే అస్త్రాన్ని అష్టాంగ యోగం అనే పిడికిలితో వేయడం అంటాడు (69). మరొక పద్యంలో 'భవదుఃఖార్ణవ యాన పాత్రము పరబ్రహ్మంబు' (107) - అని అంటాడు. ఇంకొక పద్యంలో రెండు కట్టెలను తెచ్చి వాటిని తరచితే పుట్టిన అగ్ని ఎట్లా ఆ రెండింటినీ తగుల బెడ్తుందో అట్లాగే శరీరాన్ని సత్కర్మతో మధిస్తే, శివుని చిచ్ఛక్తి అనే సద్వహ్ని ప్రదీపించి, అటు కాయాన్నీ ఇటు కర్మాన్నీ పోగొడ్తుందంటాడీ కవి. తాత్త్విక విషయాలను భక్త పాఠకులకు సుగమం చేయడానికి కవిత్వాభివ్యక్తి ఎంతగానో పనికి వస్తుందని వేరే చెప్పనక్కర లేదు.

ధూర్జటి మొ॥న కవులకు ఆవేశ స్ఫూర్తిని తొలుతగా కల్గించిన ఆదర్శ రచన ఈ శతకమే ననడంలో ఆశ్చర్యం లేదు. ఆ ఆవేశ వేళలో అన్నమయ్య గారు సుదీర్ఘ సమాసాలను రమ్యంగా రచించడం కూడా ఒక విశేషం.

"ఉరు సంసార గజేంద్ర దర్పదళన వ్యాఘ్ర ప్రతాపోగ్ర కేసరి - దుష్ప్రాప శరీర బంధ విపులక్ష్మాజ ప్రజ చ్ఛేదవిస్ఫురిత కుఠారధార దురిత ప్రోద్భూ త జీమూత దుస్తర సంఘాత విఘాత మారుతము నీ సద్భక్తి" (57)

అని శివభక్తి విషయం రాగానే ఆవేశంతో సమాస రచన చేస్తాడు కవి. ఇట్లాంటి ఆవేశ రచన ఈ రచనలో చాలా చోట్ల కన్పిస్తుంది.

యథావాక్కుల అన్నమయ్య గారి స్వీయ విషయాలు అంతగా తెలియరావు. ఈ శతకంలోనే 'శాకాబ్దంబులు వార్ధి షట్కపుర జిత్సంఖ్యం బ్రవర్తింప' అనే పద్యంలో కవి తన రచనా కాలాన్ని శాలివాహన శకం 1164 అని చెప్పుకోవడం చేత ఆ విషయం తెలిసింది. ఇంటి పేరు 'యథావాక్కుల' అని కూడా 'జయశక్తిన్ రవిచంద్ర తారకముగా' అనే చివరి పద్యం ద్వారా స్పష్టపడ్తుంది. ఏ ఊరి వాడో గ్రంథస్థ సాక్ష్యం లేదు. గురువుగారి ఊరూ పేరూ మాత్రం ఈ రచనలో చెప్తూ 'దూదికొండ మహనీయారాధ్య సోమేశ్వర ప్రభు'' అని అన్నాడు. ఈ దూదికొండే నేటి పత్తికొండ కావచ్చునని ఒక అభిప్రాయం. తన యీ సర్వేశ్వర శతక రచనకు ప్రేరకమేమిటో కవి చెప్పుకోలేదు. కాని జనశ్రుతిగా కొంత సమాచారం ఈ విషయంలో ఉన్నది. శ్రీశైల క్షేత్రం నుంచి ఒకసారి అన్నమయ్య గారు తిరిగివస్తూ కృష్ణా తీరంలోని 'సత్రశాల' అనే గ్రామంలోని మల్లికేశ్వరస్వామి ఆలయంలో కొన్ని రోజులు శివార్చన చేస్తూ ఈ శతక రచన చేసినాడట. ఐతే ఈ రచన ప్రకాశానికి ఆయన తనకు తానే ఒక నియమాన్ని పెట్టుకొన్నాడట. తాటాకు మీద రాసిన ప్రతి పద్యాన్నీ ఆయన కృష్ణలో పడవేసేవాడు. శివాంగీకారం ఉంటే, అట్లా నీట్లో వేసిన పద్యపు ఆకు కొట్టుకుని పోకుండా తన వద్దకు తిరిగి రావాలి. తన రచన మొత్తానికీ ఇదే నియమం? ఒక వేళ ఏదైనా పద్యం తిరిగి రాకపోతే శతక ప్రకాశనం ఆగడమే కాదు - తన శిరస్సును గండె కత్తెరతో కత్తిరించు కొని మరణిద్దామను కొన్నాడట! 86 పద్యాలు నీటిలో పడినా మళ్లీ అన్నమయ్యకే తిరిగి వచ్చాయట. కాని 87వ పద్యం

"తరులం బువ్వులు పిందెలై యొదవి తత్తజ్జాతితోఁ బండ్లగున్
హర మీ పాదపయోజ పూజితములై యత్యద్భుతం బవ్విరుల్
కరుతౌనశ్వముతౌ ననర్ఘమణుతౌఁ గర్పూరమౌ హారమౌఁ
దరుణీ రత్నముతౌఁ బటీర తరుతౌఁ దధ్యంబు సర్వేశ్వరా!'

- తిరిగి రాలేదు. దీన్తో అన్నమయ్య గండెకత్తెర ప్రయోగానికి వీరభక్తుడుగా సిద్ధమైనాడు. కాని ఇంతలో ఒక పశువుల కాపరి ఒక తాటాకు నదిలో దొరికిందంటూ తెచ్చి ఇచ్చి మాయమైనాడు. ఆకైతే తాను పడవేసిందేకాని, పద్యం తనది కాదు! ఆ పద్యంలోనూ 'సర్వేశ్వరా!' అన్న మకుటమే ఉన్నది.

సర్వేశ్వర కృతమైన ఆ పద్యం ఈ శతకంలోనే ఎక్కడో ఉండకుండా ఉంటుందా? ఉన్నది కాబట్టే ఈ శతకానికి ఇంతటి పేరూ మహత్తూ! శివనిర్మాల్య మహిమ పుష్పదంతుని కథ ద్వారా మనకు తెలుసు. ఈ శతక పద్యాలతో అన్నమయ్య శివార్చన చేశాడు. ఇవన్నీ శివ నిర్మాల్యమే. ఈ పద్యకుసుమాల వల్ల భక్తులైన సాధకులకు ఏమి సిద్ధించదు?! 'సన్ముని గణస్వాధ్యాయ సారంబు' అని శివనామాన్ని అన్నమయ్య అన్నారు. ఈ రచన కూడా అంతే. ఈ కృతిలో ఒక చోట అన్నమయ్య సర్వేశ్వరుణ్ని

'గౌరీలోచన నర్తకీ నటన రంగస్థాన'

అని కీర్తిస్తాడు. సర్వేశ్వరుడు శివశక్తి యుతుడు. అందువల్ల ఆయన ఇవ్వలేనిదేమిటి?! ఆయన ఇవ్వగలిగిందీ, ఇవ్వదలచిందీ - ఇవ్వడానికి ఏర్పాటే ఈ సర్వేశ్వర శతకం. ఇది ప్రాకామ్యస్తవం. ఈ శతకం చిత్రార్థాంచిత శబ్ద బంధురమైనది. సజ్జన శ్రోత్రానందమైనది. శుభాంచిత మైనది. ఈశ్వరానుగ్రహ ప్రాప్తికిది చింతామణి. మానుషత్వం నుంచి ప్రమథత్వానికి ఎక్కించే నిచ్చెన ఇది. మలత్రయ నిర్మూలిని ఇది. భావలింగ ప్రాప్తికిది గొప్ప సహకారి. అమృతత్వం గూడు కట్టిన సత్కృతి ఇది. రౌప్య కుధర వ్యాపారి అయిన శివసాయుజ్యాన్ని పొందింప జేసే అధ్యాత్మ శాస్త్రం ఇది.

భక్తి వల్లరికిది ఆలవాలం

భక్తి వల్లరికిది ఆధారస్తంభం

భక్తి వల్లరికిది తెలుగు పందిరి.

మహావిద్వాంసులు శ్రీమాన్ ఉత్పల సత్యనారాయణాచార్యుల వారు శ్రీ చల్లా సాంబిరెడ్డిగారికి నా పేరు సూచించి నేనీ వ్యాఖ్యానం రాయడానికి కారణమైనారు. వారి ఋణం తీర్చలేనిది వారికినమోవాకాలు.

ఈ గ్రంథప్రచురణ బాధ్యతేకాక మరికొన్ని శతకాలను కూడా ఇట్లాగే ప్రచురిస్తున్న మహానుభావులు మహాదాత, ఆధ్యాత్మిక సంపన్నులు శ్రీ చల్లా సాంబిరెడ్డిగారు. పాఠకులు, భక్తులు, ఈ వ్యాఖ్యాత వారికి ఋణగ్రస్తుడు. వారికి నమస్సులు.

ప్రచురించిన శ్రీ పావని సేవా సమితి వారికి, దానికి కార్యదర్శులైన శ్రీ రామారావుగారికి నమస్సులు.

స్వాభిప్రాయము అనే పేరుతో ఈ గ్రంథాన్ని నన్నూ ఆశీర్వదించిన శ్రీ శైవ మహాపీఠాధ్యక్షులు, విద్యాభూషణ, సాహిత్య రత్న, శివయోగివర్యులు అయిన శివశ్రీ॥ నిర్మల శంకరశాస్త్రిగారికి సాష్టాంగ నమస్కారం.

భవదీయుడు

— *ముదిగొండ వీరభద్రయ్య*

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ

సర్వం శివార్పణమస్తు

మా మాట

సాహిత్యం చాలా ప్రభావవంతమైన వస్తువు. దానికి భగవద్ వైముఖ్యం కలిగించడంలోనూ, భగవదాభిముఖ్యం కలిగించడంలోనూ అప్రతిమానమైన సామర్థ్యం ఉంది.

గతంలో మాదిరి, మానవ మానస వికాసం ధర్మావగాహన - పారలౌకిక చింతన అనే పునాదులపై జరగడం లేదనేది గమనార్హం. ఈ లోటు పూరించడానికి శ్రీ పావని సేవాసమితి శతకసాహిత్యం మీదికి దృష్టి మళ్లించింది. భక్తి సంప్రదాయ శతక సాహిత్య ప్రచురణతోపాటు, నీతి శతక సాహిత్య ప్రచురణ కూడ చేపట్టింది.

ప్రథమ ప్రచురణ శ్రీకృష్ణ శతకము, మహాకవి శ్రీ ఉత్పల సత్యనారాయణా చార్యుల వారి 'గోపీనయనోత్పలార్చిత వ్యాఖ్య'తో జనవరి 1998లో ప్రచురించటం - పండితుల ప్రశంసలందుకోవటం జరిగింది. ద్వితీయ ప్రచురణ ఆచార్య కులశేఖరరావుగారి వ్యాఖ్యతో దాశరథి శతకము మీ ముందుంది.

మా తృతీయ ప్రచురణ మహాకవి యథావాక్కుల అన్నమయ్యగారి సర్వేశ్వర శతకము. మా కోరికను మన్నించి సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు డా॥ ముదిగొండ వీరభద్రయ్యగారు, ప్రఖ్యాతమైన ఈ సర్వేశ్వర శతకానికి అనుపమానమైన వ్యాఖ్య వ్రాసి అనుగ్రహించారు. ఈ శతకం గురించి వారి ముందుమాటలో పొందుపరచిన వివరణలు, భావితరాల వారికి వెలుగుబాటగా నిలుస్తాయి.

ఈ వ్యాఖ్యాత చేసిన సర్వేశ్వరానుశీలనం భక్తి మార్గంలో ముక్తికి సోపానంగా, సాహిత్యానంద బృందావనంలో సుగంధాలను వెలయిస్తూ అన్ని కాలాల పాఠకుల హృదయాలను పరవశింపజేస్తుందని మా విశ్వాసం. శ్రీ ముదిగొండ వీరభద్రయ్య గారికి మా కృతజ్ఞతలను తెలుపుకొంటున్నాము.

ఈ పుస్తకానికి స్వాభిప్రాయము అనుగ్రహించిన శివశ్రీ నిర్మల శంకరశాస్త్రి ఆరాధ్యులు, సికిందరాబాద్ మహోదయులకు శ్రీ పావని సేవా సమితి పాలకవర్గం కృతజ్ఞతలను తెలుపుకొంటున్నది.

ఈ శతకముల ప్రచురణలో ప్రతి విషయమునందు మాకు సూచనలిస్తూ సర్వవిధముల సహకరించిన పూజ్యులు, ఆంధ్రవ్యాస, కవికుల రత్నదీప, వైదికాగమాలంకార శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య గారికి మా కృతజ్ఞతలను తెలుపుకొంటున్నాము.

ఈ పుస్తకానికి ముఖపత్రాలంకరణ కావించిన ప్రఖ్యాత చిత్రకారులు శ్రీ గంగాధర్ గారికి, ముచ్చటగా టైపు చేసిన జి.వి.గ్రాఫిక్స్ వారికి, సుందరంగా ముద్రించిన శ్రీ సాయిరాం ప్రింటర్స్ అధినేత శ్రీ నాగేశ్వరరావు గారికి, మా కృతజ్ఞతలు.

జి.సి.హెచ్.రామారావు

కార్యదర్శి, శ్రీ పావని సేవా సమితి

శ్రీ శివాయ గురవే నమః

సర్వేశ్వర శతకము

1. *శ్రీ కంఠుం బరమేశు నవ్యయు నిజశ్రీపాద దివ్య ప్రభా*
నీకోత్సారిత దేవతా నిటల దుర్నీత్యక్షర ధ్వాంతుఁజి
త్ప్రాకామ్యాంగు నపాంగ మాత్ర రచిత బ్రహ్మాండ సంఘాతుఁజం
ద్రాకల్పుం బ్రణుతింతు నిన్ను మది నాహ్లాదింతు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

శ్రీకంఠున్ = శ్రీని కంఠమునందు కలవాణ్ని; పరమ ఈశున్ = సంపూర్ణ అధికారం కల్గిన దేవుని; అవ్యయున్ = ఏ కాలంలోనూ ఎలాంటి నాశమూ లేనట్టి వాణ్ని; నిజశ్రీపాద = స్వీయమైన శుభపాదముల యొక్క; దివ్య = దేవతా సంబంధమైన; ప్రభానీక = కాంతిపుంజం చేత; ఉత్సారిత = తొలగింపబడిన; దేవతానిటల = దేవతల సమూహం యొక్క; దుర్నీతి = చెడు నడత అనే; అక్షర ధ్వాంతున్ = అక్షర అంధకారము కలవాణ్ని; చిత్ = చిత్తనే; ప్రాకామ్య అంగున్ = ఐశ్వర్యాన్నే శరీరంగా కలవాణ్ని; అపాంగమాత్ర = కడకంటి

చూపుమాత్రం చేతనే; రచిత = సృష్టించిన; బ్రహ్మాండ సంఘాతు = చతుర్దశ లోకాల సమూహం కల్గిన వాణ్ని; చంద్రాకల్పున్ = చంద్రుడు అలంకారంగా కల్గినవాణ్ని; నిన్ను = అట్టి నిన్ను; ప్రణుతింతు = నమస్కరిస్తాను; మదిన్ = మనస్సులో; ఆహ్లాదింతు = ఆనందపడ్తాను.

— *సర్వేశ్వరా! విషాన్ని కంఠంలో కల్గిన నిన్ను, నాశంలేని నిన్ను, నీ పాదముల దివ్య కాంతి పుంజంచేత, దేవతా సమూహాల దుష్టమైన నీతి అనే అంధకారాన్ని తొలగించిన నిన్ను, చిత్ శక్తి అనే అష్టైశ్వర్యాలలో ఒక దాన్ని శరీరంగా కల నిన్ను, కడకంటి చూపు మాత్రం చేతనే బ్రహ్మాండ సమూహాన్ని సృష్టించిన నిన్ను, చంద్రుణ్ని శిరస్సున దాల్చిన నిన్ను నమస్కరిస్తాను. మనస్సులో ఆనందిస్తాను.*

❊ *ఈ పద్యం 'శ్రీ' కారంతో మొదలయి కావ్యారంభంలో మంగళం ఉండాలన్న సంప్రదాయాన్ని అనుసరించింది. ఐతే ఇక్కడ విషాన్ని కంఠంలో కల్గిన శ్రీకంఠునికి ప్రణుతి అంటున్నాడు కదా - అదేం మంగళం? 'శ్రీ' అన్నంత మాత్రంలోనే మంగళమా? దాని అర్థం విషం కదా అని అంటే పరమశివుడు విషాన్ని లోకక్షేమం కోసమే కదా కంఠంలో ఉంచుకొన్నది అని సమాధానం. ఊర్ధ్వఅధోలోకాలకి వేటికీ విషం తగిలి శివేతరం కాకుండా శివుడు విషాన్ని రెంటికీ నడుమన తన కంఠంలో ఉంచుకున్నాడు.*

❊ *శివునికి వికారాన్ని కల్గించే ఈ శ్రీకంఠత్వాన్ని స్తోత్రాదినే చెప్పడం ఏమి సొగసు? ఏమి ఔచిత్యం అని ప్రశ్నించవచ్చును? దీనికి సమాధానం మనకు పుష్పదంతుని మహిమ్నస్తవంలో దొరుకుతుంది.*

అకాండ బ్రహ్మాండ క్షయ చకిత దేవాసుర కృపా
విధేయస్యాసీద్యస్త్రినయన విషం సంహృతవతః।
సకల్మాషః కంఠే తవనకురుతే నశ్రియ మహో
వికారోఽపి శ్లాఘ్యో భువన భయభంగ వ్యసనినః॥

— త్రినయనా! అకాలంలో, బ్రహ్మాండ నాశం వల్ల భీతిపొందిన దేవతలకూ రాక్షసులకు కృప చూపించే వాడివై, గరళాన్ని తాగిన నీ కంఠంలో ఏకల్మషం ఉందో, ఆ నల్లదనం శోభను కల్గించడం లేదనలేదు. లోకాల భీతిని నాశనం చేయడంలో ఆసక్తి కలిగిన వాడికి వికారం కూడా శ్లాఘ్యమే. వికారోపిశ్లాఘ్యః అన్నదిక్కడ ప్రమాణవాక్కు అయిపోయింది. అందుచేత లోకక్షేమ దృష్ట్యా ఈ వర్ణవికృతిని శివుడు పొందినవాడు కాబట్టి తొలిపద్యం మొదటి శబ్దమే శ్రీకంఠుడని ఉండటం అనౌచిత్యం కాదు.

❇ పరమేశుడు అన్న శబ్దం సర్వేశ్వర శబ్దార్థంతో తుల్యత కలిగింది. ఈశ్వరులకు పరముడీయన. దేవేంద్రాదులను ఈశ్వరులుగా వేదం చెప్పింది. వారందరికీ ఈయన ఈశ్వరుడు కాబట్టి ఇక్కడ పరమేశ్వర శబ్దం ప్రయోగించారు కవి.

❇ అవ్యయుడన్న శబ్దం ఈశ్వరునికే చెల్లేది. ఈశ్వరునికి జన్మ, జరామరణాలు లేవు. ఆయన ఏదో, ఆయన ఎంతో - అందులో ఏ మాత్రమూ మార్పు ఉండదు. భూత భవిష్యత్ వర్తమానాల్లో వ్యయం - నాశనం - లేని వాడాయన.

❇ సర్వేశ్వరుడు సచ్చిదానందుడు. స్థాణువూ, చైతన్యమూర్తీ, ఆనందమూర్తీ ఆయన. ఈశ్వరుడైన ఆయనకు అష్టైశ్వర్యాలూ ఉన్నాయి. శరీర మాత్ర జీవి కాదాయన. ఎక్కడి కంటే అక్కడికి ఏ రూపంలోనైనా వెళ్ల గల్గిన ప్రాకామ్యత్వం ఆయనకు ఉంది. అది ఆయన చిద్రూప లక్షణం. అవ్యయత్వం ఆయన సత్‌రూపం. ఈ రెండింటి ఫలితం ఆనందం. సత్‌చిత్ రూపాలను ప్రణుతిస్తున్న ఈ భక్తుడికి కూడా ఆయన ఆహ్లాదాన్నీ ఆనందాన్నీ కలిగిస్తున్నాడు. ఇది విశేషం.

❇ బ్రహ్మాండాలను తనకంటి చూపు మాత్రం చేతనే సృజించేవాడని పద్యంలో ఉంది. అంటే అంత తేలికగా సృజిస్తాడని అర్థం. శివునిలో ఒక ఇచ్ఛ

కల్గుతుంది. దాన్తో అంతవరకు అవ్యక్తంగా ఉన్న జడ చేతన రూప జగత్తు పుడ్తుంది. సంకల్పించక ముందు కూడా ఇది శివునిలో అవ్యక్తరూపంగా, అంటే సూక్ష్మ రూపంలో ఉంటుంది. అప్పుడిది అకార్యం. శివ సంకల్పానంతరం ఇది కార్య రూపం పొందుతుంది. జగత్తుగా స్థూలంగా కన్పిస్తుంది. శివుని కంటి చూపే ఇక్కడ చిత్తు. ఈ చిత్తునే 'మాయ' అనీ అంటారు. ఇదే సూక్ష్మ చిదచిత్ విశిష్ట బ్రహ్మ (శివుడు) స్థూలచిదచిత్ బ్రహ్మమునకు కారణం. నీలకంఠ భాష్యం 1.1.2.లో "సూక్ష్మ చిదచిద్విశిష్టం బ్రహ్మకారణమ్; స్థూల చిదచిద్విశిష్టం తత్ కార్యం భవతి" అని ఉన్నది. సృష్టికి హేతువుని శ్రౌత శైవం ఇట్లా చెప్తున్న దన్న మాట. ఈ సూక్ష్మ స్థూల శివులకు అభేదం విశిష్ట రీతిలో చెప్తున్నది కాబట్టే ఈ మత శాఖకు పేరు 'విశిష్ట శివాద్వైతం'. అన్నమయ్య ఈ మతానికి చెందినవాడు కావడం చేత కొన్ని పద్యాలలో ఈ శైవశాఖాభిప్రాయాలను రమ్యంగా వ్యక్తీకరించాడు.

❋ చంద్రుని ఆభరణంగా ధరించడంలో విశేషం ఏమిటి? లోకాలనే సృష్టించాడని ముందుపాదంలో చెప్పాడు కదా అంటే లోకంలో మనకు కన్పించే 15 కళల చంద్రుడు కాడీయన. దాన్తో పాటు 16వ కళగా ఉన్న చంద్రుణ్ణి కవి ఇక్కడ ఉద్దేశిస్తున్నాడు. 15 కళలు వృద్ధిక్షయాలున్నట్టివి. 16వ కళ 15 కళలలోని కాంతిని ఆకర్షించుకొని భక్తులకు శివజ్ఞానాన్ని కల్గిస్తుంది. అంటే పేరుకి ఒక్క కళే అయినా, తక్కిన 15 కళల మేలిమిని పోత పోసికొన్న కళ ఇది. దీన్ని ధరించిన వాడిని ప్రణుతిస్తున్నానంటున్నాడు కవి. భక్తుడైనా ముక్తుడు కావాలంటే జ్ఞాని కావాల్సిందే. దీన్తో ఆ జ్ఞాన సూచన చేస్తున్నాడు కవి.

❋ అన్నమయ్య కవి రచించిన ఈ సర్వేశ్వరశతకానికి మకుటం 'సర్వేశ్వరా' అన్న శివ సంబోధన. ఈ సంబోధన శివపారమ్యాన్ని తెలిపేది కావడం వల్ల, శివపారమ్యాన్ని తెలిపే ఈ శతకానికిది ఎంతో వన్నె తెచ్చింది.

❋ సర్వులకి ఈశ్వరుడు శివుడు. అంటే ఆయనే ఈశ్వరుడు తప్ప ఆయనకు మరొక ఈశ్వరుడు లేడని అర్థం. అథర్వవేదంలో 'బ్రహ్మ విష్ణు రుద్రేంద్రాః సంప్రసూయంతే' అని ఉన్నది. మూర్తిత్రయానికి శివుడే కారణమంటున్న దన్న మాట. బ్రహ్మ విష్ణురుద్రులు కదా సర్వానికి కారణం. వారికి కూడా కారణం ఈశ్వరుడన్నప్పుడు ఆయనకు సర్వేశ్వర నామం అన్వర్థనామం అవుతుంది. దీన్ని సమర్థిస్తూ మహా భారత ఆనుశాసనిక పర్వంలో ఇలా ఉంది.

"సఏషభగవానీశః - సర్వతత్త్వాది రవ్యయః
సర్వతత్త్వ విధానజ్ఞః - ప్రధాన పురుషేశ్వరః॥

సర్వతత్త్వాలకు మొదటివాడు, అవ్యయుడు, సర్వతత్త్వ విధానజ్ఞుడు, పురుషేశ్వరుడు అయిన భగవానుడు ఈశ్వరుడు.

సోసృజద్దక్షిణాదంగాత్ - బ్రహ్మాణంలోక సంభవం,
వామ పార్శ్వాత్తతో విష్ణుం - లోక రక్షార్థమీశ్వరః
యుగాంతే చైవ సంప్రాప్తే - రుద్రం ప్రభురథాసృజత్ ॥

ఆయన కుడి అంగం నుండి లోకోత్పత్తి కారకుడైన బ్రహ్మను, ఎడమవైపు నుంచి లోకరక్షార్థం విష్ణువును, లోకసంహారార్థం తన నుంచి రుద్రుని సృజించాడు. త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు రుద్రులు ఈశ్వరునినుంచే పుట్టి జగత్కార్యాన్ని చేస్తుండడం, వారు ఈశ్వరాధీనులు కావడం, పరమేశ్వరునికి సర్వేశ్వరత్వాన్ని ఇస్తున్నవి.

2. **ఒక మాటీ సకలంబు త్వన్మయముగా నూహించు చున్వేండి యొ
క్కొకమాటింతయు నీవుగావనుచు నే యుక్తిం బ్రశంసింపనే
రక వేదంబులు చిక్కువడ్డ వనినం బ్రవ్యక్తమై యుండు భా
వకుఁడై నీ నిజరూప మిట్టిదన నెవ్వండోపు సర్వేశ్వరా!**

సర్వేశ్వరా !

ఒకమాటు = ఒకసారి; ఈ సకలంబు = ఈ సమస్త జగత్తూ; త్వత్ = నీ; మయముగాన్ = నీతోనిండినట్లుగా; ఊహించుచున్ = భావిస్తూ; వెండి = తిరిగి; ఒక్కొక మాటు = ఒక్కొక్క సారి; ఇంతయు = ఇది ఏ మాత్రమూ; నీవు కావనుచు = నీవు కాదంటూ; ఏ యుక్తిన్ = ఏ రీతిగానూ; ప్రశంసింపనేరక = స్తుతించ లేక; వేదంబులు = చతుర్వేదాలు; చిక్కుపడ్డవి = గజిబిజి అయినవి; అనినన్ = అని అంటే; ప్రవ్యక్తమై ఉండు = తేట తెల్లమై ఉన్న; నీ నిజరూపము = నీ స్వీయ రూపాన్ని; భావకుడై = ఊహాశాలి అయి; ఇట్టి దనన్ = ఇట్లాంటిది అని అనడానికి; ఎవ్వండు = ఎవ్వడు; ఓపు = చాలును.

— *సర్వేశ్వరా! (జ్ఞానరాశులైన) వేదాలే ఒకసారి ఈ సమస్తాన్నీ నీవుగా భావిస్తాయి. మరొకసారి నీవుకావని అంటాయి. అట్లా ఏ ఒక్క రీతిలోనూ నిన్ను స్తుతించలేక తికమక పడినవంటే నీ స్పష్టరూపాన్ని ఏ ఊహాశాలి ఇట్లా ఉంటుందని చెప్పగల్గుతాడు?*

❄ *ఈశ్వరుడెట్లా ఉంటాడు? ఈశ్వరుడెక్కడ ఉంటాడు? అని అంటే ఈ సర్వజగత్తూ విశ్వమే అని వేదం ఒక చోట అంటుంది. మరొక సారేమో ఇదేదీ ఆయన కాదు అని అంటుంది. ఇట్లా నిన్ను స్పష్టంగా ఎలా వర్ణించాలో తెలియక వేదాలే తికమక పడ్తున్నవంటే కేవల ఊహాశాలి, అనుభూతి లేనివాడు నీ నిజ స్వరూపం ఇట్లా ఉంటుందని చెప్ప గల్గుతాడా? చెప్పలేడు అని ఉద్దేశ్యం.*

3. **జ్ఞానాతీతుఁడవైన నీ మహిమ (బ్రజ్ఞంబూని తర్కించుట**
జ్ఞానాంగంబగు నైనసుం దమ యథాశక్తిం బ్రశంసించి ది

వ్యానంద స్థితిఁ బొందువారిఁ గని భక్త్యా వృత్తి నిన్నెట్టి వాఁ
డైనం బ్రస్తుతి సేయుచుండుఁ దనచే నైనంత సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జ్ఞానాతీతుఁడవైన = జ్ఞానానికి అవలిదైన; నీ మహిమ = నీ యొక్క గొప్ప దనము; ప్రజ్ఞన్ = చాకచక్యంతో; పూని = ప్రయత్నించి; తర్కించుట = వివేచించడం; అజ్ఞాన అంగంబు అగున్ = అజ్ఞానానికి అవయవం అవుతుంది; ఐననున్ = ఐనప్పటికిన్నీ; తమ = తమ యొక్క; యథాశక్తిన్ = శక్తి అనుసారం; ప్రశంసించి = స్తుతించి; దివ్య ఆనంద స్థితి = దేవతా సంబంధమైన ఆనంద స్థితిని; పొందువారి = పొందేవాళ్లను; కని = చూసి; భక్త్యా వృత్తి = భక్తి ఆవరించడం చేత; నిన్ను ఎట్టి వాడైనన్ = నిన్ను ఎలాంటి వాడయినా; తనచేన్ ఐనంత = తన శక్తిని అనుసరించి; ప్రస్తుతి = స్తుతి; చేయుచుండు = చేస్తూ ఉంటాడు.

– *సర్వేశ్వరా! జ్ఞానాతీతుడవైన నీ యొక్క మహిమను ప్రజ్ఞతో ప్రయత్నించి వివేచించడం అజ్ఞానమే అయినప్పటికిన్నీ, తమ శక్త్యనుసారంగా నిన్ను నుతించి ,దివ్యానందాన్ని పొందే వాళ్లని చూసి భక్తి ఆవరించగా, నిన్నెలాంటి వాడైనా తన శక్తికొలది నుతిస్తాడు.*

❄ *ఈశ్వరుని మహిమ అజ్ఞేయం. తెలియరానిది. దాన్ని మానవుడు తన అల్పధిషణతో వివేచించితే అది తెలియదు. ఐనా కొందరు ఆగలేక ఈశ్వరుణ్ని స్తుతిస్తూ ఆనందాన్ని పొందుతున్నారు. అలా ఆనందం పొందే వాళ్లని చూసి భక్తి కలిగి ఎవడైనా స్వశక్త్యను సారంగా నిన్ను స్తుతి చేస్తున్నాడని అర్థం.*

❄ *శివుడు మనస్సుకి అతీతుడు. జ్ఞానమే మానసా తీతమైనది. ఆ మానసానికి కూడా అతీతం ఈశ్వర మహిమ. మనస్సుకి లోబడింది అంతా అజ్ఞానమే. ఐనా ఆ అజ్ఞాన స్థితిలో కూడా ఈశ్వర స్తుతి సన్మార్గమే. అది ఇతరులను భక్తులను చేస్తున్నది.*

❉ ఇక్కడ ఈశ్వరుణ్ని చూసి భక్త్యావేశంలో స్తుతించడం లేదు. ఈశ్వర స్తుతి చేసి ఆనందాన్ని పొందుతున్న వాళ్లను చూసి భక్త్యావేశం కలిగి స్తుతిస్తున్నాడు. అంటే మంచి శివభక్తుడు పొందుతున్న ఆనందమే మరొకణ్ని భక్తుణ్ని చేస్తున్నది.

4. ***అమితాంభోజ భవాండ భాండ నిలయంబై యుండు నీ యంతరం***
గము పట్టెంతయొ దాని కింక బహిరంగం బెట్టిదో సూక్ష్మత
త్త్వము దానంతకు మీఁద నేమి విధమో తానిట్టి నీ పెంపుమా
ర్గము నీకైన నచింత్య; మెట్లొరుఁ డెఱుంగంజాలు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమిత = అవధిలేని; అంభోజ భవ అండ భాండ = బ్రహ్మాండ భాండానికి; నిలయంబై = ఆశ్రయమై; ఉండు = ఉండే; నీ అంతరంగము = నీ యొక్క లోపలి భాగం యొక్క; పట్టు ఎంతయొ = వాసస్థానము ఎంత ఉన్నదో; దానికింక = ఆ అంతరంగానికింక; బహిరంగంబు = బైటనున్నది; ఎట్టిదో = ఎలాంటిదో; అంతకు మీదన్ = ఈ అంతర్బహిరంగాలకు పైన; తాను సూక్ష్మ తత్త్వము = తన సూక్ష్మ స్వభావం; మీదన్ ఏమి విధమో = ఆ మీద ఏ విధమైందో; తాను; ఇట్టి = ఇలాంటి; నీ పెంపు = నీదైన వృద్ధి యొక్క; మార్గము = పద్ధతి; నీ కైనన్ = నీకైనా; అచింత్యము = ఊహించరానిది; ఒరుడు = ఇతరుడు; ఎట్లు = ఎట్లా; ఎఱుంగన్ చాలు = తెలిసికో గల్గుతాడు?

— *సర్వేశ్వరా! బ్రహ్మాండభాండానికి నిలయమైన నీ అంతరంగం యొక్క విస్తీర్ణత ఎంత ఉందో దానికి బహిరంగంగా ఉన్నదెంతదో, దానిమీద నీ సూక్ష్మ తత్త్వం ఎంతటిదో - ఇలా నీ ఒకదానికంటె ఒకదాని ఎక్కువ తనం యొక్క పద్ధతి నీకైనా ఊహించ రానిదంటే ఇక ఇతరుడేమి తెలిసికో గల్గుతాడు.*

❊ నీకైనా అచింత్యం అన్న మాట మాట వరుసకి, వ్యవహార రీతిలో, అన్న మాట మాత్రమే!

❊ శివునికి అంతరంగ బహిరంగాలు నిజానికి లేవు. అన్నీ అంతరంగాలే.

❊ శివుడు సంకల్పించి లోకాలను ఆవిష్కరించని వేళలో అవన్నీ శివుని సూక్ష్మ రూపంలోనే అవ్యక్తంగా ఉంటాయి. ఈ అవ్యక్త స్థితిని పొదివి ఉంచుకొన్న సూక్ష్మ రూపం పేరుకే సూక్ష్మం కాని, బ్రహ్మాండ భాండాలను కలిగి ఉన్న అంతర్ బహిరంగాల కన్నా ఇది ఇంకా విశాలమైనది. దీన్ని తెలుప డానికే ఈ పద్యం.

5. ***ఇన విఘ్నేశ్వర మాతృకా ద్రుహిణ బ్రాహ్మీస్కంద దుర్గా రమా***
వనితాధీశ్వర భైరవుల్ బలసి భాస్వద్భక్తి సంయుక్తి నీ
కనిశంబుం బరివార భృత్య నికరంబై రన్న నిన్నింకఁగొ
ల్వని వారెవ్వ రజాండ భాండములలో వర్ణింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఇన = సూర్యుడు; విఘ్నేశ్వర = వినాయకుడు; మాతృక = సప్తమాతృకలు; ద్రుహిణ = బ్రహ్మ; బ్రాహ్మీ = సరస్వతి; స్కంద = కుమారస్వామి; దుర్గ = పార్వతి; రమా వనిత అధీశ్వర = లక్ష్మీనాథుడు; భైరవుల్ = శివుని యందు పుట్టిన వారలు; భాస్వత్ = ప్రకాశించే; భక్తి సంయుక్తి = భక్తితో కూడుకొని; బలసి = వృద్ధినంది; నీకు అనిశంబు = నీకు నిరంతరం; పరివార భృత్య నికరంబైరి అన్నన్ = పరిజన సేవక సమూహమైనారు అనగా; వర్ణింప; అజాండ భాండములలో = బ్రహ్మాండ భాండాలలో; ఇంక = ఇక; నిన్ను; కొల్వని వారెవ్వరు = సేవించని వారెవరు?

— సర్వేశ్వరా! సూర్య, వినాయక, సప్తమాతృక, బ్రహ్మ, సరస్వతి, కుమార, దుర్గ, విష్ణు, భైరవులు భక్తి ఎక్కువ కాగా నీకు ఎల్లపుడు పరిజనులో, సేవకులో అయ్యారంటే, ఈ బ్రహ్మాండాలలో నిన్నింక సేవించని వాళ్లెవ్వరు?

❄ మాతృకలు ఏడుగురు - వీరిని సప్త మాతృకలంటారు. బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ అని వీళ్ల పేర్లు.

❄ ఈ పద్యంలోని దేవతలందరి లోనూ భైరవుడు, స్కందుడూ పార్వతీ ప్రమేయం లేకుండా శివతేజం నుంచి పుట్టినవాళ్లు. దక్షాధ్వరంలో సతీదేవి అవమానం పాలయి, శివనింద జరుగుతుంటే శివుడు రౌద్రంతో తన జటలోంచి వీరభద్రోత్పత్తి చేశాడు. అట్లాగే బ్రహ్మదేవుడి ఐదవ ముఖం శివుణ్ని నిందిస్తుంటే శివునిలోంచి భైరవుడు పుట్టి ఆ బ్రహ్మ పంచమ ముఖాన్ని ఖండిస్తాడు. ఈ భైరవుడు గత జన్మలో కూడా శివుని తేజస్సుతో పార్వతీ ప్రమేయం లేకుండా భృంగి అనే శివద్వార పాలకుడుగా పుట్టిన వాడు. అప్పుడీయన వానర ముఖుడు.

❄ పార్వతీ ప్రమేయం లేకుండా జన్మించిన భైరవుడూ కుమార స్వామీ శివ ప్రమేయం లేకుండా జన్మించిన విఘ్నేశ్వరుని వంటి శక్త్యుద్భవులు శివునికి పరిచారకులు. సృష్టికర్తా, తత్పాలకుడూ ఐన బ్రహ్మవిష్ణువులు శివభృత్యులు. ఇక సామాన్యుడు సర్వేశ్వరుణ్ని కొలువ కుండా ఉంటాడా?

6. ***ఏ పారంగ నజాండ భాండ నికరం బేరూపులోఁ బుట్టి యు***
ద్దీపించున్మతి రూపులెల్ల సమసుప్తింబొంది యే రూపులో
లోపించుం గలయంగ నంతటికిఁ దాలోనై విజృంభించి యే
రూపం బవ్యయమై వెలుంగు నది నీ రూపంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఏ పారంగన్ = అతిశయించుతూ; అజాండ భాండ నికరంబు = బ్రహ్మాండ భాండ సమూహం; ఏ రూపులో పుట్టి = ఏ రూపంలో జన్మించి; ఉద్దీపించున్ = ప్రకాశిస్తుందో; మఱి = ఆ తర్వాత; రూపులు ఎల్ల = సమస్త దృశ్య విషయాలు; సమ సుప్తిన్ పొంది = సమమైన నిద్రా స్థితిని పొంది; ఏ రూపులో = ఏ రూపంలో; లోపించు = లేనివి అవుతాయో; కలయంగన్ = కలిసేటట్లుగా; అంతటికి = సమస్తానికి; తాలోనై = తానే అంతరంగమయి; విజృంభించి = పరాక్రమించి; ఏ రూపంబు = ఏ రూపం; అవ్యయము ఐ = నాశంలేనిదయి; వెలుంగున్ = ప్రకాశిస్తుందో; అది నీ రూపంబు = అది ఈశ్వరుడవైన నీ యొక్క రూపము.

— *సర్వేశ్వరా! బ్రహ్మాండ భాండనికరం ఏ రూపంలో పుట్టి పెరిగి ఏ రూపంలో సమసుప్తిని పొంది లేకుండా పోతుందో, ఏ రూపం సమస్తానికీ అంతరంగమయి మహోత్సాహంతో వినాశం లేకుండా వెలుగుతుందో అది నీ రూపం.*

❊ *ఈ పద్యం సర్వజగత్తూ ఈశ్వరునికి లోబడి ఉన్నదేనని చెప్తున్నది. అట్లాగే తానే అన్నింటిలోనూ ఉన్నవానిగానూ చెప్తున్నది. తన రూపం అవ్యయమనీ చెప్తున్నది.*

— *సృష్టి స్థితిలయాదులు ఈశ్వరుడు చేసేవి. శివేతరంగా ఏదీలేదు. సముద్రంలో పుట్టి నశించే ఫేన బుద్బుదాలు సముద్రంలాగానే కనబడ్తున్నట్లుగా, శక్తి విశిష్టుడైన శివుని వల్ల ఏర్పడే సృష్టి స్థితిలయాలు శివమయాలే.*

❊ *అథర్వశిరంలో ఇట్లా ఉన్నది -"అహమేకః ప్రథమ మాసం వర్తామి చ భవిష్యామి చ నాన్యః కశ్చిన్మత్తో వ్యతిరిక్తః" - సృష్టికి ముందూ, ఇప్పుడూ, భవిష్యత్తులోనూ ఉండగల్గిన నన్ను ఆశ్రయించక ఎవ్వడూ ఉండలేడు.*

❊ *తాలోనై విజృంభించు అని పద్యంలో ఉన్నది. వేదంలో 'బ్రహ్మాహం' అని ఉన్నది. "సోఽంతరాదంతరం ప్రావిశత్" - అంటే పరమేశ్వరుడు*

సర్వాంతరమైన జీవుని కంటె అంతరాన్ని అంటే లోనప్రవేశించిన వాడు - అని అర్థము.

❋ ప్రళయ కాలం నామరూప శూన్యం. అందువల్ల ఇంద్రియ శక్తుల్ని కోల్పోయిన జీవాత్మలు, శరీరాది పరికరాదులు లేకపోవడం చేత సృష్టి ఉన్నప్పటి వేళలో వలె ప్రపంచాన్ని అనుభవించ లేరు. ఈ స్థితి సమస్త కార్య విశేష జ్ఞానం లేనట్టి జీవుల పరమ సుషుప్తి అనదగిన మహావస్థ. ఇది తమస్సు. దీన్నే 'సమసుప్తి' అంటున్నాడు కవి.

7. ***జలజాత ప్రభవాండ బుద్బుదముల శ్రాంతంబునుం బుట్టు చుం***
గలయం గ్రాఁగుచు నుండు నీ పృథుల లింగస్ఫార గర్భాబ్ధిలో
పలఁ దద్బుద్బుద గర్భవాసులు హరి బ్రహ్మాది దేవాళియుం;
గలదే వారికి నీ మహత్త్వ మెఱుగంగా శక్తి? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జలజాత ప్రభవ అండ బుద్బుదములు = బ్రహ్మాండాలనే బుడగలు; అశ్రాంతంబునున్ = నిరంతరం; నీ పృథుల = నీ యొక్క విశాలమైన; లింగ = లింగమనే; స్ఫార = చలించే; గర్భ = కడుపు గల్గిన; అబ్ధిలో = సముద్రంలో; పుట్టుచున్ = పుడ్తూ; కలయన్ = అంతటా; క్రాగుచున్ ఉండు = తపిస్తూ ఉంటవి; తత్ = అలాంటి; బుద్బుద గర్భ = బుడగల కడుపులలో; హరిబ్రహ్మ దేవాళియున్ = శ్రీ మహావిష్ణువు, బ్రహ్మలనే దేవతలు కూడా; వాసులు = నివసిస్తారు; వారికి = (అలాంటి) వాళ్లకు; నీ మహత్త్వము = నీ యొక్క గొప్ప దనము; ఎఱుగంగా = తెలిసి కోవడానికి; శక్తి కలదే = శక్తి ఉన్నదా?

— *సర్వేశ్వరా! నీ యొక్క విశాలమైన లింగ గర్భంలోపల బ్రహ్మాండాలనే బుడగలు నిరంతరం పుడ్తూ, అంతటా క్రాగిపోతూ ఉంటవి. అట్లాంటి బుడగలలో హరి*

బ్రహ్మాది దేవతానీకం నివసిస్తారంటే, ఇక వాళ్లకి నీ మహత్త్వం తెలిసికోవడం సాధ్యమవుతుందా?

❊ శివాధిక్యాన్ని చెప్పే పద్యం ఇది. శివుని లింగ రూపం ఎంత పెద్దదో, అందులో తక్కిన దేవతల స్థానం ఎంత తక్కువదో అన్నమయ్య గారీ పద్యంలో తెల్పుతున్నారు. వాళ్లది అణుత్వం ఈశ్వరునిది మహత్త్వం. అణుత్వానికి నీ మహత్త్వం ఎట్లా తెలుస్తుంది? అని ప్రశ్నిస్తున్నారు కవి.

8. ***భవదున్మేష విజృంభణంబు పరికింపంగా సరోజాత సం***
భవు జన్మంబు; భవన్నిమేష మమిత బ్రహ్మాండ కల్పాంత భై
రవ సంక్షోభిత మన్నఁ దక్కిన భవత్ప్రారంభ భూరి క్రియా
నివహం బెవ్వరు నేర్తురిట్టిదని వర్ణింపంగ సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భవత్ = నీయొక్క; ఉన్మేష = సంతోషం; విజృంభణంబు = వికసించడం; పరికింపంగా = పరిశీలిస్తే; సరోజాత సంభవు = బ్రహ్మ యొక్క; జన్మంబు = పుట్టుక; భవత్ = నీ యొక్క; నిమేషము = తెప్పపాటు; అమిత = పరిమితి లేని; బ్రహ్మాండ = బ్రహ్మాండాలకు; కల్పాంత = ప్రళయ కాలంలోని; భైరవ = భయానకరసం చేత; సంక్షోభితము = కల్లోల పడింది; అన్న = అనగా; తక్కిన = మిగిలిన; భవత్ = నీ యొక్క; ప్రారంభ = మొదలెట్టిన; భూరి = గొప్ప; క్రియా నివహంబు = కార్య సమూహాన్ని; ఇట్టిదని = ఇలాంటిదని; వర్ణింపంగ = వర్ణించడానికి; ఎవ్వరు నేర్తురు = ఎవరు చాలుతారు?

– *సర్వేశ్వరా! నీ సంతోష వికాసంలో బ్రహ్మకుజన్మ,నీవు తెప్పవేస్తే (ఆ బ్రహ్మ సృష్టికి) ప్రళయం - అని అంటే ఇక నీ మహా కార్య సమూహం ఇట్లాంటిది ఇట్లాంటిది అని ఎవరు వర్ణించ గల్గుతారు?*

❋ ఈ పద్యం కూడా పరమేశ్వరాధిక్యాన్ని తెలుపు తున్నదే. ఈశ్వరుని ఆనంద వికసనమే లోకోత్పత్తికి హేతువు. ఈశ్వరుడు కనురెప్ప వేయడమే లోకాలకు ప్రళయ హేతువు. ఆయన కనుతెఱవడం, రెప్ప వేయడం అన్న చిన్న చిన్న వాటితోనే సృష్టి, ప్రళయాలనే వాటిని చేయగల్గుతున్నాడు. నిజానికి ఆయన ఇంకా అనేక ఘన కార్యాలు చేస్తాడు. రెండు స్వల్ప హేతువులతోనే రెండు విశిష్ట కార్యాలు జరుగుతున్నప్పుడు, ఇంకా ఘనతర విషయాలకు హేతువులు కానీ, అవి ఎట్లా జరుగుతున్నవని కానీ, వాటిని జరిపించే ఈశ్వర శక్తి ఇలాంటిదని కాని ఎవ్వరూ వర్ణించలేరని కవి చెప్తున్నారీ పద్యంలో.

9. పవనుండై, హిమధాముఁ డై యనలుఁడై పానీయమై యాత్మయై
రవియై యంబరమై మహీవలయమై రమ్యాష్ట మూర్తి క్రియన్
భువనాండంబులు రక్షణాంగములుగాఁ బుట్టించు నత్యద్భుతో
త్సవలీలా విభవంబుతోడ భవదాజ్ఞా శక్తి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

రమ్య అష్టమూర్తి = సుందరుడైన ఎనిమిది మూర్తులు కల్పిన వాడు; భవత్ ఆజ్ఞా శక్తి = నీ యొక్క ఉత్తరువు అనే శక్తి వల్ల; పవనుండుఐ = వాయువయి; హిమధాముడై = చంద్రుడయి; అనలుడై = అగ్ని అయి; పానీయమై = జలమయి; ఆత్మయై = బ్రహ్మ (పురుషుడు) అయి; రవియై = సూర్యుడయి; అంబరమై = ఆకాశమై; మహీవలయమై = భూ చక్రమై; అతిఅద్భుత = మిక్కిలి ఆశ్చర్య జనకమైన; ఉత్సవలీలా విభవంబు తోడ = ఉత్సవ స్వభావ సంపత్తి చేత; క్రియన్ = చేష్ట ద్వారా; భువనాండంబులు = బ్రహ్మాండాలు; రక్షణాంగములుగా = రక్షించే అవయవాలుగా; పుట్టించున్ = పుట్టిస్తాడు.

– సర్వేశ్వరా! నీ యొక్క అద్భుత లీలా వైభవం కల్గిన ఆజ్ఞాశక్తి వల్ల అష్టమూర్తి పృథివి, ఆపః, తేజో, వాయురాకాశాలు, సూర్య చంద్రులు, పురుషుడు అయి తన చేష్టతో ఈ బ్రహ్మాండాలు రక్షణాంగాలుగా పుట్టిస్తాడు.

❊ సర్వేశ్వరుడు త్రిమూర్తులకు అతీతుడు. హరిహర బ్రహ్మలకు కూడా ఆయన అతీతుడన్న మాట. శివునికి అష్టమూర్తులు. జగత్తు యొక్క మౌలిక ద్రవ్యాలను ఎనిమిదిగా విభజించి చూపినారు. అవన్నీ కలిస్తేనే బ్రహ్మాండాలు. అవన్నీ పంచభూతాలుగా, సూర్య చంద్ర ఆత్మలుగా ఉంటాయి. ఈ ఎనిమిది వినా లోక సృజన జరుగదు. ఈ ఎనిమిదింటినీ కల్పించి సృజించినవాడు శివుడు. ఆ శివుడు ఈశ్వరుని ఆజ్ఞాశక్తి వల్లనే ఈ ఎనిమిదింటితో బ్రహ్మాండాలను పుట్టించాడు.

❊ అష్ట మూర్తుల రహస్యాన్ని శివపురాణం చక్కగా విశదీకరించింది -

(1) శర్వుడు (2) భవుడు (3) రుద్రుడు (4) ఉగ్రుడు (5) భీముడు (6) పశుపతి (7) ఈశానుడు (8) మహాదేవుడు - వీళ్ళు అష్టమూర్తులు

(1) భూమి (2) ఉదకం (3) అగ్ని (4) మరుత్తు (4) ఆకాశం (5) క్షేత్రజ్ఞుడు (ఆత్మ) (6) రవి (7) చంద్రుడు (8) మహేశ్వరుడు - ఇవి పై శర్వాది మూర్తులచే అధిష్ఠితులు.

ఇట్లా తెలుపుతూ శివపురాణం

"ఇట్లు మూర్త్యష్టకంబున నీజగములు
సర్వములు నిండి వెలసెడు శంకరుండు
ఆ శివుని గొల్వజగముల కమరు వృద్ధి
శాఖిమూల సేకంబున శాఖలెసగు."

అని అంటుంది. చెట్టు వేళ్లకి నీళ్లు పోస్తే చెట్టు కొమ్మలకి అందినట్లుగా శివారాధన చేస్తే జగాలకన్నిటికీ వృద్ధి లభిస్తుంది. అష్టమూర్తులుగా ఉన్న కారణాన శంకరుడు సర్వ జగత్తూ నిండిన వాడే.

10. ***జలజాత ప్రభవాండ భాండములు దుశ్చారిత్రులం బాత్రులం***
జెలువై యుండ యథా ప్రమాణములుగా శిక్షింప రక్షింప ని
శ్చల లీలం బ్రభవించు రాజు భవదాజ్ఞా శక్తి గా కింత వ
ట్టెలమిం జే కొని నిర్వహింప మఱి రాజెవ్వండు? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జలజాత ప్రభవఅండ భాండములు = బ్రహ్మాండ భాండాలు; దుశ్చారిత్రులన్ = దుశ్శీలం కల్గిన వాళ్లతోను; పాత్రులన్ = యోగ్యులతోను; చెలువై ఉండ = ఒప్పి ఉండగా; యథా ప్రమాణములుగా = శాస్త్ర రీత్యా (ఎవరికేది ఇవ్వాలో దాన్ని ఇస్తూ); శిక్షింప = శిక్షించడానికీ; రక్షింప = రక్షించడానికీ; నిశ్చల లీలన్ = ధీర గుణంతో; ప్రభవించు = పుట్టే; రాజు = అధికారి; భవత్ = నీ యొక్క; ఆజ్ఞాశక్తి = ఆజ్ఞ అనే శక్తి; కాక = కాకపోతే; ఇంత పట్టు = ఇంత అధికారాన్ని; ఎలమిన్ = ఔచిత్యంతో; చేకొని = తీసికొని; నిర్వహింప = నిర్వహించ డానికి; రాజెవ్వండు మఱి = ఎవడు రాజు?

— *సర్వేశ్వరా! బ్రహ్మాండ భాండాలు చెడ్డ వాళ్లతోనూ మంచి వాళ్లతోనూ ఉండగా యథా ప్రమాణంగా చెడ్డవాళ్లని శిక్షించడానికీ, మంచి వాళ్లని రక్షించడానికీ నీ ఆజ్ఞా శక్తియే రాజు. అంతే తప్ప అట్లాంటి అధికారం ఉన్న రాజు ఇంకొకడెవ్వరుండ గల్గుతాడు?*

❉ *ఇతర దేవతలు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసినప్పటికీ, వారినా పని చేయమని నియోగించేది ఈశ్వరుని ఆజ్ఞాశక్తియే. అందుచేత సర్వాధికారి సర్వేశ్వరుడే తప్ప ఇతరులెవ్వరూ కాదు. దీనికి ఇది,దీనికి ఇది,అని ప్రమాణీకరించేది కూడా ఈశ్వరాజ్ఞా శక్తియే.*

11. **జ్ఞానజ్యోతి విజృంభమాణముగ నోజన్ విష్ణు విద్యాది దే**
వానీకాత్మ దశావళిం దవిలి నీవారంగ వారిం గళా
జ్ఞాన ప్రౌఢులఁ జేయుటన్ వెలయఁగా సర్వజ్ఞ శబ్దంబు దా
నీ నామాంకముగా విధించె నిగమానీకంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జ్ఞాన జ్యోతి = జ్ఞాన దీపం; విజృంభమాణముగన్ = వికసిస్తూన్న; ఓజన్ = రీతిగా; విష్ణు విద్యాది = శ్రీ మహా విష్ణువు, సరస్వతి మొదలయిన; దేవానీక = దేవతల సమూహం యొక్క; ఆత్మదశావళిన్ = అంతరంగ సమూహాన్ని; తవిలి = కూడి; నీవు; ఆరంగ = పూనుకొని; వారిన్ = ఆ దేవతలను; కళాజ్ఞాన ప్రౌఢుల = కళలయందూ, జ్ఞానంలోనూ దిట్టలను; చేయుటన్ = చేయడం వల్ల; నిగమానీకంబు = వేద సమూహం; సర్వజ్ఞ శబ్దంబు = సర్వమూ తెలిసిన వాడు అనే 'సర్వజ్ఞ' శబ్దాన్ని; వెలయగా = ప్రకాశించగా; నీ; నామాంకముగా = పేరుకి చిహ్నంగా; విధించె = నిశ్చయించాయి.

- సర్వేశ్వరా! జ్ఞానజ్యోతి విజృంభిస్తున్న విధంగా విష్ణువు సరస్వతి ఇత్యాది దేవతల అంతరంగాలతో కూడి నీవు వాళ్లను కళలలోనూ జ్ఞానంలోనూ ప్రౌఢులను చేయడం వల్ల,వేదాలు నీ పేరుగా 'సర్వజ్ఞ' శబ్దాన్ని విధించాయి.

❋ ఇది కూడా శివపారమ్యాన్ని చెప్తున్న పద్యం. సర్వదేవతలను కళాజ్ఞాన ప్రౌఢులను చేస్తున్న వాడు ఈశ్వరుడేననీ, అందువల్లే ఆయనకు 'సర్వజ్ఞు' డనే పేరని వేదాలంటున్న వంటే ఇతర దైవాలకంటే కూడా అధికుడనే అర్థం.

❋ సర్వానికీ ఈశ్వరుడవడం అంటే సర్వముపై అధికారం కలిగి ఉన్నవాడూ,ఆధిపత్యమూ, యాజమాన్యమూ కల్గిన వాడవడం.

❋ ఈ పద్యంలోని సర్వజ్ఞ శబ్దం విశిష్టమైంది. శివపర్యాయుడైన బ్రహ్మము 'సర్వజ్ఞత, నిత్యతృప్తి, అనాది బోధ, స్వతంత్రత, అలుప్త శక్తిమత్వము,

10. ***జలజాత ప్రభవాండ భాండములు దుశ్చారిత్రులం బాత్రులం***
జెలువై యుండ యథా ప్రమాణములుగా శిక్షింప రక్షింప ని
శ్చల లీలం బ్రభవించు రాజు భవదాజ్ఞా శక్తి గా కింత వ
ట్టెలమిం జే కొని నిర్వహింప మఱి రాజెవ్వండు? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జలజాత ప్రభవఅండ భాండములు = బ్రహ్మాండ భాండాలు దుశ్చారిత్రులన్ = దుశ్శీలం కల్గిన వాళ్ళతోను; పాత్రులన్ = యోగ్యులతోను చెలువై ఉండ = ఒప్పి ఉండగా; యథా ప్రమాణములుగా = శాస్త్ర రీత్యా (ఎవరికేది ఇవ్వాలో దాన్ని ఇస్తూ); శిక్షింప = శిక్షించడానికీ; రక్షింప = రక్షించడానికి నిశ్చల లీలన్ = ధీర గుణంతో; ప్రభవించు = పుట్టే; రాజు = అధికారి; భవత్ = నీ యొక్క; ఆజ్ఞాశక్తి = ఆజ్ఞ అనే శక్తి; కాక = కాకపోతే; ఇంత పట్టు = ఇంత అధికారాన్ని; ఎలమిన్ = ఔచిత్యంతో; చేకొని = తీసికొని; నిర్వహింప = నిర్వహించ డానికి; రాజెవ్వండు మఱి = ఎవడు రాజు?

— *సర్వేశ్వరా! బ్రహ్మాండ భాండాలు చెడ్డ వాళ్ళతోనూ మంచి వాళ్ళతోనూ ఉండగా యథా ప్రమాణంగా చెడ్డవాళ్లని శిక్షించడానికీ, మంచి వాళ్లని రక్షించడానికీ నీ ఆజ్ఞా శక్తియే రాజు. అంతే తప్ప అట్లాంటి అధికారం ఉన్న రాజు ఇంకొకడెవ్వరుండ గల్గుతాడు?*

❋ *ఇతర దేవతలు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసినప్పటికీ, వారినా పని చేయమని నియోగించేది ఈశ్వరుని ఆజ్ఞాశక్తియే. అందుచేత సర్వాధికారి సర్వేశ్వరుడే తప్ప ఇతరులెవ్వరూ కాదు. దీనికి ఇది,దీనికి ఇది,అని ప్రమాణీకరించేది కూడా ఈశ్వరాజ్ఞా శక్తియే.*

11. ***జ్ఞానజ్యోతి విజృంభమాణముగ నోజన్ విష్ణు విద్యాది దే***
వానీకాత్మ దశావళిం దవిలి నీవారంగ వారిం గళా
జ్ఞాన ప్రౌఢులఁ జేయుటన్ వెలయఁగా సర్వజ్ఞ శబ్దంబు దా
నీ నామాంకముగా విధించె నిగమానీకంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జ్ఞాన జ్యోతి = జ్ఞాన దీపం; విజృంభమాణముగన్ = వికసిస్తూన్న; ఓజన్ = రీతిగా; విష్ణు విద్యాది = శ్రీ మహా విష్ణువు, సరస్వతి మొదలయిన; దేవానీక = దేవతల సమూహం యొక్క; ఆత్మదశావళిన్ = అంతరంగ సమూహాన్ని; తవిలి = కూడి; నీవు; ఆరంగ = పూనుకొని; వారిన్ = ఆ దేవతలను; కళాజ్ఞాన ప్రౌఢుల = కళలయందూ, జ్ఞానంలోనూ దిట్టలను; చేయుటన్ = చేయడం వల్ల; నిగమానీకంబు = వేద సమూహం; సర్వజ్ఞ శబ్దంబు = సర్వమూ తెలిసిన వాడు అనే 'సర్వజ్ఞ' శబ్దాన్ని; వెలయగా = ప్రకాశించగా; నీ; నామాంకముగా = పేరుకి చిహ్నంగా; విధించె = నిశ్చయించాయి.

– *సర్వేశ్వరా! జ్ఞానజ్యోతి విజృంభిస్తున్న విధంగా విష్ణువు సరస్వతి ఇత్యాది దేవతల అంతరంగాలతో కూడి నీవు వాళ్లను కళలలోనూ జ్ఞానంలోనూ ప్రౌఢులను చేయడం వల్ల,వేదాలు నీ పేరుగా 'సర్వజ్ఞ' శబ్దాన్ని విధించాయి.*

❊ *ఇది కూడా శివపారమ్యాన్ని చెప్తున్న పద్యం. సర్వదేవతలను కళాజ్ఞాన ప్రౌఢులను చేస్తున్న వాడు ఈశ్వరుడేననీ, అందువల్లే ఆయనకు 'సర్వజ్ఞు' డనే పేరని వేదాలంటున్న వంటే ఇతర దైవాలకంటే కూడా అధికుడనే అర్థం.*

❊ *సర్వానికీ ఈశ్వరుడవడం అంటే సర్వముపై అధికారం కలిగి ఉన్నవాడూ,ఆధిపత్యమూ, యాజమాన్యమూ కల్గిన వాడవడం.*

❊ *ఈ పద్యంలోని సర్వజ్ఞ శబ్దం విశిష్టమైంది. శివపర్యాయుడైన బ్రహ్మము 'సర్వజ్ఞత, నిత్యతృప్తి, అనాది బోధ, స్వతంత్రత, అలుప్త శక్తిమత్త్వము,*

అనంత శక్తిమత్వము' అన్న సహజ లక్షణాలను కలిగి ఉన్నాడు. ఈ సహజ లక్షణాలలో 'సర్వజ్ఞత' అన్నది ఈశ్వరుని మొదటి లక్షణం. దీనికి నైఘంటు కార్థం అన్నీ తెలిసిన వాడు అని. నీలకంఠ భాష్య వ్యాఖ్య తెలుగు అనువాదంలో 'బాహ్య సాధనముల నపేక్షింపనట్టి నిష్కళంకానుభవమున సర్వవస్తువులు నిత్య ప్రత్యక్షములగు చుండుట' అని ఉన్నది. ఇంకా అందులో అర్థ వివరణగా 'యః సర్వజ్ఞః సర్వవిత్, యస్య జ్ఞానమయం తపః' అని కూడా ఉన్నది. అభివ్యక్తి భేదమే కాని సర్వ వస్తువులు నిత్య ప్రత్యక్షాలు కావడమూ, సర్వ వేత్తృత్వమూ ఒక్కటే.

❋ విష్ణ్వాది దేవతలను జ్ఞాన ప్రౌఢుల చేయడం చేత వేదములు సర్వేశ్వరుణ్ని సర్వజ్ఞుడంటున్నవని కవి అంటున్నారు. అంటే సకల జీవజాలానికే కాక విష్ణ్వాది సమస్త దేవతలకు కూడా జ్ఞానాన్ని ఇవ్వడంచేత శివుడు సర్వజ్ఞుడని అర్థం. జ్ఞానం ఉన్నవాడే జ్ఞానాన్ని ఇవ్వ గల్గుతాడు. జ్ఞాన మెప్పుడూ పూర్ణ రూపంగా ఉండాల్సిందే తప్ప ఖండ రూపంగా ఉండదు. ఉన్నా అది జ్ఞానం కాదు. ఈ పూర్ణ జ్ఞానమే ఇక్కడ సర్వజ్ఞత. అందరికీ తెలియడం అసంభవం. అందుచేత సర్వేశ్వరుడైనప్పుడే స్వర్వజ్ఞత్వం కల్గుతుంది. ఈశ్వరునికి అటు సర్వేశ్వరత్వం కల్గడం వల్లనే ఇటు సర్వజ్ఞత్వం కల్గిందన్న మాట.

❋ ఈ పద్యంలో విష్ణువూ, విద్యా దేవత అయిన సరస్వతి అన్న ఇద్దరి దేవతల పేర్లే ఉండడం విశేషం. విష్ణువంటే సర్వవ్యాపి అని అర్థం. ఆయనకే జ్ఞాన ప్రౌఢిమ కలిగించే వాడు నిజంగా సర్వవ్యాపి అని వ్యంగ్యార్థం. సరస్వతి వాగ్దేవత, చదువుల తల్లి, జ్ఞానమూర్తి. ఆమెకీ జ్ఞాన ప్రౌఢత కల్గించుతున్న వాడు సర్వేశ్వరుడు.

❋ ఇట్లా ఈ పద్యాలన్నింటా ఈశ్వరుని సర్వేశ్వరత్వాన్ని ఏదో ఒక అంశం ద్వారా సువ్యక్తం చేస్తున్నారు అన్నమయ్య కవి.

12. **సురలన్ మర్త్య సమూహిగా, మనుజులన్ శోభిల్లు బృందారకో**
త్కరముంగా, ఘను నల్పు, నల్పుని ఘనుంగాఁ బుణ్య పాపాళిచేఁ
దిరుగన్ వైచుచు నీ మహా మహిమ ప్రీతిం బద్మజాండంబులం
దరయన్ జీవుల నింద్రజాలములుగా నాడించు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నీ మహామహిమ = నీ యొక్క గొప్ప మహిమ; సురలన్ = దేవతలను; మర్త్య సమూహిగా = మానవానీకంగా; మనుజులన్ = మానవులను; శోభిల్లు = శోభించే; బృందారక ఉత్కరముంగా = దేవతా సమూహంగా; ఘనున్ = గొప్ప వాణ్ని; అల్పున్ = నీచునిగా; అల్పుని = నీచుని; ఘనుంగా = గొప్పవాణ్నిగా; పుణ్య పాపాలిచే = పుణ్యపాప సమూహం చేత; తిరుగన్ వైచుచు = తిప్పి వేస్తూ; ప్రీతిన్ = ప్రేమతో; అరయన్ = పరిశీలిస్తే; పద్మజాండంబులన్ = బ్రహ్మాండాలలో; జీవులన్ = జీవుల్ని; ఇంద్ర జాలములుగాన్ = కనికట్లుగా (మాయాజాలంగా) ఆడించు = ఆడిస్తుంది.

– *సర్వేశ్వరా! నీ మహా మహిమ దేవతల్ని మనుష్యులుగా, మనుష్యుల్ని దేవతలుగా, గొప్పవాణ్ని అల్పునిగా, అల్పుణ్ని గొప్ప వాణ్నిగా (వారివారి) పుణ్య పాపాల చేత (అటూ ఇటూ పైకీకిందికీ) తిరుగవేస్తూ బ్రహ్మాండాలలో జీవుల్నందర్నీ ఇంద్రజాలంలో లాగా ఆడిస్తుంది.*

❉ జీవులకు ఉత్తమ అధోగతులు వారి వారి పాపపుణ్యాల చేత కల్గడం అన్నది ఈశ్వర శాసనం. దాని ప్రకారం దేవతలు ఒక్కొక్కప్పుడు మనుష్యులవుతారు. మనుష్యులు దేవతలవుతారు. అంతా ఇంద్రజాలంలో లాగ ఈశ్వర మహిమ జీవుల్ని ఆడిస్తుంది. పుణ్యపాపాల చేత వాళ్లు వీళ్లు కావడం, వీళ్లు వాళ్లు కావడం - మంచివాడు చెడ్డవాడు కావడం, చెడ్డవాడు మంచి వాడు కావడం - అన్నవాటి కన్నా జీవులు ఈశ్వరుడు అవడం

అనంత శక్తిమత్త్వము' అన్న సహజ లక్షణాలను కలిగి ఉన్నాడు. ఈ సహజ లక్షణాలలో 'సర్వజ్ఞత' అన్నది ఈశ్వరుని మొదటి లక్షణం. దీనికి నైఘంటు కార్థం అన్నీ తెలిసిన వాడు అని. నీలకంఠ భాష్య వ్యాఖ్య తెలుగు అనువాదంలో 'బాహ్య సాధనముల నపేక్షింపనట్టి నిష్కళంకానుభవమున సర్వవస్తువులు నిత్య ప్రత్యక్షములగు చుండుట' అని ఉన్నది. ఇంకా అందులో అర్థ వివరణగా 'యః సర్వజ్ఞః సర్వవిత్, యస్య జ్ఞానమయం తపః' అని కూడా ఉన్నది. అభివ్యక్తి భేదమే కాని సర్వ వస్తువులు నిత్య ప్రత్యక్షాలు కావడమూ, సర్వ వేత్తృత్వమూ ఒక్కటే.

❄ విష్ణ్వాది దేవతలను జ్ఞాన ప్రౌఢుల చేయడం చేత వేదములు సర్వేశ్వరుణ్ణి సర్వజ్ఞుడంటున్నవని కవి అంటున్నారు. అంటే సకల జీవజాలానికే కా విష్ణ్వాది సమస్త దేవతలకు కూడా జ్ఞానాన్ని ఇవ్వడంచేత శివుడు సర్వజ్ఞుడ అర్థం. జ్ఞానం ఉన్నవాడే జ్ఞానాన్ని ఇవ్వ గల్గుతాడు. జ్ఞాన మెప్పుడూ పూ రూపంగా ఉండాల్సిందే తప్ప ఖండ రూపంగా ఉండదు. ఉన్నా అ జ్ఞానం కాదు. ఈ పూర్ణ జ్ఞానమే ఇక్కడ సర్వజ్ఞత. అందరికీ తెలియడ అసంభవం. అందుచేత సర్వేశ్వరుడైనప్పుడే స్వర్వజ్ఞత్వం కల్గుతుం ఈశ్వరునికి అటు సర్వేశ్వరత్వం కల్గడం వల్లనే ఇటు సర్వజ్ఞత్వం కల్గింద మాట.

❄ ఈ పద్యంలో విష్ణువూ, విద్యా దేవత అయిన సరస్వతి అన్న ఇద్దరి దేవత పేర్లే ఉండడం విశేషం. విష్ణువంటే సర్వవ్యాపి అని అర్థం. ఆయనకే జ్ఞా ప్రౌఢిమ కలిగించే వాడు నిజంగా సర్వవ్యాపి అని వ్యంగ్యార్థం. సరస్వ వాగ్దేవత, చదువుల తల్లి, జ్ఞానమూర్తి. ఆమెకీ జ్ఞాన ప్రౌఢత కల్గించుతు వాడు సర్వేశ్వరుడు.

❄ ఇట్లా ఈ పద్యాలన్నింటా ఈశ్వరుని సర్వేశ్వరత్వాన్ని ఏదో ఒక అం ద్వారా సువ్యక్తం చేస్తున్నారు అన్నమయ్య కవి.

12. సురలన్ మర్త్య సమూహిగా, మనుజులన్ శోభిల్లు బృందారకో
త్కరముంగా, ఘను నల్పు, నల్పుని ఘనుంగాఁ బుణ్య పాపాళిచేఁ
దిరుగన్ వైచుచు నీ మహా మహిమ ప్రీతిం బద్మజాండంబులం
దరయన్ జీవుల నింద్రజాలములుగా నాడించు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నీ మహామహిమ = నీ యొక్క గొప్ప మహిమ; సురలన్ = దేవతలను; మర్త్య సమూహిగా = మానవానీకంగా; మనుజులన్ = మానవులను; శోభిల్లు = శోభించే; బృందారక ఉత్కరముంగా = దేవతా సమూహంగా; ఘనున్ = గొప్ప వాణ్ని; అల్పున్ = నీచునిగా; అల్పుని = నీచుని; ఘనుంగా = గొప్పవాణ్నిగా; పుణ్య పాపాలిచే = పుణ్యపాప సమూహం చేత; తిరుగన్ వైచుచు = తిప్పి వేస్తూ; ప్రీతిన్ = ప్రేమతో; అరయన్ = పరిశీలిస్తే; పద్మజాండంబులన్ = బ్రహ్మాండాలలో; జీవులన్ = జీవుల్ని; ఇంద్ర జాలములుగాన్ = కనికట్లుగా (మాయాజాలంగా) ఆడించు = ఆడిస్తుంది.

– *సర్వేశ్వరా! నీ మహా మహిమ దేవతల్ని మనుష్యులుగా, మనుష్యుల్ని దేవతలుగా, గొప్పవాణ్ని అల్పునిగా, అల్పుణ్ని గొప్ప వాణ్నిగా (వారివారి) పుణ్య పాపాల చేత (అటూ ఇటూ పైకీకిందికీ) తిరుగవేస్తూ బ్రహ్మాండాలలో జీవుల్నందర్నీ ఇంద్రజాలంలో లాగా ఆడిస్తుంది.*

❊ జీవులకు ఉత్తమ అధోగతులు వారి వారి పాపపుణ్యాల చేత కల్గడం అన్నది ఈశ్వర శాసనం. దాని ప్రకారం దేవతలు ఒక్కొక్కప్పుడు మనుష్యులవుతారు. మనుష్యులు దేవతలవుతారు. అంతా ఇంద్రజాలంలో లాగ ఈశ్వర మహిమ జీవుల్ని ఆడిస్తుంది. పుణ్యపాపాల చేత వాళ్లు వీళ్లు కావడం, వీళ్లు వాళ్లు కావడం - మంచివాడు చెడ్డవాడు కావడం, చెడ్డవాడు మంచి వాడు కావడం - అన్నవాటి కన్నా జీవులు ఈశ్వరుడు అవడం

ముఖ్యం. పశువులు పశుపతులు కావాలి. ఈశ్వరుని మహామహిమ కార్యకారణ రూపమైన చక్రాన్ని ఇవ్వగా, ఈశ్వరానుగ్రహం ఆ చక్రంలోంచి బైటకు తెచ్చి జీవులకు పశుపతిత్వాన్నిస్తుంది.

13. ***ఘనుఁడై యేచి దశాననుండు బలిమిం గైలాస శైలేంద్ర మె***
త్తిన నద్దానవనాథుఁ ద్రొక్క నతఁడర్థిన్ మ్రొక్కినం గాచి ప్రా
క్తన శౌర్యాధికుఁజేసె దుష్టునణపంగా శిష్ట రక్షింప రం
జనతో నెప్పడు వేచి యుండు భవదాజ్ఞా శక్తి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఘనుడై = గొప్పవాడై; ఏచి = విజృంభించి; దశాననుండు = రావణాసురుడు; బలిమిన్ = శక్తితో; కైలాస శైలేంద్రము = కైలాస పర్వతాన్ని ఎత్తినన్ = (పైకి) ఎత్తగా; ఆ దానవనాథు = ఆ రాక్షసాధిపతిని; త్రొక్కన్ = అణచగా; అతడు = ఆ రావణాసురుడు; అర్థిన్ మ్రొక్కన్ = ప్రార్థించి నమస్కరించగా; కాచి = (అతణ్ణి) రక్షించి; ప్రాక్తన శౌర్యాధికు = పూర్వపు శౌర్యం కల్గినవాణ్నిగా; చేసె = చేసింది; భవదాజ్ఞా శక్తి = నీ ఆజ్ఞాశక్తి; దుష్టున్ అణపంగా = దుర్మార్గుణ్ని అణచి వేయడానికి; శిష్టున్ రక్షింప = మంచి వాళ్లని కాపాడడానికి రంజనతోన్ = ప్రేమతో; ఎప్పుడు = నిరంతరమూ; వేచిఉండు = కాచుకొని ఉంటుంది.

— *సర్వేశ్వరా! పదితలల రావణాసురుడు విజృంభించి బలంతో కైలాస పర్వతాన్ని భుజంతో పైకి ఎత్తగా, ఈశ్వరుడు ఆ రాక్షసుణ్ని త్రొక్కి వేశాడు. (దాని నిరహంకారుడై) అతడు ప్రార్థించి శివునికి మొక్కగా మళ్లీ అతనికి పూర్వశౌర్యం ఇచ్చినాడీశ్వరుడు. నీ ఆజ్ఞాశక్తి దుష్టుల్ని శిక్షించడానికీ, శిష్టుల్ని రక్షించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.*

❊ రావణాసురునికి పదితలకాయలు. ఇరవై చేతులూ! నృసింహావతారం హిరణ్యకశిపుణ్ని చంపుతున్నప్పుడు హిరణ్యకశిపుడు నీవు మోసంతో స్తంభంలో నుంచి వచ్చి ఇరవై గోళ్లతో నన్ను చంపుతున్నావు. ఇదేనా నీ పౌరుషం? అని అంటాడు. దానికి నృసింహస్వామి నీకు ముందు జన్మలో ఇరవై చేతుల్నీ, పది శిరస్సులనీ ఇచ్చి నేను సామాన్య నరునిగానే పుట్టి నిన్ను వధిస్తాను అని చెప్తాడు. అట్లా రావణాసురునికి దశముఖాలు వచ్చాయి!

❊ రావణుడు కైలాసాన్ని ఎత్తిన కథ ప్రఖ్యాతం. పుష్పకంలో అతడు ఎగిరివస్తుంటే కైలాస సమీపంలో అది ఆగిపోతుంది. కారణం తెలీక అతడాలోచిస్తుంటే శివుడు అమ్మతో ఉన్నాడు. నీవిపుడు కైలాసం మీదుగా పోగూడదని బసవడు చెప్తాడు. బసవనిపై కోపించి రావణుడు నీవెంత? నీ శివుడెంత? అని కైలాసాన్ని ఎత్తి అటూ ఇటూ కదలిస్తాడు. ఆ కదలికకు పార్వతి భయపడి శివుని ఆలింగనం చేసికొంటుంది. రావణాసురుని వ్యవహారం ఇదని గ్రహించి శివుడు తన కాలి బొటన వ్రేలితో కైలాసాన్ని కిందికి ఒత్తుతాడు. దాన్తో కైలాస పర్వతం కింద రావణాసురుని చేతులు అణగి నలిగి పోయాయి. బాధతో లోకాలన్నీ అదిరిపోయే కేక వేస్తాడు రావణాసురుడు. ఆ రావం వల్లనే అతనికి రావణాసురుడన్న పేరు వచ్చింది. తర్వాత అతడు శివుని స్తుతిస్తాడు. దాన్తో ఆయన అతనికి లోటులేని ఆయుష్షునూ, చంద్రహాసాన్నీ ఇస్తాడు.

❊ ఎంతటి భక్తుడైనా అహంకరిస్తే వాని అహంకారాన్ని త్రెంచి వేయగల వాడీశ్వరుడు. ఎలాంటి వాడైనా పశ్చాత్తాపంతో స్తుతిస్తే వాడికీ వరాలూ ఇవ్వగల స్వభావం శివునిది!

14. **తమకం బెత్తిన నాత్మజం గడు మదాంధవ్యాప్తి నేకాంత ప**
క్షమునం దెవ్వరు గానకుండఁ గవయంగాఁ బోయి నీ బాణ ఘా
తమునం బద్మభవుండు ద్రెళ్లెననినం దాఁదప్ప వర్తింపలో
కమునం దెవ్వరి కింక నిన్ను నెఱుఁగంగా వచ్చు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

తమకంబు = మోహం; ఎత్తిన = కలుగగా; కడు = మిక్కిలి; మదాంధ వ్యాప్తిన్ = మదం వల్ల కల్గిన గ్రుడ్డి తనం చేత; ఏకాంత పక్షమునన్ = ఒంటరిగా ఉన్నప్పుడు; ఎవ్వరు = ఎవరూ; కానకుండ = చూడకుండా; ఆత్మజన్ = తన కూతురును; కవయంగా పోయి = సంగమించబోయి; తా = తాను; తప్ప = దుష్టంగా; వర్తింప = ప్రవర్తించగా; నీ బాణఘాతమునన్ = నీ బాణపు దెబ్బకు; పద్మభవుండు = బ్రహ్మ దేవుడు; త్రెళ్లెన్ అనినన్ = కడతేరినాడంటే; లోకమునందు = లోకంలో; నిన్నున్ ఎఱుగంగా = నిన్ను తెలిసికో గల్గడం; ఇంక = ఇక; ఎవ్వరికి వచ్చు = ఎవరివల్ల అవుతుంది?

— *సర్వేశ్వరా! మోహితుడై మదాంధుడై ఏకాంతంలో తన ఆత్మజనే కలువబోయిన బ్రహ్మ - ఆయన తప్పుగా ప్రవర్తించాడు కాబట్టి - నీ బాణఘాతంతో నరుకబడి నాడంటే ఇక లోకంలో నిన్ను తెలిసికోవడం ఎవరి వల్ల ఔతుంది?*

❊ *బ్రహ్మకే నీ సంగతి తెలియలేదు? ఇంకెవ్వరికి తెలుస్తుంది? ఎంత బ్రహ్మ అయినా తానూ పాపం చేయకూడదని తెలీదు. తెలిస్తే ఆత్మజతో కూడ బోతాడా? అట్లా చేస్తే నీవు శిక్షిస్తావని తెలియదు. ఆయనకే తెలియనప్పుడు సామాన్యులకేం తెలుస్తుంది? బ్రహ్మకు సరస్వతి పుత్రిక. బ్రహ్మ తన తేజస్సులోంచి ఈమెను సృష్టించాడు. శతరూప, సావిత్రి, గాయత్రి, బ్రాహ్మణి అని కూడా ఈమెను పిలుస్తారు. ఒకనాడు తన పుత్రిక అయిన ఈ సరస్వతి పైన కామభావం కల్గింది బ్రహ్మకు. సరస్వతి ఈ విషయం గ్రహించి తండ్రి*

అయిన బ్రహ్మ దక్షిణ పార్శ్వానికి వెళ్లి దాక్కుంది. అక్కడా కామదృక్కులతో బ్రహ్మ ముఖం ఆమెకు కనిపించింది. అప్పుడామె ఆయనకు ఎడమ దిక్కుగా వెళ్లింది. అక్కడా అదే దర్శనం. సరస్వతి అప్పుడు ఆకాశానికి ఎగిరింది. అక్కడ బ్రహ్మ ఐదవ ముఖం అదే దృక్కులతో కన్పించింది. ఇంక తప్పించు కోవడం అసాధ్యమని గ్రహించి సరస్వతి బ్రహ్మకు లొంగి పోయింది. దీనికి శిక్షగా శివుడు బ్రహ్మపై బాణం వేశాడు. - ఈ కథని ఈ పద్యంలో సూచిస్తూ, తప్పు చేసిన వాడెంతటి వాడైనా శివక్రోధానికి గురి కాక తప్పదని అంటూ లోకంలో ఎవ్వరూ శివుణ్ని తెలిసికో లేరంటున్నాడు అన్నమయ్య కవి.

15. ***పలు జన్మంబులఁ గూడఁ బడ్డ భవశుంభద్ఘోర దుష్కర్మ రా***
సులు పైఁ గూలి సమస్త జీవులు వెసన్ శోషించుచున్ బెద్ద దు
ర్బలులై చిక్కినఁ దద్భవాపహరణార్థం బొప్పఁ బద్మోద్భవ
ప్రళయం బొక్కొక మాటు సేయుదు తుదిన్ భావింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

పలు జన్మంబులఁ = అనేక జన్మలలో; కూడఁ బడ్డ = పేరుకొన్న; భవ = సంసార; శుంభత్ = రాక్షసుని; ఘోర = భయంకర; దుష్కర్మరాసులు = దుష్కర్మల ప్రోవులు; పై కూలి = మీద పడి; సమస్త జీవులు = జీవులందరూ; వెసన్ = వేగంగా; శోషించుచున్ = ఎండిపోతూ; పెద్ద దుర్బలులై = పెద్దగా బలరహితులై; చిక్కిన = చిక్కుపడగా; భావింప = ఊహించగా; తత్ భవ అపహరణ అర్థంబు = ఆ సంసారాన్ని తొలగించడం కోసం; తుదిన్ = చివరకు; పద్మోద్భవ ప్రళయంబు = బ్రహ్మప్రళయాన్ని; ఒక్కొక మాటు = ఒక్కోసారి; చేయుదు = కల్గిస్తావు.

— *సర్వేశ్వరా! అనేక జన్మలలో పేరు కొనిపోయిన సంసార రాక్షసుని భయంకర దుష్కర్మరాశులు మీద పడగా జీవులందరూ శుష్కించి బలరహితులై చిక్కుపడి*

పోగా, వారి ఆ సంసారాన్ని (తద్వారా దుష్ కర్మ ఫలితాలను) తొలగించడం కోసం చివరకు ఒక్కొక్కసారి నీవు బ్రహ్మ ప్రళయాన్ని కల్గిస్తావు.

❉ ఇక్కడ ప్రళయం కల్గించడం కూడా శివానుగ్రహంలో ఒక భాగంగా కవి చెప్తున్నారు. దుష్కర్మలు మీద పడినప్పుడు సంసారాన్ని తొలగించడం కోసం ఈ ప్రళయ కల్పన ఒక్కొక్కసారి శివుడనుసరించే మార్గం అన్నమాట. ఇది ఆయనకు చివరి మార్గమే కాని మొదటిది కాదనటానికి 'తుదిన్' అని కవి అంటున్నారు. పద్మోద్భవ ప్రళయం అంటే బ్రహ్మ ప్రళయం. ప్రళయాలు నాల్గు రకాలు.

(1) నిత్యప్రళయం (2) బ్రహ్మ ప్రళయం (3) ప్రాకృత ప్రళయం (4) ఆత్యంతిక ప్రళయం

- భూమి మీద జన్మించిన సమస్త చరాచరాలకు అనుక్షణం కల్గుతున్న నాశం నిత్య ప్రళయం.

- ప్రకృతిలో తీవ్ర సంక్షోభానంతరం కలిగే ఘోర వినాశం ప్రాకృత ప్రళయం. ఇది చతుర్యుగాలు ఒక వేయి గడిచాక ఒక్కసారి కల్గుతుంది. కృత త్రేతా ద్వాపర కలియుగాలు ఒక్క చతుర్యుగం. అలాంటివి ఒక వేయి గడిచాక అన్నమాట.

- జ్ఞానం కలిగాక జీవుడు పరమేశ్వరునితో కలిసినప్పుడు దాన్ని ఆత్యంతిక ప్రళయం అంటారు.

❉ ఇక రెండవదైన బ్రహ్మ ప్రళయం. దీన్ని నైమిత్తిక ప్రళయమని కూడా అంటారు. ఇది కల్పాంతంలో ఒక్కసారి జరుగుతుంది. వేయి యుగాలు బ్రహ్మకు ఒక్కరోజు. బ్రహ్మకు ఒక్క దినం ఒక్క కల్పం. సహస్ర యుగాల తర్వాత లోకాలన్నీ వంద సంవత్సరాల కరువు కాటకాలను అనుభవిస్తాయి. జలాలనన్నింటినీ సూర్య కిరణాలు త్రాగివేస్తాయి. దాన్తో సూర్యుడు బలిసి

సప్త సూర్యులు అవుతారు. ఈ సప్తసూర్యులు లోకాలని మాడ్చి పారేస్తారు. అప్పుడు భూమి తాబేటి వీపులాగా (కూర్మపృష్ఠం) కన్పిస్తుంది. అప్పుడు కాలాగ్నితో సమానమైన తేజస్సుతో రుద్రుడు పాతాళాన్నీ, భూమినీ, స్వర్గాన్నీ దహించి పారేస్తాడు. అప్పుడు లోకాలన్నీ అగ్ని గోళాలవుతాయి. అప్పుడీ లోక వాసులందరూ ఆగ్నేయ బాధ నుంచి తప్పుకోవడానికి మహర్లోకం వెళ్తారు. అక్కణ్నుంచి జనలోకం వెళ్తారు. ఇట్లా బ్రహ్మ ప్రళయంలో సర్వం నాశన మవుతుంది.

16. ***సుమహత్పద్మ భవాండ పంక్తుల లయ క్షోభ ప్రతాపంబుతో***
నిమిషార్ధంబునఁ గ్రాఁచి పెంపెసఁగు నీ నేత్రానల జ్యోతి య
య్యమ మీనాంక జలంధర త్రిపుర దైత్యాలిన్ విజృంభించి భ
స్మముగాఁ జేయుట నిశ్చయింప నిది దాశౌర్యంబె సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సుమహత్ = గొప్ప; పద్మభవాండ పంక్తుల = బ్రహ్మాండాల వరుసలను; లయక్షోభ, ప్రతాపంబుతో = ప్రళయకాలపు అల్లకల్లోలమూ, శౌర్యాలతో; నిమిష అర్ధంబున = అరనిమేషకాలంలో; క్రాచి = తపింపజేసి; పెంపెసగు = వృద్ధి పొందు; నీ = నీ యొక్క; నేత్ర అనల జ్యోతి = కంటి మంటల వెల్తురు; ఆ; యమ = యముడు; మీనాంక = మన్మథుడు; జలంధర = జలంధరుడు; త్రిపుర దైత్యాలిన్ = త్రిపురాసురుణ్ని; విజృంభించి = ప్రతాపించి; భస్మముగా చేయుట = బూడిదగా చేయడం; నిశ్చయింప = నిర్ణయిస్తే; తా = తాను; ఇది శౌర్యంబె = ఇదే శౌర్యము.

– *సర్వేశ్వరా! అరనిమేషమాత్ర సమయంలో గొప్పవైన బ్రహ్మాండాల నన్నింటినీ ప్రళయ కాలపు అల్లకల్లోలంతోనూ, శౌర్యంతోనూ కాచి వృద్ధిపొందే నీ కంటి*

మంట వెలుగు యముడు, మన్మథుడు, జలంధరుడు, త్రిపురాసురులను విజృంభించి బూడిద చేయడం అది ఖచ్చితంగా నీ శౌర్యమే.

❄ ప్రళయాన్నే కలిగించగల్గిన ఈశ్వరునికి ఓ ఇద్దరు దేవతల్నీ, ఓ ఇద్దరు రాక్షసుల్నీ భస్మం చేయడం ఒక లెక్కా?!

❄ ఈశ్వర నేత్రానల జ్యోతి లయక్షోభ ప్రతాపంతో వృద్ధి పొందుతుందనడం విశేషం!

— మృకండుని కుమారుడైన మార్కండేయుడు 16 సం॥లే ఆయుష్షు కలిగి జన్మించాడు. తన ఆయుష్షు 16 సం॥లేనని తెలిసినప్పటి నుంచీ మార్కండేయుడు శివలింగం ముందర కూర్చొని తపస్సు చేయడం మొదలెట్టాడు. 16 వ సం॥ రాగానే అతని ప్రాణాలను తీసికొని పోవడానికి వచ్చిన యమదూతలకు అతని తేజస్సు వాళ్లని తపించడం వల్ల సాధ్యంకాక వెనక్కి పోవాల్సి వచ్చింది. అప్పుడు మృత్యు దేవత అయిన యముడే వచ్చి తన యమపాశాన్ని వేశాడు. భయంతో మార్కండేయుడు శివలింగాన్ని కౌగిలించుకొని ఉండడం చేత ఆపాశం శివునికీ చుట్టుకొన్నది. శివుడు రౌద్రంతో లింగంలోంచి బైటకు వచ్చి యముణ్ణి చంపి మార్కండేయుణ్ణి రక్షిస్తాడు. ఆ తర్వాత దేవతలూ, మార్కండేయుడూ ప్రార్థించి యముణ్ణి తిరిగి బ్రతికింప చేస్తారు. శివుని మృత్యుంజయత్వంలో ఇదొక అంశం. ఆయనకు మృత్యువు లేకపోవడమేకాక మృత్యు దేవత ఆయనకు బంటు. ఆయన ఆజ్ఞకు లోబడాల్సిన వాడా దేవత. కాలకాలుడన్న శివ నామాంతరం శివుని మహిమను తెల్పేదే.

— మీనాంకుడంటే మన్మథుడు. మన్మథ దహనం ప్రసిద్ధమైన ఐతిహాసిక వృత్తాంతమే. తారకాసురుడు పెట్టే బాధలను భరించలేక బ్రహ్మనుంచి దేవతలు శివవీర్య సముద్భవుడైన కుమారస్వామే తారక సంహారం చేయగల్గిన వాడని తెలిసి, తత్సిద్ధికై పార్వతీశివుల కళ్యాణాన్ని

కోరుకుంటారు. హిమాలయాల్లో తపస్సు చేసికొంటున్న శివునికి ఆయనకు పరిచర్యలు చేస్తున్న పార్వతిపై ప్రేమ కల్గి పరిణయం కావాలని అందుకు గాను మన్మథుణ్ని ఇంద్రుడు అక్కడికి పంపిస్తాడు. అదను చూసి మన్మథుడు బాణప్రయోగం చేయగా, తనలో క్షణం పాటు కల్గిన మనో వికారానికి ఎవరు కారణమా? అని తపోభంగం అయిన శివుడు కన్ను తెరచి చూసి మన్మథుణ్ని కారణంగా గ్రహించి, అతి రౌద్రంతో తన మూడవ కన్ను తెరిచి అతణ్ని దహిస్తాడు. అట్లా ఆ క్షణాన మన్మథుడు భస్మమై పోతాడు.

— ఈ పద్యంలోని యమమీనాంకులు దేవతలు కాగా తక్కిన ఇద్దరు జలంధర త్రిపురులు అసురులు. జలంధరుడు శివునితోనే యుద్ధం చేసినవాడు. అర్జునుని లాగా ప్రచ్ఛన్న రూపంలో ఉన్న శివునితో కాకుండా శివునితో ప్రత్యక్షంగానే యుద్ధం చేసినవాడు.

జలంధరుడు క్షీరసాగరునికి మనుమడు. ఒక సారి రాహువు శిరస్సు లేకుండా మొండెంతో మాత్రమే ఉన్న దశలో క్షీరసాగర మథన ఇతివృత్తం అంతా జలంధరుడితో చెప్తాడు. తన తాతను మథించినందుకు దేవతలందరి మీదా అతనికి విపరీతమైన క్రోధం కల్గుతుంది. దాన్తో అతను రాక్షసులందర్నీ వేసికొని దేవతల మీదికి యుద్ధం వెళ్తాడు. అసురులు చాలా మంది నిహతులౌతారా యుద్ధంలో. ఐనా విష్ణువూ ఇంద్రులు ఓడిపోతారు. విష్ణువుని బందీగా తీసికొని పోయి సముద్ర గర్భంలో దాస్తారు.

అప్పుడు సాక్షాత్తు శివుడే యుద్ధంలోకి దిగుతాడు. ఘోర యుద్ధం జరుగుతుంది. (జలంధరుడు తాను ఓడిపోనున్నానని గ్రహించి మాయా శివరూపంలో కైలాసంలోని పార్వతిని మోసగించే ప్రయత్నం చేస్తాడు. ఇది అవాంతర కథ) అందులో జలంధరుడోడుతాడు.

— ఈ పద్యంలోని నాల్గవ విషయం త్రిపురాసుర సంహారం. నిజానికి త్రిపురాసురుడన్నది ముగ్గురు రాక్షసులకు కలిపిన పేరు. ఆ ముగ్గురూ తారకాసురుని కుమారులు. తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అని వారి పేర్లు. తారక వధానంతరం గత వైభవాన్ని పొంద గోరి వాళ్లు బ్రహ్మను గురించి తపస్సు ఉగ్రంగా చేస్తారు. బ్రహ్మ ప్రత్యక్షమయి వరం కోరుకొమ్మని అంటే వాళ్లు 'ఏ వడువున మాకు మిత్తి ఏర్పడని యటుల్' (ఏ రకంగానూ మాకు మృత్యువు కల్గని విధంగా) వరమీయమంటారు. దానికి బ్రహ్మ అంగీకరించ కుండటంతో వారు తమ కోరికను మార్చుకొని విచిత్రమైన వరాన్ని అర్థిస్తారు. - వాళ్లు ముగ్గురికీ, ఒక్కొక్కరికి ఒక్కొక్క పురాన్ని ఇవ్వమంటారు. ఆ మూడు పురాల్లో ఒకటి బంగారపుదీ, ఇంకొకటి వెండిదీ, మరొకటేమో ఇనుపది. ఈ మూడు పురాలూ 'నేలపై ఆనక మింట తిర్గుచూ' ఉండాలట. ఈ పురాలలో ఒక్కొక్క దానిలో వీళ్లు ఒక్కొక్కరుంటారు. శివుడు రథంకాని రథంలో వచ్చి, విల్లుకాని విల్లుతో, వాలుకాని వాలుతో ఈ మూడు పురాలనూ ఒక్కసారిగా కాలిచి చంపుతే తప్ప తాము చావగూడదని అంతవరకు తాము బ్రతికి ఉండేటట్లుగా వరం ఇవ్వమని ప్రార్థించారు. మయుణ్ని పిలిచి బ్రహ్మ అలాంటి పురాలను చేయించి వారికి వరప్రాప్తిని కలిగించాడు.

ఈ భర్మ, రాజత, ఆయన పురాలను రోదసిలో తిరిగే పురాలు కావడం చేత గ్రహనక్షత్రాలకూ, దేవతలకూ నిత్య ప్రమాదం కలుగుతూ ఉండేది. పోగా ఈ ముగ్గురూ శంకర భక్తులు. అటు బ్రహ్మ వరమూ, ఇటు శివానుగ్రహమూ వారిని అనివార్యులుగా చేయగా దేవతలంతా బ్రహ్మను తీసికొని శంభునివద్దకు వచ్చి మొరపెట్టుకొంటారు. శివుడు లోక సంక్షేమం కోసం వారిని చంపడానికి సిద్ధంకాగా, బ్రహ్మ ఇచ్చిన వరాన్ని దృష్టిలో ఉంచుకొని, "విశ్వంభరను రథంబుగను, అద్దానికి సూర్య చంద్రుల

ద్వాదశార షోడ శారంబులగు చక్రంబులుగను, ఉదయాస్తాచలంబులను నొగలుగను, మంత్రంబులు ఘంటంబులుగను, ఋతుషట్కంబు నేములుగను, మందరాద్రి చోటుగను, నాకసంబు టెక్కెంబుగను, స్వర్గ మోక్షంబులు ధ్వజంబులుగను, షడంగ పురాణ మీమాంసా ధర్మశాస్త్రంబులు తేరి నొగలుగను, దిక్కులు పాదంబులుగను, అనంతుండు బంధముగను, సంద్రంబు లేడును రథ కంబలంబులు గను, గంగాది సరిన్మతల్లులు స్వర్ణ కంకణ కరభూషితులగు చామర గ్రాహిణులుగను, లోకాలోకాచలంబు సోపానంబుగను, విధిని సారథిగను, తొలి పల్కులు తేజులుగను, ప్రణవంబును కొరడాగను, దర్వీకరంబులు పగ్గంబులుగను, వేల్పులు రశ్మిధారులుగను, అకారంబు గొడుగుగను, బంగరు కొండ విల్లుగను, శేషుండు నారిగను, సరస్వతి ఘంటగను, నారాయణుండు బాణంబుగను, అగ్గి శల్యంబుగను తారలు తురంగ భూషణంబులు గను, మహర్షులు గుజ్జుపు జౌతులుగను, విషవాయువులు సైనికులుగను, సంతరించి సర్వదేవమయుండగు మహేశ్వరున కొసంగి (శివపురాణం) దేవతలు ఆయనని రథారోహణం చేయమన్నారు. ఇట్లాంటి రథం ఎక్కి, విచిత్రమైన విల్లమ్ములతో శివుడు పోరి త్రిపురాలను భస్మం చేశాడు.

— ఈ పద్యంలో శివశౌర్యాన్ని సూచించే ఈ నల్గురిని (యమమీనాంక జలంధర త్రిపురులు) పేర్కొన్నారు కవి అన్నమయ్యగారు.

17. ***అతిదక్షుండగు దక్షుఁడీ జగములో యాగంబు సల్లక్షణ***
స్థితిగాఁ జేయుచు నుండి నిన్ను మది నుద్దేశింపమిం జేసి తా
హతుఁడయ్యెన్ మది నట్టి కార్యములు పొందై యుండునే? కర్తస
మ్మతితోఁ జేయని దుర్మదుండు మనునే? భావింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అతిదక్షుండగు = మిక్కిలి నేర్పరియైన; దక్షుడు = దక్షప్రజాపతి; ఈ జగములో = ఈ లోకంలో; యాగంబు = యజ్ఞాన్ని; సత్ లక్షణ స్థితిగా = లక్షణాను సారియై; చేయుచున్ ఉండి = చేస్తూ ఉండి కూడా; నిన్ను; మదిన్ = మనస్సులో; ఉద్దేశింపమిన్ చేసి = లక్షించక పోవడం చేత; తా = తాను; తుది = చివరకు; హతుడు అయ్యెన్ = నిహతుడైనాడు; అట్టి కార్యములు = శివుని లక్షించని అట్లాంటి కార్యాలు; పొందు ఐ = ఉచితమై; ఉండునే = ఉంటాయా?; కర్త = యజమాని యొక్క; సమ్మతితో = అనుమతితో; చేయని = చేయనట్టి; దుర్మదుండు = దురహంకారంతో నిండిన వాడు; భావింప = ఊహించగా; మనునే = బ్రతుకుతాడా?

— *సర్వేశ్వరా! మిక్కిలి నేర్పరి ఐన దక్షుడు సలక్షణంగా యజ్ఞం చేస్తుండగా, ఈశ్వరుడవైన నిన్ను ఆయన ఉద్దేశింపకుండా చేసినందువల్ల హతుడైనాడు. అట్లాంటి కార్యాలు (శివుని లక్షింపని కార్యాలు) ఔచితీమంతా లవుతాయా? కర్త అయిన నీ అనుజ్ఞతో చేయని దుర్మదుడు మన్నుతాడా?*

❄ *దక్షుడు అహంకరించి ఫలితం అనుభవించాడు. ఏ సత్ కార్యమైనా శివుణ్ని ఉద్దేశించకుండా చేస్తే అది దుష్కార్యమే అవుతుంది. అది అనౌచిత్యం. కావాల్సింది పనులు చేయడంలో దక్షత కాదు. కావాల్సింది శివభక్తి. యజ్ఞం చేసేది దక్షుడే అయినా, నిజమైన కర్త-చేయించే వాడయిన శివుడే. అన్నింటికీ ఆయన అనుమతి అవసరం.*

❄ ఈ పద్యంలో దక్షుడు హతుడవడమన్న విషయం ఉన్నది. బ్రహ్మ ఆజ్ఞ మేరకు దక్షుడు ప్రజోత్పత్తి చేస్తాడు. అందుకే ఈయనను దక్ష ప్రజాపతి అని కూడా అంటారు. బ్రహ్మ మనస్సంకల్పంతో సప్తర్షులను సృష్టిస్తాడు. వాళ్లు - మరీచి, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, వసిష్ఠుడు, పులహుడు, క్రతువు. దీని తర్వాత బ్రహ్మ ఒడిలోంచి నారదుడు, అతని కుడి బొటన

వ్రేలినుంచి దక్షుడు, అతని మనస్సునుంచి సనక, సనందన, సనత్కుమార, సనత్ సుజాతులనే మానస పుత్రులూ, అతని ఎడమ బొటన వ్రేలినుంచి వీరణి అనే కూతురూ పుట్టారు.

దక్షుడు పర దేవత అయిన మాహేశ్వరిని గురించి తపస్సు చేసి ఆమెనే తనకు పుత్రికగా పుట్టమని ప్రార్థించగా ఆమె సతీ దేవిగా అతని పుత్రికా రత్నంగా జన్మిస్తుంది. పరమ శివునికి ఆమె భార్య అవుతుంది. దక్షుడు ఆ తర్వాత ఒక యజ్ఞాన్ని చేస్తూ దేవతల నందర్నీ దానికి ఆహ్వానించి కూడా, తన కూతురైన సతీ దేవిని కాని, అల్లుడు పరమశివుణ్ని కానీ పిలువలేదు. ఐనా శివానుమతితో సతీదేవి ఆయజ్ఞానికి పోయి భంగపడ్తుంది. అప్పుడు సతీదేవి దేవతల్ని శపించి తాను యోగాగ్ని సృష్టించుకొని అందులో దగ్ధమవుతుంది. ఈ విషయం తెలిసి శివుడు పరమ రౌద్రంతో తన ఒక జడను తీసి పర్వతాగ్రంపై కొట్టగా వీరభద్రుడూ, ఆయన పక్కన భద్రకాళీ పుట్టారు. ఆ వీరభద్రుడు దేవతలందరితో యుద్ధం చేసి వారినోడించి, అవమానించి చివరకు దక్షుని చంపుతాడు.

18. ***జగతీ చక్రము పాదఘట్టన నదృశ్యంబై ప్రవర్తింపఁగా***
గగనంబంతయు బాహుమండల సమగ్రవ్యాప్తులం దద్భుతం
బుగ ఘూర్ణిల్ల నజాంత్య వేళల సముద్భూతాంగ హారావళుల్
నిగుడం బొంగి నటింతు తాండవ మహానృత్యంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జగతీ చక్రము = జగన్మండలం; పాదఘట్టనన్ = (నీ) పాదాల తొక్కిడి చేత; అదృశ్యంబై = లేనిదై; ప్రవర్తింపగా = ఉండగా; గగనంబు అంతయు = ఆకాశమంతా; బాహుమండల = (నీ) బాహువుల యొక్క; సమగ్ర = పూర్తియైన;

వ్యాప్తులన్ = వ్యాపించడాల చేత; అద్భుతంబుగ = ఆశ్చర్య కరంగా; ఘూర్ణిల్లన్ = తిరుగుడు పడగా; అజాంత్య వేళల = ప్రళయ కాలంలో; సముద్భూత = పైకి లేచిన; అంగ = శరీరం మీది; హారావళుల్ = ఆభరణ సమూహాలు; నిగుడన్ = నిక్కునట్లుగా; తాండవ మహానృత్యంబు = తాండవమనే గొప్ప నాట్యాన్ని; నటింతు = నటిస్తావు.

— *సర్వేశ్వరా! జగన్మండలం నీ పాదఘట్టనల చేత నశించగా, ఆకాశమంతా నీ బాహుమండలం సంపూర్ణంగా వ్యాపించడం చేత, ఆశ్చర్యకరంగా తిరుగుడు పడగా, ప్రళయ కాలంలో పైకి లేచిన నీ శరీరం మీది హారావళులు నిక్కునట్లుగా నీవు తాండవ మహానృత్యాన్ని నటిస్తావు.*

❋ *తాండవం శివుని యొక్క ఉద్ధతమైన నృత్యం. నృత్త, నృత్య. నాట్య, లాస, తాండవాలన్నవి మూలభూత విభాగాలు. పార్వతిచేసేదిలాస్యం. శివునిది తాండవం. తాండవ శివుణ్ని నటరాజు అంటారు. ఈయనకు చతుర్భుజాలు. కుడి పార్శ్వం లోని ఒక చేయి అభయహస్తం. మరొక చేయి ఢమరుకాన్ని పట్టుకుంటుంది. ఎడమవైపు పై చెయ్యి అగ్నినీ, మరొక చేయి డోలా కారమైన 'స్వస్తికమండ' లాన్ని గ్రహించి ఉంటుంది. ఎడమ కాలు బాగా పైకెత్తబడి ఉంటుంది. కుడి కాలి వేళ్ల కింద రాక్షసుడు తొక్కబడి ఉంటాడు. కొన్ని నటరాజ మూర్తులలో ఢమరుకానికి బదులు లేడిపిల్ల ఉంటుంది. దాని రెండు కాళ్లూ ముష్టిలోనూ మిగిలిన రెండు కాళ్లూ స్వేచ్ఛగానూ ఉంటాయి.*

❋ *శివతాండవం చిదంబర సభలో జరుగుతుంది. అందుకే ఆయనను చిత్ సభా పతయే నమః అనీ నమస్కరిస్తారు. ఉపనిషత్తులు చెప్పిన పంచ ఆకాశాలలో ఐదవది చిదాకాశం. కథగా చెప్పుకోవడం కన్నా కూడా ఈ తాండవ నటరాజు ప్రతీకాత్మక మూర్తి. సంసారానికి ప్రళయం కల్గిస్తూ చిదాకాశంలో ఆనంద ప్రాప్తిని కల్గించే ఈశ్వరమూర్తి ఇది.*

19. ***అమరేంద్రాబ్జ భవాళికెన్నఁ దుది నీవాదిం బ్రసాదించు న***
ర్థము సిద్ధించుచునుండుగాని సురమాత్రం గోరిన న్వీరికా
ర్యము సిద్ధింపదనేక మార్గములఁ బ్రారంభించి రే నిశ్చయా
ర్థముగా నీవ సమస్త కర్తవగుటం దర్కింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఎన్న = పరిగణిస్తే; తుది = చివరకు; అమరేంద్ర = దేవేంద్ర; అబ్జభవాళికి = బ్రహ్మాదులకు; నీవు; ఆదిన్ = మొదటగా; ప్రసాదించు = ప్రీతితో అనుగ్రహించే; అర్థము = ప్రయోజనం; సిద్ధించుచు నుండు కాని = లభిస్తూ ఉంటుంది కాని; తర్కింప = వివేచిస్తే; నిశ్చయార్థముగా = ఖచ్చితంగా; నీవ = నీవే; సమస్త కర్తవు = అన్నింటికీ కర్తవు; అగుటన్ = కావడం వల్ల; సురమాత్రన్ = దైవత్వాన్ని మాత్రమే; కోరినన్ = కాంక్షించి నట్లయితే; అనేక మార్గముల = అనేక రీతులుగా; ప్రారంభించిరే = మొదలెట్టినా; వీరి కార్యము = వీళ్ల పని; సిద్ధింపదు = ఫలించదు.

– *సర్వేశ్వరా! ఇంద్రబ్రహ్మాదులకు నీవు మొదట ప్రసాదించిన ప్రయోజనమే సిద్ధిస్తుంది కాని, నీవే సమస్త కర్తవు కావడం చేత సురత్వమే కోరి అనేక మార్గాలలో ప్రారంభించిన వీళ్లకి కార్యం సిద్ధించదు.*

❋ *సర్వేశ్వరానుగ్రహం వల్లనే సమస్తమూ సిద్ధిస్తుంది. సురత్వ మాత్రం చేత ఏదీ సిద్ధించదు. సురత్వమన్నది దేనికీ కర్తకాదు. అది దేన్నీ చేయలేదు. సమస్తానికీ కర్త ఖచ్చితంగా సర్వేశ్వరుడే. అందువల్ల దేవతలు ఎన్ని మార్గాల్లో కార్యాలను ప్రారంభించినప్పటికీ అది సిద్ధించదు. కేవలం ఈశ్వరుడు ప్రసాదిస్తేనే అది సిద్ధిస్తుంది.*

❋ *సమస్త కర్తృత్వం ఈశ్వరునిదే. ఇతరులు నిమిత్త మాత్రులు. దైవత్వం చేతనే ఏదీ సిద్ధించదు. దేవదేవుడే అన్నింటికీ మూలం!*

20. అమరంగా స్ఫుటభక్తి నాటకము భాషాంగ క్రియాంగాభి ర
మ్యముగాఁ జూపిన మెచ్చి నీ విల బలే యన్నంతకున్ యోనిగే
హములన్ రూపులు వన్నుకొంచును నటుండై వచ్చి సంసార రం
గములోనన్ బహురూప మాడు వెలయంగా జీవి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమరంగా = పొందికగా; స్ఫుట = స్పష్టమైన; భక్తినాటకము = భక్తి అనే నాటకాన్ని; భాషాంగ = వాచిక భాగంతో; క్రియాంగ = చేష్టా భాగంతో; అభిరమ్యముగా = బహు సుందరంగా; చూపిన = ప్రదర్శించగా; మెచ్చి = ప్రశంసించి; నీవు ఇల = నీవిక్కడ; బలే = భళీ; అన్నంతకున్ = అనగా; జీవి = జీవి; యోని గేహములన్ = (స్త్రీల గర్భాలలో); రూపులు పన్నుకొంచును = శరీర రచన చేసికొంటూ; నటుండైవచ్చి = నటుడుగా (వేషధారిగా) వచ్చి; సంసార రంగములోనన్ = సంసారమనే రంగస్థలం మీద; వెలయంగా = ప్రకాశిస్తూ; బహురూపము ఆడు = అనేక వేషాలు ధరిస్తాడు.

— *సర్వేశ్వరా! భక్తి అనే నాటకాన్ని వాగభినయంతోనూ, చేష్టాభినయం తోనూ ఎంతో రమణీయంగా చూపితే మెచ్చి నీవు బలే యనగా జీవి అనేక స్త్రీల గర్భాలలో జన్మిస్తూ నటుడుగా వచ్చి సంసారమనే రంగస్థలం పై అనేక వేషాలు వేస్తాడు.*

❋ *ఈ పద్యంలోని జీవి మాయామోహితుడు కాకపోవడం విశేషం. ఇతడు నాటక ప్రదర్శనంలోని నటునిలాంటి వాడు. సంసారాన్నే ఒక నాటకంగా భావించే వాడు కాబట్టి ఇతనికి కర్మబంధం లేదు. మళ్లీమళ్లీ జన్మ ఎత్తినా, సృష్టి రహస్యం తెలిసిన వాడు కావడం వల్ల శివుడు ఇతని వాగంగాభినయాలకు మెచ్చి బలే అంటున్నాడు. అది ప్రేరణగా తీసికొని జన్మనెత్తడానికి అతడు భీతి చెందడం లేదు. సుఖదుఃఖాదిక ద్వంద్వాలను తటస్థుడుగా చూడగల్గిన మహా జీవి అన్న మాట ఇతడు.*

21. ***శ్రీవత్సాంకు రమావిశేషతయు వాక్ఛ్రీనాథు చాతుర్యమున్***
దేవాధీశ్వరు వైభవోన్నతియు నా తిగ్మాంశు తేజంబు శ్రీ
దేవీ నందను రూప విభ్రమము చింతింపంగ నీ భక్తి స
ద్భావాత్ముండగు పుణ్య మూర్తికిఁ దృణ ప్రాయంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

శ్రీవత్సాంకు = వక్షఃస్థలం మీద మచ్చ గల్గిన శ్రీ మహావిష్ణువు యొక్క; రమా విశేషతయు = సంపత్ విశేషంకానీ; వాక్ శ్రీనాథు = వాగైశ్వర్యానికి అంటే సరస్వతికి నాథుడైన బ్రహ్మ యొక్క; చాతుర్యమున్ = దక్షతకానీ; దేవాధీశ్వరు = దేవేంద్రుని; వైభవ ఉన్నతియున్ = ఐశ్వర్య ఆధిక్యం కానీ; ఆ; తిగ్మాంశు = వేడి కిరణాలు గల్గిన సూర్యుని; తేజంబు = ప్రకాశం కానీ; శ్రీదేవీ నందను = శ్రీ లక్ష్మీ పుత్రుడైన మన్మథుని యొక్క; రూప విభ్రమము = ఆశ్చర్యం కల్గించే ఆకారంకానీ; చింతింపంగ = వితర్కిస్తే; నీ = నీ యొక్క; భక్తి సద్భావాత్ముండగు = భక్తి అనే సద్భావాన్ని కలిగినట్టి; పుణ్య మూర్తికి = పవిత్రమూర్తికి; తృణప్రాయంబు = గడ్డి పరకతో సమానం.

– *సర్వేశ్వరా! నీ భక్తి కల్గిన పుణ్యాత్ముడికి శ్రీ మహావిష్ణువు యొక్క సంపద కానీ, బ్రహ్మ యొక్క చాతుర్యంకానీ, దేవేంద్రుడి వైభవం కానీ, సూర్యతేజం కానీ, మన్మథుని రూపంకానీ గడ్డి పరకతో సమానం!*

❊ *ఈ పద్యంలో ఎవరైనా కావాలని కోరుకొనే ఐదు అంశాలున్నాయి. అవి (1) సంపద (2) చాతుర్యం (3) సంపదను భోగించే (అంటే సంపద భోగరూపమైన) వైభవం (4) తేజస్సు (5) సుందర రూపం. వీటిల్లో ఏ ఒక్కటి లోపించినా తక్కిన నాలుగూ వ్యర్థం. సంపద ఉండి చాతుర్యం లేకపోతే రాణించదు. ఇతరులను ఆశ్రయించుకొని జీవించాల్సి ఉంటుంది. సంపద చాతుర్యాలు రెండూ ఉండి వైభవం లేకపోతే అవి అనుభవానికే*

రాక అడవిగాచిన వెన్నెల అవుతాయి. సంపద, చాతుర్యం - వైభవం అన్న మూడూ ఉండి తేజస్సు లేకపోతే లోకానికి అవి ప్రకాశించనే ప్రకాశించక చీకటిలోని సౌందర్యం అవుతాయి. సంపద - చాతుర్యం - వైభవం - తేజస్సు అన్న నాలుగూ ఉండి సుందర ఆకారం లేకపోతే లోకానికి అసహనమూ, అప్రీతీ కలిగి రాణింపు లేకుండా పోతుంది. కాబట్టి ఈ ఐదూ ఐహిక దృష్టి ఉన్న ఎవ్వడైనా కోరుకొంటాడు. కాని శివానందాన్ని కోరే ఈశ్వర భక్తునికి ఈ ఐదూ తృణప్రాయాలు. శివానందం ఈ ఐదింటికన్నా ఎన్నో రెట్లు గొప్పది కావడమే ఇందుకు హేతువు.

❄ ఈ పద్యంలో మరో విశేషం ఈ ఐదూ ఆయా దేవతలతో ముడిపడి ఉన్న మహావిషయాలు. మానవుని సంపద కన్నా శ్రీ మహావిష్ణు సంపద ఎప్పుడూ అత్యంత గరిష్ఠమైనది. కారణం ఆయన సతీమణియే లక్ష్మీదేవి కాబట్టి. సకల ప్రజ్ఞలకు మూలపుటమ్మ సరస్వతి. ఆమెకు నాథుడు బ్రహ్మ కాబట్టి ఆయన చాతుర్యం గరిష్ఠ మయింది. ఇట్లాగే వైభవంలో దేవేంద్రుడిదీ, తేజంలో సూర్యనారాయణునిదీ, రూపంలో మన్మథునిదీ! అన్నీ గరిష్ఠ స్థాయివి. శివభక్తుడిట్లాంటి వాటిని కూడా గడ్డి పరకతో సమానంగా చూస్తున్నాడంటే ఇవేవీ నిజానికి గరిష్ఠ స్థాయివి కావనీ ఇంత కన్నా శ్రేష్ఠాతి శ్రేష్ఠం ఉత్తమోత్తమం, ఈ ఐదింటినీ కలగలుపుకొని మించిన దాన్ని - శివభక్తి ఇస్తుంది కాబట్టే శివభక్తుడు వీటిని తృణ ప్రాయంగా చూస్తున్నాడు.

22. ఇలసద్భక్తుల పాదధూళి పటలం బెవ్వండు ఫాలంబునం
జిలికెన్ వాఁడపవర్గ నాథుఁడనినన్ సిద్ధంబుగా వాని ని
ర్మల హస్తార్పిత భూతిఁ బ్రీతి నొసలారం బూయు విశ్వాసికిన్
ఫలమూహించి విధింప నెవ్వరికిఁ జెప్పన్ వచ్చు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఇల = భువిపై; సద్భక్తుల = (సర్వేశ్వరుని) మంచి భక్తుల యొక్క; పాదధూళి పటలంబు = పాదరజః సమూహాన్ని; ఎవ్వండు = ఎవడు; ఫాలంబునన్ = నొసట; చిలికె = చల్లుకొంటాడో; వాడు = అట్లా చల్లుకొన్న వాడు; అపవర్గ నాథుడు = మోక్షాధిపతి; అనినన్ = అనగా; సిద్ధంబుగా = అప్రయత్నంగా; వాని = ఆ భక్తుని యొక్క; నిర్మల = అకలంక; హస్త అర్పిత = అరచేతిలో ఉంచిన; భూతి = భస్మమును; నొసలారన్ = నొసటి నిండా; పూయు = పూసే; విశ్వాసికిన్ = విశ్వాసవంతునికి; ఊహించి = భావించి; ఫలము = ఫలితాన్ని; విధింప = నిర్ణయించడానికి; ఎవ్వరికి = ఎవరికి; చెప్పన్ వచ్చు = సాధ్యమవుతుంది?

– *సర్వేశ్వరా! సద్భక్తుల పాదధూళిని ఎవడు నొసట చల్లుకొంటాడో వాడు మోక్ష ప్రదాత అయిన శివుడు అవుతాడు అని అంటే సిద్ధంగా వాడి నిర్మల హస్తంలోని విభూతిని భక్తితో నొసట పూసే విశ్వాసికి దక్కే ఫలం ఇదీ అని ఎవరూహించి చెప్పగల్గుతారు?*

❄ *ఇది భస్మధారణ మహిమను తెలిపే పద్యం. భస్మధారణను తెలిపే పద్యం ఈ కృతిలో ఇదొక్కటే. రుద్రాక్ష మహిమపై పద్యాలు లేవు.*

❄ *శివుడు భక్తుల రక్షణకు ఇచ్చిన కవచాలు ఎనిమిది. వీటిని అష్టావరణాలు అంటారు. ఇవి (1) విభూతి (2) రుద్రాక్ష (3) మంత్రము (4) గురువు (5) లింగము (6) జంగమ మాహేశ్వరుడు (7) తీర్థము (8) ప్రసాదము.*

ఇందులో మొదటిది విభూతి ధారణం.

ఈ పద్యంలో భక్త పాదధూళి నొసట పూస్తే అపవర్గ నాథుడౌతాడనీ, హస్తార్పిత విభూతి పూసికొంటే ఇంకా ఏమౌతాడో ఎవరు చెప్ప గల్గుతారనీ అంటూ హస్త విభూతితో లభించే ప్రయోజనం సిద్ధమైనదిగా చెప్పారు

కవి. అంటే అప్రయత్నంగానే ఫలం లభిస్తుందని అర్థం. విభూతిని ఎడమ అరచేతిలో ఉంచుకొని పంచ బ్రహ్మ మంత్రంతో అమృతత్వ దాయకం చేసి నొసట దాన్ని పూస్తారు.

"సద్యోజాతం ప్రపద్యామి సద్యోజాతాయవై నమోనమః

భవే భవే నాతిభవే భవస్వమాం భవోద్భవాయ నమః ....."

ఇత్యాదిగా ఈ మంత్రం సాగుతుంది. దీన్తర్వాత కుడిచేతితో ఎడమ అర చేతిని మూసి

"అగ్నిరితి భస్మ వాయురితి భస్మ జలమితి భస్మ

స్థలమితి భస్మ వ్యోమేతి భస్మ సర్వగ్ం హవా

ఇదగ్ం భస్మ వాఙ్మన ఇత్యేతాని చక్షూగుంషి

కరణాని భస్మాని"

అన్న మంత్రంతో ప్రళయ కాలయజ్ఞ ప్రసాదంగా సిద్ధింప జేస్తారు. తర్వాత రుద్రాధ్యాయంలోని "మానస్తోకే తనయే మాన ఆయుషి" అన్న మంత్రంతో విభూతికి రుద్రత్వాన్ని కల్గిస్తారు. ఆ తర్వాత అదే రుద్రాధ్యాయం లోని మహామృత్యుంజయ మంత్రమైన

"త్ర్యంబకమ్ యజామహే సుగంధిం పుష్టి వర్ధనమ్

ఉర్వారుకమివబంధ నాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్"

తో మృత్యుంజయత్వాన్ని కలిగిస్తారు.

ఇట్లా విభూతికి అమృతత్వం, ప్రళయ కాల యజ్ఞ ప్రసాదత్వం, రుద్రత్వం, మృత్యుంజయత్వం అన్న లక్షణాలు కల్గుతాయి. ఇట్లాంటి విభూతి అపవర్గ నాథత్వానికి మించిన దాన్నిస్తుంది. విభూతి ధారణ వల్ల కలిగే ఫలితాలను కింది విధంగా చెప్పారు.

"భూతిర్భూతికరీ పవిత్ర జననీ పాపౌఘవిధ్వంసినీ
సర్వోపద్రవనాశినీ శుభకరీ సర్వార్థ సంపత్కరీ।
భూతప్రేత పిశాచ రాక్షస గణారిష్టాది సంహారిణీ
తేజోరాజ్య విశేష మోక్షణకరీ భూతిస్సదా ధార్యతామ్"॥

తేజో రాజ్య విశేషమైన మోక్షాన్నిచ్చేది విభూతి.

❋ ఇదంతా విశ్వాసికి. విశ్వాసం లేకుండా ఇదంతా చేస్తే ఈ ఫలితం దక్కుతుందా? అందుకని కవి 'విశ్వాసికి' అని అన్నాడు.

23. పలుతీర్థంబులఁ గ్రుంకుకంటె మహిలో భక్తాంఘ్రి పానీయముల్
తలమీఁదం జిలికించుకొన్న శుచి తీర్థం బాడ భారంబు త
త్ఫల మత్యల్పము భక్త పాదయుగ ళాంభ స్స్పర్శ నిర్భారమై
యలరున్ శాశ్వత భక్తి ముక్తి ఫలదంబై యుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

పలు = అనేక; తీర్థంబుల = పుణ్యానదులలో; క్రుంకు కంటె = మునగడం కన్నా; మహిలో = భువిలో; భక్త అంఘ్రి = భక్తులైన వారి బొటన వ్రేళ్ల; పానీయముల్ = నీళ్లను; తలమీఁదన్ = శిరస్సు మీద; చిలికించుకొన్న = చల్లుకొన్నట్లయితే; శుచి = (ఎక్కువ) పవిత్రము (పుణ్యము); తీర్థం బాడ = స్నానమాడడం; భారంబు = బరువైనది; (పోగా); తత్ఫలము = (అట్లా స్నానమాడడం వల్ల కలిగే) ఆ ఫలితము; అతి అల్పము = చాలా తక్కువ; భక్త = భక్తుల యొక్క; పాదయుగళ = పాదద్వయం మీది; అంభః = నీటి; స్పర్శ = తగలడం; నిర్భారమై = భారరహితమై; అలరున్ = ఒప్పును; (అది ఇంకా) శాశ్వత = నిరంతర; భక్తి = భక్తి; ముక్తి = మోక్షం యొక్క; ఫలదంబు ఐ = ఫలాన్ని ఇచ్చేదిగా; ఉండు = ఉంటుంది.

– సర్వేశ్వరా! అనేక పుణ్యనదుల్లో మునిగిన దానికంటే, భక్తుల పాదతీర్థాన్ని నెత్తి మీద చల్లుకొంటే ఎక్కువ పుణ్యం. స్నానం చేయడం ఎక్కువ బరువు కూడాను. పోగా దాని వల్ల కలిగే ఫలితమూ తక్కువే. ఇక భక్త పాదయుగళ జలస్పర్శ తేలికయిన పని. పోగా అదీ శాశ్వతమైన భక్తి ముక్తుల ఫలాన్ని కూడా ఇస్తుంది.

❊ ఇక్కడి నుంచి ఆరు పద్యాలు తీర్థాల కన్నా భక్త దర్శనమో సేవనమో ఎక్కువ ఫలదాయి అని చెప్తాయి.

❊ *22వ పద్యంలో భస్మధారణ ప్రయోజనం చెప్పిన కవి ఈ పద్యంలో భక్తుల పాదతీర్థాన్ని తీసికొంటే వచ్చే ప్రయోజనాన్ని తెలుపుతున్నారు. అష్టావరణాల్లో ఏడవది పాదతీర్థము. సకల తీర్థాలలో మునిగిం దానికంటే భక్తుల పాద తీర్థాన్ని శిరస్సుపై చల్లుకొంటే అసలు ప్రయోజనమైన శాశ్వత భక్తి ముక్తులు లభిస్తాయనడం అచ్చమైన శైవమత సంప్రదాయం. శివుడే ముక్తి ప్రదాత. శివభక్తుడూ ముక్తి ప్రదాతే అనడం భక్త సంప్రదాయం.*

శైవ మతంలో నిత్య జీవన విధానాలుగా పంచాచారాలున్నవి. లింగాచార, సదాచార, శివాచార, గణాచార, భృత్యాచారాలలో భక్తునికి భక్తుడుగా భృత్యునిగా భావించు కోవడమన్నది గురువు, జంగముడు, పాదతీర్థము, ప్రసాదము అన్న అష్టావరణాలలోని నాలిగింటికి మూలం.

24. **రమణన్ భక్త సమగ్ర దర్శనము తీర్థశ్రేణి, తద్గోష్ఠి తీ**
ర్థము, తద్దివ్య దయావలోకనము తీర్థం బెన్నఁగా నిట్టి జం
గమ తీర్థాంబుధి నోలలాడక వివేక భ్రష్టులై పోయి లో
కములోఁ దీర్థములంచు నేఱులు సొఱంగా నేల? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

రమణన్ = ప్రీతితో; భక్త = శివభక్తులను; సమగ్ర = సంపూర్ణంగా; దర్శనము = చూడడం; తీర్థశ్రేణి = పుణ్య నదీ తీర్థాల వరుస; తత్ గోష్ఠి = వారితో సమావేశమే; తీర్థము; తత్ దివ్య అవలోకనము = దివ్యమైన వారి చూపే; తీర్థంబు; ఎన్నగా = పరిగణించగా; ఇట్టి = ఇలాంటి; జంగమ = కదలాడుచున్న; తీర్థ అంబుధి = పుణ్యతీర్థమనే సముద్రంలో; ఓలలాడక = మునుగక; వివేక భ్రష్టులు ఐపోయి = బుద్ధి నుండి జారిన వాళ్ళయి (బుద్ధిని పోగొట్టుకొన్న వాళ్లై); లోకములో = (ఈ) ప్రపంచంలో; తీర్థములు అంచున్ = తీర్థాలంటూ; ఏఱులు = వాగులలో; చొఱంగాన్ = చొఱబారడం; ఏల = ఎందుకు?

– *సర్వేశ్వరా! ప్రేమతో శివభక్తుల్ని పూర్తిగా చూడడమే అనేక తీర్థాలు. వారితో సమావేశమే తీర్థం; వారి దివ్యమైన దయా దృష్టియే తీర్థం. పరిశీలిస్తే ఇలాంటి కదలాడే మహా తీర్థాలలో మునిగి తేలక, వివేకాన్ని కోల్పోయి లోకంలో తీర్థాలంటూ (ఏవో) ఏర్లలో మునగడం ఎందుకు?*

❈ *ఈ పద్యం కూడా అష్టావరణాలలోని పాద తీర్థ విషయం జంగముని వ్యాజంగా చెప్తున్నది. జంగముడంటే మాహేశ్వరుడే. శివునికి లింగము ఒక రూపం కాగా జంగముడు రెండవరూపం. ఈశ్వరునికి తన మీది కంటె కూడా తన భక్తుల మీద భక్తి చూపే వాళ్లంటే ఎక్కువ ఇష్టం. భక్తులను చూడడం, వారితో సత్సంగం, వారి దయావలోకనం ఇవే తీర్థాలు. కేవలం నీటి తీర్థాలు కావు. శివునికెట్లా మంత్రరూపం, జంగమ రూపం ఉన్నాయో తీర్థాలకీ అట్లాగే ఉన్నాయని స్ఫురింప జేస్తున్నారు కవి. ఇష్టలింగ, బాణలింగ, మృత్తికా లింగాదులు శివుని మంత్ర రూపాలు. మాహేశ్వరుడైన జంగముడు శివుని జంగమ రూపం. అట్లాగే భూమి మీద ఆయా ప్రాంతాల్లో, క్షేత్రాలలో పారే పుణ్య నదులన్నీ ఒక రకమైన తీర్థాలు. వాటి కన్నా ఎక్కువ ఫలదాయకాలయినవి జంగమ తీర్థాలైన భక్త సేవనం.*

25. **కమనీయంబగు సర్వ తీర్థములు లింగం బున్నచో మూర్తి మం**
తములై యొప్పుచు నుండు; లింగమును దాత్పర్యంబుతో భక్తగా
త్రములందెప్పుడు నుండుఁ, గాన మహిలోఁ దత్త్వార్థ మూహింపఁదీ
ర్థములం దెల్లను దివ్య తీర్థము భవద్భక్తుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కమనీయంబు అగు = హృద్యమైన; సర్వ తీర్థములు = సకల తీర్థాలు; లింగంబు ఉన్నచో = లింగం ఉంటేనే; మూర్తి మంతములు ఐ = ప్రకాశవంతాలై; ఒప్పుచున్ ఉండు = విలసిల్లుతాయి; లింగమును = లింగమున్నూ; తాత్పర్యంబుతో = తత్పరతతో; భక్త గాత్రములందు = భక్తుల దేహాలమీద; ఎప్పుడున్ = ఎల్లప్పుడు; ఉండున్ = ఉంటుంది; కాన = కాబట్టి; మహిలోన్ = భూమిమీద; తత్త్వ అర్థము = అంతరార్థాన్ని; ఊహింపన్ = భావిస్తే తీర్థములందు ఎల్లను = సర్వ తీర్థాలలో; దివ్య తీర్థము = దేవతా తీర్థం; భగవద్భక్తుండు = ఈశ్వర భక్తుడు.

— *సర్వేశ్వరా! లింగం ఉంటేనే హృద్యాలైన సర్వ తీర్థాలూ ప్రకాశవంతాలౌతాయి. (మఱి) ఆ లింగ (మేమో) భక్త జనుల దేహాల మీద సర్వదా ఉంటుంది. కాబట్టి (దీని) అంతరార్థాన్ని మనం ఊహిస్తే భూమి మీద అన్ని తీర్థాలలోనూ దివ్య తీర్థం భగవద్భక్తుడే.*

❈ *ఈ పద్యంలో లింగధారి శివభక్తుల ప్రసక్తి వచ్చింది. అన్నమయ్య పుట్టింది శ్రౌతశైవ మతావలంబులైన ఆరాధ్య బ్రాహ్మణ శాఖలో. ఆశాఖలోని వాళ్లు శాంభవ దీక్ష తీసికొంటారు. శాంభవ దీక్షలో శివలింగ ధారణ, శివపంచాక్షరీ మంత్రోపదేశమూ అన్న రెండంశాలుంటాయి.*

❈ పద్యంలో తీర్థాలన్నింటిలోనూ భక్తుడనే తీర్థమే దివ్య తీర్థమనడానికి సుతర్కాన్ని ఒకదాన్ని కవి చూపుతున్నాడు.

— ఏ తీర్థమయినా శివలింగం ఉంటేనే ప్రభావవంతం అవుతుంది. లేకపోతే అది ఒట్టి నదీ ప్రవాహ మాత్రమే అవుతుంది. శివభక్తులైన మాహేశ్వరుల శరీరాలపై శివలింగం ఎప్పుడూ ఉంటుంది. కాబట్టి అతడే దివ్య తీర్థ మంటారు కవి.

❋ శైవుల గాత్రాలపై శివలింగం ఎప్పుడూ ఉండాలన్నది శైవమత సంప్రదాయం. శాంభవ దీక్షనాటి నుంచి లింగైక్యమయ్యేటంత వరకూ శివలింగ ధారణ (వ్యవధి లేకుండా) ఉండేదే.

26. ధరణిం దీర్థములాడుకంటె, నతిమోదం బొప్ప యజ్ఞంబులం
బరఁగం జేయుట కంటె, సువ్రతము లొప్పన్ వేదశాస్త్రార్థత
త్పరుడై యాదటఁ జల్పుకంటె, మది నుత్సాహించి నీ భక్తి మ
త్పురుష శ్రేష్ఠులఁ బూజ సేయుట మహా పుణ్యంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ధరణిన్ = భూమిపై; తీర్థము లాడు కంటెన్ = తీర్థస్నానాలు చేయడం కన్నా; అతి మోదంబు ఒప్ప = మిక్కిలి సంతోషంతో; యజ్ఞంబులన్ = యజ్ఞాలను; పరగన్ = ఒప్పునట్లుగా; చేయుట కంటె = చేయడం కన్నా; ఒప్పన్ = ఒప్పునట్లుగా; వేదశాస్త్ర అర్థ తత్పరుడు ఐ = వేద శాస్త్రాలు చెప్పిన వాటి యందు ఆసక్తి కలవాడై; ఆదటన్ = సంతోషంతో; చల్పుకంటె = చేయడం కన్నా; మదిన్ = మనస్సులో; ఉత్సాహించి = ఉత్సాహాన్ని పొంది; నీ; భక్తిమత్ = భక్తి కలిగిన; పురుష శ్రేష్ఠులన్ = అగ్రేసరులైన వాళ్లని; పూజ చేయుట = అర్చించుట; మహా పుణ్యంబు = గొప్ప పుణ్యము.

— సర్వేశ్వరా! తీర్థ స్నానాలు చేయడంకన్నా, సంతోషంతో యజ్ఞాలు చేయడం కన్నా, ఆనందంతో వేదశాస్త్ర బద్ధంగా సువ్రతాలు చేయడం కన్నా, మనస్సులో ఉత్సాహాన్ని పూని నీ యొక్క శ్రేష్ఠులైన భక్తుల్ని పూజించడం మహా పుణ్యం.

❋ ఇదీ అష్టావరణాలలోని జంగమార్చనే. కర్మ మార్గాన్ని అనుసరించే వాళ్ల పద్ధతులకంటే భక్తి మార్గాన్ని అనుసరించే వాళ్ల పద్ధతులు భేదిస్తవి. భక్తి మార్గంలో దేవుడూ, దేవుని కన్నా దైవ భక్తుడూ ఎక్కువ ప్రాధాన్యాన్ని వహిస్తారు. దైవానికి పూజ చేసే పద్ధతిలోనే భక్తునికి చేయడం శైవమతంలో ప్రబలంగా కన్పిస్తుంది. మాహేశ్వర పాద పూజ అన్నది మహాపుణ్యమని ఈ మతస్థులు గట్టిగా నమ్ముతారు. ఈ పద్యంలో అన్నమయ్య దీన్నే తెలిపారు.

27. *భవదీయామల తత్త్వ నిర్ణయ కళా ప్రఖ్యాత సద్భక్త పుం*
గవ గోష్ఠీ సుఖ వార్ధిలోనఁ గడువేడ్కం దేలినం గాక యీ
భువిలోఁ దీర్థ జలంబులం గడగినం బోనేర్చునే ఘోర దు
ర్భవ సంఘాకలితాత్మ తామస మహా పంకంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భవదీయ = నీయొక్క; అమల = నిర్మలమైన; తత్త్వ = స్వభావాన్ని; నిర్ణయ = నిశ్చయించడమనే; కళా = కళలో; ప్రఖ్యాత = కీర్తిని పొందిన; సద్భక్త = మంచి భక్తులనే; పుంగవ = శ్రేష్ఠుల యొక్క; గోష్ఠీ = కూటమి అనే; సుఖ వార్ధిలోనన్ = సుఖాన్ని కలిగించే సముద్రంలో; కడు = మిక్కిలి; వేడ్కన్ = సంతోషంతో; తేలినన్ కాక = ఓలలాడితే తప్ప; ఈ భువిలో = ఈ భూమిపైన; తీర్థ జలంబులన్ = (కేవల) పుణ్య నదీ జలాల్లో; కడగినన్ = కడిగితే; ఘోర = భయంకర; దుర్భవ = దుష్ట జన్మల; సంఘ = సమూహంతో; ఆ కలిత = కూడిన; ఆత్మ = తమ; తామస = అజ్ఞానం అనే; మహా పంకంబు = పెద్ద బురద; పోనేర్చునే = పోగల్గుతుందా?

సర్వేశ్వరా! నీ యొక్క నిర్మల తత్త్వాన్ని నిర్ణయించే కళలో ప్రఖ్యాతులైన సద్భక్త శ్రేష్ఠుల గోష్ఠీ సుఖం అనే వార్ధి లోపల సంతోషంతో ఓలలాడ్తే తప్ప ఈ భూమి మీద కేవల తీర్థ జలాలతో కడిగినంత మాత్రంలో; భయంకరమైన దుష్ట జన్మ సమూహాలతో కూడిన అజ్ఞానమనే మహా పంకం పోతుందా?

- ఇట్లాంటి దీర్ఘ సమాస రచన అన్నమయ్య గారిలో అరుదు. ఈ పద్యంలోని రెండు దీర్ఘ సమాసాలు లయాత్మకంగానూ, మధురంగానూ ఉన్నాయి.
- శివ తత్త్వనిర్ణయ కళలో ప్రఖ్యాతులైన శివభక్తుల సత్సంగ మహిమ ఈ పద్యం చెప్తున్నది. భక్తమతం తప్పని సరిగా సత్సంగాన్ని చెప్తుతుంది.

28. ***ధరణిం బ్రాక్తన భక్త నిర్మిత మహా స్థానంబులై యొప్పు శ్రీ***
గిరి ముఖ్యం బగు దివ్య తీర్థములు భక్తిం జూచిరే వారి దు
స్తర దోషంబులు వాయునన్న మతి సాక్షాద్భక్తులం జూచినం
బర మార్థంబుగఁ బాయదే నరుల పాపం బెల్ల సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ధరణిన్ = భూమిపైన; ప్రాక్తన = పురాతన; భక్త = భక్తుల చేత; నిర్మిత = నిర్మింప బడిన; శ్రీగిరి = శ్రీశైలము; ముఖ్యంబు అగు = మొదలయిన; మహాస్థానంబులు ఐ = గొప్ప ప్రదేశములయి; ఒప్పు = విలసిల్లే; దివ్య తీర్థములు = దేవతా తీర్థాలను; భక్తిన్ = భక్తితో; చూచిరే = చూస్తే; వారి = అట్లా చూసిన వాళ్లయొక్క; దుస్తర = దాటడానికి వీలులేని; దోషంబులు = తప్పులు (పాపాలు) పాయున్ అన్న = పోతాయి అంటే; మతి; సాక్షాత్ = ప్రత్యక్షంగా; భక్తులన్ = (అ) భక్తులనే; చూచినన్ = చూస్తే; పరమార్థంబుగన్ = శ్రేష్ఠార్థంగా; నరుల = మానవుల యొక్క; పాపంబు ఎల్ల = పాపమంతా; పాయదే = వీడదా (పోదా?)

— సర్వేశ్వరా! ప్రాచీన భక్తుల చేత నిర్మింపబడిన శ్రీశైలాది దివ్య తీర్థాలను చూస్తే పాపాలు పోతాయన్నారే మరి సాక్షాత్తు (అలాంటి) భక్తుల్నే చూసినపుడు మానవుల పాపాలన్నీ పరమార్థంలో పోవా?

❋ ఈ పద్యంలో కూడా కవి ప్రయోగించిన తర్కం భక్తజనుల పక్షపాతం కలది. శ్రీశైలాది దివ్య క్షేత్రాలలోని దేవాలయాలను నిర్మించింది భక్తులే కదా. ఆ భక్తులు నిర్మించిన దేవాలయాలను, తీర్థాలను భక్తితో చూస్తే పాపాలు పోయినప్పుడు, మరి ఆ భక్తుల్నే చూస్తే పోవా?! పోతాయని చెప్పడానికే ఈ తర్కం.

29. ***కని సద్భక్తుల కంత నంత గడు వేడ్కన్ హృత్ప్రణామంబు సే***
సిన మాత్రం జెడు సర్వ దోషములు, తచ్ఛ్రీ పాదముల్ముట్టి మ్రొ
క్కిన సర్వాంగ సమగ్ర శుద్ధియగు, భక్తిన్ వారికిం బ్రీతిచే
సినఁ దద్దివ్య దయావలోకనఘన శ్రీ లొందు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కని = చూసి; సద్భక్తులకు = మంచి భక్తులకు; అంతనంత = ఎంతో కొంత; కడు = మిక్కిలి; వేడ్కన్ = ప్రీతితో; హృత్ ప్రణామంబు = హృదయ (పూర్వక) నమస్కారం; చేసిన మాత్రన్ = చేసినంత మాత్రంలో; సర్వ దోషములు = అన్ని తప్పులు (పాపాలు); చెడు = చెడుతాయి (అంటే పాపాలు పోతాయి); తత్ = వారి; శ్రీ పాదముల్ = శుభ చరణాలను; ముట్టి = అంటి; మ్రొక్కిన = నమస్కరిస్తే; సర్వాంగ = సమస్త అవయవాలకు; సమగ్ర శుద్ధి = పరిపూర్ణ క్షాళనం; అగు = అవుతుంది; భక్తిన్ = భక్తితో; వారికిన్ = ఆ భక్తులకు; ప్రీతి చేసినన్ = ప్రేమ కలిగేటట్లు చేసినట్లయితే; తత్ = వారల యొక్క; దివ్య = దేవతా సంబంధమైన; దయ = కృప అనే; అవలోకన = దృష్టి అనే; ఘనశ్రీలు = గొప్ప సంపదలు; ఒందు = పొందు.

- సర్వేశ్వరా! సద్భక్తులకు ఎంతో ప్రీతితో హృదయ పూర్వక నమస్కారం చేస్తే సర్వ దోషాలూ పోతాయి. ఆ భక్తుల పాదాలని అంటి మొక్కితే సర్వాంగాలు సంపూర్ణంగా శుద్ధి అయిపోతాయి. భక్తితో వాళ్లకి ప్రేమ చూపితే వారి కృపా పూరిత దృష్టులనే గొప్ప ఐశ్వర్యం లభిస్తుంది.
- పైపైన చేసే నమస్కారం వల్లనే సర్వ దోషాలూ పోతాయంటే ఇక పాదాలని ముట్టి నమస్కరిస్తే భక్తజనుల దయ లభిస్తుందని చెప్తూ, వారి దయ ఈశ్వరానుగ్రహతుల్యమని పరోక్షంగా సూచిస్తున్నారు కవి.

30. జలజాత ప్రభవాచ్యుతాదులు మదిం జర్చించి చర్చించి నీ
కల రూపారయ లేక చిక్కులఁ బడంగా నిన్ను హస్తార్పితా
మలక వ్యాప్తికిఁ దెచ్చి యేర్పఱిచి సంబంధించి చేకొన్న భ
క్తుల శౌర్యంబుపమింప నెవ్వఁడు సమర్థుండింక సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జలజాత ప్రభవ = బ్రహ్మ; అచ్యుతఆదులు = విష్ణ్వాదులు; మదిన్ = మనస్సులో; చర్చించి చర్చించి = చింతించి చింతించి; నీ కలరూపు = నీ యొక్క ఉన్న రూపును; ఆరయ లేక = చూడలేక; చిక్కుల = ఇడుములలో; పడంగా = పడగా; నిన్ను = సర్వేశ్వరుడవైన నిన్ను; హస్త అర్పిత = అరచేతిలో ఉంచిన; ఆమలక = ఉసిరిక లాగా; వ్యాప్తికి = ప్రచారానికి; (అంటే వీళ్ల వల్ల శివరూపం తేలికగా వ్యాపించిందని అర్థం) తెచ్చి; ఏర్పఱిచి = ఇదీ అని చూపి; సంబంధించి = ఇదిగో ఆయనతోడి బంధం అని తెలిపి; చేకొన్న = గ్రహించిన; భక్తుల = భక్తుల యొక్క; శౌర్యంబు = ప్రతాపం (లేక గొప్పతనం); ఉపమింపన్ = పోల్చడానికి; ఎవ్వడు ఇంక; సమర్థుండు = చాలినవాడు?!

- సర్వేశ్వరా! బ్రహ్మవిష్ణ్వాదులు మనస్సులో ఎంత ఆలోచించినా నీవున్న రూపాన్ని తెలసికోలేక కష్టపడగా, అరచేతిలో ఉసిరికంత సులభంగా నిన్ను

అందరికీ చూపించి, స్పష్టపరిచి, నీతో సంబంధం కల్గించిన భక్తుల ప్రతాపాన్ని పోల్చడానికి ఎవ్వడు సమర్థుడు!

31. అమరన్ 'భక్తగణాత్మ మధ్యమము లింగావాస, మాలింగమ ధ్యమముం బద్మ భవాండ భాండ నిలయంబై యుండుటన్ భక్త తృ ప్తి మహాలింగము తృప్తమై మహిమ నుద్దీపించుఁ; దల్లింగ తృ ప్తి మహత్త్వంబున నీ సమస్తమును దృప్తిం బొందు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమరన్ = పొందిక కల్గునట్లుగా; భక్తగణ = భక్త సమూహము యొక్క; ఆత్మమధ్యమము = ఆత్మ నడిమిభాగంలో; లింగావాసము = లింగని యొక్క నివాసము; (మరి) ఆ లింగమధ్యమమున్ = ఆ లింగని యొక్క నడిమి భాగం; పద్మభవ అండభాండ నిలయంబు ఐ = బ్రహ్మాండాలనే ఘటానికి స్థానమై; ఉండుటన్ = ఉండడం వల్ల; భక్త తృప్తి = భక్తుల యొక్క సంతృప్తి చేత; మహా లింగము; తృప్తమై = సంతృప్తమై; మహిమన్ = ఘనతతో; ఉద్దీపించున్ = ప్రకాశించును; తత్ = ఆ; లింగ తృప్తి మహత్త్వంబునన్ = లింగడు సంతృప్తి పొందిన ఘనత చేత; ఈ సమస్తమును = ఈ సర్వమును; తృప్తింపొందు = సంతృప్తిని పొందు.

— సర్వేశ్వరా! లింగము భక్త సమూహం యొక్క ఆత్మ నడిమిభాగంలో ఉంటుంది. ఆ లింగం నడిమి భాగం బ్రహ్మాండ భాండానికి నిలయమై ఉండడం వల్ల భక్తుల సంతృప్తి చేత మహాలింగం తృప్తి పొంది మహిమతో ప్రకాశిస్తుంది. ఆ లింగ తృప్తి యొక్క మహత్త్వం చేత ఈ సమస్తమున్నూ తృప్తిని పొందుతుంది.

❊ ఆచార లింగం, గురులింగం, శివలింగం, చరలింగం, ప్రసాద లింగం, మహా లింగాలని షల్లింగాలు. ఇవి మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రాలలో ఉంటవి.

32. **అనురాగంబున నిన్నుఁ జూచుఁ దలపోయుం జొక్కుఁ గాంక్షించు వ**
ర్ణన సేయున్ దమకించు, సిగ్గు విరియం బ్రార్థించు, శోషించు, నం
తను నీ ధ్యానముఁ దాల్చుఁ, దన్ను మఱచుం, దానీ దశావస్థలం
దనరంగా మది నిన్ను డక్కఁగొను సద్భక్తుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అనురాగంబున = ప్రేమతో; నిన్ను; చూచు; తలపోయున్ = భావిస్తాడు; చొక్కు = పరవశిస్తాడు; వర్ణన చేయున్ = స్తుతిస్తాడు; తమకించు = చలిస్తాడు; సిగ్గు విరియన్ = సిగ్గు తొలగగా; ప్రార్థించు = అర్థిస్తాడు; శోషించు = నీరసిస్తాడు; అంతను = అంతలో; నీ ధ్యానము = నీ ధ్యానాన్ని; తాల్చు = ధరిస్తాడు (చేస్తాడు); తన్ను; మఱచున్ = విస్మరిస్తాడు; తాను ఈ; దశ అవస్థలన్ = పది అవస్థలలోను; నిన్ను; సద్భక్తుడు = మంచి భక్తుడు; డక్కన్ కొను = అనుభవిస్తాడు.

– *సర్వేశ్వరా! ప్రేమతో నిన్ను చూస్తాడు; భావిస్తాడు; పరవశిస్తాడు; కోరుకొంటాడు. వర్ణిస్తాడు; చలిస్తాడు; బక్క చిక్కుతాడు; నీ ధ్యానంలో ఉంటాడు; తనని తాను విస్మరిస్తాడు. సద్భక్తుడు ఈ దశావస్థలలోనూ నిన్ను అనుభవిస్తాడు.*

33. **ఎలమిన్ భక్తుఁడు వక్త్రుఁడై నడిచెనే నేపారఁగా దానికిం**
గలుషింపం గలహింపఁ గింకిరి పడంగా; దెట్టిచోనైన ని
ర్మల గంగా పృథుల ప్రవాహమరయం బ్రస్ఫూర్తిమై నెన్ని వం
కలుగాఁ బాఱిన దాని నొండు పలుకంగాఁ జన్నె? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఎలమిన్ = అతిశయంతో; భక్తుడు; వక్రుండు ఐ = వంకరగా; నడిచెనేన్ = నడిచినట్లయితే (తప్పుగా నడిస్తే - ఋజు వర్తనుడు కాకపోతే); ఏ పారగా = విజృంభించి; దానికిన్ = ఆ ప్రవర్తనకు; కలుషింపన్ = కలంత పడటం; కలహింపన్ = జగడమాడ్డం; కింకిరి పడన్ = కోపగించడం; కాదు = కూడదు; ఎట్టిచోన్ ఐన = ఎక్కడనైనా; నిర్మల = పవిత్ర; గంగా = గంగానది యొక్క; పృథుల ప్రవాహము = విరివి అయిన ప్రవాహం; ప్రస్ఫూర్తిమైన్ = అగుపడేట్లుగా (స్పష్టంగా); ఎన్ని; వంకలుగాన్ = వంకరలతో; పాఱిన = ప్రవహించినప్పటికీ; దానిన్ = దాన్ని గురించి; ఒండు = వేరే; పలుకంగాన్ = మాట్లాడ్డం; చన్నె = ఒప్పుతుందా?!

— *సర్వేశ్వరా! భక్తుడు ఋజుప్రవర్తనుడు కాక వక్రంగా ప్రవర్తిస్తే దానికి కలత పడడమూ, పేచీ పడడమూ, కోపగించడమూ కూడదు. నిర్మల గంగానది యొక్క విశాలమైన ప్రవాహం స్పష్టంగా అనేక వంకలతో పారినప్పటికీ అన్యథా అనడం ఉచితమా?*

❄ *భక్తుడు సాధకుడు. తోటి భక్తుని ఏ సందర్భంలోనైనా శివునిగా చూడాల్సిందే తప్ప అతనిలో తప్పు పట్టి శివసామీప్యం కోలుపోకూడదని భావం.*

34. సికతా ధామము నీకుఁ జేసి మదిలోఁ జెన్నొంది క్రీడించు బా
లకు లింద్రాధికులన్న, నీ గుడులతిశ్లాఘ్యేష్ట కాష్ఠాదులన్
సుకుమారంబుగ నెత్తి భూతములలో శోభిల్లు వంశ ప్రదీ
పకు సౌభాగ్యము మానమెవ్వరికిఁ జెప్పన్వచ్చు? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సికతా ధామము = ఇసికతో ఇల్లు; నీకు చేసి = నీకు కట్టి; మదిలో =

మనస్సులో; చెన్నొంది = సంతోషించి; క్రీడించు = ఆడుకొనే; బాలకులు = పిల్లలు; ఇంద్రాధికులు అన = దేవేంద్రునికన్నా ఎక్కువ వారని అంటే; అతి మిక్కిలి; శ్లాఘ్య = శ్లాఘించదగిన; ఇష్ట కాష్ఠాదులన్ = పవిత్రమైన కలపతో; సుకుమారంబుగ = నాజూకుగా; నీ గుడులు = నీ ఆలయాలను; ఎత్తి = కట్టి; భూతములలో = ప్రాణులలో; శోభిల్లు = ప్రకాశించే; వంశప్రదీపకు = వంశాన్ని వెలిగించే పుత్రుని; సౌభాగ్యము = ఐశ్వర్యం యొక్క; మానము = కొలత; ఎవ్వరికి = ఎవరికి; చెప్పన్ వచ్చు = చెప్పడానికి సాధ్యమౌతుంది?

– *సర్వేశ్వరా! ఇసుకతో నీకు గుడి కట్టి ఆడుకొనే పసి పిల్లలే దేవేంద్రుని కంటే అధికులంటే, ఇక అత్యంతమూ శ్రేష్ఠమైన పుణ్యామైన కర్రలతో నీకు గుడిని నాజూకుగా కట్టిన పుత్రుని యొక్క సౌభాగ్యం ఇంతదని ఎవరు చెప్పగల్గుతారు?*

35. ***భవదభ్యర్చన వేళలన్ భవుల సంపద్భ్రాంతులన్ దీన మా***
నవులన్ విద్విషులన్ భవాతురుల సన్మానించుటల్ సౌఖ్యము
ఖ్యవిహారేచ్ఛలు నీ మహత్త్వములు నిత్యానంద మూహించుచో
భువి నీ భక్తుల కాత్మలో విరసముల్పుట్టించు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నీ మహత్త్వములు = నీ యొక్క గొప్ప తనములు, నిత్యానందము = నిరంతరానందము; ఊహించుచో = భావించినట్లయితే; భవత్ = నీ యొక్క; అభిఅర్చన వేళలన్ = సమ్యక్పూజా సమయాలలో; భవుల = శివ భక్తులు కాని వాళ్ల యొక్క; సంపత్ భ్రాంతులన్ = ఐశ్వర్యం మీది భ్రమలను; దీనమానవులన్ = (భక్తి) దరిద్ర మానవులను; విద్విషులన్ = పగవాళ్లని (శత్రువులని); భవ ఆతురులన్ = సంసారం పై ఆత్రుత కలవాళ్లని; సన్మానించుటల్ = గౌరవించడాలు; సౌఖ్యముఖ్య = సౌఖ్యమే ప్రధానంగా ఉండే; విహార ఇచ్ఛలు = తిరగాలనే

కోరికలు; భువి = భూమి మీద; నీ భక్తులకు; ఆత్మలో = హృదయంలో; విరసముల్ = వైమనస్యాన్ని; పుట్టించు = పుట్టిస్తాయి.

— సర్వేశ్వరా! నీ మహత్వాలని నిత్యానందాన్ని భావించినట్లయితే, నీ పూజ చేస్తూనే శివభక్తులు కాని వాళ్ల ఐశ్వర్య భ్రమలను, భక్తి హీనులను, ద్వేషపరులనూ, సంసారాసక్తులనూ గౌరవించడం, సుఖప్రాప్తికై విహరేచ్ఛ నీ భక్తులకు మనస్సులో విరసాన్ని పుట్టిస్తాయి.

❈ అచ్చమైన శివభక్తుడు శివమాహాత్మ్యాన్నీ, శివానందాన్నీ మాత్రమే కోరుకొంటాడు. భవేతరుల ఐశ్వర్య భ్రమల్ని కానీ, భక్తి దరిద్రుల్ని కానీ, సుఖాలకోసం దేవులాడే కోరికల్ని కానీ, సంసారాసక్తుల్ని గానీ సన్మానించడం శివభక్తులకు వైరస్యాన్ని కల్గిస్తవి - అని తాత్పర్యం.

36. ***కరుణం జేకొనిరేని రౌరవ పదగ్రస్తాత్ము దేవేంద్రుఁ గాఁ***
బరఁగం జేయుదు; రాత్మలో నలిగిరేఁ బర్జన్యు నా రౌరవో
త్కర పంక ప్రవిలీన కీటకముఁగాఁ గల్పింతు రన్నట్టిచో
హర నీ భక్తుల శక్తి యెట్లు గుఱిసేయన్వచ్చు? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కరుణన్ = దయతో; చేకొనిరేని = ఆదరించినట్లయితే; రౌరవపద = నరక స్థలము చేత; గ్రస్త ఆత్ము = మింగబడినట్టి వానిని; దేవేంద్రుఁగాన్ = దేవేంద్రుడగునట్లుగా; పరగన్ చేయుదురు = ఒప్ప జేయుదురు; ఆత్మలో = హృదయంలో; అలిగిరేన్ = కోపించినట్లయితే; పర్జన్యున్ = దేవేంద్రుని; ఆ; రౌరవ = నరకంలోని; ఉత్కరపంక = అధికమైన బుఱదలో; ప్రవిలీన = కూరుకొని పోయిన; కీటకముగా = పురుగుగా; కల్పింతురు అన్నట్టిచో = చేస్తారు అని అంటే; హర = శివా; నీ భక్తుల శక్తి = నీ భక్త జనుల సామర్థ్యం; ఎట్లు; గుఱి చేయన్ వచ్చు? = నిర్ణయించవచ్చు? (లేక పరిమితి భావించ వచ్చును)

– సర్వేశ్వరా! నీ భక్తులు దయతో స్వీకరిస్తే రౌరవంలో మునిగి ఉన్న వాణ్ని కూడా దేవేంద్రునిగా చేస్తారు. ఒకవేళ మనస్సులో కోపిస్తే దేవేంద్రుణ్నయినా ఆ రౌరవంలోని బురదలోని పురుగుగా చేస్తారు. అందువల్ల నీ భక్తుల శక్తికి మితి ఇది అని ఎట్లా చెప్తాము?

37. రమణీయక్షితి పాలుఁడింద్రుని చతుర్మాస క్రమాయుష్యుఁడా
యమరేంద్రుండజు నాడి కాద్వయము వాఁడా బ్రహ్మ యుష్మన్నిమే
షము వాఁడంచును వీరి నెల్ల నగు నీ సాలోక్య సామీప్య స
త్తమ రాజ్యస్థితి పట్ట భద్రుఁడగు సద్భక్తుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

రమణీయ = ప్రీతిని కలిగించే; క్షితి పాలుడు = భూపాలుడైన రాజు; ఇంద్రుని = దేవేంద్రుని యొక్క; చతుర్మాస క్రమ = నాలుగు మాసాలతో సరిఅయిన; ఆయుష్యుడు = జీవిత కాలం కల్గిన వాడు; (మరి) ఆ అమరేంద్రుండు = ఆ దేవేంద్రుడు; అజు = బ్రహ్మ యొక్క; నాడికా, ద్వయము వాడు = రెండు ఘడియల కాలం వాడు; ఆ బ్రహ్మ; యుష్మత్ = నీ యొక్క; నిమేషము వాడు = రెప్పపాటు కాలం వాడు; అంచును = అంటూ; నీ; సాలోక్య = నీ వున్న లోకం; సామీప్య = నీ సమీపం; సత్తమ = అనే మిక్కిలి గొప్పదైన; రాజ్యస్థితి = రాజ్యం అనే స్థితిని; పట్టభద్రుడు అగు = అధిరోహించిన వాడగు; సద్భక్తుండు = మంచి భక్తుడు; వీరిన్ ఎల్లన్ = వీళ్లనందరినీ - (రాజు, దేవేంద్రుడు, బ్రహ్మలనన్నమాట); నగు = పరిహసిస్తాడు.

– సర్వేశ్వరా! భూలోకంలోని రాజు దేవేంద్రుని ఆయుష్కాలంలో నాల్గు నెలలు మాత్రమే కల్గి ఉంటాడు; దేవేంద్రుడేమో బ్రహ్మ యొక్క ఆయుః కాలంలో రెండు ఘడియలే. మరి ఆ బ్రహ్మేమో ఓ సర్వేశ్వరా నీ ఆయుః కాలంలో

ఒక్క రెప్పపాటు కాలం వాడు! - అని నీ సాలోక్య సామీప్యాలనే గొప్ప రాజ్యస్థితికి పట్టి భద్రులైన నీ సద్భక్తులు వాళ్లనందర్నీ పరిహసిస్తారు!

కలియుగం 4,32,000 సంవత్సరాలు

ద్వాపరం 8,64,000 సంవత్సరాలు

త్రేతా 12,96,000 సంవత్సరాలు

కృత 17,28,000 సంవత్సరాలు

ఈ నాలుగు యుగాల కాలం కలిస్తే ఒక మహాయుగం. సప్తర్షులు, ఇంద్రుడు, మనువు - వీరి ఆయువు 71 మహాయుగాలు. ఇది ఒక మన్వంతరం. ఇట్టి 14 మన్వంతరాల కాలం 994 మహాయుగాలు. ఇదీ మరొక 6 మహాయుగాలూ కలిసి అనగా వెయ్యి మహాయుగాలు బ్రహ్మకు ఒక పగలు. అంటే సగం రోజు అన్నమాట! శివుడికి ఈ కాలావధి లేదని ఈ పద్య తాత్పర్యం.

❋ శివభక్తుడు సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్యాలను పొందుతాడు. ఇవన్నీ ఒకదానికన్నా మరొకటి ఎక్కువ. శివభక్తుడు కైలాసానికి పోతే అది సాలోక్యం. శివ సమీపస్థుడౌతే అది సామీప్యం. సారూప్య సాయుజ్యాలు రాకపోయినా ముక్తిలో ప్రథమ ద్వితీయ సోపానాలలోని వీళ్లే బ్రహ్మేంద్రాదుల్ని వాళ్ల అల్పాయుష్షుకి పరిహసిస్తున్నారు. వీరిది ప్రళయ కాల పర్యంతమూ ఉండే ఆయుష్షు. వీరు శివ పరివారం లోపలివాళ్లు. పారిషదులన్న మాట. ప్రమథులని నామాంతరం.

38. ప్రకటింపంగ సమస్త పాతకములం బాపంగ నీ పూజయం
దొక పుష్పాంశము చాలునన్న మహిలో నూహింపఁగా నీ పదా
ర్చకులే మార్గము నందు శుద్ధులు మదిం జర్చింపఁ దద్దుర్గుణ
ప్రకరం బెన్నెడి వాఁడు లోకములలోఁ బాపిష్ఠి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సమస్త పాతకములన్ = పాపాల నన్నింటినీ; పాపంగ = పోగొట్టడానికి; నీ ్రాజయందు = నీ పూజలోని; ఒక పుష్ప అంశము = ఒక్క పూవులోని భాగం; ాలును అన = శక్తి కల్గిందీ అని అంటే (సరిపోతుందని అంటే); మహిలోన్ = ూమిపై; ఊహింపగా = భావించగా; మదిన్ = మనస్సులో; చర్చింపన్ = ాతర్కించగా; నీ పద అర్చకులు = నీపాద పూజ చేసే వాళ్లు; ఏ మార్గము ంందు = ఏ రీతిలో నైనా; శుద్ధులు = పవిత్రులు; తత్ = అట్లాంటి ఆ భక్తుల; ుర్గుణ ప్రకరంబు = దుర్గుణ సమూహాన్ని; ఎన్నెడి వాడు = లెక్కించే వాడు; ోకములలో; పాపిష్ఠి = పాపాత్ముడు!

- *సర్వేశ్వరా! అన్ని పాపాలనూ నీకు పూజ చేసిన ఒక్క పుష్ప భాగమయినా పోగొట్ట గల్గుతుంది. అట్లాంటిది నీ పాదార్చన చేసే భక్తులు ఏ రీతి వారైనా శుద్ధులే. (దీన్ని గ్రహించక) వాళ్ల దుర్గుణాలని లెక్కించే వాడు లోకాలలో పాపాత్ముడే అవుతాడు.*

* *సంసార మనేదే ఒక రోగం. సమస్త పాపాలకూ ఈ సంసారమే హేతువు. భక్తుల పాపాలను పోగొడ్తాడు కాబట్టే పరమాత్ముణ్ని రుద్రుడన్నారు. చేసిన పాపం పోవడం సాధ్యమా? అన్న ప్రశ్నకు కాదనే చాలా మంది సమాధానం ఇస్తారు. ముఖ్యంగా భక్తి మార్గంలో లేని వాళ్లు. "నా భుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతైరపి" అని అన్నారు. 'అనుభవించకుండా కర్మ వంద కోట్ల కల్పాలకైనా నశించద'ని అర్థం. కాని శివపాదార్చకుల పాపం నశిస్తుందని కొన్ని ప్రమాణాలున్నాయి. 'నా భుక్తం క్షీయతే' అన్నది శివార్చకులు కాని వాళ్ల విషయం. అనుపాసకుల విషయం. శివోపాసకుల పాపాలు నశిస్తాయని నీలకంఠభాష్యం కూడా చెప్తున్నది. అందులో*

సూ. "తదధిగమ ఉత్తర పూర్వాఘయోరశ్లేష వినాశౌ

తద్వ్యపదేశాత్" 4-1-13

అని ఉన్నది. శివోపాసనకు ముందు చేసిన పాపాలు, ఉపాసన దృఢంగా చేస్తే నశించటమే కాకుండా, అనంతరం చేసిన పాపాలు కూడా

అంటకుండా పోతాయి. దీనికీ కింది విధంగా శ్రుతి ప్రమాణాన్ని ఇచ్చారు.

"తద్యథైషీకాతూలమగ్నౌప్రోతం ప్రదూయేతైవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయంతే"

— అగ్నిలో దూదిని వేస్తే దాన్ని అగ్ని కాల్చి వేసినట్లు శివోపాసకుని సర్వపాపాలూ నశిస్తాయి.

"తద్యథా పుష్కర పలాశ ఆపో నశ్లిష్యంతే ఏవమేవంవిధ పాపకర్మ నశ్లిష్యత ఇతి"

— తామరాకునకు ఎట్లా సరస్సులోని నీరు అంటకుండా ఉంటుందో అట్లాగే శివభక్తుణ్ని పాపకర్మ ముట్టుకోదు.

❋ ఇట్లా ఇక్కడ శివోపాసనకు ముందు చేసిన పాపం, తర్వాత చేసిన పాపం రెండూ కూడా శివభక్తుణ్ని అంటుకోవని చెప్తున్నారు.

❋ ఉపాసన గట్టిపడ్తున్న కొద్దీ అంటే శివారాధన సిద్ధిస్తున్న కొద్దీ హృదయంలో భావలింగ సాక్షాత్కారం సిద్ధిస్తుంది. ఆ స్థితిని చేరినప్పుడే పూర్వ పాపాలు నశిస్తాయి.

❋ ఈ పద్యంలో పూజ చేస్తే పాపం పోతుందనడాన్ని కవితా ధర్మంగా పూజ చేసిన పువ్వులోని ఒక భాగం కూడా పాపాన్ని పోగొడ్తుందని చెప్తున్నారు అన్నమయ్య కవి.

❋ ఈ పద్యంలో శివనిర్మాల్యమైన పుష్ప ప్రసక్తి ఉంది. శివుణ్ని అర్చించిన పుష్పానికి ఉన్న శక్తిని తెల్పుతున్న పద్యం. కుబేర వనంలో పుష్పదంతుడు రోజూ దొంగతనంగా కుసుమాలను అదృశ్యుడుగా వచ్చి కోసికొని వెళ్లేవాడు. ఆయనను పట్టుకోలేక కుబేరుడు తోట చుట్టూతా శివనిర్మాల్యాన్ని అంటే శివునికి పూజ చేసిన పూలనీ పత్రినీ వేయించాడు. అదృశ్యంగా వచ్చి పుష్పదంతుడు ఆ శివనిర్మాల్యాన్ని దాటి తన శక్తిని కోల్పోయి రూపధారణ జరిగి పట్టుపడ్డాడు.

— ఇక్కడ కూడా శివనిర్మాల్యం ఎంతటి శక్తి కల్గిందో పరోక్ష విధానంతో తెలుస్తున్నది.

39. తమతేజంబుఁ దృణీకరించుచు సముద్యత్తేజులై మీఁదిలో
కములందున్ జరియించు నీ యచల భక్తశ్రేణులం జూచి, నె
య్యమునం దారును దద్విధంబునను, నిన్నర్చింప నూహించి మ
ర్త్యమునం బుట్టఁగ వాంఛ సేయుదు రమర్త్యశ్రేణి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

తమతేజంబు = తమ యొక్క ప్రకాశాన్ని; తృణీకరించుచు = నిర్లక్ష్యం చేస్తూ; సముద్యత్ = విజృంభించిన; తేజులై = ప్రకాశం కల్గిన వాళ్లై; మీది లోకములందున్ = పై లోకాలలో; చరియించు = తిరిగే; నీ; అచల = స్థిరమైన; భక్త శ్రేణులన్ = భక్తులవరుసను; చూచి; నెయ్యమునన్ = స్నేహంతో; తారును = తామున్నూ; తద్విధంబునను = (వారు నిన్ను అర్చించి నట్లుగానే) అదే రీతిగా; నిన్ను అర్చింపన్ = నిన్ను పూజించాలని; ఊహించి = భావించి; మర్త్యమునన్ = భూలోకంలో; పుట్టఁగ = పుట్టడానికి; అమర్త్య శ్రేణి = దేవతల శ్రేణి; వాంఛ చేయుదురు = కోరుకొంటారు.

– సర్వేశ్వరా! దేవతలు - తమ తేజాన్ని తక్కువ చేస్తూ పై లోకాలలో సంచరిస్తున్న నీ నిశ్చల భక్తుల గొప్ప తేజస్సుని చూసి స్నేహంతో తామున్నూ వారిలాగే నీకు పూజలు చేయాలని - అందుకు గాను భూలోకంలో పుట్టాలని తీవ్రంగా కోరుకుంటారు.

40. అమరన్ భక్తులకెల్ల నీవ హృదయంబై యుండుటన్ వారి సౌ
ఖ్యము నీ సౌఖ్యము, వారి కూర్మియు సమగ్రంబైన నీ కూర్మి, త
త్త్వము భావింపఁగ వారి కోపము భవత్ప్రఖ్యాత రౌద్రప్రభా
వము, దా వారల వాక్య నిర్ణయము నీ వాక్యంబు; సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమరన్ = పొందికగా; భక్తులకు ఎల్ల = భక్తులం దరికి; నీవు, అ = నీవే; హృదయంబు, ఐ = హృదయమయి ఉండుటన్ = ఉండటం వల్ల; వారి సౌఖ్యము = ఆ భక్తుల సౌఖ్యము; నీ సౌఖ్యము = నీ యొక్క సౌఖ్యము; వారి కూర్మియు = వారి యొక్క ప్రేమ; సమగ్రంబైన = పూర్ణమైన; నీ కూర్మి = నీ యొక్క ప్రేమే; తత్త్వము = గుణము; భావింపగ = ఊహిస్తే; వారి కోపము = భక్తుల కోపము; భవత్ = నీ యొక్క; ప్రఖ్యాత = ప్రసిద్ధమైన; రౌద్ర ప్రభావము = మహాక్రోధ శక్తి; తావారల = అట్టి వారియొక్క; వాక్య నిర్ణయము = వాక్యార్థ నిర్ణయం; నీ వాక్యంబు = నీ వాక్యం.

— *సర్వేశ్వరా! భక్తునికి సుఖం కల్గితే అది ఈశ్వరునికి సౌఖ్యము. వారి ప్రేమ శివుని యొక్క సమగ్రమైన ప్రేమ. లోనారసి చూస్తే వారి కోపము నీ యొక్క ప్రసిద్ధమైన రౌద్ర ప్రభావం, వాళ్ల వాక్య నిర్ణయమే నీ వాక్యం.*

❄ *సుఖమూ, ప్రేమ, క్రోధమూ, అభిప్రాయ ప్రకటనమూ - ఇవన్నీ భక్తులవేవో అవే శివునివి కూడాను. శివభక్తునికి శివునితో తాదాత్మ్యం. దాన్తో శివునికీ భక్తునితో తాదాత్మ్యం అని తిప్పి చెప్పడం.*

41. *అవనింబెన్నిధి భాగ్యహీనునకుఁ బ్రత్యక్షంబుగాకప్పు డొం*
డవ భాండాకృతిఁ దాల్చి మాటు వడి మాయావృత్తి నున్నట్లు దా
భవదీయ ప్రతిబింబ మూర్తి యగు సద్భక్తుండు సంసారదు
ర్వ్యవసాయాత్ములకెల్లఁ గేవల నరుండై తోఁచు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అవనిన్ = భూమి మీద; భాగ్యహీనునకు = దరిద్రునికి; పెన్నిధి = పెద్దనిధి; అప్పుడు = (దాన్ని చూస్తున్న ఆ) సమయంలో; ప్రత్యక్షంబు కాక = కన్పించ

కుండా; ఒండవ = మరొక; భాండాకృతి = పాత్ర ఆకారాన్ని; తాల్చి = ధరించి; మాటుపడి = కనుపించకుండా; మాయావృత్తిన్ = మోస లక్షణంతో ఉన్నట్లు; త్వా, భవదీయ = నీ యొక్క; ప్రతిబింబమూర్తి అగు = ప్రతిఫలన రూపమే అయిన; సత్ భక్తుండు = మంచి భక్తుడు; సంసార = లౌకిక జీవన మనెడి; దుర్ వ్యవసాయ ఆత్ములకు ఎల్ల = చెడ్డ కార్యం చేసే వాళ్లందరికీ; కేవలనరుండు, ఐ = మానవ మాత్రునిగానే; తోఁచు = స్ఫురిస్తాడు.

– సర్వేశ్వరా! భాగ్యహీనుడికి భూమిమీద పెన్నిధి ఉన్న భాండం కన్పించినప్పటికీ ఆవేళకి అది వేరే భాండంలాగా కన్పించి మాయలో పడి పోయినట్లుగా, నీ ప్రతిబింబ మూర్తి అయిన సద్భక్తుడు సంసారమనే దుర్వ్యావసాయంలోని వాళ్లకు మామూలు మానవుడే అనిపిస్తాడు.

❄ శివభక్తునికీ శివునికీ రూపంలో కూడా భేదం లేదని తాత్పర్యం. ఐతే ఇద్దరికీ భేదం కన్పించని వాడు అదృష్టవంతుడు. భేదం కన్పించేది దురదృష్టవంతునికి మాత్రమే. కళ్లకు పొరలు కప్పి అసలైన నిధి ఉన్న భాండాన్ని కూడా మామూలు పాత్రగా భావించే దురదృష్టవంతుల లాంటి వాళ్లు వీరు.

❄ శివభక్తి చేత మామూలు మానవుడు కూడా శివరూపాన్ని పొందుతాడు. ప్రతిబింబం నిజం కాదు. బింబమే నిజం. శివుడు సత్యం. ఆయన ప్రతిబింబమైన సద్భక్తుడు కూడా శివుడుగానే సత్యం. వారి అస్తిత్వం బింబంలోనే ఉన్నది కాని ప్రతిబింబంలో లేదు.

42. క్షితిపై శ్వేత మునీంద్రుఁ జంప నలుకం గీనాశుఁడేతెంచి నీ
యతి కోపోజ్జ్వల నాహుతిన్మడిసెఁ దద్భ్యం బేక నిష్ఠా సమ
న్వితులం జేకొని భక్తవత్సలుఁడవై నీవెల్లప్పుడు న్గావఁగాఁ
బ్రతి పక్షావలి కెట్లు వారి దెసఁ జేరన్వచ్చు? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కీనాశుఁడు = యముడు; అలుకన్ = క్రోధముతో; ఏతెంచి = వచ్చి; క్షితిపై = భూమి మీద; శ్వేతమునీంద్రు; చంపన్ = చంపగా; నీ, అతి = నీ యొక్క అధికమైన; కోపోజ్జ్వలన = క్రోధము చేత పై కెగిసే అగ్నియందు; ఆహుతిన్ = హవిస్సు రూపంతో; మడిసె = చచ్చినాడు; తథ్యంబు = ఇది (ఖచ్చితమైన) సత్యం; ఏకనిష్ఠా = ఒకే వ్రతమందు; సమన్వితులన్ = కూడు కొన్న వారిని; చేకొని = ఆదరించి; భక్తవత్సలుడవై = భక్త జనులమీద వాత్సల్యం కల్గిన వాడివై; నీవు ఎల్లప్పుడున్ = నీవు సర్వవేళలా; కావగా = రక్షించగా; ప్రతి పక్షావలికి = శత్రు సమూహానికి; వారి దెస = వారివైపుకి; ఎట్లు చేరన్ వచ్చు = ఎట్లా చేరగల్గుతారు (కీడు చేయడానికి).

— *సర్వేశ్వరా! శ్వేతమునిని చంపడంకోసం యముడు రాగా అధికమైన నీ క్రోధాగ్నికి మరణించాడు. నీయందే నిష్ఠఉన్న వారిని గ్రహించి భక్త వాత్సల్యంతో నీ వెప్పుడూ కాపాడుతూ ఉండగా శత్రు సమూహం నీ భక్తులను సమీపించ గల్గుతారా?*

❄ *శివుడు ప్రారబ్ధ కర్మను మార్చగలడు. మృత్యువుని సైతం తొలగించ గలడు. అంతే కాదీ పద్యం లోని ఘట్టం ప్రకారం మృత్యువుకే మృత్యువు కాగలడు! ఇదంతా ఆయన భక్త వాత్సల్యం చేతనే జరుగుతున్నది.*

43. *కింకన్ దన్నునదల్చి చక్రమునఁదాఁ గృష్ణుండనిన్ వైచినం*
బొంకం బొప్పఁగ దానిఁ దుత్తుఋముగాఁ బోఁదట్టి యుప్పొంగె ని
శ్శంకాత్ముండు దధీచి శాశ్వతులు నీ సద్భక్తులూహింపఁగా
సంకల్ప ప్రభవ ప్రతాపవన భాస్వద్దావ! సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కింకన్ = కోపముతో; తన్నున్; అదల్చి = అదలించి; చక్రమున = సుదర్శన చక్రంతో; తా; కృష్ణుండు = కృష్ణుడు; అనిన్ = యుద్ధంలో; వైచినన్ = వేయగా; పొంకంబు ఒప్పగ = పొందికగా; నిశ్శంక, ఆత్ముడు = సందేహ రహితుడు (జ్ఞాని) అయిన, దధీచి = దధీచి మహాముని; దాని = ఆ సుదర్శన చక్రాన్ని; తుటుము = నుగ్గునుగ్గుగా; పో, తట్టి = అగునట్లు తగిలి; ఉప్పొంగె = విజృంభించెను; సంకల్ప = మనస్సులో భావించడం చేత; ప్రభవ = పుట్టిన; ప్రతాప = శౌర్యమనే; వన = అరణ్యంలో; భాస్వత్ = ప్రకాశించే; దావ = దావాగ్ని; ఊహింపగా = ఆలోచిస్తే; నీ = నీయొక్క; సత్ భక్తులు = మంచి భక్తులు; శాశ్వతులు = నాశనము లేని వాళ్లు (అంటే మరణం లేని వాళ్లు).

- *సర్వేశ్వరా! కోపంతో అదలించి తనపై శ్రీకృష్ణుడు సుదర్శన చక్రాన్ని ప్రయోగిస్తే సందేహ రహితుడైన దధీచి దాన్ని ఎంతో రమణీయంగా పొడిపొడిగా వేసి విజృంభించాడు; ఓ సర్వేశ్వరా! సంకల్పం చేతనే పుట్టిన శౌర్యమనే అరణ్యంలో ప్రకాశించే దావాగ్నీ! నీ భక్తులని ఎవరూ చంపలేరు సుమా.*

❖ *క్షుపుడు అనే విష్ణు భక్తుడైన రాజు శైవుడైన దధీచితో భూమినేలే రాజే ఇతరులకన్నా మేటి - అతడే గరీయసుడు అని ఐశ్వర్య మదంతో వాదించగా దధీచి క్రుద్ధుడై క్షుపుని నెత్తి మీద పిడికిటితో ఒక గుద్దు గుద్దుతాడు. దాన్తో కోపించి వజ్రం వేసి దధీచిని చీల్చగా, ఆయన నేలమీద పడి శుక్రాచార్యులను ప్రార్థిస్తే ఆయన వచ్చి సంజీవినితో దధీచిని బ్రదికిస్తాడు.' ఆయన హితవు విని దధీచి మహామృత్యుంజయ మంత్రాన్ని ఉపాసిస్తాడు. దానికి సంతోషించి శివుడు ప్రత్యక్షమయి వరమడుగ మనగా వజ్రాస్థీ దివ్యతనువునూ, అమృతత్వాన్నీ దధీచి కోరుకొంటాడు. శివుడా వరం ఇస్తాడు.*

ఇదిట్లా ఉండగా ఒక బ్రాహ్మడు శివభక్తుడయి నా తల పగులదన్నినాడు. వజ్రం వేసినా ఆయన మీద వ్యర్థమయింది - అని క్షుపుడు శ్రీమహా

విష్ణువుతో మొరపెట్టుకోగా, శాంభవుల ఘనత తెలిసి కూడా తన భక్తుని కోసం దధీచితో శ్రీ మహావిష్ణువు యుద్ధం చేయబోగా దధీచి నాకు అలసట కాని, పరాజయం కానీ మృత్యువు కానీ లేనే లేవని ఆయనతో అన్నాడు. దానికి కుపితుడై సుదర్శన చక్రాన్ని చూడగా, అది చలనం వదలి నిశ్చలమయింది! అది ఈశ్వరునిదయ్యా అది నన్నేమీ చేయదని దధీచి విష్ణువుని పరిహాసమాడినాడు - అని శివపురాణం ఈ ఘట్టాన్ని చెప్తున్నది.

కొద్ది మార్పుతో అన్నమయ్య ఈ ఘట్టాన్ని ఆధారంగా చేసికొని శివపారమ్యంతో పాటు శివభక్తుల శాశ్వతత్వాన్నీ ఈ పద్యంలో తెలిపాడు.

44. ***ఘట దుగ్ధంబులు పేరుఁగాక వెలయంగా నెంత తోడంటిన***
న్నట దుగ్ధాంబుధి పేరునే? జగములో నల్పుండు దుస్సంగతిం
జటులాత్ముండగుఁ గాక యెయ్యెడల నీ సద్భక్తుఁడే కార్యము
త్కటమై తాఁకిన నన్య చిత్తుఁడగునే తర్కింప? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

వెలయంగాన్ = తెలిసేటట్లుగా; ఘట దుగ్ధంబులు = కుండలోని పాలు; పేరుగాక = తోడుకో వచ్చునుకాక; ఎంత తోడు అంటినన్ = ఎంతగా తోడు పెట్టినప్పటికిన్నీ; దుగ్ధాంబుధి = పాలసముద్రం; పేరునే = తోడు కొంటుందా; జగములో = లోకంలో; అల్పుండు = నీచుడు; దుస్సంగతిన్ = చెడ్డ సావాసాల చేత; చటుల, ఆత్ముండు = చంచలాత్ముడు; అగుకాక = కావచ్చును గాక; (కాని) ఎయ్యెడల = ఎక్కడనైనా; నీ; సద్భక్తుడు = మంచి భక్తుడు; ఏ కార్యము = ఏ సంఘటన; ఉత్కటము ఐ = తీవ్రంగా; తాకినన్ = (తనను) తగిలినప్పటి కిన్నీ; తర్కింప = వివేచిస్తే; అన్యచిత్తుడగునే = ఇతర విషయాల మీద తన చిత్తాన్ని ఉంచుతాడా?

- సర్వేశ్వరా! కుండలోని పాలు కొద్ది పెరుగు వల్ల తోడు కోవచ్చును గానీ, పాల సముద్రంలోని పాలు ఎంత తోడు వేసినా తోడుకుంటాయా? లోకంలో అల్పుడు దుస్సాంగత్యం చేత చంచల చిత్తుడు కావచ్చును గానీ, ఎట్టి పరిస్థితిలోనైనా నీ సద్భక్తుడు, ఏ పరిస్థితి తనకు తటస్థించినప్పటికిన్నీ నీ నుంచి చిత్తం మరలించి అన్య చిత్తుడు కాడు. అంటే అసలు నీ నుంచి తన చిత్తాన్ని మరలించనే మరలించడు.

❄ కుండలోని పాలు తోడుకొని పెరుగు అవుతాయి. దుస్సాంగత్యం చేత మామూలు మానవుడు తనను మార్చుకొని ఇతరం అవుతాడు.

❄ ఎంత తోడు పెట్టినప్పటికీ పాల సముద్రం పెరుగుగా తోడు కోదు. అంటే తన క్షీరత్వాన్ని వదలుకొని దధిత్వం అనే అన్యవిషయం మీదికి చిత్తాన్ని మరల్చదు.

ఈశ్వరుని యందు చిత్తం లయించిన సద్భక్తుడు ఏ పరిస్థితి ఎదురయి నప్పటికిన్నీ ఈశ్వరుడి నించి మరల్చుకొని అన్యచిత్తుడు కాడు.

❄ ఇక్కడ అన్నమయ్య కవి చెప్పదల్చుకొన్నది - ఈశ్వర భక్తుని మీద ఈశ్వరుడి అనుగ్రహం దండిగా ఉంటుందనీ, అతడే పరిస్థితిలోనూ, ఏ వేళలోనూ అధీరుడూ అస్థిరుడూ కాడనీ, అతని చిత్తం ఈశ్వరునిలో లయించడం శాశ్వత విషయమే తప్ప తాత్కాలిక విషయం కాదనీ -

45. సతి వేడ్కం దన ప్రాణ వల్లభునితో సంయోగ మర్థించుఁగా
కతనిం బ్రార్థన సేసి సొమ్ము గొనిపో నట్టాడునే? భక్తుఁడీ
క్షితి నీ భక్తియ వేడుఁగాక మఱి నీ శ్రీపాదము ల్గొల్చి కు
త్సిత కామ్యార్థము లెందు వేఁడుకొనునే చింతింప? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సతి = ధర్మపత్ని; ప్రార్థన చేసి = ప్రార్థించి; తన ప్రాణ వల్లభునితో = తనకు ప్రాణం వంటి వాడయిన (తన) భర్తతో; సంయోగము = కలయికను; అర్థించు గాక = కోరుకోవచ్చు గాక; (అంతే గాని) సొమ్ము = ధనాన్ని; కొనిపోన్ = తీసికొని పోవాలని; అర్థాడునే = వెంట తిరుగుతుందా?; భక్తుడు; ఈక్షితిన్ = ఈ భూమి మీద; నీ భక్తియ = నీ యందు భక్తినే; వేడుఁ గాక = అర్థించును గాక; మఱి = అంతే తప్ప; నీ; శ్రీ పాదముల్ = ఐశ్వర్యదములైన నీ పాదాలను; కొల్చి = సేవించి; కుత్సిత = నీచమైన; కామ్యార్థముల్ = కామ విషయాలను (కోరికలను); ఎందు = ఎక్కడయినా; చింతింప = వివేచిస్తే; వేడుకొనునే = కావాలని అర్థిస్తాడా?

— *సర్వేశ్వరా! భార్య తన భర్తతో సంయోగాన్ని కోరుకుంటుంది. కాని, అతడి నుంచి డబ్బు తీసికొని వెళ్లిపోవాలని కోరుకొంటుందా? ఈ భూమి మీద ఈశ్వర భక్తుడు, ఆయన యందు భక్తినే కోరుకొంటాడు కాని, నీచమైన కోరికల్ని తీర్చమని కోరుకొంటాడా?*

❋ *డబ్బు వల్ల వచ్చే ఆనందం కన్నా, భర్త పొందువల్ల వచ్చే ఆనందం శ్రేష్ఠమైంది. అందువల్ల ఏ సతియైనా భర్తతో పొందునే కోరుకుంటుంది. కాని, ధనాన్ని తీసికొని వెళ్లిపోదామని కోరుకోదు.*

❋ *ఇట్లాగే శ్రేష్ఠమైన ఆనందాన్నిచ్చే సర్వేశ్వరుని మీది భక్తి కావాలని కోరు కొంటాడే తప్ప ఏ భక్తుడైనా నీచమైన కామ్యార్థాలని కోరుకోడని కవి అంటున్నాడు.*

46. భ్రమరధ్యానము దాల్చి కీటకము సద్భావాది సంయుక్తిఁ దా
భ్రమరంబై ఖగవీథి నాడు నని న, న్భావించి నిన్నాత్మ నె

య్యముతో ధ్యానము సేయు మర్త్యుఁడును నీ యట్లే పరవ్యోమ త
త్త్వము నందవ్యయలీల నుండు టరుదే భావింప? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భ్రమరధ్యానము తాల్చి = తుమ్మెదను ధ్యానము చేసి; కీటకము = పురుగు (క్రిమి); సత్ భావాది సంయుక్తి = మంచి భావాలను (ఆలోచనలను) కలిగి ఉండడం చేత; తా = తాను; భ్రమరంబు ఐ = తుమ్మెద అయి; ఖగవీథిన్ = ఆకాశ వీథిలో; ఆడున్ = విహరిస్తుంది; అనినన్ = (అని) అంటే; భావించి = ఊహించి; నిన్ను = సర్వేశ్వరుడి వైన నిన్ను; ఆత్మ నెయ్యముతో = ఆత్మీయమైన స్నేహంతో; ధ్యానము చేయు = ధ్యానించే; మర్త్యుడును = మానవుడును; భావింప = ఊహింపగా; నీ అట్లే = నీ వలెనే; పరవ్యోమ తత్త్వమునందు = చిదాకాశ తత్త్వంలో; అవ్యయ లీలన్ = శాశ్వతంగా; ఉండుట; అరుదే = అపూర్వమా?

– *సర్వేశ్వరా! భ్రమరాన్ని ధ్యానం చేసి కీటకం సద్భావాలుండటం చేత తానూ భ్రమరమై ఆకాశ వీథిలో ఎగురుతుంది. అట్లాగే ఎంతో ప్రేమతో ధ్యానం చేసే మానవుడు కూడా నీలాగే చిదాకాశంలో శాశ్వతంగా ఉంటాడనడం అరుదా?*

❈ ధ్యాత, ధ్యానమూ, ధ్యేయము అన్నవి ఒక త్రిపుటి. ధ్యానం చేసే వాడు ధ్యాత. ధ్యాత చేసే పని ధ్యానం. ధ్యానం దేని మీద చేస్తారో అది ధ్యేయం. ఇక్కడ ధ్యేయం శివుడు. ధ్యాత శివభక్తుడు.

❈ భ్రమర కీటన్యాయం ద్వారా ధ్యానత్రిపుటిని కవి ఇక్కడ పై విధంగా చక్కగా విశదీకరించి కవితామయం చేయడం గొప్ప ప్రతిభ.

❈ మకుటాగమంలో ఇట్లా ఉన్నది -

"కీటో భ్రమర యోగేన భ్రమరో భవతి ధ్రువం

మానవశ్శివ యోగేన శివోభవతి నిశ్చయః।
కీటకం తుమ్మెద స్పర్శ చేత తుమ్మెద కావడం ఎట్లా ఖచ్చితమో అట్లాగే మానవుడు శివయోగం చేత నిశ్చయంగా శివుడవుతాడని దీని అర్థం.
"గురు దీక్షా పరిప్రాప్త శివలింగాంగ యోగతః
ద్విరేఫకీటన్యాయేన శివైక్యం ప్రాప్తవాన్ జనః"
లింగాంగ సంయోగం వల్ల శివైక్యప్రాప్తి అన్నది తాత్పర్యం.
ఈ విషయాన్నే అన్నమయ్య ఈ పద్యంలో తెల్పినారు. శైవ సంప్రదాయంలో ఈ భ్రమర కీటన్యాయాన్ని సాదృశ్యంగా చూపడంతో పాటుగా, శిఖి కర్పూర న్యాయ సాదృశ్యం చూపడం కూడా ఉన్నది.
శంకర సంహితలోని శివానుభవ సూత్రంలో ఇట్లా ఉన్నది -
"యథాలింగాంగ సంయోగ శ్శిఖి కర్పూర యోగతః
కర్పూర రూప మంగంచ తద్గంధః ప్రాణ ఈరితః।
కర్పూరస్యానలాక్రాంతౌ కాఠిన్యం నాస్యవిద్యతే
అహంకార క్షయాత్తత్వే సంలీనః ప్రోచ్యతే బుధైః॥

— కర్పూరం జ్వాలా సంయోగంతో తన రూపాన్నీ వాసననీ ఎలా పోగొట్టుకొంటుందో శివలింగానికీ మానవ దేహానికీ సంయోగం వల్ల అహంకారం క్షీణించి లింగంలో సంలీనత కల్గుతుంది అని అర్థం. కర్పూరానికి స్వీయ వస్తుత్వం పోవడం, శివలింగ ధారికి అహంకారం పోవడం సదృశ విషయాలన్న మాట.

47. అమర శ్రేణులకున్ సుధామయ కళౌఘాత్మీయ సారంబు ర
మ్యముగాఁ గ్రోలఁగ నిచ్చి తానొక కళామాత్రాంగుఁడై యున్న చం
ద్రమునిం జూచి జగమ్ము మ్రొక్కు గతినారన్ భక్తి పూజా విధి
క్రమ భారాకృశుఁ జూచి మ్రొక్కుదురు లోకం బెల్ల సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమర శ్రేణులకున్ = దేవతల బారులకు; సుధామయ = అమృత మయమైన; కళాఓఘ = కళల సమూహం యొక్క (చంద్రుని షోడశ కళలన్న మాట); ఆత్మీయ సారంబు = లోని సారాన్ని; రమ్యముగా = అందంగా; క్రోలనిచ్చి = త్రాగనిచ్చి; తాను = తానుమాత్రం; ఒక కళా మాత్రాంగుడై = ఒక్క కళతో మాత్రమే ఉన్న శరీరము కలవాడై; ఉన్న = ఉన్నట్టి; చంద్రమునిన్ = చంద్రుని; చూచి; జగమ్ము = లోకం; మ్రొక్కు గతిన్ = నమస్కరించిన పద్ధతిగా; ఆరన్ = పరిశీలిస్తే; భక్తి పూజావిధి = భక్తితో చేసే పూజా విధిచేత; క్రమ = క్రమంగా; భార ఆకృశు = బరువు కృశించడం (తగ్గడం); చూచి; లోకంబు ఎల్ల = జగత్తంతా; మ్రొక్కుదురు = నమస్కరిస్తారు.

– *సర్వేశ్వరా! దేవతా శ్రేణులకు తన 16 కళల్లోని పదునేనింటిని త్రాగనిచ్చి చంద్రుడు ఒక్క 16వ కళతో మాత్రమే మిగిలి అందరికీ వంద్యుడయినట్లుగా, భక్తితో చేసే పూజావిధి వల్ల బక్క చిక్కే వారిని చూసి లోకమంతా నమస్కరిస్తుంది.*

❄ *చంద్రునిలోని 15 కళలు దేవతలే ఆరగించారు. మామూలు వాళ్లు కాదు. భక్తి పరవశుడైన భక్తుని కృశత్వం కూడా అయోగ్యులకు తన శక్తినిచ్చినందు వల్లకాదు. అతని కృశత్వం వల్ల మేలు పొందేది లోకమేనని వ్యంగ్యార్థం. అతని ఈ త్యాగానికి లోకం అంతా అతనికి మొక్కుతుంది అని కవి అంటున్నారు. భక్తి అన్నది కూడా ఒక యజ్ఞమే. భక్తుని భక్తి వల్ల లోక శ్రేయమేనని కవి-చంద్రుని ఉదాహరణను రమణీయంగా ఈ పద్యంలో చెప్తున్నాడు.*

48. ***చెదఱంబాఱు దశ ప్రభంజనములన్ శిక్షన్ సుషుమ్నంబునం***
గుదియం బట్టి చలింపకుండ శశి నర్కుం గట్టి భాస్వన్మన
స్సదన స్థానము నందు నిన్నెలమి సంస్థాప్యంబుగాఁ జేసి తాఁ
హృదయానంద రసాబ్ధిఁ దేలు శివయోగీంద్రుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

చెదఱంబాఱు = (అటునిటు) చెదరిపోయే; దశప్రభంజనములన్ = పదివాయువులను; శిక్షన్ = అభ్యాసం చేత; సుషుమ్నంబునన్ = సుషుమ్నానాడి యందు; గుదియన్ పట్టి = నిలిపి; చలింపక ఉండ = చాంచల్యం లేకుండా; శశిన్ = ఇడ అన్ననాడిని; అర్కున్ = పింగళ అన్న నాడిని; కట్టి = నియమించి; భాస్వత్ = ప్రకాశించే; మనః సదన స్థానమునందు = మనస్సనే నివాస స్థానంలో; నిన్ను = (సర్వేశ్వరుడవైన) నిన్ను; ఎలమి = ప్రేమతో; సంస్థాప్యంబుగా చేసి = ప్రతిష్ఠాపించి; తా = తాను (భక్తుడు); హృదయానంద = హృదయంలోని ఆనందమనే; రసాబ్ధి = రస సముద్రంలో; శివయోగీంద్రుండు = శివయోగి శ్రేష్ఠుడు; తేలు = తేలుతాడు.

— *సర్వేశ్వరా! అటూ ఇటూ చెదిరిపోయే దశ వాయువులను చెదరిపోకుండా అభ్యాసం చేత సుషుమ్నలో నిలిపి నిశ్చలం చేసి, ఇడ పింగళలను నియమించి, తేజో వంతమైన మనస్సులో ఈశ్వరుడవైన నిన్ను ప్రతిష్ఠాపించి శివయోగి వర్యుడు తాను హృదయానందమనే రస సముద్రంలో తేలుతాడు.*

❊ *దశ ప్రభంజనాలు అంటే దశవాయువులు. (1) ప్రాణము (2) అపానము (3) వ్యానము (4) ఉదానము (5) సమానము (6) నాగము (7) కూర్మము (8) కృకరము (9) దేవదత్తము (10) ధనంజయము లన్నవి ఈ దశ వాయువులు.*

ఇవి చలిస్తుంటే ధ్యానం అసాధ్యం. ప్రాణచలనమే మనోవృత్తి. మనోవృత్తి నాశనమే యోగం.

❊ *కొన్ని పద్యాలలో ఇట్లా యోగ ప్రసక్తి చేశారు కవి.*

49. **వెలి వీక్షించిన నీ స్వరూపమె మహా విస్పష్టమై, యాత్మలో**
పల భావించిన నీ స్వరూపమె మహా ప్రవ్యక్తమై, దృష్టులం
దలఁపం జేకొని యున్న నీ యచలిత ధ్యానంబునం జేసి తాఁ
గలనైనన్ శివయోగి తన్ను జగముం గానండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

వెలి = బయటకు; వీక్షించిన = చూస్తే; దృష్టులన్ = చూపులకు; నీ; స్వరూపమె = రూపమే; మహావిస్పష్టము, ఐ = ఎంతో స్పష్టమయి; ఆత్మలోపల = అంత రంగంలో; భావించిన = ఊహించి నట్లయితే; తలపన్ = భావన చేత; నీ; స్వరూపమె = రూపమే; మహా ప్రవ్యక్తము, ఐ = గొప్పగా అభివ్యక్తమయి; చేకొని యున్న = గ్రహించి యుండగా; నీ = నీపై; అచలిత = నిశ్చల; ధ్యానంబునం, చేసి = ధ్యానము చేత; కలనైనన్ = స్వప్నంలోనైనా; శివయోగి = శివునిలో లయించి యున్న యోగి; తన్ను = తనను కాని; జగమున్ = లోకాన్ని కానీ; కానండు = చూడడు.

– *సర్వేశ్వరా! నీ యందు నిశ్చల ధ్యానం కలిగి ఉండడం చేత శివయోగి కలలో నైనా తనని కాని, లోకాన్ని కానీ చూడడు. అతడు బైటికి చూసినా నీ స్వరూపమే మహా విస్పష్టంగా దృక్కులలో గ్రహిస్తాడు. అట్లాగే అంతరంగంలో నిన్ను భావిస్తే అక్కడ నీ స్వరూపమే గొప్పగా అభివ్యక్తం కావడాన్ని భావన చేత గ్రహిస్తాడు.*

❋ *బహిరంతరాల్లో శివయోగికి శివుడే కనబడడం, స్ఫురణ కావడం జరుగుతుంది. కాబట్టి శివయోగికి తాను కానీ, జగత్తు కానీ విడిగా కన్పించదు. అంతా శివమయమే. శివుడు వినా ఆయనకు మరేదీ లేదు. ఈశావాస్యమి దగ్ం సర్వం.*

50. *భవదాకారమె కాంచు, నీస్తవ కదంబ శ్రేష్ఠ సద్వాక్యముల్*
చెవులారన్ విను, నిన్నె చెప్పు మది, దుశ్శీలేంద్రి యాటోప దు
ర్వ్యవసాయాత్ములఁ గాంచుచో వినెడిచో వర్ణించుచోఁ జీకునుం
జెవిటిన్మూఁగయునై చరించు మహిఁద్వచ్ఛీలుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

త్వత్ = నీయొక్క; శీలుండు = శీలము (ప్రవర్తన) కలవాడు; భవత్ = నీయొక్క; ఆకారమె = రూపాన్నే; కాంచు = చూస్తాడు; నీ; స్తవకదంబ = స్తోత్ర సమూహంలోని; శ్రేష్ఠ = ఉత్తమోత్తమమైన; సత్ = మంచి; వాక్యముల్ = వాక్యాలను; చెవులారన్ = వీనుల విందుగా; విను = వింటాడు; మది = మనసా; నిన్నె = నిన్ను గురించి మాత్రమే; చెప్పు = చెప్తాడు; దుశ్శీల = దుర్మార్గమైన నడత గలిగిన వాళ్లను; ఇంద్రియ = ఇంద్రియముల యొక్క; ఆటోప = ఆడంబరం చేత; దుర్ వ్యవసాయాత్ముల = దుష్కార్య పరులను; కాంచుచో = చూసినా; వినెడిచో = విన్నా; వర్ణించుచో = వర్ణించినా; చీకునున్ = గ్రుడ్డివాడూ; చెవిటిన్ = బధిరుడూ; మూగయున్, ఐ = నోరు లేనివాడూ అయి; మహి = భూమి మీద; చరించు = ప్రవర్తిస్తాడు.

— *సర్వేశ్వరా! నీ శీలాన్ని కల్గినవాడు నీ రూపాన్నే చూస్తాడు. నీ స్తోత్రాలలోని మంచి మాటలే వీనుల విందుగా వింటాడు. మనస్సుతో నిన్ను గురించే చెప్తాడు. చెడు ప్రవర్తన కల్గిన వాళ్లని, ఇంద్రియాటోప మనే దుష్కార్యాలలో మునిగిన వాళ్లని చూసినా, విన్నా, వర్ణించినా అతడు గుడ్డీ, చెవిటీ మూగీ అయి ప్రవర్తిస్తాడు.*

51. **అతి లాలిత్యముగా నహర్నిశము నిన్నర్చింపఁగా వచ్చు, సు**
వ్రతుఁడై యుండఁగ వచ్చు, నెల్ల కళలం బ్రౌఢుండు గా వచ్చు వా
క్పతిగా నైనను వచ్చు; గాని మఱి నీ భక్తుండు గారాదు సు
స్థితిగా నీ దయలేని మానవునకుం జింతింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అతి = మిక్కిలి; లాలిత్యముగా = నాజూకుగా; అహర్నిశము = రాత్రింబగళ్లు; నిన్ను; అర్చింపఁగా వచ్చు = పూజించ వచ్చును; సువ్రతుడై = మంచి వ్రతనిష్ఠుడై; ఉండగ వచ్చు; ఎల్ల కళలన్ = సమస్త కళలలో; ప్రౌఢుండు = దిట్ట కావచ్చు; వాక్పతిగా నైనను వచ్చు = (చివరకు) బ్రహ్మ అయినా కావచ్చును; కాని; చింతింపన్ = ఆలోచిస్తే; నీదయ లేని మానవునకున్ = నీ అనుగ్రహం లేని మానవునికి; సుస్థితిగా = స్థిరంగా; మఱి; నీ భక్తుఁడు = నీ యొక్క భక్తుండు; కారాదు = కాలేడు.

– *సర్వేశ్వరా! ఎంతో లలితంగా నీ పూజ చేయవచ్చును. నీ వ్రతం చేయవచ్చును. సమస్త కళలలో దిట్ట కావచ్చును. బ్రహ్మ కావచ్చును. కాని నీ అనుగ్రహం లేని మానవుడు నీ భక్తుడు మాత్రం కాలేడు.*

❋ *ఏదైనా పురుష ప్రయత్నంతో చేయవచ్చును. ఒక పూజ, ఒక వ్రతం, విద్యా పాండిత్యం - ఇవన్నీ అట్లా సాధించుకో వచ్చును. కాని శివభక్తి మాత్రం శివానుగ్రహంతోనే సిద్ధిస్తుంది తప్ప వేరే విధంగా కాదు.*

52. **భవికిన్ భక్తి మహత్త్వ మంకురితమై పాటిల్ల భక్తుండు బాం**
ధవ మాత్రుండగు, భక్తి పుష్పితముగాఁ దద్భక్తుఁడాత్మేశుఁడై
సవిశేష స్థితిఁదోఁచు, భక్తి సఫలోత్సాహంబునుం బొందఁగా
నవికల్పస్థితి నంత భక్తుఁడును నీవై యుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భవికిన్ = శైవుడు కాని వానికి; భక్తి మహత్త్వము = భక్తి మహిమ; అంకురితము ఐ = వేరూని; పాటిల్ల = ప్రవర్తిల్లగా; భక్తుండు = భక్తుడు (అతనికి); బాంధవ మాత్రుండు; అగు = బంధువు మాత్రమే అగును; భక్తి; పుష్పితముగా = పుష్పించినట్లయితే; భక్తుడు; ఆత్మేశుడు ఐ = తనకు అధిపతి అయి; సవిశేష స్థితి = విశిష్ట స్థితిలో; తోచు = అగుపిస్తాడు; భక్తి; సఫల ఉత్సాహంబునున్ = ఫలముతో గూడిన ఉత్సాహస్థితిని పొందితే; అవికల్ప స్థితిన్ = వికల్పం లేని (అంటే రెండు కాని) స్థితిలో; అంత = వెంటనే; భక్తుడును; నీవు ఐ = నీవే అయి; ఉండు.

— *సర్వేశ్వరా! శైవుడు కాని వాడికి ఘనమైన భక్తి అంకురిస్తే శివభక్తుడు అతనికి బంధు సముడుగా మాత్రమే కన్పిస్తాడు. ఆ భక్తే అతనిలో పుష్పిస్తే శివభక్తుడు అతనికి ఆత్మేశుడు అన్న విశేషంగా తోస్తాడు. భక్తి ఫలవంతం అవుతే వెంటనే భక్తుడు శివుడుగా అయి అద్వయానుభూతిని పొందుతాడు.*

❋ *ఇక్కడ భక్తి అంకురించే వేళ, పుష్పించే వేళ, ఫలవంతం అయ్యే వేళల్లో శివభక్తునికి ఏ క్రమ పరిణామం కల్గుతుందో చెప్తున్నాడు.*

❋ *ఈ పద్యంలో 'నీవై ఉండు' అన్నది విశేష విషయం. భక్తుడు ఒక దశలో శివుడై ఉండటం అన్నది శైవమతంలో ఒక ప్రత్యేకాంశం. జీవులు బంధ విముక్తులు కావాలంటే భక్తి మార్గంతో అజ్ఞానావరణాన్ని తొలగించు కొని చిత్త శుద్ధిని సాధించినప్పుడు మోక్షం లభిస్తుంది. శైవంలో జీవుడికీ పరమ శివునికీ భేదం ఉన్నప్పటికీ వారిద్దరికీ అత్యంత భేదం కానీ, అత్యంత అభేదం కానీ లేవు. అట్లాగే ఏకతర మిథ్యాత్వం కానీ, భేదాభేదాలు కూడా ఈ మతంలో అంగీకార్యం కాదు. ఈ పద్యంలో 'భక్తుడును నీవైయుండు' అన్న తాత్త్విక భావాన్ని అర్థం చేసికోవడానికి ఈ నేపథ్యాన్ని అవగాహన చేసి కోవాలి.*

53. సుముఖుండై శివయోగి మోదము మదిన్ శోభిల్లఁ జేకొన్న భి
క్షము విప్రోత్తమ కోటి భోజన సదృక్షంబన్న సౌభాగ్యయో
గము నందారయ నమ్మహా మహుఁడు వేడ్కం గోరి యారోగిణం
బమరం జేసిన పుణ్యమెట్లు గుఱి సేయన్వచ్చు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సుముఖుండై = అంగీకారం కల్గిన వాడై; శివయోగి = శివుని మీదనే చిత్తం లయించిన వాడు; మోదము = సంతోషం; మదిన్ = మనస్సులో; శోభిల్ల = శోభిల్లగా; చేకొన్న = తీసికొన్న; భిక్షము = బిచ్చము; సౌభాగ్య యోగము నందు = అదృష్ట యోగంలో; విప్రోత్తమ కోటి = కోటి మంది శ్రేష్ఠులైన బ్రాహ్మణులకు పెట్టిన; భోజన సదృక్షంబు అన్న = భోజనంతో సమానం అని అంటే; (ఇక); ఆరయ = పరిశీలిస్తే; ఆ మహామహుఁడు = ఆ శివయోగే; వేడ్కన్ = సంతోషంతో; కోరి = తానుగా అడిగి; ఆరోగిణంబు = భోజనాన్ని; అమరన్ చేసిన = ఒనకూడే టట్లుగా చేసిన; పుణ్యము = పుణ్యాన్ని; ఎట్లు = ఎట్లా; గుఱి చేయన్ వచ్చు = మితి చేయవచ్చు.

– *సర్వేశ్వరా! శివయోగి మనస్సులో సంతోషిస్తూ అంగీకరించిన భిక్షం కోటి మంది బ్రాహ్మణోత్తములకు భోజనం పెట్టిం దాంతో అదృష్ట యోగంలో సమానం అనగా ఇక ఆ శివయోగియే ప్రేమతో కోరి భోజనం అమర్చితే ఆ పుణ్యానికి మితి (గుఱి) ఉంటుందా? (ఉండదని అర్థం).*

❄ ఈ పద్యం జంగమార్చనను తెలిపే పద్యాలలో ఒకటి. అష్టావరణాలలోని ఆరవ ఆవరణం జంగమ మహేశ్వరుడు. శివునికి మొదటి రూపం లింగం కాగా రెండవ రూపం జంగమ మాహేశ్వరుడు. ఈయనే శివయోగి. తన యందు భక్తి ఉన్న వాణ్ణి తనకన్నా ఎక్కువగా శివుడే చూసికొంటాడట. అందువల్ల ఒక్క శివయోగికి పెట్టిన భోజనం విలువ ఎంతటిదో ఈ పద్యం తెల్పుతున్నది.

54. ఎచ్చో నీ పదభక్తుఁడుండు మదినింపెక్కం బ్రయత్నంబు తో
నచ్చో నీ వనిశంబు నుండుదు, త్వదీయ ధ్యాన చిన్మూర్తులై
యచ్చో సన్మునులెల్ల నుండుదురు, మంత్రాంగాక్షరా యుక్తులై
యచ్చోఁ దీర్థము లెల్ల నుండు, నిది వేదార్థంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఎచ్చో = ఏ చోట; నీ; పద భక్తుడుండు = పాదములపై భక్తి ఉన్న వాడుంటాడో; అచ్చో = ఆచోట; మదిన్ = మనస్సునందు; ఇంపు; ఎక్కన్ = ప్రేమ అధికం కాగా; ప్రయత్నంబుతో = పూనికతో; నీవు; అనిశంబున్ = నిరంతరము; ఉండుదు = ఉంటావు; అచ్చో = ఆచోట; సత్ మునులు ఎల్ల = మంచి మునులంతా; మంత్రాంగ అక్షర ఆయుక్తులు, ఐ = మంత్ర అవయవములలోని (బీజ) అక్షరములతో కూడు కొన్న వారయి; త్వదీయ = నీ యొక్క; ధ్యాన చిన్మూర్తులు, ఐ = ధ్యానము చేత చైతన్య వంతమైన మూర్తులు కల వారయి; ఉండుదురు = ఉంటారు; అచ్చో = ఆచోట; తీర్థములు ఎల్ల = (పుణ్య) తీర్థములన్నీ; ఉండున్ = ఉంటవి; ఇది = ఈ విషయము; వేదార్థంబు = వేదముల తాత్పర్యము.

— *సర్వేశ్వరా! ఎక్కడ నీ భక్తుడుంటాడో అక్కడ మనస్సులో ప్రేమ అధికం కాగా నీ వెల్లప్పుడూ ఉంటావు. నీపై ధ్యానం చేత చిన్మూర్తులై అక్కడ సన్మునులందరూ మంత్ర బీజాక్షరయుక్తులై ఉంటారు. అక్కడ తీర్థాలన్నీ ఉంటాయి. ఇది వేదాల తాత్పర్యం.*

55. సత్యం బెప్పుడు తప్పఁడేనియు దురాచారుండు గాఁడేని యా
చిత్యం బేమఱఁడేని దుర్జనుల గోష్ఠిం బొందఁడే భక్త సాం

గత్యం బాదటఁ బాయఁడేని మదన గ్రస్తుండు గాఁడేని నీ

భృత్యుండాతఁడు మూఁడు లోకములలోఁ బూజ్యుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సత్యంబు ఎప్పుడు తప్పడేనియు = సత్యభాషణము నిరంతరము తప్పక చేసే వాడయినట్లయితే; దురాచారుండు కాడేని = దుష్టమైన ప్రవర్తన కలిగి ఉండని వాడయినట్లయితే; ఔచిత్యంబు ఏమఱడేని = ఉచితమైన దానిని మర్చిపోకుండా ఉన్నట్లయితే; దుర్జనుల గోష్ఠిన్ = చెడ్డవారల సాంగత్యాన్ని; పొందడేన్ = పొందని వాడయితే; భక్త సాంగత్యంబు = భక్తులతో పొత్తును; ఆదట = ప్రేమతో; పాయడేని = విడువని వాడయితే; మదనగ్రస్తుండు = కాముకుడు; కాడేని = కానివాడు; నీ భృత్యుండు = (అట్టివాడు) నీ కింకరుడు; అతడు = (అట్టి) వాడు; మూడు లోకములలో = ముల్లోకాలలో; పూజ్యుండు = ఆరాధ్యుడు.

– సర్వేశ్వరా! ఎప్పుడూ సత్యం తప్పని వాడూ, దురాచారుడు కాని వాడూ, ఔచిత్యాన్ని విస్మరించని వాడూ, దుర్జన సాంగత్యంలో ఉండని వాడూ, భక్తుల సాంగత్యాన్ని ప్రేమతో విడువని వాడూ, కాముకుడు కానివాడూ నీ సేవకుడౌతాడు. అలాంటి వాడు ముల్లోకాల్లో పూజ్యుడౌతాడు.

❄ సద్భక్తుని లక్షణాలన్నీ అన్నమయ్య గారీ పద్యంలో చెప్పారు.

56. పెంపం దల్లి యగున్ రుజాపటల దుష్పీడా విధి క్షోభ వా

రింపన్ వైద్యుఁడగుం గుమార్గ విధులం గ్రీడింపఁ బోకుండ శి

క్షింపన్ బల్లిదుఁడైన తండ్రి యగుచున్ శ్రీమంతుఁగా నెంతయున్

సంపద్వృద్ధి యొనర్ప దాతయగు నీ సద్భక్తి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నీ సద్భక్తి = నీ యందలి మంచి భక్తి; పెంపన్ = పెంచడం చేత; తల్లి అగున్ = తల్లి అవుతుంది; రుజాపటల = రోగ సమూహం అనే; దుష్ పీడా విధి = చెడ్డ బాధా పద్ధతి యొక్క; క్షోభ = వేదనకు; వారింపన్ = నివారించడం చేత; వైద్యుడగున్ = ఆరోగ్య దాత; అవుతాడు; కుమార్గ విధులన్ = చెడు మార్గాల వైపుకి; క్రీడింప పోకుండ = విహరించడానికి పోకుండా; శిక్షింపన్ = నేర్పడం చేత; బల్లిదుడు ఐన = బలిష్ఠుడైన; తండ్రి అగుచున్; శ్రీమంతుగాన్ = ఐశ్వర్యవంతు డగునట్లుగా; ఎంతయున్ = ఎంతో; సంపత్ వృద్ధి = ఐశ్వర్య వృద్ధి; ఒనర్ప = చేయగా; దాత అగు.

— *సర్వేశ్వరా! నీ మీది సద్భక్తి పెంచి పోషిస్తుంది కాబట్టి తల్లి అవుతున్నది. రోగ బాధ వల్ల కలిగే క్షోభను నివారిస్తుంది. కాబట్టి వైద్యుడవుతున్నది. చెడు మార్గాలలో పోకుండా నేర్పుతున్నది కాబట్టి బలవంతుడైన తండ్రి అవుతున్నది. శ్రీమంతుడవడం కోసం సంపదలను వృద్ధి చేస్తున్నది కాబట్టి దాత అవుతున్నది.*

❋ *తల్లీ, తండ్రీ, వైద్యుడూ, దాతలుగా భక్తిని కవి నిరూపిస్తున్నాడు. సద్భక్తునికి ఇహలోక విషయాలపై వ్యామోహం పనికిరాదు. కాని మనిషైన వాడెవ్వడికైనా సరే తల్లీ తండ్రీ వైద్యుడూ దాతా లేకపోతే జీవన వ్యవహారం నడవదు. అందువల్ల మోహనాశం పొందిన భక్తునికి నష్టం కలుగకుండా ఈశ్వర భక్తియే ఆ లోటుని తీరుస్తుందని కవి ఈ పద్యంలో చెప్తున్నాడు.*

57. ***ఉరు సంసార గజేంద్ర దర్పదళన వ్యూఢ ప్రతాపోగ్ర కే***
సరి, దుష్ప్రాప శరీర బంధ విపులక్ష్మాజ వ్రజచ్ఛేద వి
స్ఫురిత క్రూర కుఠార ధార, దురిత ప్రోద్భూత జీమూత దు
స్తర సంఘాత విఘాత మారుతము, నీ సద్భక్తి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఉరు = పెద్దదైన; సంసార గజ ఇంద్ర = సంసారమనే శ్రేష్ఠమైన ఏనుగు యొక్క; దర్ప = గర్వమును; దళన = ఖండించుట యందు; వ్యూఢ = ఉంచ బడిన; ప్రతాప, ఉగ్ర = శౌర్యం చేత భీకరమైన; కేసరి = సింహము; దుష్ ప్రాప = దుర్లభమైన; శరీర = శరీరానికి; బంధ = బంధమైన; విపుల = విశాల; క్ష్మాజ = చెట్లది; వ్రజ = సమూహాన్ని; ఛేద = త్రెంపే; విస్ఫురిత = ప్రకాశించే; క్రూర = కర్కశమైన; కుఠారధార = గొడ్డలి పదును; దురిత = పాపాల చేత; ప్రోద్భూత = పుట్టిన; జీమూత = మబ్బుల యొక్క; దుస్తర = అధిగమించలేని; సంఘాత = సమూహానికి; విఘాతము = దెబ్బ; (అయినట్టి) మారుతము = ప్రభంజనము; నీ సద్భక్తి.

– *సర్వేశ్వరా! పెద్దదయిన ఈ సంసారమనే గజేంద్రుని గర్వాన్ని ఖండించడం కోసం ఉంచిన శౌర్య భీకరమైన సింహం నీ భక్తి. దుర్లభమైన శరీరానికి బంధమనెడు అడవిని ఛేదించే క్రూరమైన గొడ్డలి పదునూ, పాపాల వల్ల పుట్టిన మబ్బుల సమూహానికి విఘాతమైన వాయువూ నీ భక్తి.*

❈ *సంతానంతో ఉన్న మోహాన్ని ఛేదిస్తుంది భక్తి. మానవ శరీరం లభించడం బహు కష్టం. అయితే దాన్ని శివునికి చేర్చే లక్ష్యానికి పెద్ద అడ్డంకి సంతాన వ్యామోహం. దాన్ని పోగొట్టేది శివభక్తి.*

58. అరి వీరప్రకరంబు భీకరతరంబై తాఁకుచో సింహ సిం
ధుర శార్దూల మృగోరగాది భయముల్దో తెంచుచో ఘోర దు
స్తర సంసార వికార వేదనలు మీఁదం బర్వుచో వజ్ర పం
జరమై చేకొని తన్ను నెత్తు కొను నీ సద్భక్తి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అరివీర ప్రకరంబు = శత్రువీరుల సమూహం; భీకర తరంబై = భయంకరమై; తాకుచో = దండెత్తి వస్తే; సింహ, సింధుర = సింహం, గజము; శార్దూల మృగ = పెద్దపులి; ఉరగ ఆది = సర్పాది; భయముల్ = భయములు; తోతెంచుచో = వెంట వస్తే; ఘోర = భయంకరమైన; దుస్తర = దాటుటకు వీలులేని; సంసార = జీవయాత్ర యందలి; వికార = వికృతుల చేత కలిగే; వేదనలు = కష్టాలు; మీదన్ = మీదికి; పర్వుచో = రాగా; నీ సద్భక్తి = నీ యందలి మంచి భక్తి; వజ్ర పంజరము ఐ = వజ్రంతో చేసిన పంజరమయి; తన్నున్ = తనను; ఎత్తుకొను = కాపాడును.

— *సర్వేశ్వరా! భయంకరంగా శత్రు వీరులు ఎదిరించినా, సింహ, గజ, శార్దూల, ఉరగాదుల చేత భీతి కల్గినప్పటికీ, దుస్తరమైన భయంకరమైన సంసార వికృతుల చేత కష్టాలు మీద పడినప్పటికీ, నీ సద్భక్తి భక్తునికి వజ్ర పంజరమై కాపాడుతుంది.*

❋ *ఈశ్వర భక్తి ఉపాసకుణ్ని సంసారం నుంచి విభక్తుణ్ని చేస్తుందని తాత్పర్యం. అతని చుట్టూతా లోకం ఉన్నప్పటికీ ఆ లోకం అతణ్ని ఏమీ చేయకుండా ఈశ్వర భక్తి అతని చుట్టూతా వజ్ర పంజరంగా నిలుస్తుందట. వజ్రం కఠినాతి కఠినం - సుందరం. వజ్రాన్ని మరేదీ భేదించలేదు. అందువల్ల ఈ వజ్ర పంజరాన్ని ఏదీ భేదించి భక్తునికి నష్టాన్నీ, భయాన్నీ కష్టాన్నీ కల్గించ లేదని అంటున్నారు అన్నమయ్య.*

59. కమలాప్తుండుదయింపఁగా ననల నక్షత్ర క్షపాధీశ తే
జము లెల్లం బెడఁ బాసి పోవు గతి నీ సద్భక్తి భావంబు చి
త్తము లోనం బ్రభవింపఁగా నితర మంత్రధ్యాన - తద్దేవతా
క్రమ మాయాపటలంబు లన్నియును వీఁకం గ్రాఁగు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కమలాప్తుండు = సూర్యుడు; ఉదయింపగాన్; అనల = అగ్ని; నక్షత్ర = చుక్కలు; క్షపాధీశ = చంద్రుల యొక్క; తేజములు ఎల్ల = సర్వ తేజములు (కాంతులు); పెడబాసి పోవు గతి = వెలవెలపోవు మాదిరిగా; నీ సద్భక్తి భావంబు = నీ మీది మంచి భక్తి భావం; చిత్తము లోనన్ = మనస్సులో; ప్రభవింపగా = పుట్టగా; ఇతర = శివేతర; మంత్ర ధ్యాన = మంత్రాలు, ధ్యానాలు; తత్ = ఆ; దేవతా క్రమ = దేవతల వరుసల; మాయా = అసత్య; పటలంబులు, అన్నియును = సమూహాలన్నీ; వీకన్ క్రాగు = దైన్యంతో తపిస్తవి.

— *సర్వేశ్వరా! సూర్యుడుదయిస్తే చంద్రాగ్ని నక్షత్రాల తేజస్సెలా వెలవెల బోతుందో అట్లాగే నీ సద్భక్తి భావం భక్తుని చిత్తంలో పుట్టగానే ఇతర మంత్ర ధ్యానాలు - వాటి దేవతా క్రమం యొక్క మాయా సమూహాలన్నీ దైన్యంతో తపిస్తవి.*

❊ *ఇతర దేవతా మంత్ర ధ్యానాలన్నీ శివభక్తికి సోపానాలే తప్ప అవే సత్యం కావు. శివభక్తి ఉదయించగానే అవన్నీ పోతాయి.*

❊ *అన్నమయ్య గారు శివపారమ్యం మాత్రమే అంగీకరిస్తారు. అందువల్ల శివభక్తి ఉదయిస్తే చాలు తక్కినవన్నీ వ్యర్థమై పోతాయనీ, అనవసరమనీ అంటారు వారు. వాటికీ ఎంతో కొంత ప్రయోజనం లేకపోలేదు. కాని శివభక్తి ముందర వాటి ప్రయోజనం గుర్తించ దగింది కాదు. సూర్య తేజం ముందర నక్షత్రాదుల కాంతిలాగా.*

60. **చటుల ప్రాయ గుణేంద్రియాత్ములకు వాంఛావృత్తి నీ భక్తి సం**
స్ఫుటమై యుండదు భక్తి తత్పరులకుం బొల్పొందగాఁ జిత్తము
త్కట దుష్టేంద్రియ వర్గ తామస పరిగ్రస్తంబు గాఁబోదు; చీఁ
కటికిం దిగ్మ మరీచికిం గలదె సాంగత్యంబు? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

చటుల ప్రాయ = చంచల ప్రాయమైన; గుణ = గుణముతో; ఇంద్రియాత్ములకు = ఇంద్రియాలు కలిగిన వాళ్లకు; వాంఛా వృత్తి = కోరికలు ప్రవర్తించడం చేత; నీ భక్తి = నీపైన భక్తి; సంస్ఫుటమై = విశదమై; ఉండదు; భక్తి తత్పరులకున్ = భక్తితో కూడిన వాళ్లకేమో; పొల్పొందగా = సుందరంగా; చిత్తము = (వారి) మనస్సు; ఉత్కట = మదించిన; దుష్ట ఇంద్రియ వర్గ = చెడ్డవైన ఇంద్రియ సమూహం యొక్క; తామస = అజ్ఞానం చేత; పరిగ్రస్తంబు కాబోదు = ఆక్రమింప బడదు; చీకటికిన్ = అంధకారానికి; తిగ్మ = వేడి అయిన; మరీచికిన్ = కిరణానికి; సాంగత్యంబు = స్నేహం; కలదె = ఉంటుందా?

— *సర్వేశ్వరా! చంచలమైన గుణాలతో ఇంద్రియాలు కల్గిన వాళ్లకు కామనలు ఉండడం చేత నీయందు భక్తి సంస్ఫుటంగా ఉండదు. కాని భక్తి తత్పరుల కేమీ వారి చిత్తం దుష్టేంద్రియ వర్గం యొక్క అజ్ఞానం చేత పరిగ్రస్తం కానేరదు. అంధకారానికీ వేడి వెలుగు కిరణానికీ పొత్తు ఉంటుందా? ఉండదు కదా.*

❊ *వాంఛావృత్తిని తామసంతోనూ, శివభక్తి తత్పరతను వెలుగు కిరణంతోనూ పోల్చడం ఉచితం. కామమే అంధకారం. జ్ఞానమే ప్రకాశం. దీన్నీ పద్యంలో అన్నమయ్య కవి స్పష్టం చేశారు.*

61. **బలవంతుండును దుర్బలుండును, మహాప్రౌఢుండు మూఢుండునుం**
కులహీనాత్మకుఁడున్ మహాకులజుఁడున్, గ్రూరుండు శాంతాతి ని
శ్చల చిత్తుండును నొక్క రూపయగు; నీ సద్భక్తి చిత్తంబు లో
పల వర్ధిల్లిన మీఁద నే విధమునన్ భావింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నీ సద్భక్తి = నీ మీద మంచి భక్తి; చిత్తంబు లోపల; వర్ధిల్లిన మీద = వృద్ధి పొందిన తర్వాత; ఏ విధమునన్ = ఏ రకంగా; భావింప = భావించినప్పటికిన్నీ; బలవంతుండును = బలిష్ఠుడూ; దుర్బలుండును = బలం లేని వాడూ; మహా ప్రౌఢుండు = మిక్కిలి నేర్పరీ; మూఢుండునున్ = తెలివి లేని మొద్దూ; కుల హీనాత్మకుడున్ = కులం లేని వాడూ; మహాకులజుడున్ = గొప్ప కులంలో పుట్టిన వాడూ; క్రూరుండు = (దయ లేని) కఠినుడూ; శాంత = శమము చేత; అతి నిశ్చల = అత్యంత ధీరమైన; చిత్తుండును = చిత్తము కల్గినవాడూ; ఒక్క రూప అగు = ఒకే రూపం కల్గిన వాళ్లవుతారు (అంటే సమానమే అవుతారు).

— *సర్వేశ్వరా! నీ సద్భక్తి చిత్తంలో వృద్ధి పొందినప్పుడు ఏ విధంగా చూసినప్పటికీ బలిష్ఠుడూ, దుర్బలుడూ, నేర్పరీ, మూర్ఖుడూ, హీన కులస్థుడూ మహాకులజుడూ, క్రూరుడూ శాంతుడూ సమానమే అవుతారు.*

❈ *శివభక్తి ఎక్కువ తక్కువలన్న తారతమ్యాలని తొలగించి సమానం చేస్తుందని భావం. నిజానికి దుర్బలునికి బలాన్నీ, మూర్ఖునికి చాకచక్యాన్నీ, హీనకులజునికి మహాకుల ప్రాప్తినీ, క్రూరునికి శాంతాన్నీ ఇస్తుందని భావం. పై పద్యాలలో దుష్ట సాంగత్యాన్నీ, దుర్గుణాలనీ, దురాచారాలనీ సద్భక్తునికి లక్షణం కాదంటున్నారు కవి కాబట్టి ఈ పద్యంలోని కవి హృదయం ఇదని భావించాలి.*

62. **కామోద్రేక విజృంభణంబును సమగ్రక్రోధమున్ లోభమున్**
వ్యామోహంబు మదంబు మచ్చరము దీవ్రంబైన పంచేంద్రియో
ద్దామా టోపము గ్రాఁచి పెంపెసఁగు తత్త్వ జ్ఞానికిం గాక తా
సామాన్యాత్ముల కేల నూలు కొను నీ సద్భక్తి? సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కామోద్రేక విజృంభణంబును = కామోద్రేక విజృంభణతో; సమగ్రక్రోధమున్ = నిండు క్రోధంతో; లోభమున్ = లుబ్ధత్వంతో; వ్యామోహంబు = మోహంతో; మదంబు = తామసాహంకారంతో; మచ్చరము = మాత్సర్యంతో; తీవ్రంబు ఐన = తీవ్రమైన; పంచేంద్రియ = ఐదింద్రియాల; ఉద్దామ = కట్టులేని; ఆటోపము = వేగిరపాటుని; క్రాచి = తపింప జేసి; పెంపెసగు = వృద్ధి పొందిన; తత్త్వ జ్ఞానికిన్ కాక = ఈశ్వర జ్ఞానం కలిగిన వాడికి కాక; తా = తాను; సామాన్య ఆత్ములకు = అతి సాధారణులకు; నీ భక్తి = నీ యందు భక్తి; ఏల; నూలు కొను = కుదరు కుంటుంది.

— సర్వేశ్వరా! తీవ్రమైన కామక్రోధలోభ మోహ మద మాత్సర్యాలతో తీవ్రమైన పంచేంద్రియాల యొక్క ఉద్ధృతిని తపింపజేసే తత్త్వజ్ఞానికి కాక అతిసాధారణులకు నీ భక్తి ఎందుకు కుదురు కొంటుంది?

❋ *కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలు అరిషడ్వర్గాల అధీనంలో ఉంటే సామాన్యుడు. వాటిని జయిస్తే తత్త్వజ్ఞాని. అరిషడ్వర్గాలు జ్ఞానానికి అడ్డంకి. జ్ఞానావిష్కారానికి అరిషడ్వర్గ నిరోధం పోవాలి. వాటిని తపింప జేసి వాటి ప్రతాపాన్ని నీరు గార్చి వృద్ధిని పొందగల్గేవాడే మహానుభావుడు. అలాంటి వారికి సద్భక్తి కల్గుతుంది. ఇతరులకి కాదని భావం.*

63. ***ఉరు పక్షంబులు వచ్చు నంతకు నిరుద్యోగంబునన్ వృక్ష కో***
టర మధ్యంబున నుండు పక్షిగతి నిష్ఠం గూడి నీ భక్తి వి
స్తర మాత్మం బ్రభవించు నంతకును నీ సంసార కారాగృహాం
తర గేహంబున నుండి జీవుఁడతి చింతం బొందు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఉరు = పెద్దవైన; పక్షంబులు = ఱెక్కలు; వచ్చునంతకు = వచ్చేటంతవఱకు; నిరుద్యోగంబునన్ = నిష్క్రియంగా; వృక్షకోటర = చెట్టు తొఱ్ఱ; మధ్యంబునన్ = లోపల; ఉండు = ఉండే; పక్షిగతి = పక్షిలాగా; నిష్ఠన్ గూడి = దీక్షతో కూడి; నీ భక్తి విస్తరము = నీపై అధికమైన భక్తి; ఆత్మన్ = తనలో; ప్రభవించునంతకునున్ = పుట్టేటంత వఱకూ; ఈ; సంసార కారాగృహాంతర = సంసారపు చెరసాల అనే; గేహంబునన్ = ఇంటిలో; ఉండి; జీవుడు; అతిచింతన్ = మిక్కిలి వ్యథను; పొందు = అనుభవిస్తాడు.

— సర్వేశ్వరా! పెద్ద ఱెక్కలు వచ్చేటంత దాకా, చెట్టు తొఱ్ఱలో ఏమీ చేయకుండా (ఎగురకుండా) పక్షి ఉన్నట్లుగా, నిష్ఠతో కూడిన నీ మీది భక్తి పుట్టేటంత దాకా జీవుడు సంసారమనే చెఱసాలలో ఉండి ఎంతో వ్యథను పొందుతాడు.

❄ పక్షికి ఱెక్కలు రానంత దాకా వృక్ష కోటరం దానికి బందిఖానాయే. శివభక్తి కల్గనంత దాకా జీవునికి సంసారమూ అంతే. ఱెక్కలు మొలుస్తే పక్షి చెట్టుని విడిచి స్వేచ్ఛగా ఆకాశంలోకి ఎగిరిపోతుంది. కావాలనుకొన్నప్పుడు మాత్రం చెట్టుమీది గూటికి రాగల్గుతుంది. భక్తుడూ అంతే. సంసారం అతణ్ని భక్తి కల్గినప్పుడు బంధించలేదు. దాన్ని వదలి స్వేచ్ఛగా బంధరహితుడుగా అతడుండ గలడు. సంసారం సంకుచితమైంది. దాన్ని దాటితే విశాలమైన శివానందం ఉన్నది. విశాలమైన శివభక్తి తనలో పుట్టగానే విశాలమైన శివానందంలో ఆయన విహరించ గల్గుతాడు. శరీరం ఉంది కాబట్టే సంసార మనే గూటికి అప్పుడప్పుడు చేరడం.

ఇట్లా ఈ పద్యంలో చక్కని పోలికతో మహా విషయాన్ని ఎంతో చక్కగా విశదీకరించారు అన్నమయ్య గారు.

64. *లింగారాధన జంగమార్చనము లోలిన్ భక్తికంగంబు ప్రా*
ణాంగ వ్యాప్తియునై స్ఫురించు నిది తత్త్వార్థం బగుంగాన నా
యంగాభ్యర్చన జంగమాహిత కరుండై చేసినం బీన్గు పై
శృంగారం బగు వాని భక్తి మదిఁ జర్చింపంగ సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

లింగారాధన = శివలింగ అర్చన; జంగమ అర్చనములు = శివభక్తులైన శివలింగ ధారికి చేసే పూజలు; ఓలిన్; భక్తికి అంగంబు = భక్తికి ఒక అవయవము; ప్రాణాంగ వ్యాప్తియున్ ఐ = ప్రాణంతో నున్న అవయవంలో వ్యాపించేదిగా; స్ఫురించున్ = అనిపిస్తుంది; ఇది = ఇట్లాంటి అర్చన; తత్త్వార్థంబగున్ = లోతైన అర్థం కల్గింది అవుతుంది; కాన = కాబట్టి; ఆ అంగాభ్యర్చన = ఆ అవయవ అర్చన; జంగమ అహితకరుండు ఐ = శివలింగ ధారికి కీడు కలగాలని; చేసినన్ = చేసినట్లయితే; మది చర్చింపంగ = బుద్ధితో ఆలోచిస్తే (అది); వాని భక్తి = అట్లాంటి వాని భక్తి; పీన్గుపై = శవం మీద; శృంగారంబు అగు = అలంకరణ అవుతుంది.

— *సర్వేశ్వరా! శివలింగారాధనా, జంగమార్చనా అన్న రెండూ భక్తికి అంగాలు. అవి ప్రాణాంగాలలో వ్యాపించినట్లుగా అనిపిస్తాయి. (అంటే సజీవంగా, ప్రయోజకంగా అన్పిస్తాయి). జంగములకు కీడు తలంచి ఆ అంగార్చన చేసినట్లవుతే (అంటే భక్తుడే అయి ఉండీ జంగములకు కీడు తలచి నట్లవుతే) వాని భక్తి పీనుగకు చేసిన శృంగారం లాంటిదే.*

❈ *లింగ జంగమార్చనల తత్త్వం భక్తుడు గ్రహించి చేస్తే అది ఎక్కువ ప్రయోజనకరం. సద్భక్తితో చేస్తే ప్రాణంతో ఉన్న అంగాన్ని అది అలంకరించి నట్లు. జంగమునికి కీడు కలగాలని చేస్తే అది పీనుగకి చేసిన శృంగారం లాంటిది. అంటే వ్యర్థం. పీనుగకి ఎంత శృంగారం చేసినా అవి ఆ పీనుగతో*

పాటుగా భూస్థాపితమయ్యేవే, నశించేవే. అంటే ఇట్లాంటి అర్చన ప్రాణాంగ వ్యాప్తిని పొందదు.

❄ శైవమతంలో లింగార్చన కెంత విలువ ఉన్నదో అంతకెక్కువగా జంగమార్చన కున్నది. జంగముడంటే నడుస్తున్న శివలింగమే. లింగము, జంగముడు - అష్టావరణాలలోని రెండు ముఖ్యాంశాలు. ఇంతకు ముందే వీటి వివరణ జరిగింది. లింగార్చనే శివపూజ. లింగార్చన మూడు స్థాయులలో జరుగుతుంది. భావ లింగం. ప్రాణ లింగం, ఇష్ట లింగం అన్నవి అవి. భావ లింగాన్ని ఆత్మ భావంతోనే తెలిసి కొంటారు. మంత్రజపం మనస్సులో చేయడం చేత ప్రాణ లింగాన్ని తెలిసికొంటారు. చూపుతో గుర్తించి ఇష్ట లింగాన్ని తెలిసికొంటారు. ఈ తెలిసి కోవడమే అర్చన. శాంభవ దీక్షనాడు గురువు శివలింగాన్ని, పంచాక్షరీమంత్రోపదేశాన్నీ ఇస్తాడు. ఈ రెండూ ఇష్టలింగ, ప్రాణ లింగార్చనకు పరికరాలు. ఈ రెండూ శివానుగ్రహం చేత భావలింగ ప్రాప్తిని కలిగిస్తాయి. ఈ మూడు తిరిగి షట్ చక్రాలలో ఆరులింగాలుగా ఆచారలింగ, గురులింగ, శివలింగ, చరలింగ, ప్రసాద లింగ, మహా లింగాలుగా అధిష్ఠించి ఉంటాయి.

❄ ఐతే కేవల శివాలింగార్చనతో ఆగిపోతే ఏమీ సిద్ధించదు. అది జంగమార్చన వరకూ వెళ్లాలి. ఆ జంగమార్చన ఏ స్ఫూర్తితో చేయాలో అన్నమయ్య ఈ పద్యంలో స్పష్టీకరించారు. పూజ యాంత్రికంగా కాక త్రికరణ శుద్ధితో చేయాలి. జంగమ మాహేశ్వరునికి పూజ చేస్తున్నావంటే ఆయనను శివుని రెండవ రూపంగా నమ్మి చేయాలనే ఉద్దేశ్యం. అట్లా నమ్మకం లేకుండా, అటు ఆయనకు పూజ చేసి, ఇటు ఆయనకు కీడు చేస్తే అది అప్రయోజకం అంటూ ఈ పద్యం ఘోషిస్తున్నది.

65. *ధరణిం గర్మవిధాన భక్తి విభవ ధ్యానోత్తమ జ్ఞానముల్*
వరుసం బేర్కొన నాల్గు యోగములు; తత్త్వం బెందు నీ భక్తి; వి
స్తర బాహ్య క్రియ లెల్లఁ బొల్లులగుటం, దద్భక్తి యోగంబు తాఁ
బరఁగం దక్కిన మూఁడు యోగములకుం బ్రాణంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ధరణిన్ = భూమి మీద; కర్మవిధాన = కర్మ పద్ధతి; భక్తి విభవ = భక్తి వైభవము; ధ్యాన = ధ్యానము; ఉత్తమ జ్ఞానముల్ = శ్రేష్ఠమైన జ్ఞానము; (అన్నవి) వరుసన్ = వరుసగా; పేర్కొన = లెక్కిస్తే; నాల్గు యోగములు; ఎందు = ఎక్కడైనా (అంటే వీటి అన్నింటికీ); నీ భక్తి = ఈశ్వర భక్తి; తత్త్వంబు = మూలతత్త్వం; విస్తర = అనేక; బాహ్య క్రియలు ఎల్ల = బైటకు చేసే క్రియా కలాపాలన్నీ; పొల్లులు అగుటన్ = ప్రాణ రహితాలు కావడం చేత; తద్భక్తి యోగంబు = ఆ నీ భక్తి యోగమే; తా బరగన్ = తాను పరిగణించబడగా; (తక్కిన) మూడు యోగములకున్; ప్రాణంబు = జీవము.

— *సర్వేశ్వరా! ఈ భూమిమీద కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞానాలన్నవి నాలుగు యోగాలు. ఈ అన్నింటికీ మూలంలో ఉండేది భక్తి. బాహ్యోపచారాలన్నీ పనికిరానివి కావడం చేత ఆ భక్తి యోగమే తక్కిన మూడు యోగాలకు ప్రాణం.*

❄ *కర్మ, ధ్యాన, జ్ఞాన యోగాలకన్నా భక్తి యోగమే శ్రేష్ఠ మనడం ఇది. తక్కిన మూడింటిలో బాహ్య క్రియలే ఉండి హృదయం ఉండదని కవి ఉద్దేశ్యం. ఆ మూడు యోగాలూ ప్రయోజకాలు కావాలంటే 'భక్తి' అనే ప్రాణం వాటిల్లోకి రావాలి.*

66. *అమరంగా ధనమిచ్చి కాతురు మహీయః ప్రీతిఁ బ్రాణంబుఁ బ్రా*
ణము నర్థంబును నిచ్చి కాతు రభిమానంబు న్విశేషించి మా

నముఁ బ్రాణంబును నర్థము న్నొసగి సన్మానంబుగా నుత్తమో
త్తమ చారిత్రులు భక్తిఁ గాతురు ప్రమోదం బంది సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమరంగా = పొందికగా; ధనము ఇచ్చి = డబ్బిచ్చి; మహీయః ప్రీతి = గొప్ప ప్రేమతో; ప్రాణంబు కాతురు = ప్రాణాన్ని కాపాడుతారు; విశేషించి = (ఇంకా) విశిష్టంగా; ప్రాణమున్ అర్థంబునున్ = ప్రాణమూ, డబ్బూ; ఇచ్చి; అభిమానంబున్ = గౌరవాన్ని; కాతురు = రక్షిస్తారు; ఉత్తమోత్తమ చారిత్రులు = అత్యంత శ్రేష్ఠమైన ప్రవర్తన కలిగిన వాళ్లు; సన్మానంబుగా = స్తుత్యంగా; మానము, ప్రాణంబునున్, అర్థమున్ = మానాన్ని, ప్రాణాన్ని, డబ్బుని; ఒసంగి = ఇచ్చి; ప్రమోదంబు అంది = సంతోషాన్ని పొంది; భక్తి = భక్తిని; కాతురు = రక్షిస్తారు.

– సర్వేశ్వరా! గొప్ప ప్రీతితో డబ్బిచ్చి ప్రాణాన్ని, డబ్బునీ ప్రాణాన్నీ ఇచ్చి అభిమానాన్ని, మాన ప్రాణధనాల నిచ్చి ఈశ్వర భక్తినీ ఉత్తమోత్తమ చారిత్రులు కాపాడ్తారు.

❄ ఇక్కడ దేనికన్నా ఏది శ్రేష్ఠమన్నది అన్నమయ్య తేలుస్తున్నారు. లోకులు మొదట ధనానికీ, దాని కన్నా ఎక్కువగా ప్రాణానికీ, ఈ రెంటికన్నా ఎక్కువగా అభిమానానికీ విలువనీ ప్రాధాన్యాన్నీ ఇస్తారు. ఉత్తమోత్తమ శీలం కల్గిన వాళ్లు ఈ మూడింటి కన్నా భక్తికి ఎక్కువ ప్రాధాన్యాన్నిస్తారు. అందువల్ల భక్తిని పోగొట్టు కోకుండా, కాపాడు కోవడానికి తక్కిన మూడింటినీ త్యజించడానికైనా వారు వెనుకాడరని మహా శివభక్తుడైన అన్నమయ్య అంటున్నారు.

67. అనుబద్ధేంద్రియ భూత వర్గము, యమాద్యష్టాంగ మంత్రోరు సా
ధన నుచ్చాటన సేసి పాపి గురు సద్వాక్య ప్రకాశోత్త మాం

జన దృష్టిం బరికించి యేర్పఱిచి వాంఛం గోరి సాధించి చే
కొను చిన్మూర్తికిఁ గాని భక్తి నిధి గీల్కొదెందు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

యమాది = యమ నియమాది; అష్టాంగ = ఎనిమిది అంగములు (యోగం); మంత్ర = మంత్రము అనెడి; ఉరు = ఘనమైన; సాధనన్ = సాధన చేత; అనుబద్ధ = వెంట కట్టబడిన; ఇంద్రియ = ఇంద్రియాలనే; భూతవర్గము = భూత సమూహాన్ని; ఉచ్చాటన చేసి = నిర్మూలించి; పాపి = పాపాలు చేసిన వాడు; గురు = (ఆధ్యాత్మిక) గురువు యొక్క; సద్వాక్య = సదుపదేశ; ప్రకాశ = కాంతి అనే; ఉత్తమ = శ్రేష్ఠమైన; అంజన = కాటుక; దృష్టిన్ = చూపుతో; పరికించి = చూసి; ఏర్పఱిచి = స్పష్టం చేసి కొని; వాంఛన్ = తీవ్రేచ్ఛతో; కోరి = కావాలనుకొని; సాధించి = సిద్ధింప జేసికొని; చేకొను = గ్రహించే; చిన్మూర్తికి కాని = చిత్తునే మూర్తిగా కల్గిన వాడికి తప్ప; భక్తి నిధి = భక్తి అనే నిక్షేపం; ఎందు = ఎక్కడా; కీల్కొదు = తగులు కోదు.

— *సర్వేశ్వరా! యమనియమాసనాది అష్టాంగాల చేత, మంత్రాల చేత గొప్ప సాధన చేసి, మన వెంట కట్టబడిన ఇంద్రియాలనే భూతాలను ఊడ బెఱికి, పాపి,గురువు యొక్క సద్వాక్యాల తేజస్సునే కాటుకగా పెట్టుకొన్న దృష్టితో చూసి, స్పష్టీకరించు కొని, తీవ్ర వాంఛతో కావాలనుకొని, సాధించి గ్రహించే చిన్మూర్తికి కాని భక్తి అనే నిధి లభించదు.*

❄ *యోగానికి ఎనిమిది అంగాలున్నాయి. అందుకే దానిని అష్టాంగ యోగం అన్నారు. అవి (1) యమ (2) నియమ (3) ఆసన (4) ప్రాణాయామ (5) ప్రత్యాహార (6) ధారణ (7) ధ్యాన (8) సమాధులన్నవి. సమాధి అన్నది లక్ష్యం. తక్కిన ఏడున్నూ దానికి సాధనాలు.*

❄ *ఈ అష్టాంగ యోగాన్ని రాజయోగం అని అంటారు. ఈ ఎనిమిదింటిలో మొదటి నాలుగైన యమ, నియమ, ఆసన, ప్రాణాయామాలు బాహిర*

క్రమ శిక్షణకు చెందినవి. ఈ నాలుగూ ముఖ్యంగా ప్రాణాయామం తక్కిన ప్రత్యాహార, ధారణ, ధ్యాన సమాధులకు ఉపకరిస్తవి. తర్వాతివైన ఈ నాలుగు మనస్సు, మానసాతీత భూమికలకు సంబంధించినవి. ఐతే వీటిల్లో ఎక్కడా భక్తి ప్రసక్తి స్పష్ట రీతిలో లేదు. భక్తి అంటే భగవంతునిపై ప్రేమ. అట్లాంటి ప్రేమ పర్యాయ వాచి అయిన భక్తియే ఈ అన్ని సాధనల పరమార్థం.

❊ గురువాక్యాలనే కాటుక కళ్లతో చూడమంటున్నారీ పద్యంలో అన్నమయ్య. అష్టావరణాలలో గురువు అన్న ఆవరణం నాల్గవది. శైవ సంప్రదాయంలో గురువంటే శాంభవ దీక్షనిచ్చినవాడే - అంటే లింగధారణ, శివపంచాక్షరీ మంత్ర ఉపదేశం - ఈ రెండూ ఇచ్చినవాడే. అలాంటి గురూపదేశం అనే అంజనం కల్గిన కళ్లతో చూసిన వాడికే భక్తి అన్న నిధి దొరుకుతుంది అంటున్నారు కవి.

68. కనకంబందు ఘనీభవించిన కళంకం బెల్ల సువ్యక్తిగా
ననలాస్యంబునఁ గ్రాగి పోవు గతి జీవాత్మం బ్రవేశించి చే
కొని వర్తించిన దుర్మలత్రయ పరిక్షోభంబు నీ భక్తి చే
తను బాపంబడు గాని వేఱొకటి చేతం బోదు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కనకంబు అందు = బంగారంలో; ఘనీభవించిన = గడ్డకట్టిన; కళంకంబు ఎల్ల = మాలిన్యమంతా; సువ్యక్తిగా = చక్కగా; అనల, ఆస్యంబున = అగ్నిముఖంలో; క్రాగిపోవు గతి = కరగిపోవు రీతిగా; జీవాత్మన్ ప్రవేశించి = జీవాత్మలోకి వచ్చి; చేకొని = పూనుకొని; వర్తించిన = ప్రవర్తించే; దుర్మలత్రయ = చెడ్డవైన మూడు మలముల; పరిక్షోభంబు = సంక్షోభం; నీ భక్తి చేతను = నీ

యందలి భక్తిచేతనే; పాపం బడుగాని = పోగొట్టబడ్తుంది కాని; వేఱొకటి చేతన్ పోదు = ఇంకొక దాని చేత పోదు.

— *సర్వేశ్వరా! బంగారంలో గడ్డకట్టి ఉన్న మాలిన్యం అగ్నివల్లనే ఎట్లా కరిగిపోతుందో, అట్లాగే జీవాత్మలోకి ప్రవేశించిన మలినత్రయం కేవలం శివభక్తి చేతనే పోతుంది తప్ప మరో దాని చేత పోదు.*

❇ *మలినత్రయాన్ని గురించి నీలకంఠభాష్య ఉపోద్ఘాతంలో వ్యాఖ్యాత ఇట్లా రాశారు. (ఆణవము, మాయికము, కార్మికము అన్నవి మలత్రయము). ఆణవము - సృష్టి ప్రారంభమున అణువుల కూడిక వలన ఏర్పడునది. మాయికము - ఈశ్వరుని ఎడబాయునట్టి మాయాశక్తి వలన సంభవించునది. కార్మికము - సంచిత ప్రారబ్ధ రూపములగు కర్మలం జెందునది. అంటే జన్మ కల్గితే మలత్రయ బాధ తప్పదు. ఈ మలత్రయ సంక్షోభాన్ని పోగొట్ట గలిగేది శివభక్తి ఒక్కటే నని ఈ పద్యంలో అన్నమయ్య కవి విశదీకరిస్తున్నారు. ఈ మలత్రయం స్థూల సూక్ష్మ కారణ శరీరాలలో ఎట్లా ఉన్నదో తెలిసికొంటే శివోపాసకునికి మేలు జరుగుతుంది.*

❇ *స్థూలశరీరంలో కార్మిక మలం ఉంటే, స్థూల శరీర భ్రాంతి అతనికి పోదు. దైవకార్యాలు జరుగుతుంటే వాటికి అతడు సుముఖుడు కాక అక్కడి నుంచి వెళ్లిపోతాడు. ఈ కార్మిక మలమే జీవుడు సంసార బద్ధుడయ్యేటట్లు చేస్తుంది.*

❇ సూక్ష్మ శరీరంలోని మాయిక మలం చేత దైవసంబంధ కార్యాల నుంచి లేచి పోకపోయినా, వాటి అర్థాన్ని - అవి సులభంగా ఉన్నప్పటికీ - గ్రహించలేడు.

❇ ఆణవమలం కారణ శరీరంలో ఉండడం చేత, దైవకార్యాలపై సుముఖతతో ఉంటూనే, అవి అర్థమవుతూనే, తమోగతుడవుతాడు. అందుచేత ఈ

మూడింటినీ క్షాళనం చేసికొంటేనే శివానందం. ఈ మూడింటినీ శివభక్తి ఒక్కటే పోగొట్ట గల్గుతుంది.

69. అమరంగా గురుమంత్ర కార్ముకమునం దాత్మాస్త్రమష్టాంగ యో
గ మహాముష్టి వివేకి యేయుటయుఁ దత్కాండం బజాండాది త
త్త్వము లెల్లన్వడి గ్రుచ్చి పాఱి భవదుద్యత్ సూక్ష్మకైవల్యల
క్ష్యమునందద్భుత శక్తితోడఁ గమియంగా నాటు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమరంగా = ఒప్పిదముగా; గురుమంత్ర, కార్ముకము నందు = గురు విచ్చిన మంత్రమనే, విల్లునందు; వివేకి = జ్ఞాని; అష్టాంగ యోగ = ఎనిమిది అంగాలున్న యోగం అనే; మహాముష్టి = గొప్ప పిడికిలితో; ఆత్మాస్త్రము = ఆత్మ అనే అస్త్రాన్ని; ఏయుటయు = వేయ్యగా; తత్ కాండంబు = ఆ బాణము; అజాండ ఆది = బ్రహ్మాండాది; తత్త్వములు ఎల్లన్ = తత్త్వాల నన్నింటినీ; వడి గ్రుచ్చి = వేగంగా గుచ్చి; పాఱి = (వాటిని) దాటి; భవత్ = నీ నుంచి; ఉద్యత్ = పైకి లేస్తున్న; సూక్ష్మ = మిక్కిలి చిన్నదైన; కైవల్య = కేవలత్వము లేక మోక్షం అనే; లక్ష్యము నందు = గురియందు; అద్భుత శక్తి తోడ = అసాధారణ శక్తితో; కమియంగా = కవియగా - పర్వగా; నాటు = దిగబడును.

– సర్వేశ్వరా! జ్ఞాని గురుమంత్రమనే విల్లునందు అష్టాంగయోగ మనే పిడికిలితో ఆత్మఅనే అస్త్రాన్ని సంధించి వేయగా, ఆ ఆత్మాస్త్రం బ్రహ్మాండాది (స్థూల) తత్త్వాలన్నిటినీ గ్రుచ్చి, వాటిని దాటి సూక్ష్మమైన మోక్షం అనే లక్ష్యాన్ని మహాద్భుత శక్తితో చేరుతుంది.

70. తనరం గాయవహిత్ర మందు హృదయ స్తంభాభి సంస్థాన మై
చను నీ ధ్యాన పటంబు నూల్కొలిపి భాస్వద్భక్తి వాతాహతిన్

వినుతజ్ఞాన పథంబు చేకొని సముద్వేగంబునన్ జీవుఁడీ
ఘన సంసార మహార్ణవంబుఁ గడవంగాఁబాఱు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

తనరన్ = ఒప్పిదముగా; కాయ = శరీరమనే; వహిత్రము, అందు = నావలో; హృదయస్తంభ = హృదయమనే స్తంభములో; అభిసంస్థానమై చను = చక్కగా నిల్చి ఉన్న; నీ = నీయందలి; ధ్యాన పటంబు = ధ్యాన చిత్రాన్ని; నూల్కొలిపి = కుదిరించి; భాస్వత్ = తేజోవంతమైన; భక్తి వాతాహతిన్ = భక్తి అనే గాలిచేత కొట్టబడినదై; వినుత = స్తుత్యమైన; జ్ఞానపథంబు = జ్ఞాన మార్గాన్ని; చేకొని = గ్రహించి; సముద్వేగంబునన్ = ఉత్సాహంతో; జీవుడు; ఈ; ఘన = గొప్పదైన; సంసార మహా అర్ణవంబు = సంసారమనే గొప్ప సముద్రాన్ని; కడవంగా = దాటడానికి; పాఱు = ప్రసరిస్తాడు.

— *సర్వేశ్వరా! శరీరమనే పడవలో, హృదయం అనే స్తంభంలో చక్కగా ఉన్న శివధ్యాన చిత్రాన్ని కుదిరించి; ప్రకాశవంతమైన భక్తి వాయువు చేత కదిలించబడగా, జ్ఞాన మార్గాన్ని స్వీకరించి ఉత్సాహంతో జీవుడు ఈ సంసార సముద్రాన్ని దాటడానికి పూనుకొంటాడు.*

❈ *భక్తి వల్లనైనా జ్ఞానం సిద్ధించనిది మోక్షం లేదు. కళ్యాణ్ శివపురాణాంకంలో ఇట్లా ఉన్నది.*

"జ్ఞానాగ్నిః సర్వ కర్మాణి। భస్మసాత్కురుతే కిల
తేనైవ భస్మనా గాత్ర। ముద్ధూళయతి ధూర్జటిః॥

జ్ఞానాగ్ని సర్వకర్మలను భస్మం చేస్తుంది. ఆ భస్మాన్నే శివుడు ఒళ్లంతా పూసి కొంటాడని దీని అర్థం. ఈ జ్ఞాన విషయమే అన్నమయ్య ఈ పద్యంలో ప్రస్తావించింది.

71. అకలంక స్థిరభక్తి మున్పొగయ నిన్నశ్రాంతముం జూచి పాయక
పూజించు మహామహుండు భవదభ్యర్చ్యుండగుం గాక దా
సక లేచ్ఛా విషయంబులం బొరయుచుం జాపల్యతం జేయునా
బక వేషార్చన లేల నిన్ను సొగయింపం జాలు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అకలంక = నిష్కళంకమైన; స్థిరభక్తి = నిశ్చలమైన భక్తి చేత; మున్పొగయ = ముందు పక్వమునకు తెచ్చి; నిన్ను; అ(శ్రాంతమున్ = ఎడతెఱపి లేకుండా; చూచి; పాయక = విడవకుండా; పూజించు = అర్చించే; మహామహుండు = ఘనుడు; భవత్ = నీ చేత; అభిఅర్చ్యుండు అగున్ కాక = సన్మానించబడును కాని; తా; సకల ఇచ్ఛా విషయంబులన్ = తాను ఇష్టం వచ్చిన సమస్త లౌకిక విషయాలను; పొరయుచున్ = పొందుచూ; చాపల్యతన్ = చంచల బుద్ధి చేత; చేయు = చేసే; ఆ; బక వేష అర్చనలు = కొంగ వేషంతో చేసే పూజలు; నిన్ను; ఏల = ఎందుకు; సొగయింపన్ చాలు = తృప్తిపరచ గల్గుతాయి?

— *సర్వేశ్వరా! నిష్కళంకమైన నిశ్చలభక్తి చేత పరిపక్వ స్థితికి తెచ్చి ఎడతెగకుండా నిన్ను చూసి నిరంతరం పూజించే ఘనుడు నీచేత గౌరవింప బడ్తాడు కాని, సకల లౌకిక విషయాలలో మునిగి చాపల్యంతో, కొంగ వేషంతో, పూజలు చేస్తే అవి నిన్ను సంతృప్తి పర్చ గల్గుతాయా?*

❋ కార్మిక మలం ఉన్నవాడు లౌకిక విషయేచ్ఛా పరుడవుతాడు.అట్లాంటి విషయేచ్ఛలున్న వాడు చేసే శివార్చన నిజాయితీ లేనిది - అంటే మనోవాక్కాయ కర్మల శుద్ధితో చేస్తున్నది కాదు. అందువల్లనే ఈ పద్యంలో దాన్ని కవి బక వేషమని ఖచ్చితంగా పోలుస్తున్నారు. అట్లాంటి పూజలు పేరుకే పూజలు కాని, అవి శివుణ్ని సంతోష పెట్టేవి కానే కావు.

72. సమదోత్సాహ సుఖాభిలాషలును నీ సంసారమాయా వినో
దములున్ స్వర్గ ఫలాపవర్గఫల చిత్త భ్రాంతులుం బ్రాజ్య రా
జ్య మహాకాంక్షలు నెన్ని చూడనివి నీ సద్భక్తి కత్యంతరా
యములై మాటికి మాటి కడ్డు పడుఁ గామ్య శ్రేణి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సమద ఉత్సాహ = మదంతో కూడిన ఉత్సాహం; సుఖ అభిలాషలునున్ = సుఖం మీద కోరికలూ; ఈ సంసార = ఈ సంసారమనే; మాయావినోదములున్ = అసత్యమైన వినోదాలూ; స్వర్గఫల = స్వర్గం లభించడం; అపవర్గఫల = మోక్షం లభించడం అన్న; చిత్తభ్రాంతులున్ = మనస్సు కల్గించే భ్రమలు; ప్రాజ్య = అధికమైన; రాజ్య = రాజ్యంమీద; మహాకాంక్షలున్ = అత్యాశలు; ఎన్నిచూడ = పరిగణించి చూస్తే; ఇవి = ఇవన్నీ; నీ సద్భక్తికి = నీ యందలి సద్భక్తికి; అతి అంతరాయములు ఐ = మిక్కిలి అడ్డంకులయి; మాటికి మాటికి = పదే పదే; అడ్డుపడు = అడ్డంపడే; కామ్యశ్రేణి = కోరికల వరుస.

– *సర్వేశ్వరా! మదంతో కూడిన ఉత్సాహం, సుఖాభిలాషలూ ఈ సంసారం యొక్క మాయావినోదాలు, స్వర్గ ఫలం, మోక్ష ఫలం అనే మనోభ్రాంతులు, మహారాజ్యం మీద అత్యాశలు, ఇవన్నీ నీ మీది సద్భక్తికి అడ్డంకులయి మాటి మాటికీ అడ్డం పడేటువంటి కామనలు.*

73. మోహధ్వాంతములో మునింగిన మహామూఢుండతి భ్రష్టుఁడై
సోఽహమ్మంచుఁ దొడంగి నీకుఁగడు దూరాత్ముండగుంగాని దు

ష్టాహంకార గుణంబు మాని మది సొంపారంగ సద్భక్తి దా

సోహమ్మన్న భవత్పదార్చకుఁడు నీవై యుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

మోహధ్వాంతములో = మోహమనే అంధకారంలో; మునిగిన; మహామూఢుండు = మిక్కిలి అజ్ఞాని; అతిభ్రష్టుడు ఐ = మిక్కిలి జారిపోయిన వాడయి; సోఽహం = అతడే నేను; అంచు = అని పలుకుతూ; తొడంగి = పూనుకొని; నీకు; కడు = మిక్కిలి; దూరాత్ముండు = దూరమైనవాడు; అగున్ = అవుతాడు; కాని; దుష్ట అహంకార గుణంబు = చెడ్డదయిన అహంకారమనే గుణాన్ని; మాని = విడిచి; మది = మనస్సులో; సొంపారంగ = సొంపు కలిగేటట్లుగా; సద్భక్తి = మంచి భక్తి చేత; దాసోహం అన్న = నేను దాసుణ్ని అని అన్నట్టి; భవత్ = నీ యొక్క; పదార్చకుడు = పాదాలను పూజచేసేవాడు; నీ వు ఐ ఉండు = నీవే అయి ఉంటాడు.

— *సర్వేశ్వరా! మోహాంధకారంలో మునిగిన పరమ అజ్ఞాని భ్రష్టుడయి సోఽహం అనడం మొదలెట్టి నీకు చెడిన వాడవుతాడు. కాని దుష్టాహంకారమనే గుణాన్ని వదలి మనస్సులో ఉత్సాహంతో సద్భక్తితో దాసోఽహం అన్న నీ పాదార్చకుడేమో నీవే అయిఉంటాడు.*

❉ యథావాక్కుల అన్నమయ్యగారి ఈ సర్వేశ్వర శతకంలో ఈ పద్యం కీలకమైన పద్యం. అన్నమయ్యగారు ప్రపంచించిన మతతత్త్వం ఈ పద్యం ద్వారా స్పష్టమవుతున్నది. జీవేశ్వరులకు అద్వైతమన్నది అన్నమయ్య అంగీకరించని విషయం. వారు కైవల్యాన్ని కూడా అంగీకరించరు. వారంగీకరించేది శివభక్తినీ సారూప్యాన్నీ మాత్రమే.

❉ సోఽహం, దాసోఽహంలతో అన్నమయ్యగారి మతతత్త్వ రహస్యం విశదీకరింప బడ్తున్న పద్యం ఇది. జ్ఞాన మార్గంలో వాళ్లు సోఽహం భావనతో ఉంటారు. సః అహం అంటే అతడే నేనని అర్థం. ఆ శివుడే నేనని భావం.

దీన్ని అజపాగాయత్రి అని అంటారు. శుద్ధాద్వైత మతంలో దీని కెంతో ప్రాధాన్యం ఉంది. భక్త మతాలయిన శ్రీ విశిష్టా ద్వైతం కాని, విశిష్ట శివాద్వైతం కాని 'సోఽహం'ను అంగీకరించలేదు. ఐతే శివాద్వైతంలో ఈ 'సోఽహం' అన్నది అసలు లేకపోలేదు. శ్రీ నీలకంఠభాష్యములో సూ. "ఆత్మేతి తూపగచ్ఛంతి గ్రాహయంతిచ" (4-1-3) అన్న దాన్ని వ్యాఖ్యానిస్తూ పరమేశ్వరుని స్వాత్మగా భావించాలా? లేక తనకంటే వేరే అయిన వానిగా ఉపాసించాలా? అన్నసందేహాన్ని తీరుస్తూ కింది విధంగా సమాధాన మిచ్చారు. "విశ్వాధికోరుద్రో మహర్షిః"... అంటే సర్వజ్ఞుడైన శివుడు విశ్వం (చరాచరం) కన్నా మించిన వాడు. "అధికంతు భేద నిర్దేశాత్" అంటే శివుడికీ జీవుడికీ భేదం నిర్దేశించారు. కాబట్టి జీవుడి కన్నా శివుడు ఎక్కువ -మొ॥న శ్రుతి సూత్రాలాధారంగా జీవుడి కన్నా శివాధిక్యం ఉన్నట్లు తేలుతున్నప్పటికీ 'అహం బ్రహ్మాస్మి' నేనే బ్రహ్మాన్ని లేక శివుణ్ని అన్న భావంతో ఉపాసన చేయాలన్నారు. పరమాత్మ - ఉపాసకునికంటే వేరే అయినప్పటికీ, 'శివోఽహం' అన్న భావనతో తన్నుపాసించే వారిని స్వరూపం ఇవ్వడం ద్వారా అనుగ్రహిస్తాడు. జీవాత్మకు పశుత్వం పోనిది శివరూపం, శివత్వం ప్రాప్తించదు. కాబట్టి నిరంతరం శివోఽహం అన్న భావనలో ఉంటే పశుత్వం పోయి శివత్వం వస్తుంది. కీటకం తన కీటకత్వాన్ని తొలగించుకొని భ్రమరత్వాన్ని పొందడానికి నిరంతర భ్రమరాహం భావన ఎట్లా ఉపయోగపడ్తుందో, పశువైన జీవుడు నిరంతర శివోహం భావన చేత పశుత్వాన్ని విడిచి శివత్వాన్ని పొందుతాడని "దేవోభూత్వా దేవమప్యేతి" అని శ్రుతి వాక్యం ఉద్ఘోషిస్తున్నదని చెప్పారు.

ఇక్కడ శుద్ధాద్వైతుల జీవేశ్వరైక్యాన్ని ఈ భాష్యం అంగీకరించ కుండా ఆ ఐక్యం సరికాదని అన్నది. జీవేశ్వరులకు విరుద్ధ ధర్మ సంయోగం వల్ల వారి ఆ ఐక్యం పొసగదన్నది. పోతే పరమాత్మయే జీవుడంటే పరమేశ్వరుని

అస్తిత్వం తగ్గిపోతుంది. జీవుడే ఈశ్వరుడంటే శాస్త్రం చేసే ఉపదేశానికి యోగ్యుడు లేకుండా పోతాడు. అందుచేత జీవేశ్వరాభేదాన్ని నిరాకరిస్తూ శివోఽహం లేక సోఽహం భావనను జాగ్రత్తగా ఉపాసించాల్సి ఉన్నది. ఈ చీకాకులతో శివునికి చెడిపోవడం కన్నా సోఽహం బదులు ప్రమాదరహితమైన 'దాసోఽహం' అన్నది మార్గంగా అన్నమయ్య కవి పై పద్యంలో చూపారు.

74. **చావంబుట్టుచుఁ బుట్టఁ జచ్చుచు మహాచండాల సంసార పా**
రావారంబునఁ గూలి తాఁ జెడుటకుం బ్రవ్యక్తిగా నాత్మలో
నేవం బొందక యేను నీవనుట తానే జ్ఞానమో శ్రీ మహా
దేవా! యిట్టి కుతర్కముం గలదె చింతింపంగ సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

చావన్ = చావడం కోసం; పుట్టుచు = పుడ్తూ; పుట్ట = పుట్టడానికి; చచ్చుచు = చస్తూ; మహాచండాల = ఎంతో నీచమయిన; సంసార పారావారంబున = సంసారమనే సముద్రంలో; కూలి = పడిపోయి; తా = తాను; చెడుటకున్ = చెడిపోవడానికి; ప్రవ్యక్తి గాన్ = శ్రేష్ఠమైన వ్యక్తిగా; ఆత్మలోన్ = తనలో; ఏవంబు, ఒందక = అసహ్యాపడక; ఏను = నేను; ఈవు = నీవు; అనుట = అనడం; తాను ఏ జ్ఞానమో = అది ఏమి తెలివో; శ్రీ మహాదేవా = శివా; చింతింపంగ = ఆలోచిస్తే; ఇట్టి = ఇలాంటి; కుతర్కమున్ = చెడ్డ తర్కం; కలదె = ఉంటుందా?

— **సర్వేశ్వరా! చావడం కోసం పుడ్తూ, పుట్టడం కోసం చస్తూ, నీచమైన ఈ సంసారార్ణవంలో కూలి తాను చెడిపోయినందుకు మంచి మనిషిగా తాను అంతరంగంలో అసహ్యాపడడానికి బదులుగా నీవే నేను (త్వమేవాఽహం) అంటే సోఽహం అని అనడం ఏమి జ్ఞానం? శ్రీ మహాదేవా! ఆలోచిస్తే (ఎక్కడైనా) ఇలాంటి కుతర్కం ఉంటుందా?**

❄ అన్నమయ్య ప్రపంచించే తత్త్వానికిది కూడా ఒక కీలక పద్యం. పై పద్యాన్ని వ్యాఖ్యానిస్తూ సోఽహం విషయం కొంత వివరించడం జరిగింది. శివసాయుజ్య దృష్టి ఏ మాత్రమూ లేకుండా, జనన మరణ చక్రాన్ని నిరోధించే కాంక్ష బొత్తిగా లేకుండా కేవలం కూట సంసారిగా బ్రదికే వానికి శివోఽహం అన్న ఉపాసనా మార్గం బొత్తిగా పనికి రాదని కవి తీవ్రంగా చెప్పుతున్నారీ పద్యంలో. మహా చండాల సంసారంలో మునిగి పోయిన వ్యక్తి ఈ మార్గాన్ని అనుసరిస్తే అహంకారంతో ఇంకా చెడిపోయి భ్రష్టుడు కావడం ఖచ్చితం. అందువల్ల దాసోహమన్న భక్తి మార్గమే తప్ప సోఽహమన్న జ్ఞాన మార్గం, లేక విచార మార్గం కుదరదని తీవ్రంగా తెలుపుతున్న పద్యం ఇది. ఇలాంటి భావనను కుతర్కం అని కూడా హెచ్చరిస్తున్నారు కవి.

❄ మహాదేవ శబ్దానికి విశిష్టార్థం ఉన్నది.

"శక్తిః సాక్షాన్మహాదేవీ మహాదేవస్తు శక్తిమాన్
తయోర్విభూతి లేశోవై సర్వమేతచ్చరాచరమ్।"

శక్తి అంటే సాక్షాత్తూ మహాదేవి. శక్తితో (ఎప్పుడూ) కూడి ఉండేవాడు మహాదేవుడు. ఈ చరాచర మంతా వారిద్దరి విభూతి లేశమే - ఇట్లా పురాణం మహాదేవ శబ్దార్థాన్ని చెప్పింది మరొక చోట.

— "పూజ్యతే యత్సురైర్నిత్యమ్ - మహాంశ్చైవ ప్రమాణతః
ధాతుర్మహేతి పూజాయాం - మహాదేవ స్తతః స్మృతః॥"

నిత్యమూ దేవతల చేత పూజింపబడ్తూ, మహాఅనే ధాతువు పూజార్థకం కావడం వల్ల మహాదేవుడని పిలువబడ్తున్నాడు.

— అథర్వశీర్షోపనిషత్తులో ఇట్లా ఉన్నది.

"అథ కస్మాదుచ్యతే మహాదేవః? యః సర్వాన్ భావాన్ పరిత్యజ్యాత్మజ్ఞాన యోగైశ్వర్యే మహతి మహీయతే, తస్మాదుచ్యతే మహాదేవః"

మహాదేవుడని ఎందువల్ల పిలువ బడ్తున్నాడు? సర్వభావాలను పరిత్యజించి, ఆత్మజ్ఞాన మనే యోగ సంపత్తిలో గొప్పగా ప్రకాశిస్తాడు కాబట్టి మహాదేవుడు అని అంటున్నారు.

ఆత్మజ్ఞాన యోగైశ్వర్యంలో ప్రకాశిస్తున్న వాడు కావడం వల్లనే జ్ఞానం కాని దానిలో మునిగిన వాడిది ఏ రకమైన జ్ఞానం అని ప్రశ్నిస్తూ 'మహాదేవ' అన్న సంబోధన వేయడం ఎంతో ఉచితంగా ఉన్నది.

75. రసికుండై భవదంఘ్రి పద్మయుగ మారాధించుచో దుర్మద
వ్యసనాటోపము చిక్కులం బొరయుచు న్వర్తించు చున్నట్టి పా
లసు పూజా విభవంబ దొప్పునె మహిన్ లక్షింప నారంభముం
గసవుం బెంచిన చేని యట్లఁ దలఁపంగా మీఁద సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

రసికుడై = ఆనందపడ్తున్న వాడై; భవత్ అంఘ్రి పద్మయుగము = నీ యొక్క పాద పద్మాల జంటను; ఆరాధించుచో = అర్చించేటట్లయితే; దుర్మద వ్యసన = దురహంకార దోషం అనే; ఆటోపము = ఆడంబరం; చిక్కులన్ = ఇబ్బందులను; పొరయుచున్ = పొందుతూ; వర్తించుచున్నట్టి = ప్రవర్తిస్తున్నట్టి; పాలసు = దుర్జనుని (మూర్ఖుని); పూజావిభవంబు = పూజా వైభవం; మహిన్ = భూమి మీద; అది; ఒప్పునె = ఒప్పుతుందా; లక్షింప = జాగ్రత్తగా చూస్తే; తలపంగా మీఁద = ముందుగా వివేచిస్తే; ఆరంభమున్ = మొదటనే; కసవున్ = గడ్డిని; పెంచిన = పెంచినట్టి; చేని అట్ల = పొలంలాంటిది.

— సర్వేశ్వరా! ఆనందంతో నీపాద యుగళాన్ని ఆరాధించే వాడయినట్లయితే దుర్మదంతో, క్లిష్టతలతో ఉన్నట్టి మూర్ఖుని పూజావైభవం సరైనది కాదు. పొలంలో మొదటనే ఎవరైనా గడ్డిని పెంచడం ఎట్లాంటిదో ఇదీ అట్లాంటిదే.

❋ పొలంలో ఎవరైనా పంట మొదట వేస్తారు కాని, గడ్డిని వేసి పెంచరు. అట్లా చేస్తే అది మూర్ఖత, అప్రయోజకం, క్షేత్రాన్ని తప్పుడు లక్ష్యానికి వాడడం అవుతుంది. మూర్ఖుని పూజావిభవం దుర్మదం అన్నట్టి గడ్డినే పెంచుతున్నది కాని శివభక్తి అన్న సుసస్యాన్ని పెంచడం లేదు. ఇది మంచిది కాదని ఈ పద్యంలో అన్నమయ్య చెప్తున్నారు.

76. ***అమితోత్సాహము నంది నీకుఁ దన సర్వార్థంబులుం గూర్చి నే***
మముతో నిచ్చుటకంటెఁ శౌర్య గుణ సామర్థ్యంబునం జేసి ప్రా
ణము నీ కిచ్చుట కంటె దుస్తర భవోన్మాదంబు మర్దించి చి
త్తము నీ కిచ్చుట పెక్కు భంగుల మహౌదార్యంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమిత = మితము లేని; ఉత్సాహమున్ అంది = ఉత్సాహం పొంది; నీకు; తన; సర్వ అర్థంబులున్ = సమస్త ధనాన్ని; కూర్చి = జత చేసి; నేమము తోన్ = వ్రతంతో; ఇచ్చుట కంటె = ఇవ్వడం కన్నా; శౌర్య గుణ = శూర గుణ; సామర్థ్యంబునన్ చేసి = శక్తి చేత; ప్రాణము = జీవమును; నీకు; ఇచ్చుట కంటె = ఇవ్వడం కన్నా; దుస్తర = తరింప శక్యం కాని; భవ ఉన్మాదంబు = సంసారం మీది పిచ్చిని; మర్దించి = అణచి; చిత్తము = మనస్సుని; నీకు; ఇచ్చుట; పెక్కు = అనేక; భంగుల = రీతుల; మహా, ఔదార్యంబు = గొప్ప ఉదార లక్షణము.

— *సర్వేశ్వరా! మిక్కిలి ఉత్సాహంతో నీకు తన ధనాన్నంతా వ్రతంగా ఇవ్వడంకంటే, శౌర్యగుణం ఉండడంవల్ల నీకు తన ప్రాణాన్నే ఇచ్చిందానికంటే, దుస్తరమైన సంసారం మీది ఉన్మాదాన్ని మర్దించి చిత్తాన్ని నీకీయడం అనేక రకాలుగా మహౌదార్యం అవుతుంది.*

❊ ధనమూ, ప్రాణమూ శివునికి ఈయడం ఔదార్యం కావచ్చును. కాని భవోన్మాదాన్ని నాశనం చేసి చిత్తాన్ని ఈశ్వరునికి ఇవ్వడం మహౌదార్యం. ధన ప్రాణాలను ఇచ్చినంత మాత్రంలో జన్మ పునరావృత్తి లేకుండా పోదు. కాని భవదృష్టిని తొలగించుకొన్న చిత్తాన్ని అర్పిస్తే మాత్రం పునర్జన్మే ఉండదు. ఈ రెండవది దానం చేయడం ఎక్కువ ఔదార్యం ఉంటేనే సాధ్యం. దీనివల్ల భక్తునికి ఎక్కువ లాభం కూడాను.

❊ ఈ పద్యం చదువుతున్నప్పుడు ఆదిశంకర భగవత్పాదుల శివానందలహరిలోని ఈ కింది శ్లోకం తప్పక జ్ఞాపకం వస్తుంది.

"సదామోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ
నటత్యాశా శాఖా స్వటతి ఝుడితి స్వైర మభితః
కపాలిన్! భిక్షో! మే హృదయ కపిమత్యంత చపలం
దృఢం భక్త్యా బధ్వా శివ భవదధీనం కురు విభో!

— నిరంతరం మోహారణ్యంలో తిరుగుతుంది. యువతుల కుచగిరులపై నటిస్తుంది. ఆశా శాఖలపై సంచరిస్తుంది. నాల్గు వైపులా స్వైర విహారం చేస్తుంది. అత్యంత చపలమైన నా హృదయ కపిని కట్టేసి, ఓ కపాలీ! ఓ భిక్షుకుడా! నీ మీది భక్తితో నా హృదయకపిని బంధించి నీ ఆధీనం చెయ్యి.

ఇక్కడ భిక్షువైన శివుడికి అర్థాలనీ, శౌర్యగుణాలనూ, ప్రాణాలనూ, ఇచ్చిందాని కంటే కూడా భవోన్మాదం లేని చిత్తాన్ని ఇవ్వడం అంటే దాన్ని భిక్షగా వేయడం ఎంతో ఎక్కువ ఔదార్యం అంటున్నారు అన్నమయ్య కవి. ఈ శ్లోక, పద్యాల నడుమన సాదృశ్యం ఎంతో హృద్యంగా ఉన్నది.

77. ఘన వైరిప్రకరంబుఁ దాఁకి యనిలో ఖండించు కంటెన్ మృగేం
ద్రునిఁజేపట్టుట కంటె దిగ్గజముతోఁద్రోపాడు కంటెన్ మహా

శని దా వ్రేయుటకంటె ఘోరభవ దుశ్చారిత్ర వారించి రం
జనతోఁ జిత్తము శిక్ష సేయుట మహాశౌర్యంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఘన = గొప్పనైన; వైరి ప్రకరంబు = శత్రు సమూహాన్ని; తాఁకి = ఎదిరించి; అనిలో = యుద్ధంలో; ఖండించు కంటెన్ = నరికిన దానికన్నా; మృగేంద్రుని = సింహాన్ని; చేపట్టుట కంటె = చేతితో పట్టడం కన్నా; దిగ్గజముతో = దిక్కులలోని ఏనుగుతో; త్రోపాడు కంటెన్ = తోయడం కన్నా; మహా అశని = పెద్ద వజ్రాయుధాన్ని; తా = తాను; వ్రేయుట కంటె = కొట్టడం కన్నా; ఘోర = భయంకరమైన; భవ = సంసారం అనే; దుశ్చారిత్ర = దుష్టవర్తనని; వారించి = నిరోధించి; రంజనతో = ప్రేమతో: చిత్తము = మనస్సును; శిక్ష చేయుట = అభ్యసింప జేయడం; మహా శౌర్యంబు = ఎంతో శౌర్యము.

— *సర్వేశ్వరా! యుద్ధంలో ఘన శత్రు వర్గాన్ని దండెత్తి నరికిందాని కంటే, సింహాన్ని చేతితో పట్టిందానికంటే, దిగ్గజాన్ని తోసిందాని కన్నా; మహా వజ్రాయుధాన్ని విరిచిందాని కంటే, ఘోరమైన సంసారమనే దుష్ట చరిత్రను అడ్డుకొని, ప్రేమతో చిత్తాన్ని అదుపులో పెట్టడం ఎక్కువ శౌర్యము.*

❋ *సకల యోగాలూ చిత్తవృత్తి నిరోధం ఎట్లా? అన్నదాన్నే చెప్పుతాయి. ఐతే అది అంత తేలికకాదన్న విషయం అందరికీ తెలుసు. అదెంత క్లిష్టమో సాదృశ్యాత్మకంగా ఈ పద్యంలో అన్నమయ్య కవి చెప్తున్నారు.*

78. ***అమితామోద నవ ప్రసూనముల నిన్నర్చించుచో గద్య ప***
ద్యము లూహించి నుతించుచో వివిధ గీత వ్రాతము ల్పాడుచో
నమృతాహారము లిచ్చుచో నిపుణుఁడై యాటాడుచో నందుఁ జి
త్తము సద్భక్తియె నీవు చేకొను పదార్థం బెల్ల సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమిత = అపరిమితమైన; ఆమోద = సుదూరం వ్యాపించే సువాసన ఉన్న; నవ = కొత్త; ప్రసూనములన్ = పువ్వులతో; నిన్ను; అర్చించుచో = పూజించినట్లయితే; గద్య పద్యములు = గద్యాలను పద్యాలను; ఊహించి = కల్పించి; నుతించుచో = స్తుతించినట్లయితే; వివిధ = అనేక; గీత వ్రాతముల్ = గీత సమూహాలను; పాడుచో = గానం చేసినట్లయితే; అమృతాహారములు = అమృత సమానమైన, నివేదనలను; ఇచ్చుచో = అర్పించినట్లయితే; నిపుణుడై = చాకచక్యంతో; ఆట ఆడుచో = క్రీడించినట్లయితే; అందు = (వీటి) అన్నింటిలోనూ; నీవు; చేకొను = స్వీకరించే; పదార్థంబు ఎల్ల = పదార్థమంతా; చిత్తము = చిత్తమూ; సద్భక్తియె = మంచి భక్తి మాత్రమే.

– *సర్వేశ్వరా! అపరిమితమైన సువాసన గల్గిన నవప్రసూనాలతో నిన్ను పూజించినా, గద్య పద్యాలు కల్పించి నిన్ను స్తుతించినా, అనేక గీతాలను గానం చేసినా, అమృతాహారాలను నివేదించినా నిపుణుడై క్రీడించినా వీటిలో నీవు తీసికొనే పదార్థం మాత్రం చిత్తమూ, సద్భక్తి మాత్రమే.*

❋ *పుష్పంతో పూజా, రచనతో స్తుతి, గీతంతో గానం, రుచ్యాన్నాలతో నివేదనా, చాక చక్యంతో నాట్యమూ - ఇవన్నీ కూడా శివపూజలోని భాగాలే. అర్ఘ్యం సమర్పయామి, ధూపం సమర్పయామి, ఇత్యాదిగా శివపూజలో అనేక (16) ఉపచారాలుంటాయి. అయితే శివపూజ పరమార్థం ఇవి కానే కాదు. వీటి వెనుకన శివభక్తునికి ఉండే మనస్సెలాంటిది? అతనికి నిజంగా భక్తి ఉన్నదా? అతని మనస్సు శివుని మీద లేక, అతనికి శివుని మీద భక్తే లేక షోడశోపచార పూజ చేస్తే వాటిల్లో శివుడేమి తీసికొంటాడు? ఏమీ తీసికోడు. ఆయన తీసికొనేది -శివభక్తుడు పూజ చేస్తూ ఉపచారాలను సమర్పిస్తుంటే*

ఆ ఉపచారాలను చేయించే భక్తుని సుమనస్కతనూ, సద్భక్తినీ మాత్రమే అని అన్నమయ్య గారి మాటల తాత్పర్యం.

79. ***కడుఁ జిత్రంబుగఁ జేయఁగా నొఱ సురంగం బయ్యెనే ఖడ్గమం***
దిడకున్నం జెడు రూపదేమి కొఱ దానిం బెక్కు పాటింపఁగా
నొడ లెబ్భంగుల నోపునే నియతితో నూహించి నిన్నాత్మలో
నిడకున్నం జనురూపు నేమి కొఱ తా నీక్షింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కడు = మిక్కిలి; చిత్రంబుగ = విచిత్రంగా, చేయగాన్ = చేస్తే; ఒఱ = (కత్తి) ఒఱ; సురంగంబు = సొరంగం; అయ్యెను = అయింది; ఏ ఖడ్గము = ఏ కత్తినో; అందు ఇడక ఉన్న = అందులో ఉంచక పోయినట్లయితే; చెడు రూపు = దాని రూపం చెడిపోతుంది; దానిన్ = అందువల్ల; ఏమి కొఱ = ఏమి ప్రయోజనం?; పెక్కు పాటింపగాన్ = ఎంతో అన్వయించగా; ఒడలు = శరీరం; ఏభంగులన్ = ఏ తీరుగానైనా; ఓపునే = ఒప్పునా?; నియతితో = పద్ధతిగా; ఊహించి = భావించి; నిన్ను = ఈశ్వరుడవైన నిన్ను; ఆత్మలోన్ = తన లోపల; ఇడకున్నన్ = ఉంచక పోయినట్లయితే; ఈక్షింప = చూడగా; కొఱ = ప్రయోజనం; ఏమి = ఏముంది?

— *సర్వేశ్వరా! ఎంతో విచిత్రంగా చేస్తే ఒఱ కాస్తా సురంగం అయింది. దాన్లో ఏదైనా ఒక ఖడ్గాన్ని ఉంచకపోతే ఆ ఒఱ రూపుకాస్తా చెడుతుంది. అది అప్పుడు అప్రయోజకం. దీని అన్వయంతో శరీరం లోపల తన భావనతో ఈశ్వరుణ్ని ఉంచక పోయినట్లయితే రూపం నశిస్తుంది. అందువల్ల ఏమిటీ ప్రయోజనం.*

❋ *కత్తికి ఒఱ ఒక సొరంగం. ఐతే కత్తిని అందులో పెట్టకనే పోతే అది సమగ్రం కాక దాని అస్తిత్వం దండుగ అవుతుంది. అట్లాగే శరీరమన్న ఒరలో*

ఈశ్వరుడన్న ఖడ్గాన్ని ఉంచాలి. అట్లా చేయకపోతే ఆ శరీరం వల్ల ఏమీ ప్రయోజనం లేదు.

80. జ్వరసంతాప విశోషితాంగుఁడు సుధాసంకాశ దివ్యాన్న పా
న రస శ్రేణి భుజించ రోయు గతి నున్మాదేంద్రియ ధ్వాంత దు
స్తర సంసార మద ప్రమత్తుఁడు మహా సౌఖ్యాస్పదం బైన మీ
చరణారాధన యందు బుద్ధిఁ జొనుపం జాలండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జ్వర సంతాప = రోగం వల్ల కల్గిన దుఃఖం చేత; విశోషితాంగుడు = నీరసించిన శరీరం కలవాడు; సుధా సంకాశ = అమృత సమానం అయిన; దివ్య అన్న పానరసశ్రేణి = దివ్యమైన ఆహార పానీయ ద్రవాల పంక్తులను; భుజించ = ఆరగించుటకు; రోయుగతిన్ = అసహ్యించు కొను రీతిగా; ఉన్మాద = పిచ్చి పట్టిన; ఇంద్రియ = ఇంద్రియాల; ధ్వాంత = అంధకారం చేత; దుస్తర = దాటడానికి వీలు లేని; సంసార = సంసారం యొక్క; మద = మత్తులో; ప్రమత్తుడు = మదించిన వాడు; మహా = గొప్పదైన; సౌఖ్య = సుఖానికి; ఆస్పదంబు = నిలయము; ఐన; మీ; చరణ ఆరాధన అందు = పాద పూజలో; బుద్ధి = చిత్తాన్ని; చొనుపన్ చాలడు = దూర్చలేడు.

— సర్వేశ్వరా! జ్వరం అనే దుఃఖంలో ఉన్నవాడు అమృత సమానమైన అన్నపాన రసాల నెన్నింటినయినా ఎట్లా అసహ్యించు కుంటాడో, అట్లాగే పిచ్చి పట్టిన ఇంద్రియాల అంధకారం చేత, దుస్తరమైన సంసార మదం వల్ల జ్ఞానాన్ని కోల్పోయిన వాడు మహా సౌఖ్యానికి ఇరవయిన మీ పాదార్చనలో బుద్ధిని దూర్చలేడు.

81. *కలయం గాష్ఠ యుగంబుఁ గూర్చి తరువంగాఁ బుట్టి తత్సాధనం*
బుల రెంటిన్ దహియించు వహ్ని గతిఁదాఁ బొల్పందఁగాయంబు సం
ధిల సత్కర్మముతో మథింపగ భవచ్చిచ్ఛక్తి సద్వహ్ని యు
జ్జ్వలమై కాయముఁ గర్మముం జెఱుచుఁ దత్త్వం బెన్న సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కలయన్ = కలిసేటట్లుగా; కాష్ఠయుగంబు = రెండు కట్టెలను; కూర్చి = చేర్చి; తరువంగా = రాయగా, పుట్టి; తత్ సాధనంబుల రెంటిన్ = ఆ రెండు సాధనాలను; దహియించు = దగ్ధం చేసే; వహ్ని గతి = అగ్నిలాగా; తా = తాను; పొల్పొంద = ఒప్పుగా; కాయము = శరీరం; సత్కర్మముతో = సత్ కార్యంతో; సంధిల = కూడి; మథింపగ = రాపిడి కల్గిస్తే; భవత్ = నీ యొక్క; చిత్ శక్తి = చైతన్య శక్తి అనే; సత్ వహ్నియు = మంచి అగ్ని కూడా; ఉజ్జ్వలమై = జ్వలిస్తున్నదయి; కాయము = శరీరాన్నీ; కర్మమున్ = కర్మనీ; తత్త్వంబు ఎన్న = లోనారసి చూస్తే; చెఱుచు = చెడగొడ్తుంది (అంటే పోగొడ్తుంది).

— *సర్వేశ్వరా! రెండు కట్టెలను ఒక్క చోట కూర్చి వాటిని రాస్తే పుట్టిన అగ్ని ఎట్లా తాను పుట్టడానికి సాధనాలైన ఆ రెండింటినీ కాల్చి పారేస్తుందో, అట్లాగే కాయాన్ని సత్కర్మతో మథిస్తే నీ చిచ్ఛక్తి అనే అగ్ని జ్వలిస్తూ కాయాన్నీ కర్మనీ రెండింటినీ పోగొడ్తుంది.*

❄ *ఈ పోలిక చాలా గొప్పది. రెండు కట్టెల రాపిడితో పుట్టిన అగ్ని తాను పుట్టడానికి హేతువయిన ఆ కాష్ఠ ద్వయాన్ని ఎలా తగుల బెడ్తుందో, అట్లాగే కాయం, సత్కర్మా అనే రెండూ కలిసి ఈశ్వర చిచ్ఛక్తి యొక్క జ్వాలలో నశిస్తాయి. జన్మ చక్రం ఆపడానికి మార్గం ఇందులో అన్నమయ్య చెప్తున్నారు.*

❊ జన్మకి కారణం కర్మయే. ముల్లుని ముల్లుతోనే తీసేసినట్లుగా కర్మని కర్మతోనే తీసేయాలి. కాని కర్మ చేయడానికి కాయం అవసరం. కాబట్టి కాయం, కర్మా రెండూ-ఆ రెండూ లేకుండా పోవడానికి కావాల్సిందే. ఐతే ఈ కర్మ సత్కర్మ కావాలి. కాయ కర్మలు రెండూ సంధిల్లితే ఈశ్వర చిచ్ఛక్తి జ్వాల ఆరెంటినీ పోగొడ్తుంది. కర్మ వల్ల వచ్చిన కాయం శాశ్వతంగా పోతుంది. కాయం శాశ్వతంగా పోవడంతో కర్మ కూడా నశిస్తుంది. ఈ సూక్ష్మ వివేచననంతా అన్నమయ్య కవి ఈ పద్యంలో రమణీయమైన పోలికతో చెప్పారు.

❊ జన్మ కర్మ ధర్మ బ్రహ్మలన్న నాల్గింటిపై సాధకుడు ఆధారపడ్తాడంటారు. జన్మ కర్మమయం కావాలి. కర్మ ధర్మమయం కావాలి. ధర్మం శివమయం కావాలి. ధర్మమయం కావడానికే 'సత్కర్మముతో' అని కవి ప్రయోగించాడు. శివమయం కావడాన్ని సూచించడానికే ఈశ్వర 'చిచ్ఛక్తి' అని ప్రయోగించాడు.

82. స్థిర బుద్ధిం దనసొమ్ము భక్తవర సుక్షేత్రంబునన్ బీజమై
పరగంగా వెదపెట్టి మీఁద నతి సంపన్నుండగుం గాక దా
నరి షడ్వర్గము పాలు సేసి భవమాయా గ్రస్తుఁడై యిచ్చు నె
వ్వరి వేడం జను వాఁడొకో విషయ దుర్వ్యాపారి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

విషయ దుర్వ్యాపారి = లౌకిక విషయ (ఇంద్రియ విషయ)ములతో చెడ్డ వ్యాపారం చేసే వ్యక్తి; స్థిర బుద్ధిన్ = నిశ్చయ బుద్ధితో; తన సొమ్ము = తన ధనాన్ని; భక్తవర = భక్త శ్రేష్ఠులనే; సుక్షేత్రంబునన్ = మంచి భూమి యందు;

పరగంగా = ఒప్పిదంగా; బీజము ఐ = విత్తనంగా; వెదపెట్టి = విత్తి; మీఁద = ఆ తర్వాత; అతి = మిక్కిలి; సంపన్నుండగున్ కాక = ధనికుడవ వచ్చును కాని; భవమాయాగ్రస్తుడై = సంసార మాయలో చిక్కిన వాడయి; తాన్ = తాను; అరిషట్ వర్గము పాలుచేసి = ఆరు శత్రువుల బృందం పాలు చేసి; ఇచ్చున్ = (ఆ ధనాన్ని) ఇస్తాడు; (అప్పుడు); ఎవ్వరి = ఎవరిని; వేడన్ చనువాడు ఒకో = వేడు కోవడానికి వెళ్తాడో (కదా).

— *సర్వేశ్వరా! విషయ దుర్వ్యాపారి భక్తవరులనే సుక్షేత్రంలో తన ధనాన్ని బీజంగా విత్తి మిక్కిలి ధనవంతుడవవచ్చును గాక. కాని దాన్ని అతడు కామక్రోధ లోభ మోహ మదమాత్సర్యాలనే అరిషడ్వర్గానికి సంసార మాయాగ్రస్తుడై ఇచ్చి వేస్తున్నాడు. మరి అప్పుడు ఆడబ్బుని తిరిగి పొందడం కోసం ఎవరిని వేడుకో గల్గుతాడు?*

83. ***కాయం బన్నది వారిబుద్బుద సదృక్షం, బందు రూపింప లేఁ బ్రాయంబన్నది శారదాంబుద తటిత్ప్రాయంబు, సంపత్సుఖ శ్రేయంబన్నది మాయ - యిట్లెరిగియున్ శీఘ్రంబె నీధ్యాన సం స్థాయీ భావనఁ బొందఁ డేమిటికయో సంసారి సర్వేశ్వరా!***

సర్వేశ్వరా !

కాయంబు అన్నది = శరీరమనేది; వారి బుద్బుద = నీటి బుడగను; సదృక్షంబు = పోలింది; రూపింప = నిరూపిస్తే; అందు = అందులో; లేప్రాయంబు అన్నది = లేత వయస్సు అనేది; శారదాంబుద = శరత్కాల మేఘంలోని; తటిత్ ప్రాయంబు = మెఱుపుతో సమానం; సంపత్ సుఖ శ్రేయంబు అన్నది = ఐశ్వర్యం వల్ల కలిగే సుఖాల వరుస అన్నది; మాయ = భ్రాంతి; ఇట్లు ఎరిగియున్ =

ఇట్లా తెలిసికూడా; శీఘ్రుంబె = వేగంగా; నీ ధ్యాన = నీ యందు ధ్యానమనే; సంస్థాయీ భావన = నిశ్చలమైన ఆలోచన; సంసారి = సంసారంలోని వాడు; పొందడేమిటికి అయో = ఎందుకు పొందడం లేదో కదా -

– సర్వేశ్వరా! శరీరం నీటి బుడగతో సమానం. ఆలోచిస్తే అందులో లేత వయస్సన్నది శరన్మేఘంలోని మెఱుపు లాంటిది. ఇక ఐశ్వర్యం వల్ల కలిగే సుఖమేమో మాయ. ఇదంతా తెలిసి కూడా సంసారి నీ ధ్యానం చేద్దామన్న భావన ఎందుకు పొందడో కదా -

84. ***భవదీయ స్థిర భక్తిలబ్ధియు భవద్భక్తైక గోష్ఠీ మహో***
త్సవ లీలా విభవంబు నీ యచలిత ధ్యానాను మోదంబు తా
నివి నిత్యస్థితులారయంగ విధి దేవేంద్రాది భూతాఖిలో
త్సవ భోగస్థితులెల్ల మిథ్యలవి తత్త్వం బెన్న సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భవదీయ = నీయొక్క; స్థిర భక్తి = నిశ్చల భక్తి; లబ్ధియు = లభించుట; భవత్ భక్తైక = కేవలం నీ భక్తులే ఐన వాళ్ళయొక్క; గోష్ఠీ= సత్ సంగమనే; మహా ఉత్సవ = గొప్ప ఉత్సవం యొక్క; లీలా విభవంబు = విలాస వైభవం; నీ; అచలిత = నిశ్చల; ధ్యాన = ధ్యానం యొక్క; అనుమోదంబులు = సంతోషాలు; ఇవి; అరయంగ = పరిశీలిస్తే; నిత్య స్థితులు = శాశ్వతంగా ఉండేవి; తత్త్వంబు ఎన్న = తత్త్వాన్ని లెక్కిస్తే; విధి = బ్రహ్మ; దేవేంద్ర ఆది = దేవేంద్రుడు మొదలయిన; భూత = ప్రాణుల యొక్క; అఖిల = సమస్త; ఉత్సవ = ఉత్సవాల; భోగస్థితులు ఎల్ల = సమస్త వైభోగాల ఉనికి; అవి; మిథ్యలు = అసత్యాలు (అశాశ్వతాలు)

— సర్వేశ్వరా! నీయందు స్థిర భక్తి, నీ భక్తులతో మాత్రమే సత్సంగ వైభవం, నీయందు నిశ్చల ధ్యానానందాలు అన్నవి శాశ్వతంగా ఉండేవి. బ్రహ్మ, దేవేంద్రాదుల యొక్క భోగ స్థితులన్నీ జాగ్రత్తగా చూస్తే మాయలని తెలుస్తుంది.

85. ***తన యుక్తిన్ భవదంఘ్రి పంకరుహ సద్భక్తుండు పాపంబు చే***
సిన బుణ్యంబగు; భక్తిహీనుఁడు శ్రుతుల్ చేపట్టి పుణ్యంబు చే
సినఁ బాపంబగు దీనికంతయును జర్చింపంగఁ జండీశ్వరుం
డును దక్షుండును సాక్షులెన్న; నగరాట్కోదండ సర్వేశ్వరా!

నగరాట్కోదండ = పర్వతరాజమైన మేరువుని కోదండంగా కల్గిన; సర్వేశ్వరా; తన యుక్తిన్ = తన యుక్తి చేత; భవత్ = నీ; అంఘ్రి = పాదాలనే; పంకరుహ = పద్మాలకు; సద్భక్తుండు = మంచి భక్తుడైనట్టి వాడు; పాపంబు చేసిన = పాపాన్ని చేసినట్లయితే; పుణ్యంబు అగు = (అది) పుణ్యం అవుతుంది; భక్తి హీనుడు = భక్తి లేనివాడు; శ్రుతుల్ = వేదాలను; చేపట్టి = అవలంబించి; పుణ్యంబు చేసిన = పుణ్యం చేస్తే; (అది) పాపంబుఅగు = పాపమవుతుంది; చర్చింపంగ = వితర్కిస్తే; దీనికి అంతయున్ = దీనికంతా; చండీశ్వరుండును దక్షుండును = చండీశ్వరుడూ దక్షుడూ; ఎన్న = ఎన్నగా; సాక్షులు = ఉదాహరణలు.

— మేరుచాపుడవైన సర్వేశ్వరా! నీ పాదపద్మాల మీద భక్తి ఉన్నవాడు పాపం చేసినా అది పుణ్యమవుతుంది. అట్లా భక్తి లేని వాడు వైదిక మార్గాన్ని అనుసరిస్తూ పుణ్యం చేసినప్పటికీ అది పాపం అవుతుంది. దీనికి చండీశ్వరుడూ, దక్షుడూ సాక్షులు.

36. ప్రారంభించి చకోర పోతము మహీయ జ్యోత్స్న యందుత్సవ
శ్రీ రంజిల్లుచు వేడ్కనుండు గతి నా చిత్తంబు నీదివ్య శృం
గార ధ్యానమునందహర్నిశముఁ జొక్కం జేయవే దేవ! శ్రీ
గౌరీ లోచన నర్తకీ నటన రంగస్థాన! సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

చకోర పోతము = చకోర పక్షి; మహీయ = గొప్పదైన; జ్యోత్స్న యందు = వెన్నెలలో; ప్రారంభించి = మొదలెట్టి; శ్రీ రంజిల్లుచు = మహావైభవంగా; వేడ్కనుండు గతి = సంతోషంగా ఉన్నట్లు; నా చిత్తంబు = నా చిత్తాన్ని; శ్రీ గౌరీలోచన = గౌరీ దేవి యొక్క కన్ను అనే; నర్తకీ = నట్టువకత్తె యొక్క; నటన = నాట్యానికి; రంగస్థాన = రంగస్థానం అయిన వాడా; సర్వేశ్వరా; దేవ = భగవంతుడా; నీ; దివ్య = దేవతా సంబంధమైన; శృంగార ధ్యానమునందు = శృంగార ధ్యానంలో; అహఃనిశము = రాత్రిం బగళ్లు; చొక్కన్ చేయవే = మునిగేటట్లు చేయవా.

– గౌరీలోచన మనే నర్తకి యొక్క నటనకు రంగస్థానమైన వాడా! సర్వేశ్వరా! దేవా! చకోర పక్షి పండు వెన్నెలలో ఎట్లా వైభవంగా పొర్లుతూ ఉంటుందో అట్లాగే నా చిత్తాన్ని నీ దివ్య శృంగార ధ్యానంలో రాత్రిం బగళ్లు మునిగేటట్లుగా చేయవా -

❄ గౌరీదేవికన్ను లాస్యం చేస్తూ విలాసంగా కదుల్తూ శివుని మీదే తిరుగాడు తుంది అని అనడం దీర్ఘ సమాసంలో ఎంతో రమ్యంగా రాశారు అన్నమయ్య.

❄ గౌరీలోచన నర్తకీ నటనకు శివుడు రంగస్థానం అనడం వల్ల ఇక్కడి నేపథ్యం శృంగారాన్ని తెలుపుతోంది. దీనికి అనుగుణంగా జగన్మాతా పితరులైన వారి ఈ దివ్య శృంగారంలో తన మనస్సును ఇమిడించ మంటున్నారు

కవి. అంటే ఇక్కడ ధ్యేయ విషయం వారి దివ్య శృంగారం అన్న మాట. తాళ్లపాక అన్నమాచార్యులిట్లాంటి దివ్య శృంగార కీర్తనలెన్నో రాశారు కదా. దివ్య శృంగారాన్ని ధ్యానించడం ఉన్నదే.

❋ దివ్య శృంగార విషయం కాబట్టి వెన్నెలల ప్రసక్తి రావడం ఎంతో ఉచితంగా ఉంది.

87. ***తరులంబువ్వులు పిందెలై యొదవి తత్తజ్జాతితోఁ బండ్లగున్***
హర! మీ పాద పయోజపూజితములై యత్యద్భుతం బవ్విరుల్
కరులౌ నశ్వములౌ ననర్ఘమణులౌఁ గర్పూరమౌ హారమౌఁ
దరుణీ రత్నములౌఁ బటీర తరులౌఁ దథ్యంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

తరులన్ = చెట్లలో; పువ్వులు = పూలు; పిందెలై ఒదవి = పిందెలై ఒప్పి; తత్తత్ జాతితో = అవి ఏ చెట్లో ఆ చెట్టు యొక్క; పండ్లు అగున్ = ఫలాలు అవుతాయి; హర = శివా!; మీ పాద = మీ యొక్క పాదాలనే; పయోజ = పద్మాల యందు; పూజితములై = పూజింపబడినవై; ఆవిరుల్ = ఆ పూలు; కరులౌ = ఏనుగులవుతాయి; అశ్వములౌ = గుఱ్ఱాలవుతాయి; అనర్ఘమణులౌ = పుణ్యవంతమైన మణులౌతాయి; కర్పూరమౌ = (తెల్లని) కర్పూరమౌతుంది; హారమౌ = (ఆభరణమైన మెడలోని) హారమౌతుంది; తరుణీ రత్నములౌ = శ్రేష్ఠమైన స్త్రీలవుతాయి; పటీర తరులౌ = చందన వృక్షాలవుతాయి; అతి అద్భుతంబు = ఇది అత్యద్భుతమూ; తథ్యంబు = సత్యమూ.

— సర్వేశ్వరా! చెట్లకి పూసిన పూలు ఆ చెట్టు జాతి పిందెలూ పండ్లు అవుతాయి. కాని అవే పూలు మీ పాద పయోజముల యందు పూజింపబడినవై ఏనుగులూ, గుఱ్ఱాలూ, మణులూ, కర్పూరం, హారం, తరుణీరత్నం, గంధ వృక్షమూ అవుతాయి. ఇది అద్భుతమూ సత్యమూ.

❄ చెట్లకి పూసిన పూలు ఆ చెట్టు పండు మాత్రమే అవుతుంది. కాని అద్భుత విషయమేమిటంటే, ఆ పూలే శివపాదార్చనకు వినియోగ మయినప్పుడు సకలైశ్వర్యాలుగా అద్భుతంగా పరిణమిస్తాయి. చెట్టున పండు కాయడం పరిమితులలోని విషయం. సహేతుకం. సహజం. కాని అదే పూవు శివనిర్మాల్యం కాగానే అద్భుతంగా అనేక సద్వస్తువులుగా పరిణమిస్తుంది.

❄ ఏనుగుల నుంచి కర్పూరం దాకా అనడం పెద్దవీ చిన్నవీ ఏవైనాసరే భక్తునికి లభిస్తాయనడం. గంధం, కర్పూరం శివపూజా ద్రవ్యాలు కూడా.

88. ఒక పుష్పంబు భవత్పద ద్వయముపై నొప్పంగ సద్భక్తి రం
జకుఁడై పెట్టిన పుణ్యమూర్తికిఁ బునర్జన్మంబు లేదన్నఁ; బా
యక కాలత్రితయో పచారముల నిన్నర్చించుచున్ బెద్ద నై
ష్ఠికుఁడై యుండెడి వాఁడు నీ వగుట దాఁజిత్రంబె సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భవత్ పదద్వయముపైన్ = నీ పాదయుగళం మీద; ఒప్పంగ = ఉచితంగా; సద్భక్తి రంజకుడై = సద్భక్తితో ప్రేమ గల్గిన వాడయి; ఒక పుష్పంబు = ఒక్క పువ్వును; పెట్టిన పుణ్య మూర్తికి = పెట్టిన పుణ్యాత్మునికే; పునర్ జన్మంబు లేదు అన్న = మళ్లీ జన్మ ఉండదూ అని అంటే; పాయక = నిరంతరాయంగా; కాలత్రితయ = మూడు కాలాలకు తగిన; ఉపచారములన్ = సేవలతో; నిన్ను అర్చించుచున్ = నిన్ను పూజిస్తూ; పెద్ద నైష్ఠికుడై ఉండెడివాడు = గొప్ప నిష్ఠా పరుడై ఉండేవాడు; నీవు అగుట = నీవే కావడం; తా చిత్రంబె = తానది విచిత్రమా?

– సర్వేశ్వరా! నీ పాద యుగళం మీద ఒక్క పువ్వు ప్రేమతో కూడిన సద్భక్తితో ఉంచితేనే ఆ పుణ్య మూర్తికి మళ్లీ జన్మ లేదని అంటే ఇక నిరంతరమూ,

ముక్కాలాలలో తగిన ఉపచారాలను చేస్తూ నిన్నర్చిస్తూ మహా నిష్ఠా గరిష్ఠుడైన వాడు నీవు కావడం ఒక చిత్రమా?

❊ ఈ పద్యంలోనూ మరణానంతరం శివభక్తునికి కలిగేది, లభించేదీ ఏమిటీ అన్న విషయంలో అన్నమయ్య కవి యొక్క శివాద్వైత సిద్ధాంత నిబద్ధత, విశ్వాసమూ కనిపిస్తుంది.

ఇక్కడున్న విషయం భక్తుడు శివుడు కావడం. శివరూపి కావడం. దీన్నే సారూప్యం అంటారు.

❊ మూడు కాలాల్లో సంధ్యావందనం లాగానే ఇక్కడ మూడు కాలాల్లో శివపూజను చెప్తున్నారు అన్నమయ్య.

89. ***ఆనందంబును పొందినప్పుడును నత్యాశ్చర్య కార్యార్థ భా***
వానీకంబులు దోఁచునప్పుడును రోగాపాయ దుఃఖాతుర
గ్లానిం బొంది చరించు నప్పుడును సత్కార్యంబునన్నీవు నా
ధ్యానంబందుదయించుమయ్య దివిజేంద్రస్తుత్య! సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఆనందంబును పొందినప్పుడును = ఆనందాన్ని అందుకొన్నప్పుడూ; అతి ఆశ్చర్య = మిక్కిలి ఆశ్చర్య కరమైన; కార్య అర్థ భావానీకంబులు = పనుల కోసమైన ఊహాసమూహాలు; తోచునప్పుడును = స్ఫురిస్తున్నప్పుడున్నూ; రోగ, అపాయ, దుఃఖ, ఆతుర, గ్లానిన్ = రోగం, ప్రమాదం, శోకం, బాధ, దౌర్బల్యాలను; పొంది; చరించునప్పుడును = ప్రవర్తిస్తున్నప్పుడున్నూ; సత్కార్యంబునన్ = మంచి కార్యంలో; నీవు; నా; ధ్యానంబందు = ధ్యానంలో; ఉదయించుము అయ్య = ప్రభవించు స్వామీ.

- సర్వేశ్వరా! ఆనందాన్ని పొందుతున్నప్పుడు, అత్యాశ్చర్య కర కార్యాల కోసం భావాలు తోస్తున్నప్పుడు, రోగం, అపాయం, దుఃఖం, ఆతురత్వం, గ్లాని కలిగి బ్రదుకుతున్నప్పుడు, సత్కార్యంలోనూ - ఓదివిజేంద్రస్తుత్యా సర్వేశ్వరా నీవు నా ధ్యానంలో తోచవయ్యా స్వామీ!

❊ ఆనందంలోనూ శివుణ్ని తన ధ్యానంలో తోచమంటున్నాడు. అట్లాగే దుఃఖాన్ని కల్గించే రోగాదులు కలిగిన సందర్భంలోనూ తోచమంటున్నాడు. ఇక్కడ విశేషం ఏమిటంటే కష్టాలు కలిగినప్పుడు శివస్మరణ శివరూప ధారణ సాధారణ భక్తులెవ్వరైనా చేస్తారు. కాని ఆనందం కల్గినప్పుడూ, అంటే సుఖ జీవనంలో ఉన్నప్పుడు కూడా ధ్యానంలో శివుడు కన్పించాలని కోరుకోవడం పరమ సద్భక్తుని సల్లక్షణం.

90. నానాశాస్త్ర సముచ్చయాగమ పురాణ ప్రౌఢులై తత్త్వ వి
జ్ఞాన ధ్యాన సమాధి విద్యలతి విస్పష్టంబుగా నేర్చి రే
దానీనేర్పుల నెల్ల నొప్పదు భవత్సద్భక్తి విద్యా సమా
ధాన ప్రస్ఫుట శక్తి నీ కరుణ చేతంగాని సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నానాశాస్త్ర సముచ్చయ = అనేక శాస్త్ర సమూహం; ఆగమ = వేదశాఖలయిన ఆగమాలు; పురాణ = పురాణాలలోనూ; ప్రౌఢులై = విద్వాంసులయి; తత్త్వ = తత్త్వ శాస్త్రాలలోని; విజ్ఞాన = జ్ఞానాన్ని; ధ్యాన = ఈశ్వరుని యందు యోగమూ; సమాధి = ఈశ్వరలయమూ అన్న; విద్యలు = విద్యలను; అతి విస్పష్టంబుగా = ఎంతో స్పష్టంగా; నేర్చిరే = నేర్చినప్పటికిన్నీ; భవత్ భక్తి = నీ మీది భక్తి; తాను; ఈ నేర్పులన్ ఎల్ల = ఈ చాకచక్యాలనన్నిటినీ; ఒప్పదు =

అంగీకరించదు; విద్యా = విద్యచేత; సమాధాన = ఒప్పుదల అవడం అనే; ప్రస్ఫుట శక్తి = స్పష్టమైన శక్తి; నీ కరుణ చేతన్ కాని = నీ కరుణ చేత మాత్రమే (తక్కిన వాటి చేత కల్గదు అని అర్థం).

— సర్వేశ్వరా! అనేక శాస్త్రాలు ఆగమ పురాణాలలో పండితులయి తత్త్వ విజ్ఞానం, ధ్యానం, సమాధులనే విద్యలలో ఆరితేరినప్పటికీ, నీ యందలిభక్తి ఈ చాకచక్యాలను వేటినీ అంగీకరించదు. నీ కరుణ ఉంటేనే ఈ విద్యలకు సమాధాన పర్చగలిగే శక్తి కల్గుతుంది.

❈ ఎన్ని విద్యలయినా శివభక్తి విరహితమౌతే అవి సంతృప్తినీ, సమాధానాన్నీ ఇవ్వలేవని అర్థం. ఈశ్వరుని కరుణే అన్నిటికీ మూలం.

❈ సృష్టి, మోక్షం అన్నవి కేవలం యాంత్రిక సూత్రాలాధారంగా కలిగేవి కావు. నిరీశ్వర సాంఖ్యం ప్రకారం చూస్తే కొన్ని యాంత్రిక నియమాలాధారంగా ఈ జగత్తు నడుస్తున్నట్లుగా అది అభిప్రాయ పడ్తున్నట్లుగా తేలుతుంది. అట్లాంటి మతాలలో ఈశ్వరానుగ్రహ ప్రసక్తి ఉండటానికి వీలే లేదు. కాని శైవంలో అన్నింటికీ మూలం శివానుగ్రహం నిలుస్తుంది. ఈశ్వరానుగ్రహం అన్నదే లేకుంటే బ్రహ్మ విద్యలని చెప్పబడే విద్యలు కూడా కేవలం చాకచక్యాలూ, నేర్పులే అవుతాయి తప్ప అంతకు మించి వాటి వల్ల ప్రయోజనం లేదు.

91. ప్రకటింపంగ మదీయ చిత్తమది దాఁ బం చేంద్రియోద్వృత్తమై
ప్రకటప్రాప్తిని సోలుఁగాని మఱి నీ పాదాబ్జ సంసేవనం
బొక వేళన్ భజియింప నొల్లదు నిజం బూహింప నెట్లన్న నీఁ
గకు దుర్గంధము గాక సహ్యమగునే కస్తూరి! సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ప్రకటింపంగ; మదీయ చిత్తము = నా మనస్సు; అది; తా = తాను; పంచేంద్రియ ఉద్వృత్తమై = ఐదింద్రియాల చేత గర్వించినదై; ప్రకట = నియమితమైన; ప్రాప్తిని = ప్రారబ్ధం చేత లభించిన దానిలో; సొలుగాని = మూర్ఛిల్లుతుంది కాని; ఒక వేళన్ = ఒక్క సారైనా; నీ పాదాబ్జ సంసేవనంబు = నీ పాదకమలాలకు సమ్యక్ సేవను; భజియింపన్ = చేయడానికి; ఒల్లదు = అంగీకరించదు; నిజంబు = (ఇది) సత్యం; ఊహింపన్ = వివేచిస్తే; ఎట్లన్నన్ = (ఇది) ఎట్లా అంటే; ఈగకు; దుర్గంధము కాక = దుర్వాసన తప్ప; కస్తూరి = (సుగంధ భూయిష్ఠమైన) కస్తూరి; సహ్యము అగునే = సహించ దగింది అవుతుందా?

— సర్వేశ్వరా! నా చిత్తం పంచేంద్రియాల ప్రభావంతో ప్రారబ్ధాన్ని అనుభవించు తుందే తప్ప నీ పాద కమలాలను ఒక్కసారైనా సేవించడానికి అంగీకరించదు. ఇది నిజం. ఈగకు దుర్గంధం సహ్యమవుతుంది కాని కస్తూరి సుగంధం అవుతుందా?

❋ ఇంద్రియాల వల్ల కలిగే అనుభవాల మీది రక్తి అంతా దుర్గంధంతోనూ, శివపాద సేవనం వల్ల కలిగే ఆనందం అంతా కస్తూరీ సుగంధంగానూ కవిపోలుస్తున్నారు. అట్లాగే ఇంద్రియ భోగానురక్తుడు ఈగతో పోల్చబడుతున్నాడు. ఉపమానం నీచం కావడం వల్ల కూటసంసారి చేస్తున్న పనిని కూడా నీచమైనదే నని కవి సూచిస్తున్నారు.

92. మలినాంగుండగు టేమి కష్టము మనో మార్గంబు నీ భక్తి ని
ర్మల సౌభాగ్య నిదాన దీపశిఖయై రంజిల్లదే భూషణో
జ్జ్వల దేహుండగుటేమి తేజము మనోవ్యావృత్తి దుర్మోహ చం
చల దుష్కర్మతమంబు వీడఁబడునే చర్చింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

చర్చింప = వితర్కిస్తే; మలిన అంగుండు అగుట = మలినమైన అవయవాలు కలవాడు కావడం వల్ల; ఏమి కష్టము = ఏమి కష్టం (కల్గుతుంది)? (అట్లా అయినప్పటికీ); మనోమార్గంబు = మనోవీధా; నీభక్తి = నీపైని భక్తి అనే; నిర్మల = అమలినమైన; సౌభాగ్య నిదాన = ఐశ్వర్యం యొక్క హేతువైన; దీప శిఖయై = జ్యోతి జ్వాల అయి; రంజిల్లదే = ఆనందించదే; భూషణ = అలంకరణాల చేత; ఉజ్జ్వల = ప్రకాశవంతమైన; దేహుండగుట = దేహం కలవాడవడం; ఏమి తేజము = అదేమి ప్రకాశం?; (అంత మాత్రం చేత); దుర్మోహ = దుష్టమైన మోహం వల్ల; చంచల = చలించే; దుష్కర్మ తమంబు = దుష్కర్మలనే అంధకారం; వీడబడునే = విడిచి పెట్ట బడ్తుందా?

— *సర్వేశ్వరా! దేహం మలినమైనంత మాత్రంలో ఏం బాధ? అట్లా అయినా, మనోమార్గం నీ భక్తి అనే సౌభాగ్య కారణమైన దీప శిఖఅయి సంతోష పడదా? అనేక అలంకారాల చేత దేహం అలంకరింప బడినంత మాత్రంలో ఏమి ప్రకాశం కల్గుతుంది? అంత మాత్రంలో దుర్మోహం చేత చంచలమైన అంధకారం మనల్ని విడిచి పోతుందా?*

❊ *దేహం మలినమైనప్పటికీ ఏమీ కష్టంలేదు. ఈశ్వర భక్తి భక్తుడి మనోవీథిని వెలిగిస్తుంది. కేవలం భూషణాల చేత శరీరానికి తేజస్సు వస్తుందా? అంత మాత్రం చేతనే దుర్మోహమనే అంధకారం విడిపోతుందా?*

93. *ఇలనాచిత్తము యోగ సాధనల యందీఁదాఁడఁగాఁ గొంత ని*
శ్చలతం జేరఁగ వచ్చు లేక తన వాంఛావృత్తిఁ బోనిచ్చినం
బలుపై నీ దెసఁ జేర దట్టి దకటా భావించినం గాక కే
వల సంబోధన నేల నిల్చు ఋజువై వర్తిల్లు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఇల = భూమి మీద; నా చిత్తము; యోగ సాధనల యందు = యోగసాధనలలో; ఈఁ దాడఁగా = తేలియాడగా; కొంత = ఇసుమంత; నిశ్చలతన్ = నిశ్చలత్వాన్ని; చేరఁగవచ్చు = పొందవచ్చును; లేక = అట్లా కాకుండా; తన; వాంఛావృత్తి = కోరికల వెంట; పోనిచ్చినన్ = వదలిపెట్టి నట్లయితే; బలుపై = బంలిసి; నీదెస = నీవైపుకి; చేరదు = రాదు; భావించినన్ కాక = ఊహించినట్లయితే; అకటా = అయ్యో; కేవల సంబోధనన్ = పిలుపు మాత్రం చేతనే అయితే; ఏలనిల్చు = అది ఎందుకు నిలుస్తుంది?; ఋజువై వర్తిల్లు = (ఎందుకు) అకల్మషంగా వర్తిస్తుంది?

– సర్వేశ్వరా! నా చిత్తాన్ని యోగసాధనలలో తేల్చితే కొంత నిశ్చలతని అది పొందవచ్చును. కాని కోరికలవైపు స్వైర విహారం చేస్తే బలిసి అది నిన్ను చేరదు. కేవలం నిన్ను సంబోధించినంత మాత్రంలో అది ఎందుకు నిశ్చలమవుతుంది? అది ఎందుకు ఋజుమార్గంలో ప్రవర్తిస్తుంది?

94. ఉదకంబింకిన లావు దూలి వడిఁదా నుష్ణింపఁగా రొంపిలోఁ
గదలం జాలని మీను వాన గురియం గ్రమ్మెక్కి పెన్నీటిలోఁ
బొదలం గన్న విధంబునన్ భవముతోఁ బొర్లాడు మర్త్యుండు దా
హృదయాబ్జంబున నిన్ను నిల్పఁగనునే యింపొంద సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఉదకంబు ఇంకిన = నీరింకి పోగా; లావుతూలి = బలము పోయి; వడిఁ = వేగంగా; తాను; ఉష్ణింపగా = వేడి ఎక్కి; రొంపిలో = బురద గుంటలో; కదలన్ చాలని = కదలలేని; మీను = చేప; వాన కురియన్ = వాన కురవగానే;

క్రమ్మెక్కి = వ్యాపించిన; పెన్నీటిలో = జలరాశిలో; పొదలన్ = కదలుటను; కన్న = చూడగల్గిన; విధంబునన్ = రీతిగా; భవముతో = సంసారంతో; పొర్లాడు = పొర్లాడే; మర్త్యుండు = మానవుడు; తా = తాను; ఇంపొంద = రమణీయంగా; హృదయాబ్జంబున = హృత్కమలంలో; నిన్ను; ఇంపొంద = రమణీయంగా; నిల్పకనునే = నిలుపుకో గల్గుతాడా?

— *సర్వేశ్వరా! నీరింకినప్పుడు బలంకోల్పోయి బురదలోక్కి కదలలేని చేప, ఆ పైన వాన కురిసి నీళ్లు బాగా రాగానే కదల గల్గినట్లుగా సంసారంలో పొర్లాడే మానవుడు తాను హృదయాబ్జంలో నిన్ను నిల్పుకొని చూడగల్గుతాడా?*

❋ *హృదయంలో అతడు శివుణ్ని చూడగలగాలంటే సంసారమనే ఇరుకైన నీరు లేని బురద కుంట ఈశ్వరానుగ్రహం అనే జలాలచేత విశాలమవాలి. అప్పుడు ఆ మానవుడు బలిష్ఠుడై శివుణ్ని నిలుపుకో గల్గుతాడు అని సూచన.*

95. *భవదీయార్చన సేయుచోఁ బ్రథమ పుష్పంబెన్న సత్యంబు, రెం*
డవ పుష్పంబు దయాగుణం, బతి విశిష్టంబేకనిష్ఠా సమో
త్సవ సంపత్తి తృతీయ పుష్పమది భాస్వద్భక్తి యో
గ విధానంబవి లేని పూజల మదింగైకోవు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భవదీయ = నీయొక్క; అర్చన = పూజ; చేయుచో = చేసేటప్పుడు; ఎన్న = లెక్కించగా; ప్రథమ పుష్పంబు = మొదటి పువ్వు సత్యంబు; రెండవ పుష్పంబు; దయాగుణంబు = కారుణ్యమనే గుణం; అతివిశిష్టంబు = మిక్కిలి విశేషమైనది; ఏకనిష్ఠ = ఒకే విషయమందుండటం అనే; సమోత్సవ = చక్కని ఉత్సవం; సంపత్తి = ఐశ్వర్యం; అది; తృతీయ పుష్పంబు; భాస్వత్ = ప్రకాశించే; భక్తి

…ాగ విధానంబు = భక్తి యోగ పద్ధతి; అవిలేని పూజలన్ = సత్యం, దయ, …కాగ్రత అనేవి లేని పూజలను; మదిన్ = మనస్సుతో; కైకోవు = అంగీకరించవు.

సర్వేశ్వరా! నీ పూజ చేసేటప్పుడు మొదటి పుష్పం సత్యం. రెండవ పుష్పం దయ. మూడో పుష్పం ఏకాగ్రత. ఇది భక్తి యోగ విధానం. ఈ మూడు పుష్పాలూ లేని పూజల్ని నీవు అంగీకరించవు.

* భక్తియోగ విధానంలో ప్రధానమైన అంశాలను మూడింటినిగా అన్నమయ్య గారీ పద్యంలో తెల్పుతున్నారు.

96. అమరేంద్రాద్రి శరాసనంబు హరి దివ్యాస్త్రంబు భూమండలం
బమరంగా రథ మర్క చంద్రులు తదీయాంగంబులై యొప్పఁజి
త్రమె నీకుం బుర లక్ష్యమేయు నెడ నుద్యద్భాతి నత్యల్ప కా
ర్యములందైనను దామహాఘనము నీ యత్నంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నీకున్; పురలక్ష్యము = త్రిపురాసురుడు అనే గురిని; ఏయున్ ఎడ = భేదించేటప్పుడు; అమరేంద్రాద్రి = మేరు పర్వతం అనే; శరాసనంబు = ధనుస్సు; హరి = విష్ణువు అనే; దివ్యాస్త్రంబు = దివ్యమైన అస్త్రము; అమరంగా = ఒప్పిదముగా; భూమండలంబు = భూమి; రథము = రథము; తదీయ = ఆ రథానికి; అంగంబులై = అవయవాలై (చక్రాలై); అర్క చంద్రులు = సూర్య చంద్రులు; ఒప్పు = ఒప్పుతారు; చిత్రమె = (ఇదొక) విచిత్రమా?; అతి అల్ప = మిక్కిలి చిన్న; కార్యములందు ఐనను = పనులలో కూడా; తా; నీయత్నంబు = నీ ప్రయత్నం; ఉద్యత్ భాతిన్ = పైకిఎత్తే మాదిరిగా; మహాఘనము = మిక్కిలి గొప్పదిగా ఉంటుంది.

— సర్వేశ్వరా! నీవు త్రిపురాసుర సంహారం చేసేటప్పుడు మేరు పర్వతమే నీ ధనుస్సు; విష్ణువే బాణం; భూమండలమే రథం. దానికి సూర్య చంద్రులు చక్రాలు; ఇదేమీ ఒక విచిత్ర విషయం కాదు. ఎందుకంటే అల్ప కార్యంలో కూడా నీ ప్రయత్నం మహా ఘనంగా ఉంటుంది.

❊ త్రిపురాసుర సంహారం చేశాడు కాబట్టి శివుడికి త్రిపురాంతకుడని పేరు. ఈ కార్యంలో మహాశివునికి రథం భూమి; దాని చక్రాలు సూర్య చంద్రులు; గుఱ్ఱాలు వేదాలు; ధనుస్సు మేరుపర్వతం; దాని నారి శేషుడు; బాణమేమో విష్ణువు.

97. దివిజేంద్రత్వముఁ బద్మజత్వము జగత్సేవ్యస్థిరానర్గళో
త్సవ రూపంబగు కేశవత్వమును నీ సద్భక్తి సంవృద్ధిలో
లవమాత్ర స్థితులెన్న భక్తి జనతోల్లాసావనోద్యత్సు ఖా
ర్ణవ సౌభాగ్యపు మానమెవ్వరికి జెప్ప న్వచ్చు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

దివిజేంద్రత్వము = ఇంద్రత్వం; పద్మజత్వము = బ్రహ్మత్వం; జగత్ సేవ్య = లోకం చేత సేవింపబడే; స్థిర = శాశ్వతమైన; అనర్గళ = అచ్యుతమైన; ఉత్సవ రూపంబు అగు = మోహన రూపమైన; కేశవత్వమును = విష్ణుత్వమూ; నీ సద్భక్తి = నీ యందలి సద్భక్తి అనే; సంవృద్ధిలో = సంపదలో; ఎన్న = పరిగణిస్తే; లవమాత్ర స్థితులు = ఈషణ్మాత్రపు స్థితి గల్గినవి; భక్తి జనత = భక్తులను; ఉల్లాస = ఉత్సాహంతో; అవన = రక్షించడంచేత; ఉద్యత్ = కలిగే; సుఖ అర్ణవ = ఆనంద సముద్రమనే; సౌభాగ్యపు = ఐశ్వర్యపు; మానము = కొలత; ఎవ్వరికి చెప్పన్ వచ్చు = ఎవరికి ఉందని చెప్పగలం? (నీకు తప్ప)

సర్వేశ్వరా! ఇంద్రత్వ, బ్రహ్మత్వ, విష్ణుత్వాలు నీ సద్భక్తి అనే ఐశ్వర్యంలో లవలేశమైనవి. భక్త జనులను ఉత్సాహంతో రక్షించడమనే అపార సముద్ర సదృశమైన నీ సుఖ సౌభాగ్యం ఎవరికైనా ఉందని చెప్పగలమా?

ఈశ్వరుణ్నీ - బ్రహ్మ విష్ణు ఇంద్రత్వాలనూ పోల్చి చూపి ఈశ్వరుని ఆధిక్యాన్ని చెప్తున్నారు కవి. ఐతే ఈ ఆధిక్యాన్ని ఏవేవో సంఘటనల ద్వారా కాకుండా, భక్త జనులను రక్షించడం వల్ల ఈశ్వరునికి కల్గిన సుఖం అనే కొలమానంతో కొలిచి నిర్ణయించడం ఇక్కడ విశేషం.

8. పరమార్థంబుగ నా మనంబున భవద్భక్తి ప్రభావంబు వి
స్తరమై పుట్టదు పుట్టినం బ్రబలదంతం గొంత వర్ధిల్లెనే
విరసంబైయట మీఁద జిక్కువడుఁ భావింపంగ నెట్లన్న న
స్థిరుఁడంగాన జడుండఁగాన బక వేషింగాన సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నామనంబున = నా మనస్సులో; భవద్భక్తి = నీ మీద భక్తి యొక్క; ప్రభావంబు = శక్తి, పరమఅర్థంబుగ = అదే అంతిమమై; విస్తరమై = విస్తృతంగా; పుట్టదు; పుట్టినన్ = పుట్టినప్పటికిన్నీ; ప్రబలదు = బలిష్ఠం కాదు; కొంత వర్ధిల్లెనే = (ఒకవేళ) కొంత వృద్ధి పొంది నప్పటికీ; భావింపంగన్ = ఊహించగా; అటమీద = ఆ మీద; విరసంబై = ఆనంద రహితమై; చిక్కుపడు = చిక్కుపడి పోతుంది; ఎట్లు అన్న = ఎందుకిట్లా జరిగింది అంటే; అస్థిరుడన్ కాన = స్థిర బుద్ధి లేనివాణ్ని కావడం చేత; జడుడన్ కాన = నిశ్చైతన్యుణ్ని కావడం చేత; బక వేషిన్ కాన = కొంగ వేషం వేసికొన్న వాణ్ని కావడం చేత.

— *సర్వేశ్వరా! నా మనస్సులో నీ భక్తి అదే పరమార్థం అన్నట్లుగా విస్తృతంగా పుట్టదు. ఒక వేళ పుట్టినప్పటికీ అది బలిష్ఠం కాదు. ఒక వేళ కొంత పుంజుకున్నా వెంటనే అది ఆనందరహితమై అక్కడే చిక్కుపడి ఆగిపోతుంది. ఇది ఇట్లా ఎందుకు జరుగుతుందీ అని అంటే - నేను స్థిరచిత్తుణ్ని కాకపోవడం, నేను జడుణ్ని కావడం, నేను కొంగ వేషం వేసి కొన్న వాణ్ని కావడం - ఇందుకు హేతువులు*

❋ *కొంగజపం అంటే దొంగజపం. దాని తుల్యమే ఒక వేషం.*

99. ***శ్రీ కంఠాయ నమోనమో నతసురజ్యేష్ఠాయ రుద్రాయ లిం***
గాకారాయ నమోనమో విగత సంసారాయ తారార్క చం
ద్రా కల్పాయ నమోనమో దురిత సంహారాయ తేయంచు ని
న్నాకాంక్షన్ భజియించు మానవుడు నీవై యుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

శ్రీకంఠాయ = నీలకంఠునికి; నతసురజ్యేష్ఠాయ = సురజ్యేష్ఠుడైన బ్రహ్మ చేత నమస్కరింప బడ్డవానికి; రుద్రాయ = రుద్రునికి; లింగాకారాయ = మహాలింగాకారంలో ఉన్నవానికి; నమో నమో = నమస్కారం; విగత సంసారాయ = సంసారం లేని వాడికి; తార అర్కచంద్రా కల్పాయ = నక్షత్రాలను, సూర్యుణ్నీ, చంద్రుణ్నీ సృజించిన వాడికి; నమోనమో = నమస్కారం; దురిత = పాపాలను; సంహారాయ = సంహరించిన వానికి; (అట్టి) తే = నీకు; నమోనమో = నమస్కారం; అంచు = అంటూ; నిన్ను; ఆకాంక్షన్ = తీవ్రమైన కోరికతో; భజియించు = సేవించే; మానవుడు = వ్యక్తి; నీవై ఉండు = నీవే అయి ఉంటాడు.

— *సర్వేశ్వరా! నీలకంఠునికి బ్రహ్మచేత నమస్కరించ బడిన వాడికీ, రుద్రునికీ లింగాకారునికీ నమస్కారం; సంసారం లేని వాడికీ, సూర్యచంద్ర నక్షత్రాలను*

కల్పించినవాడికీ నమస్కారం. పాపనాశకుడైన నీకు నమస్కారం - అంటూ ఆకాంక్షతో నిన్ను సేవించే మానవుడు నీవు అయి ఉంటాడు.

❋ అన్నమయ్య ఏ మత తత్త్వానికి కట్టుబడి ఉన్నాడో తెలిపే పద్యం.

❋ నిన్ను సేవించే మానవుడు 'నీవై ఉండు' అన్నదిపద్యంలో శైవసిద్ధాంతాన్ని తెలిపే అంశం.

శ్రీ నీలకంఠ భాష్యంలో 4-4-1 సూత్ర వివరణలో "అస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతి రుపసంపద్య స్వేన రూపేణాభి నిష్పద్యతే" అని ఉన్నది. పరంజ్యోతి స్వరూపుణ్ని పొందిన వాడికి స్వరూపం ఆవిర్భవిస్తుంది అని అర్థం. నిజ రూపాన్ని మఱుగు పరచిన మలమాయాకర్మ దేహేంద్రియావరణలన్నీ తొలగిపోయి శివసదృశ గుణం కల్గిన ఆత్మ స్వరూపం ఆవిర్భవిస్తుంది. ఈ ఆత్మ స్వరూపం అంతకు ముందున్నదే. కాని మఱుగుపడింది. అంటే అసలైన ఈ స్వరూపం స్వాభావికమే తప్ప మరొకటి కాదు. ముక్తుడీ మతంలో శివ సదృశుడు. "నిరంజనః పరమం సామ్యము పైతి" "ముక్తః శివసమోభవేత్" అని శ్రుతి స్మృత్యాదులలో ఉన్నది. ముక్త పురుషుడు పరమేశ్వరునితో సమానుడై శివతత్త్వాం తర్భూతుడు కూడా అయి శివునితో వేరుగా ఉండక నిజరూపాన్ని ఆవిష్కరించుకొని శివానందాన్ని అనుభవిస్తాడు.

ఒక్కడు శివరూపాన్ని పొంది శివునితో సామ్యాన్ని పొందినప్పటికీ 'ముక్త పురుషునికి చెప్పిన పరమేశ్వర సమానత్వం జగత్ సృష్ట్యాది వ్యాపారం లేనిదై సమస్త భోగ్యముల ననుభవించే సామర్థ్యం కలిగి ఉంటుంది. అంటే ముక్తుడు జగత్కర్తకాడు.

అన్నమయ్య చెప్పిన 'నీవై యుండు' అన్న దాని ఈ విశిష్ట శివాద్వైత తత్త్వ నేపథ్యంలో చూస్తే బాగా అవగత మౌతుంది.

❊ శ్రీకంఠ నామాన్ని గురించి 1వ పద్యంలో వివరణ ఉంది.

❊ రుద్రుడు మహాదేవుడే. రుద్రుణ్ని గురించి ఎనిమిది శ్లోకాలు శ్రీ శివమహాస్తోత్రంలో ఉన్నాయి. అవి -

అథరుద్రో మహాదేవః - శంభోర్మూర్తిర్గరీయసీ ।
వాహ్నేయ మండలాధీశః - పౌరుషైశ్వర్యవాన్ ప్రభుః॥
శివాభిమాన సంపన్నో - నిర్గుణస్త్రి గుణాత్మకః -
కేవలం సాత్త్వికశ్చాపి - రాజసశ్చైవ తామసః॥
అవికార రతః పూర్వం - తతస్తు సమ విక్రియః ।
అసాధారణ కర్మాచ - సృష్ట్యాది కరణాత్ పృథక్ ॥
బ్రహ్మణోఽపి శిరశ్ఛేత్తా - జనక స్తస్య తత్సుతః ।
జనకస్తనయ శ్చాపి - విష్ణోరపి నియామకః ॥
బోధక శ్చతయోర్నిత్య - మనుగ్రహకరః ప్రభుః।
అండస్యాంత ర్బహిర్వర్తీ - రుద్రోలోక ద్వయాధిపః ॥
శివప్రియః శివాసక్తః - శివపాదార్చనే రతః ।
శివస్యాజ్ఞాం పురస్కృత్య - సమే దిశతు మంగళమ్ ॥

రుద్రుడే మహాదేవుడు. రుద్రుడు అగ్నిమండలాధిపతి. అణిమాద్యష్టైశ్వర్యాలతో ఉంటాడు. రుద్రునితో శివుడు పూర్ణుడు. త్రిగుణ విశిష్టుడు. ఐనా అవికారుడు. సృష్టిస్థితి లయాలు చేయడం చేత అసాధారణుడు. శివుడు సృష్టించిన బ్రహ్మ శిరస్సుని ఖండించిన వాడు. అతని లలాటం నుంచే ఉద్భవించాడు. అందు వల్ల ఆయనకు జనకుడూ సుతుడూ! నారాయణుని నియమించే వాడు. బ్రహ్మాండం లోపలా బైటా వర్తించేవాడు - అని ఇట్లా రుద్రనామ విశదీకరణం ఉంది.

100. భువనోత్పత్తి విధించుచో నజుఁడవై పొల్పందగా దాని ను
త్సవ లీలం బ్రభవించుచో మృడుఁడవై సర్వంబు గల్పాంత భై
రవ సంక్షోభ నటించుచో హరుఁడవై త్రైగుణ్య శక్తిం దుదిన్
శివనామాంకము దాల్చు నీ మహిమ దాఁ జిత్రంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భువన = లోకాలకు; ఉత్పత్తి = పుట్టుకను; విధించుచో = కలిగించేటపుడు; భవుడవై = భవమునకు హేతువైన భవుడవుగా; పొల్పందగా = ఒప్పుగా; దానిన్ = ఆసృష్టిని; ఉత్సవ లీలన్ = పండుగ లాగా; ప్రభవించుచో = పుట్టిస్తున్నపుడు; మృడుడవై = ఇంద్రియ సుఖాన్నీ; ప్రారబ్ధాంతంలో శివానందాన్నీ ఇచ్చేవాడవై; కల్పాంత = సృష్టి ముగిసే ప్రళయ వేళలో; భైరవ = భయానకమైన ; సంక్షోభ = అల్లకల్లోలాన్ని; నటించుచో = నటిస్తున్నపుడు; హరుడవై = అన్నింటినీ హరించివేసే హరుడవుగా; త్రైగుణ్యశక్తిన్ = త్రిగుణాల శక్తిని; తుదిన్ = చివరగా; శివనామాంకము = శివుడనే నీ పేరు; తాల్చు = ధరిస్తుంది; నీ మహిమ = నీ గొప్పదనం; తా = అది; చిత్రంబు = విచిత్రం.

— సర్వేశ్వరా! లోకాలను సృజిస్తున్నపుడు భవుడవుగా, దానిని శోభాయమానంగా నిల్పుతున్నప్పుడు మృడుడవుగా, ప్రళయ కాలంలో భయానకంగా, దాన్ని కలత చెందిస్తున్నపుడు హరుడవుగా చేసిన సృష్టిస్థితిలయాలకు మూలమైన సత్త్వ రజస్తమస్సులనే మూడు గుణాల యొక్క చివరకు 'శివుడు' అన్న పేరు ధరిస్తుంది. ఓ శివా నీ మహిమ విచిత్రం.

101. కుల శైలంబులు పాదు పెల్లగిలి దిక్కూలంబునం గూలినన్
జలధుల్ మేరల నాక్రమించి సముదంచద్భంగి నుప్పొంగినన్,
జలజాతప్రియ శీతభానులు యథా సంచారముల్ దప్పినన్
దలకండుబ్బఁడు చొప్పుదప్పఁడు భవద్భక్తుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కులశైలంబులు = కులపర్వతాలు; పాదు = మూలం (ఆలవాలం); పెల్లగిలి = ఊడిపోయి; దిక్కూలంబునన్ = దిక్కుల ఒడ్డున (చివరన); కూలినన్ = పడి పోయినప్పటికీ; జలధుల్ = సముద్రాలు; మేరలన్ = తీరాలనే హద్దులను; ఆక్రమించి = దాటి; సముదంచత్ =ఒప్పిదమైన; భంగిన్ = రీతిగా; ఉప్పొంగినన్ = ఉప్పొంగినప్పటికీ; జలజాతప్రియ = సూర్య; శీతభానులు = చంద్రులు; యథాసంచారముల్ = ఎప్పటిలాగ తిరుగుటలు; తప్పినన్ = తప్పినప్పటికీ; భవద్భక్తుండు = నీ యొక్క భక్తుడు; తలకండు = చలించడు; ఉబ్బఁడు = పొంగిపోడు; చొప్పుతప్పఁడు = పద్ధతిని తప్పడు.

— *సర్వేశ్వరా! కులపర్వతాలు ఉన్మూలమయి దిక్కుల అంచులలో పడిపోయినా, సముద్రాలు, తీరాలను దాటి ఉప్పొంగినా, సూర్యచంద్రులు తమ గతులు తప్పినా, నీ భక్తుడు చలించడు - ఉబ్బిపోడు - పద్ధతి తప్పడు.*

❄ *ఈ లక్షణం జ్ఞాని లక్షణం. భక్తి కలిగించేది కూడా జ్ఞానమే. జ్ఞానికి ధీరగుణం ఉంటుంది.*

102. *శూలస్థాపితుఁడైన మానవునకున్ శూలంబు దుర్వారవా*
త్యాలిం గంపము నొందకుండుట సుఖంబై తోచుమాడ్కిన్ భవా
భీల జ్వాలలఁ గ్రాఁగు మానవునకున్ బింబాధరా హారవ
స్త్రాలంకారములించుకించుక సుఖంబై తోఁచు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

శూలస్థాపితుఁడైన = శూలంలో గుచ్చబడ్డ; మానవునకున్ = మనిషికి; శూలంబు = ఆ శూలం; దుర్వార = వారింపనలవికాని; వాత్యాలిన్ = వాయు సమూహంచేత; కంపమున్ = వణకును, (చలనాన్ని); ఒందక ఉండుట =

పొందకపోవడం; సుఖంబుఐ = సుఖమయి; తోచు మాడ్కిన్ = తోచు విధముగా; ఆభీల = భయంకర; జ్వాలల = అగ్ని జ్వాలల్లో; క్రాగు = తపించే; మానవునకున్ = మానవునికి; బింబాధరా = దొండపండులాంటి కిందిపెదవి కల్గిన స్త్రీల; హార వస్త్ర అలంకారములు= భూషణ, వస్త్రాలంకారాలు; ఇంచుకించుక = కొద్ది కొద్దిగా; సుఖంబుఐ = సుఖమయి; తోచు.

– *సర్వేశ్వరా! శూలం మీద దిగవేసిన మనిషికి పెనుగాలికి అది కదలకపోవడం ఎట్లా సుఖమని అనిపిస్తుందో, అట్లాగే సంసారమనే భీకర అగ్ని జ్వాలల్లో కాగిపోయే మనిషికి స్త్రీల వేషభూషాలంకారాలు కొద్దికొద్దిగా సుఖమనిపిస్తాయి.*

❄ *ఆ మనిషిని కొఱత వేశారు. అంటే శూలాన్ని నిల్పిదానిలో వాణ్ణి దిగేశారు. నిజానికి దానికి వాడెంతో బాధపడ్తూ ప్రాణాల్ని వదులుతాడు. కాని వాడికి అది తోచడం లేదు. పెనుగాలివీచి తనను నాటిన ఆ శూలం కదలకుండా నిశ్చలంగా ఉన్నందుకు వాడికి సుఖంగా ఉందట! సరిగ్గా ఇదే పోలికతో సంసారమనే భీకర జ్వాలల్లో కాగిపోతున్న వాడికి స్త్రీల వేషభూషాలంకారాలు సుఖాన్నిస్తున్నాయట. మొదటిది వాణ్ణి దహించి పారేసేది. ఇక రెండవది ఉన్నంత మాత్రంలో మొదటి కష్టం పోదుకదా. దాన్లో ప్రాణాలు పోకుండా ఉండవుకదా!*

103. ఆకాశానల చంద్ర సూర్య పవమానాత్మాంబు విశ్వంభరా
ప్రాకామ్యాంచిత మూర్తి భేదముల నీ బ్రహ్మాండ నానా ఘటా
నీక ప్రాకట జీవభావ విలసన్నిర్మాణ కర్మాద్భుతా
స్తోకశ్రీకరమూర్తియై నెగడు నీ స్థూలంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నీ స్థూలంబు = నీయొక్క స్థూల రూపం; ఆకాశ = ఆకాశం; అనల =

అగ్ని; చంద్రసూర్య = సూర్యచంద్రులు; పవమాన = వాయువు; ఆత్మ = పురుషుడు, అంబు = నీరు; విశ్వంభర = భూమి అనే; ప్రాకామ్య = వైభవములతో; అంచిత = కూడిన, మూర్తి భేదములన్ = విభిన్న రూపములచేత; ఈ ; బ్రహ్మాండ = బ్రహ్మాండమనే; నానా = అనేక; ఘటానీక = కుండలయందు (వస్తువుల యందు); జీవభావ = ప్రాణ భావంచేత; విలసత్ = ఒప్పునట్లుగా; నిర్మాణ కర్మ = సృష్టికర్మయందు; అద్భుత = అద్భుతమైన; అస్తోక = అనల్పమైన; శ్రీకరమూర్తియై = శివంకరమైన మూర్తి కల్గినదియై; నెగడు = ప్రకాశిస్తుంది.

— *సర్వేశ్వరా! నీ యొక్క స్థూల రూపం ఆకాశం, అగ్ని, చంద్రుడు, సూర్యుడు, వాయువు, పురుషుడు, జలము, పృథివి అన్న ఎనిమిది రకాల మూర్తులతో ఈ బ్రహ్మాండమనే అనేక ఘటాలలోని ప్రాణంతో ఒప్పే సృష్టికర్మతో - అద్భుతమూ, అనల్పమూ, శ్రీకరమూ అయిన మూర్తి కలిగినదై ప్రకాశిస్తుంది.*

❋ ఈ సృష్టికి మూలద్రవ్యం ఈశ్వరుని అష్టమూర్తులు. ఈ అష్టమూర్తులే ఈశ్వరుని స్థూలరూపం. అంటేపైకి కన్పించే రూపం అన్నమాట. ఈ స్థూల రూపమౌలిక అంశాలైన అష్టమూర్తులే సృష్టికి కారణమయి నీ మూర్తిని అద్భుతం, అనల్పం, శ్రీకరం చేస్తున్నవని తాత్పర్యం.

104. *అతివాఙ్మానసమై యజాండనిలయంబై యాది మధ్యాంత వ*
ర్జితమై నిర్గుణనిష్కలంక పదమై సిద్ధాంత మధ్యాత్మసం
యుతమై కోటి రవి ప్రకాశయుతమై యోంకారమంత్రాది సం
స్తుతమై యెంచ నచింత్యమై వెలుగు నీ సూక్ష్మంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నీ సూక్ష్మంబు = నీ యొక్క సూక్ష్మరూపం; అతివాక్మానసమై = వాక్కుకీ మనస్సుకీ అతీతమైన; అజాండ నిలయంబై = బ్రహ్మాండానికి నెలవై; ఆది

మధ్యాంత వర్జితమై = మొదలు, నడుమ, తుదీ లేనిదై; నిర్గుణ నిష్కలంకపదమై = గుణరహితమూ, కళంక రహితమూ ఐన స్థానమయి; సిద్ధాంత = తత్త్వంతోనూ; అధ్యాత్మ = పారలౌకికములతో; సంయుతమై = కూడుకొన్నదయి; కోటి రవి ప్రకాశయుతమై = కోటి సూర్యుల ప్రకాశంతో కూడుకొన్నదయి; ఓంకారమంత్రాది = ఓంకారమంత్రాదుల చేత; సంస్తుతమై= కీర్తింపబడినదై, ఎంచన్ = లెక్కించగా; అచింత్యమై = ఆలోచించడానికి వీలులేనిదయి; వెలుగు = ప్రకాశిస్తుంది.

— *సర్వేశ్వరా! నీ సూక్ష్మ శరీరం అవాఙ్మానసగోచరము, బ్రహ్మాండాల కాధారం; ఆదిమధ్యాంతరహితం, నిర్గుణం, నిష్కళంకం, అధ్యాత్మ సిద్ధాంత యుక్తం, కోటి సూర్య ప్రకాశయుతం, ఓంకార మంత్రాదుల చేత సంస్తుతమయి అచింత్యమై ప్రకాశిస్తుంది.*

❄ పై పద్యంలోనూ ఈ పద్యంలోనూ అన్నమయ్య కవి ఈశ్వరుని స్థూల సూక్ష్మ శరీరాలను గురించిన తత్త్వాన్ని తెలిపారు. స్థూల దేహం ఈశ్వరుని సంకల్పంచేత ఈశ్వరుడెట్లా అష్టమూర్తులుగా ఏర్పడ్డాడో తెలుపుతుంది. సూక్ష్మ దేహం సృష్టికి పూర్వం శివుని కేవల సత్తను తెలుపుతుంది. ఆ శివ స్థితి స్థూల స్థితికి మూలం. ఇది మంత్రాతీతం. వాక్కుకీ మనస్సుకీ అతీతం. ఆది మధ్యఅంతాలు లేని స్థితిఇది.

❄ స్థూలశరీరమే స్వల్ప ప్రమాణం కలది. సూక్ష్మమే అన్నిటికీ మూలం. "శివలోకాద్బహిర్ జ్ఞేయాన్యండస్యావరణాని" బ్రహ్మాండ ఆవరణాలన్నీ శివలోకానికి వెలుపల కింద ఉంటవి.

— "తుర్యంచ తురీయాతీతంచ శివస్థానము నామయం" అని ఉత్తర గీతా వాక్యం. శివస్థానం తురీయాతీతం. అన్నమయ్య చెప్పిన ఈ పద్యభావానికి మూలం అథర్వ శిరస్సులో ఇట్లా ఉన్నది.

— "నతత్ర సూర్యోభాతి, నచంద్రతారకం, నేమా విద్యుతోభాంతి, కుతోఽయమగ్నిః; తమేవ భాంతమనుభాతి సర్వం తస్యభాసా సర్వమిదం విభాతి."

"పరమేశ్వరోఽహం పుష్కరమహం, పవిత్ర మహమగ్రంచ మధ్యంచ, బహిశ్చ పురస్తాత్ జ్యోతిరిత్యహమేకః, సర్వేచమామేవచ, మాంయోవేద, స సర్వాన్ దేవాన్ వేద."

- *సూర్యాదుల తేజస్సుల్ని మించిన మహాప్రకాశం కల్గిన మహాతేజఃకాంతితో సమస్తమూ (సర్వమిదం) ప్రకాశిస్తుంది. నేను పరమేశ్వరుణ్ని. ఆకాశం నేనే. ఉదకం నేనే. మొదట, నడుమ, వెలుపల ముందరా ఉండేవాణ్ని నేనే. వెలుగు నేనే. నేనొక్కణ్నే అన్ని రూపాలలో ఉండే వాణ్ననీ, జీవాత్మలందరూ నన్నే ఆశ్రయిస్తారనీ నన్నెవ్వడు గుర్తిస్తాడో వాడే సర్వదేవతలను తెలిసికొంటాడు.*

❉ *ఈ పదం నిర్గుణ నిష్కళంకపదం. సత్త్వరజస్తమోగుణ వికారాలే జగత్ సృష్ట్యాదుల్ని చేస్తవి. అట్లాంటి వికారాలకు లోనుకానిది ఈ సూక్ష్మరూపం. గుణాలే కళంకాలు. గుణరహిత స్థితే కళంక రహితస్థితి.*

❉ *ఓంకారం సూక్ష్మ పంచాక్షరి. స్థూలరూపాన్ని దాటిన ఈ సూక్ష్మ రూపాన్ని తెలిసికోవడానికి అ-ఉ-మ అన్న అక్షరాల ఓంకారాన్ని సాధనంగా తీసికొంటారు.*

105. *అజుఁడై సృష్టియొనర్చు రాజసమునందందంబుగాఁ దా నధో*
క్షజుడై వర్ధిలజేయు సాత్త్వికము సంప్రవ్యక్తిగా గోపతి
ధ్వజుడై సంహృతి సేయుఁ దామసమునం దత్సర్వముం గూడఁగా
నిజవిస్ఫూర్తి వెలుంగుఁ దుర్యమగుచున్ నీ యాజ్ఞ సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నీ ఆజ్ఞ = నీ శాసనం చేత; తా = తాను; అందు = అక్కడ, అందంబుగా = సుందరంగా; రాజసమున్ = రజోగుణం; అజుడై = బ్రహ్మయై; సృష్టి ఒనర్చు = సృష్టిచేస్తుంది; సంప్రవ్యక్తిగా = విశదంగా; అధోక్షజుడై = విష్ణువై; సాత్త్వికము

= సత్త్వగుణం; (ఆ సృష్టిని) వర్ధిలచేయు = (పోషించి) పెంచుతుంది; తత్ సర్వముంగూడగా = ఈ సర్వాన్నీ కలిపి; తామసమునన్ = తమోగుణంచే; గోపతి ధ్వజుడై = వృషభకేతనుడయి; సంహృతిచేయు = సంహరిస్తాడు; (ఇక) నిజవిస్ఫూర్తి = స్వీయమైన విస్పష్టస్ఫురణ; తుర్యము అగుచున్ = నాల్గవది అవుతూ; వెలుంగు = ప్రకాశించును.

– సర్వేశ్వరా! నీ ఆజ్ఞచేత రజోగుణం బ్రహ్మ అయి సుందరంగా సృష్టిచేస్తుంది. దాన్నే ఇంకా స్పష్టీకరిస్తూ విష్ణువుగా సత్త్వగుణం పోషిస్తుంది. వృషభధ్వజుడై తామగుణం దాన్ని సంహరిస్తుంది. ఈశ్వరుని విస్ఫూర్తి నాల్గవదిగా వెల్గుతుంది.

❄ సత్త్వ రజస్తమస్సులు ఒకటి రెండు మూడు అంశాలు కాగా తురీయం అంటే నాల్గవది ఈ మూడింటి పైదిగా కవి చెప్తున్నారు.

❄ రజస్సత్త్వతమస్సులచేత బ్రహ్మవిష్ణు మహేశ్వరులు సృష్టించి దాన్ని పోషించి దాన్ని లయించడాలు చేస్తున్నారు. కాని సృష్టికి తత్పరిణామాలకూ మూలమైంది మరొకటి ఉన్నది. అందులోనే ఈశ్వరుడు తన సంపూర్ణ నిజస్ఫూర్తిని చూపుతూ వెలుగుతున్నాడు. మిగిలినవి కేవలం అంశలు మాత్రమే.

106. సకలాధీశ్వర పట్టభద్రుఁడవు భిక్షాగామి వత్యంత శాం
త కళాత్ముండవు రౌద్రమూర్తివతి సౌందర్యాంబికా సంగమా
ధిక లోలుండవు దివ్యయోగివి మదిం దెల్లంబుగా నెట్టివా
రికిఁ దా శక్యమె నీనిజం బరసి చర్చింపంగ సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సకల అధీశ్వర పట్టభద్రుఁడవు = సమస్తం మీద అధికారాన్ని కలిగిన

అధిపత్యానికి పట్టం కట్టబడిన వాడివి; భిక్షాగామివి = బిచ్చం కోసంతిరిగే వాడివి; అత్యంత = మిక్కిలి; శాంత కళాత్ముండవు = శాంత తేజస్సుతో కూడిన వాడివి; రౌద్రమూర్తివి = క్రోధమూర్తివి; సౌందర్య = సుందరమైన; అంబికా సంగమ = అంబికతో సంగమించడానికి; అధిక లోలుడవు = మిక్కిలిగా లోలుపత కలిగినవాడివి; దివ్యయోగివి = దివ్యత్వం కలిగిన యోగీశ్వరుడివి; నీ నిజంబు = నీ యొక్క సత్యాన్ని; అరసి = తెలిసికొని; చర్చింపంగ = వితర్కించడానికి; ఎట్టి వారికి = ఎలాంటి వారికైనా; తా = అది; శక్యమె = సాధ్యమవుతుందా?

— *సర్వేశ్వరా! నీ యొక్క సత్యం తెలిసికోవడం ఎలాంటి వారికైనా సాధ్యం అవుతుందా? సకలాధీశ్వరుడివి నీవు. మరి అట్లాగే భిక్షపతివి నీవు! పరమశాంతుడివి, కాని రౌద్రమూర్తివి కూడా! సుందరాంబికా సమాగమం కోసం పరితపించేవాడివి. కాని దివ్య యోగివి కూడా. వీటిల్లో నీవేదో ఎవరు తెలిసికోగల్గుతారు.*

❄ *ఈ పద్యంలో శివునిలోని వైరుధ్యాలను ఉటంకిస్తూ శివతత్త్వ రహస్యాన్ని తెలిసికోవడం ఎవరివల్లా కాదేమోనంటున్నాడు అన్నమయ్య కవి.*

107. *భవదుఃఖార్ణవ యానపాత్రము పరబ్రహ్మంబు యోగీంద్ర హృ*
ద్భవన ప్రస్ఫురిత ప్రదీపము లయధ్వాంతార్క బింబం బతి
శ్రవణానందకరంబు సన్ముని గణ స్వాధ్యాయ సారంబు మీ
శివనామాంకము భక్తపుంగవ సదా సేవ్యంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భవదుఃఖార్ణవ = సంసార దుఃఖమనే సముద్రంలో, యానపాత్రము = ప్రయాణంచేసే నావ; పరబ్రహ్మంబు; యోగీంద్రహృత్ = శ్రేష్ఠులైన యోగుల హృదయమనే; భవన = మందిరంలో; ప్రస్ఫురిత = దీపించే; ప్రదీపము =

శ్రేష్ఠమైన జ్యోతి; లయధ్వాంత = ప్రళయమనే అంధకారానికి; అర్కబింబంబు = సూర్యబింబం; అతి = మిక్కిలిగా; శ్రవణానంద కరంబు = చెవులకు ఆనందాన్ని కలిగించేది; సన్మునిగణ = మునిశ్రేష్ఠుల సమూహం యొక్క; స్వాధ్యాయ = వేద పఠన; సారంబు = సారం; మీ శివనామాంకము = మీదైన శివనామం; (అది) భక్తపుంగవ = భక్త శ్రేష్ఠులకు; సదా సేవ్యంబు = నిరంతరం భజింపదగింది.

— *సర్వేశ్వరా! సంసార దుఃఖం అనే సముద్రాన్ని తరించే నావ, పరబ్రహ్మం, యోగి హృదయాలలో జ్వలించే జ్యోతి; ప్రళయకాల అంధకారానికి సూర్యబింబం; చెవులకు మిక్కిలి ఆనందం కల్గించేది; సన్మునుల స్వాధ్యాయం యొక్క సారం; మీ యొక్క శివనామం. (అందుచేత) అది భక్తులు నిరంతరం సేవించదగింది.*

❄ *శివశబ్ద నిష్పత్తిని శ్రీ నీలకంఠభాష్యం (ఆంధ్రానువాదం) ఈ కింది విధంగా సాధించింది.*

— *శమిధాతువునకు వన్ ప్రత్యయం రాగా శమివన్ అవుతుంది. వ్యాకరణ శాస్త్ర నియమానుసారంగా అమ్, న్, అన్న రెండూ లోపించినందువల్ల శమి అన్నదాన్లో శ్ - ఇ, వన్ అన్నదాన్లో వ కారం నిలిచాయి. ఇట్లా శివ శబ్దం నిష్పన్నం అయింది.*

— *దోషాలు లేనివాడూ, గుణాలు కలవాడూ అని 'అచ్' ప్రత్యయాంతమైన శివశబ్దంచెప్తోంది. జగాన్ని హెచ్చుతగ్గులున్నదాన్నిగా సృష్టించడమూ, దాని తారతమ్యానికి కావాల్సిన పక్షపాతం లేకుండడం, జగానికి ఉపాదానం నిమిత్తం కావడం అన్నవి పరస్పర విరుద్ధాలైనప్పటికీ సర్వ సమర్థుడైన శివునికి చెల్లుతున్నాయి.*

— *ఆణవమాయిక కార్మిక మల సంబంధంలేకుండా గొప్పవైన మంగళగుణాలు శివుని స్వభావం. సర్వజ్ఞత్వం శివుని లక్షణం.*

❋ శివ సహస్రనామాలలో మొదటిది ఓంశివాయనమః అని. దీన్ని వ్యాఖ్యానిస్తూ శైవవాఙ్మయార్ణవ, శ్రీ కంఠ విద్యాభూషణులైన శివయోగులు నిర్మల శంకర శాస్త్రి ఆరాధ్యుల వారు కింది భావాన్ని రాశారు.

– శివ శబ్దం మంగళాన్ని చెప్తుంది. పరిశుద్ధమైన సచ్చిదానంద స్వరూపం గలవాడు శివుడు. అందుకే ఆది శంకరులు "చిదానంద రూపఃశివో ఽహం" అని అన్నారు. సమస్త ప్రపంచం విశ్రాంతి చెందడానికి ఆది శక్తికి ఆశ్రయమైన వాడూ, ప్రశాంత స్వభావుడూ, కామక్రోధలోభ మోహమద మాత్సర్య వికారాలు లేనివాడూ, ఇచ్ఛాశక్తి అనే మహాసంపత్తిని వామాంకంలో కూర్చుండ బెట్టుకొన్నవాడూ, లోకహితాన్ని కోరేవాడూ, శుభప్రదుడూ, అనంత కళ్యాణ గుణపరిపూర్ణుడైన వాడూ - శివుడు. శివపంచాక్షరిలో ఉన్నది శివనామమే.

108. ***అణిమాద్యష్ట గుణ ప్రసిద్ధులు త్రిలోకారాధ్యులుద్యద్వచో***
మణికోటి ప్రతిమ ప్రభాపటలు లున్మాదేంద్రియధ్వాంత భీ
షణ దైత్యేంద్ర వినాశ కారణ మహాశౌర్యోన్నతుల్ లోకర
క్షణదక్షుల్ వినుతింప నీ ప్రమథ సంఘాతంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

వినుతింప = కీర్తించగా; నీ ప్రమథ సంఘాతంబు = నీ యొక్క ప్రమథగణాలు; అణిమ ఆది = అణిమ గరిమఇత్యాది; అష్టగుణ ప్రసిద్ధులు = ఎనిమిది గుణాలలో బాగా సిద్ధిపొందిన వాళ్ళు; త్రిలోకారాధ్యులు = ముల్లోకాలలో పూజించదగ్గ వాళ్ళు; తత్ = వారి యొక్క; వచోమణికోటి =వాక్కుల మణి సమూహం అనే; ప్రతిమ = రూపం యొక్క; ప్రభాపటలులు = కాంతిపుంజం కలిగిన వాళ్ళు; ఉన్మాద = పిచ్చి ఎత్తిస; ఇంద్రియధ్వాంత =

ఇంద్రియాల అంధకారమనే; భీషణ = భయంకర; దైత్యేంద్ర = రాక్షసశ్రేష్ఠుల; వినాశకారణ = నాశనానికి కారణమైన; మహాశౌర్య ఉన్నతుల్ = గొప్ప శూరగుణం చేత మహాత్ములయిన వారు; లోకరక్షణ = జగత్తునురక్షించడంలో; దక్షులు = నేర్పరులు.

– సర్వేశ్వరా! నీ ప్రమథగణాలు అణిమాద్యష్ట సిద్ధులు కలిగిన వాళ్లు. ముల్లోకాలలో ఆరాధ్యులు. వారి వాక్కులనే మణుల ప్రతిమల తేజస్సులు కలిగిన వాళ్లు. మదించిన ఇంద్రియాలనే అంధకారదైత్యుల వినాశానికి కారణమైన మహాశౌర్యం చేత ఉన్నతులు. లోకరక్షణలో దక్షులు.

❄ ధర్మాధర్మాలు బాగా తెలిసి కైలాసంలో శివుని చుట్టూతా ఉన్న శివుని లెంకలు ప్రమథగణాలు. శివపురాణంలో ప్రమథులను గురించి ఇట్లా ఉన్నది.

– రుద్రునితో సమానమైన ప్రసిద్ధి, సర్వజన విదితమైన బలం, గొప్ప పరాక్రమం, మహాదేవ ప్రతిభతో సరితూగే ప్రభావం కలిగినట్టి వాళ్లను రుద్రగణాలనీ, ప్రమథులనీ, దేవయోని విశేష భూతములనీ పిలుస్తారు. వీళ్లు పునరావృత్తి రహితమైన శాశ్వత శివానందాన్ని అనుభవించే నిత్యముక్తులు. వీళ్లకి సమానులు లేరు. ఒకరి మీద ఒకరికి వైరం లేదు. ప్రకృతి సంబంధమైన బాధలు లేని వాళ్లు. తమ తమ శక్తులతో అనుచరులతో కలిసి ఉంటారు. అన్ని లోకాలవారూ వీరికి నమస్కరిస్తారు. సురాసుర మానవాది ప్రపంచాన్ని పుట్టించడంలోనూ గిట్టించడంలోనూ వీళ్లు సమర్థులు. పరమశివునికి అత్యంత ప్రియులు. శివుని లక్షణాలైన భస్మరుద్రాక్ష ధారణాదులతో వీరుగుర్తింపబడుతారు. శాంతస్వభావులూ - ఉగ్రచిత్తులూ. శాంత ఉగ్రస్వభావ మధ్యవర్తులూ. వికృత రూపమూ సురూపమూ కలిగిన వాళ్లు. నానా రూపధరులూ.

– ఇవీ ప్రమథుల లక్షణాలు. అన్నమయ్య వీటికితోడు మరి కొన్ని లక్షణాలనీ పద్యంలో చెప్పారు.

109. *సకలాధీశ్వరులై గణాధిపతులై సర్వజ్ఞులై నిత్యులై*
అకలంకాత్మకులై మహామహిములై యంభోజగర్భాండ ర
క్షకులై యుండుదు రెల్లవారును భవత్సద్భక్తి నానా గణా
ధిక లీలా విధి నంతరంగముల వర్తింపంగ సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఎల్లవారును = సమస్త జనులును; భవత్ = నీ యొక్క; సద్భక్తి = సత్ భక్తి; నానా గణాధిక, లీలా విధిన్ = అనేక సమూహాల కంటే అధికంగా విలాసంతో; అంతరంగములు = హృదయాలలో; వర్తింపంగ = ఉంటూండగా; సకల అధీశ్వరులై = అన్నింటిపై ఆధిపత్యం కలవారయి; గణాధిపతులై = ప్రమథగణాలకు నాయకులై; సర్వజ్ఞులై = సర్వవిషయాలను తెలిసినవారయి; నిత్యులై = శాశ్వతులయి; అకలంకాత్మకులై = నిష్కళంకాత్ములై; మహామహిములై = గొప్పమహిమ కల్గిన వారలై; అంభోజగర్భ అండ = పద్మ గర్భంలోని నిసువైన బ్రహ్మను; రక్షకులై = రక్షించే వాళ్లయి; ఉండుదురు = ఉంటారు.

— *సర్వేశ్వరా! నానా గణాధిక లీలా విధితో అంతరంగాలలో నీపై భక్తి ఉండటంవల్ల అట్టి సమస్త జనులు సకలాధీశ్వరులయి, గణాధిపతులయి, సర్వజ్ఞులై, శాశ్వతులయి, నిష్కళంకులయి, మహామహిమ కలవారయి, బ్రహ్మను రక్షించే వాళ్లయి ఉంటారు.*

110. *అమరేంద్రాబ్జ భవాచ్యుతాదులకు నీ యాజ్ఞాప్రభావం బలం*
ఘ్యము నీకున్ భవదీయ భక్త మహదాజ్ఞాపంబు నుద్యత్ప్రభా
వము లోకంబులలో నలంఘ్యమగుటన్ వర్ణింపగా నీ మహా
త్త్వము కంటెం గడు జెల్లు భక్తుల మహత్త్వం బెన్న సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమరేంద్ర అబ్జభవ అచ్యుతాదులకు = ఇంద్రబ్రహ్మ విష్ణువు మొదలైన వారికి; నీ యాజ్ఞా ప్రభావంబు = నీ యొక్క ఆజ్ఞా శక్తి; అలంఘ్యము = దాట రానిది; నీకున్ = నీకేమో; భవదీయ = నీయొక్క; భక్త = భక్తుల యొక్క; మహత్ ఆజ్ఞాపంబున్ = గొప్ప ఆజ్ఞయు; ఉద్యత్ ప్రభావంబు = దాని నుంచి పైకి లేస్తున్న శక్తి; లోకంబులలో = లోకాలలో; అలంఘ్యము అగుటన్ = దాటరానిది కావడంచేత; వర్ణింపగాన్ = వివరించగా; నీ మహత్తము కంటెన్ = నీ మహిమ కంటే కూడా; ఎన్న = పరిగణిస్తే; భక్తుల మహత్త్వంబు = నీ భక్తుల గొప్పదనమే; కడు చెల్లు = ఎక్కువగా చెల్లుతుంది.

— సర్వేశ్వరా! విష్ణుబ్రహ్మేంద్రులకు నీయాజ్ఞ జవదాటరానిది. అట్లాగే నీ భక్తుల ఆజ్ఞ నీకు దాట రానిది. అందువల్ల నీ మహత్త్వం కంటే నీ భక్తుల మహత్త్వమే ఎక్కువ విలువైది.

❄ భగవంతుని కన్నా భక్తుడే అధికమంటాయి ఇలాంటి మతాలు. భక్తి మార్గంలో ఇది ప్రధాన సూత్రం. శైవులలో జంగముడు శివునికన్నా అధికుడు. జంగమార్చన శివార్చనా ఒక్కటే అని భావిస్తారు.

111. శివసాహిత్యుల సత్కర స్థలము కాశీక్షేత్రమా హస్త దే
శవిశాలోన్నత శాఖలారయఁగఁ బంచక్రోశమా పాణి సం
భవ శోభాన్విత చిత్రరేఖలు మహాభాగీరథీ తీర్థముల్
శివలింగంబల విశ్వనాథుఁడరయన్ సిద్ధంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

శివ సాహిత్యుల = శివలింగాన్ని కలిగి ఉన్న వారి యొక్క (అంటే లింగధారుల); సత్ కరస్థలము = (శివపూజావేళలో లింగధారులు శివలింగాన్ని

అరచేతిలో ఉంచుకొంటారు) మంచి హస్త ప్రదేశం; కాశీక్షేత్రము =(అదే) శ్రీ కాశీ క్షేత్రం; ఆహస్తదేశ = ఆశివ లింగాన్ని ఉంచిన హస్తంలోని; విశాల ఉన్నత శాఖలు = నిడివైన ఎత్తయిన చోటులు; ఆరయగ = పరిశీలిస్తే; పంచక్రోశము = పంచక్రోశ పర్యంతము (ఐనకాశీక్షేత్రం); ఆ పాణి = ఆ అరచేతిలో; సంభవ = పుట్టిన; శోభాన్విత = రామణీయకతతో కూడు కొన్న; చిత్ర రేఖలు = విచిత్రమైన హస్త రేఖలు; ఘహభాగీరథీ తీర్థముల్ = ఘనమైన గంగానది యొక్క ప్రవాహాలు; శివలింగంబు = (చేతిలో అర్చన కోసం ఉంచిన) ఇష్టలింగమూర్తి; అల; విశ్వనాధుడు = కాశీ విశ్వేశ్వరుడు; అరయన్ = పరిశీలిస్తే; సిద్ధంబు = (ఇదంతా ఇట్లా) ఏర్పడి ఉన్నది.

— *శివలింగధారుల సుహస్తమే కాశీక్షేత్రం. ఆ హస్తంలోని ఉబ్బెత్తులే పంచక్రోశం. ఆపాణిలో పుట్టిన సుందరమైన చిత్రరేఖలే మహాభాగీరథీ తీర్థములు. అందులో ఉంచిన శివలింగమే విశ్వనాధుడుగా ఓ సర్వేశ్వరా సిద్ధించి ఉన్నట్లు పరిశీలన మీద తెలుస్తుంది.*

❋ *ఈ పద్యంలో శివలింగధారుల హస్తం ఎట్లా కాశీ సాదృశ్యాన్ని పొందుతుందో తెలిపారు కవి. శివలింగధారులు అంటే గురువుచేత లింగధారణా, పంచాక్షరీ మంత్రోపదేశమూ పొందిన వాళ్లని అర్థం. గురువు కట్టిన శివలింగం మెడలో నిరంతరం ఉండాల్సిందే. స్థూల దృష్టికి కనిపించే ఈ శివలింగాన్ని ఇష్టలింగం అని అంటారు. హృదయకమలంలో జ్యోతి రూపంలో ఉండే శివలింగాన్ని ప్రాణలింగం అంటారు. సంకల్ప వికల్పాత్మకమై మనస్సుకి అతీతంగా సత్తామాత్రం చేత గ్రహింపదగింది భావలింగం అని అంటారు.*

పూజయన్నిష్టలింగంతు - నిధ్యాయన్ ప్రాణ లింగకం!
భావయన్ భావలింగంవై - మృత్యుపాశాంశ్చినత్తినః!!

ఇష్టలింగాన్ని పూజిస్తూ ప్రాణలింగాన్ని ధ్యానిస్తూ భావలింగాన్ని భావించి నట్లయితే మృత్యుపాశాలను తెంచివేయగల్గుతుందని అర్థం.

ఈ పద్యంలో లింగధారి విషయం ప్రస్తావించారు. కాబట్టి లింగత్రయ వ్యవహారాన్ని కూడా గ్రహించాలి. శివలింగార్చన చేసినట్లయితే ఏ క్షేత్రానికీ పోనక్కర్లేదు. ఏ తీర్థంలోనూ మునుగనక్కర్లేదనడానికి కూడా ఈ పద్యంలో కవి ఇట్లా హేతువును చూపుతున్నాడు.

❊ లింగధారులకు తమ ఇష్టలింగాన్ని మించిందిలేదు. వాళ్లకి ఇష్టలింగ పూజద్వారానే సర్వమూ సిద్ధిస్తుంది.

112. వరుసం బైకొని వచ్చు కర్మములమున్వారించి మాయామల
జ్వరముల్దూల్చి యపార ఘోరతర సంసారాబ్ధి లంఘించి భీ
కర సూక్ష్మాంగ విచిత్ర కంచుకము వీకంబుచ్చి పోవైచి తాఁ
బరమ వ్యోమము సొచ్చు నీ యచల సద్భక్తుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

వరుసన్ = ఒక దాని వెంట ఒకటిగా; పైకొని వచ్చు = మీది మీదికి వచ్చే; కర్మములన్ = కర్మలని; వారించి = నిరోధించి; మాయామల జ్వరముల్ = మాయచేత మలముల చేత కలిగే రోగాలను; తూల్చి = పోగొట్టి; అపార = తీరంలేని; ఘోరతర = భీకరమైన; సంసార అబ్ధి = సంసారం అనేసాగరాన్ని; లంఘించి = దాటి; భీకర = భయంకరమైన; సూక్ష్మాంగ = చిన్నదైన అంగం అనే; విచిత్ర = విచిత్రమైన; కంచుకము = కవచాన్ని; వీకన్ = ఉత్సాహంతో; పుచ్చి = గ్రహించి; పోవైచి = పోగొట్టి; నీ అచల సత్ భక్తుండు = నీ యొక్క నిశ్చల భక్తుడు; తా = తాను; పరమ వ్యోమము = చిదాకాశంలోకి; చొచ్చు = దూరుతాడు (చేరుతాడు)

– సర్వేశ్వరా! నీ మీద నిశ్చలభక్తి ఉన్నవాడు ఒకదాని వెంట ఒకటిగా వచ్చే కర్మలను ముందుగా నిరోధించి; మాయా మలములనే జ్వరాలను పోగొట్టి,

తీరమే లేని భయంకర సంసారార్ణవాన్ని దాటి, భీకరమైన సూక్ష్మాంగం అనే విచిత్రమైన కంచుకాన్ని పోగొట్టి, తాను పరమాకాశాన్ని ప్రవేశిస్తాడు.

❄ ఈ పద్యంలో శైవులు ప్రత్యేకంగా చెప్పేమలత్రయం ప్రసక్తి చేశారు కవి. మలం అంటే అజ్ఞానమని అర్థం. ఈ అజ్ఞానం ముప్విధాలుగా ఉన్నది.

ఆణవము, మాయికము, కార్మికమన్నవి మూడు మలాలు.

(1) ఆణవము సృష్టి ప్రారంభంలో అణువుల కూడికవల్ల ఏర్పడేది

(2) మాయికము ఈశ్వరుని విడిచి ఉండని మాయాశక్తివల్ల సంభవించేది.

(3) కార్మికము సంచితకర్మ ప్రారబ్ధకర్మలకు సంబంధించింది.

ఈ పద్యంలోని సూక్ష్మాంగం అన్నది సూక్ష్మ శరీరమనే అర్థం కల్గింది. ఇది ఆణవం. అణువుల కూడికవల్ల ఏర్పడేది. ఈశ్వర భక్తుడు దీనిని పోగొట్టుకొంటాడు. చిదాకాశంలోకి చేరడానికి ఇది పోతే ఒక అడ్డంకి తొలగిపోయినట్లు.

ఈ పద్యం మొదట్లో వరుసగా కర్మలు మీదికి వస్తుంటే వాటిని వారించి అని ఉన్నది. ఒక దాని తర్వాత ఒకటిగా దండెత్తివచ్చే కర్మలు ప్రారబ్ధకర్మ ఫలితమే. ప్రారబ్ధకర్మలే కార్మికం - కర్మకు సంబంధించింది. ఈశ్వరభక్తుడు దీన్ని తొలగించుకోగల్గుతాడు.

మాయతొలగనిది సంసారం మీద విరక్తి కలుగదు. అట్లా విరక్తి కలుగనిది జ్ఞానం కల్గనేకల్గదు. అందుచేత ఈ మాయకల్గించే అజ్ఞానం తొలగిపోవాలి. ఈ అజ్ఞానాన్నే మాయికం అన్నారు. ఈశ్వర సద్భక్తుడు దీన్ని పోగొట్టు కొంటాడు.

❄ ఈ త్రివిధమలాలు పోగొట్టుకోగల్గుతే ఈశ్వర భక్తుడు పరమవ్యోమంలోకి ప్రవేశిస్తాడు. ఇదే చిదాకాశం. సాంకేతికంగా ఆకాశ విషయాన్ని పురాణం ఇట్లా వివరించింది.

"తేహి సాక్షా ద్దివిషద - స్త్వంతరిక్ష సదస్తథా

పృథివీషద ఇత్యేతే - దేవా దేవవ్రతే స్థితాః"

ఈ లోకంలో పృథివీ శబ్దానికి పధ్నాలుగులోకాల బ్రహ్మాండం, అంతరిక్ష పదానికి బ్రహ్మాండానికి మించిన మాయాపదం, ద్యౌః పదానికి పరాకాశ మనదగినదీ, శుద్ధ శక్తి రూపమూ అయిన శివపదమనీ అర్థం.

ఇక్కడ అన్నమయ్య కవి 'పరమవ్యోమం' అంటున్నది ఈ 'పరమ ఆకాశం' అయిన శివపదాన్నే. అంటే శివభక్తుడు ఆణవాది మలత్రయాన్ని పోగొట్టుకొంటే శివపదాన్ని పొందుతాడని అర్థం. ఇక్కడ శివపదాన్ని పొందడానికి శివత్వాన్ని పొందడానికీ వెంట్రుక వాసియే భేదం. ఆణవ మాయిక కార్మిక మలాల సంబంధం లేకుండా ఘనమైన మంగళగుణాలు కల్గిన శివునితో సమానమైన స్వభావాన్ని కలిగి ఉండటమే శివత్వం. త్రివిధ మలాలు పోయిన శివభక్తుడు పరమవ్యోమంలోకి చొచ్చుకొనిపోయిన తర్వాత పొందేస్థితి శివత్వమే.

ఈ పద్యంలో ఈతత్త్వమంతా ఇమిడించారు. అన్నమయ్య కవీంద్రుడు.

113. పరమార్థంబగు తత్త్వమారయఁగ నీ పాదాబ్జ సద్భక్తుఁడొ

క్కరుఁడే దక్క సరోజజాద్యమర సంఘాతంబులో నెల్లఁదా

నెరయం గాచి కొనంగఁ జాలరు మహానిర్భీతుఁడున్ లేఁడతి

స్ఫురణం గాలుఁడు దన్నువేచి వడిఁ గొంపోనుండ సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

పరమఅర్థంబు అగుతత్త్వము ఆరయఁగ = ఇంతకన్నా వేరే అర్థం మరోటి లేదనబడే తత్త్వాన్ని పరిశీలిస్తే; నీ పాదఅబ్జ సద్భక్తుడు ఒక్కరుఁడే తక్క = నీ చరణ కమలాలపై సద్భక్తి ఉన్న వాడొక్కడే తప్ప; అతిస్ఫురణన్ = ఎంతో

స్పష్టంగా; కాలుఁడు = యముడు; వేచి = ఎదురుచూస్తూ ఉండి; తన్ను = తనను; వడి = వేగంగా; కొంపోన్ ఉండ = తీసికొనిపోవటానికి సిద్ధంగా ఉన్నప్పుడు; సరోజజ ఆది = బ్రహ్మాది; అమరసంఘాతంబులోన్ ఎల్ల = దేవతల బృందం సమస్తంలో; తాను ఎరయన్ = తాను దగ్ధమవకుండా (మృతి పొందకుండా); కాచికొనంగ చాలరు = రక్షించుకోలేరు; (వారిలో); మహానిర్భీతుడున్ = భయరహితుడైన గొప్పవాడు కూడా; లేడు = (ఎవ్వడూ) లేడు.

— *సర్వేశ్వరా! పరమార్థాన్ని పరిశీలిస్తే నీ సద్భక్తుడు ఒక్కడు తప్ప, యముడు కాచి ఉండి తనను తీసికొని పోతున్నపుడు బ్రహ్మాది దేవతలందరూ తమను రక్షించుకోలేరు. భయపడకుండానూ ఉండలేరు.*

114. *తన చారిత్రము తత్త్వవేత్తలగు భక్త శ్రేణి వర్ణింపఁగా*
దనచిత్తంబు భవత్పదస్మరణ చేతన్ నిన్ను మెప్పింపఁగా
ననుకూల స్ఫుట నిష్కలంక బహిరంగాభ్యంతరంగ స్థితిన్
వినుతిం బొందిన తజ్జ్ఞుఁడీ జగములో నీమెచ్చు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

తన చరిత్రము = తన యొక్క నడవడిని; తత్త్వవేత్తలు అగు = పరమార్థాన్ని చూడగలిగిన వారగు; భక్తశ్రేణి = భక్తులపరంపర; వర్ణింపఁగా = వర్ణించేటట్లుగా; తన చిత్తంబు = తన యొక్క మనస్సు; భవత్ పదస్మరణ చేతన్ = నీ యొక్క చరణస్మరణచేత; నిన్ను; మెప్పింపఁగాన్ = మెప్పించేటట్లుగా; అనుకూల =సుముఖమైన; స్ఫుట = స్పష్టమైన; నిష్కలంక = కళంకం లేనట్టి; బహిరంగ, అభ్యంతరంగ, స్థితిన్ = బైటీ, లోపలీ ఉనికి చేత; వినుతిన్ పొందిన = కీర్తిని

పొందినట్టి; తజ్జ్ఞుడు = జ్ఞాని; ఈ జగములో = ఈ లోకంలో; నీ మెచ్చు =నీవు మెచ్చుకోగల్గినవాడు.

— సర్వేశ్వరా! ఎవడి నడవడిని నీ భక్త సమూహం వర్ణిస్తుందో, ఎవడి చిత్తం నీచరణ స్మరణ చేత నిన్ను మెప్పిస్తుందో, అనుకూలమూ, స్పష్టమూ, నిర్మలమూ అయిన అంతర్బహిఃస్థితి చేత ఎవడుకీర్తి పొందుతాడో వాడే ఈ జగంలో నీ మెప్పుని పొందుతాడు.

❋ ఇట్లా శివుని మెప్పు పొందేవాడు, భక్తుల మెప్పునీపొందేవాడు మామూలు వాడు కాడుకదా - అతడూ మహాభక్తుడే అని తాత్పర్యం. ఐతే దీన్ని కవి చమత్కారంగా చెప్తున్నాడు. శివుని మెచ్చుకోలు పొందగల్గిన భక్తుడు అంతర్బహిస్సులలో సుముఖుడూ నిష్కళంకుడూ, అక్లిష్టుడూ కావాలనడాన్ని గమనించాలి.

115. క్షితినత్యుగ్ర తపంబునందు జఠరాగ్నిం గ్రాఁగఁగానేల మి
మ్మతి భక్తి స్థితిఁ బూజసేయు మహనీయత్వంబు తాఁజాలదే
ప్రతిపక్షాలి నడంప రోగ భయదుర్భారంబు వారింప న
ద్భుత సౌఖ్యంబులు బెంప దివ్యసుఖముం బొందింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ప్రతిపక్షాలిన్ అడంప = శత్రువులని అణచి వేయడానికి; రోగభయ = రోగ భయమనే; దుర్భారంబు = చెడ్డబరువును (మహాభారాన్ని); వారింపన్ = నిరోధించటానికి; అద్భుత సౌభాగ్యము = అద్భుతమైన ఐశ్వర్యాన్ని; పెంప = వృద్ధి చేయడానికి; దివ్య సుఖమున్ = దేవతా సంబంధమైన సుఖాన్ని; పొందింప = కలిగేటట్లు చేయడానికి; క్షితిన్ = భూమి మీద; అత్యుగ్రతపంబునందు = అతితీక్షణమైన తపస్సులో; జఠరాగ్నిన్ = ఉదరంలోని అగ్నిలో; క్రాఁగఁగాన్ఏల

= ఉడికిపోవడం ఎందుకు? మిమ్ము = ఈశ్వరుడైన మిమ్ము; భక్తి స్థితి = భక్తి కలిగి ఉండి; పూజ చేయు = అర్చించడమనే; మహనీయత్వంబు = గొప్పతనమనేది; తా; చాలదే = సరిపోదా?!

– *సర్వేశ్వరా! శత్రురోగ బాధలను పోగొట్టి అద్భుతమైన ఐశ్వర్యాన్ని వృద్ధి పొందించడానికీ, దివ్య సుఖాన్ని కలిగించడానికీ ఈ భూమి మీద తీక్షణమైన తపస్సు చేసి జఠరాగ్నిలో మండిపోవడం ఎందుకు? మిమ్మల్ని పూజించడమనే ఆ గొప్ప పని ఒక్కటి దానికి చాలదా?*

❄ *జఠరాగ్నిలో కాగడం అంటే ఆకలితో మాడడం అని అర్థం. చిత్తం అలాంటి తపస్సులో శివుని మీద కాక భుక్తి మీద ఉంటుందని అర్థం.*

116. *శివ వాక్యస్ఫురితాక్షరద్వయ సకృజ్జిహ్వా ప్రదేశాత్ముఁడై*
భవదుఃఖాంబుధి దాటునన్న మఱి తత్పంచాక్షరీ మంత్రము
త్సవలీలం గడుశుద్ధుఁడై జపము వాంఛంజేయు భాస్వద్గుణా
ర్ణవసౌభాగ్యము మానమెవ్వరికి నెన్నన్వచ్చు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

శివ = శివ అనే; వాక్య = మంత్రంలో; స్ఫురిత = స్ఫురించే; అక్షరద్వయ = రెండక్షరాల చేత; సకృత్ = ఒక్కసారి; జిహ్వా ప్రదేశాత్ముడై = నాలికను కలిగిన వాడయి; భవదుఃఖ అంబుధి = సంసార దుఃఖం అనే సముద్రాన్ని; దాటును అన్న = తరిస్తాడు అంటే, మఱి; తత్ = ఆ; పంచాక్షరీమంత్రము = పంచాక్షరీ మంత్రాన్ని; ఉత్సవ లీలన్ = సంతోషంతో; కడు = మిక్కిలి; శుద్ధుడై = అకల్మషుడయి; వాంఛన్ = తీవ్రేచ్ఛతో; జపము చేయు =జపించే; భాస్వత్ = ప్రకాశించే గుణార్ణవసౌభాగ్యము = గుణసముద్రమనే సంపత్తి; ఎవ్వరికిన్ =

ఎవ్వరికి; మానము = ప్రమాణము, (కొలమానం, లక్ష్యం) ఎన్నన్‌వచ్చు = లెక్కించవచ్చును?

— శివ మంత్రంలో స్ఫూర్తినిచ్చే 'శివ' అనే రెండక్షరాలను ఒక్కసారి కలిగిన నాలికతో సంసార సముద్రాన్ని ఈదుతాడని అంటే మరి ఆ మొత్తం పంచాక్షరీ మంత్రాన్నే సంతోషంతో జపంచేయాలనే కోరిక కలగడం అదెంత సౌభాగ్యమో ఎవరు చెప్పగలరు?

❄ మననం చేస్తే రక్షించేది గనుక మంత్రమన్నారు. నమఃశివాయ అన్నది పంచాక్షరీ మంత్రం. ఇందులో అక్షరద్వయం 'శివ'.

122, 137 పద్యాలలోను పంచాక్షరీ మంత్ర విషయం ఉంది. అక్కడ ఈ మంత్రాన్ని గురించిన సమాచారం కొంత ఉన్నది.

117. అరిషడ్వర్గ బలంబులో మలసి మయావృత్తి నాయందతి
స్ఫురణం జేసినవాఁడు మోహుఁడతనిన్ బోద్రోచి నీ భక్తితోఁ
బరఁగం గూర్చి వివేకిఁ జేసి నెరయం బాటించి నాయందధీ
శ్వరుఁడై యుండఁగదయ్య రౌప్యకుధర వ్యాపార! సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అరిషట్ వర్గ బలంబులో = కామక్రోధలోభ మోహమద మాత్సర్యాల ఆరు శత్రువులనే సైన్యంలో; మలసి = తిరిగి; మాయావృత్తి = మాయ ప్రవర్తించడంచేత; నాయందు = నాలో; అతి స్ఫురణన్ చేసినవాఁడు = మిక్కిలిగా ప్రకటితమైనవాడు; మోహుఁడు = మోహం అనేవాడు; అతనిన్ = అతణ్ని; పోద్రోచి = పోగొట్టి; నీ భక్తితో = నీయందలి భక్తితో; పరగన్ కూర్చి = ఒప్పునట్లుగా చేసి; వివేకి చేసి = జ్ఞానిగా చేసి; నెరయన్ = ఔచిత్యాన్ని; పాటించి = అనుసరించి; నాయందు = నాలో; అధీశ్వరుఁడై = అధిపతివై, ఉండఁగదయ్యా =

ఉండరాదుటయ్య; రౌప్య కుధర వ్యాపార! = ఓ! వెండికొండ మీద ప్రవర్తించేవాడా!

— *సర్వేశ్వరా! అరిషడ్వర్గంలోని మోహుడు నాలో ఎక్కువగా ఉద్దీపించినవాడు. వాణ్ని వెళ్లగొట్టి నీ భక్తితో నన్ను వివేకిని చేసి వెండికొండమీద ఉండే శివా! నాలో అధీశ్వరునిగా ఉండరాదయ్యా!*

❄ ఎక్కడో వెండికొండ మీద నుండి వ్యవహరించే వాణ్ని ఇప్పుడు తనలో నుంచే వ్యవహారం నడపమంటున్నాడు.

❄ మోహంలేని అంతరంగం శివభక్తితో నిండినట్లయితే అదే రజతాచలం అని సూచన.

❄ జ్ఞానం లేనిది శివత్వంరాదు. భక్తి అయినా భక్తుణ్ని వివేకిని చేస్తుందనడం అందుకే.

118. *అమలామ్నాయ విధి ప్రబోధము లసంఖ్యాతంబులై యుండునా*
గమ మార్గోత్తమ మంత్రతంత్రము లసంఖ్యాతంబులైయుండుఁ ద
త్క్రమముల్నాకవి యేల నీవు మెఱయంగా నిన్ను సద్భక్తియో
గమునం గొల్చి జయింపఁ జేయుమిదె మత్కామ్యంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమల = నిర్మలమైన; ఆమ్నాయవిధి = వైదిక నియమాలు చెప్పే ప్రబోధములు = ఉపదేశాలు; అసంఖ్యాతంబులై ఉండున్ = లెక్కకు మించి ఉంటవి; ఆగమమార్గ = ఆగమ పద్ధతిలోని; ఉత్తమ మంత్రతంత్రములు = శ్రేష్ఠమైన మంత్రాలూ తంత్రాలూ; అసంఖ్యాతంబులై ఉండు = అసంఖ్యాకంగా ఉంటాయి; తత్ క్రమముల్ = ఆ పద్ధతులు; నాకు అవి ఏల = అవి

రాకెందుకు?; నీవు మెఱయంగా = నీవు ప్రకాశించగా; నిన్ను; సత్‌భక్తి యోగమునన్ = సత్ భక్తియోగంతో; కొల్చి = సేవించి; జయింపఁజేయుము = సాధించు కొనేటట్లుగా చేయుము; ఇదె = ఈ విషయమే: మత్‌కామ్యంబు = నా యొక్క ఇచ్ఛ.

— *సర్వేశ్వరా! ఆమ్నాయ పద్ధతిలో చేయాలని చెప్పే బోధనలు అనేకం. ఆగమ మార్గంలో అనేక మంత్రతంత్రాలున్నాయి. ఇవన్నీ నాకెందుకు? నీవు నాలో వెల్గగా నిన్ను సద్భక్తి యోగంతో సేవించి పొందేటట్లుగా చేయి. ఇదే నా కోరిక.*

119. *ఏ దేశంబున నే దిశా ముఖమునందే యూర నే వాడ మీ*
పాదాభ్యర్చన సేయు నిర్మలుఁడు సద్భక్తుండొకండుండెనా
యాదేశంబును నాదిశా ముఖమును న్నాయూరు నావాడ గం
గాది స్నాననదీ ప్రవాహఫలదంబై యుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఏ దేశంబున; ఏ దిశాముఖమునన్ = ఏదిక్కున; ఏ ఊరు; ఏవాడ = ఏ వీథిలో; మీ పాదాభ్యర్చన = మీ పాదపూజ; చేయు; నిర్మలుఁడు = అకళంకుడైన; సత్‌భక్తుండు ఒకండు = మంచి భక్తుడు ఒక్కడు; ఉండెనా = ఉన్నట్లయితే; ఆదేశంబును; ఆ దిశాముఖమును = ఆదిక్కు, ఆ ఊరు; ఆవాడ = ఆ వీధి; గంగాది = గంగా మొ॥న; స్నాననదీ = తీర్థముల; ప్రవాహ = ప్రవాహాల; ఫలదంబై = ఫలితాలనిచ్చేవిగా; ఉండు = ఉంటాయి.

— *సర్వేశ్వరా! ఏ దేశంలోనైనా, దిక్కులోనైనా, ఊళ్లోనైనా, వాడలోనైనా నీ పాదపూజ చేసే నిర్మలుడైన భక్తుడొక్కడున్నా, ఆదేశంలో, ఆ దిక్కులో గ్రామంలో వీధిలో గంగాది తీర్థాలలోని ఫలితం ఉంటుంది.*

120. ఒనరం జిత్తము శుద్ధిలేని నరుఁడుద్యోగంబునం గోరి చే
సిన పూజావిభవంబు సువ్రతములున్ శీలంబులు న్మంత్రసా
ధనముల్ తీర్థములుం దపంబులును మీఁదం జెట్ట వాఁడభ్యసిం
చిన శస్త్రాస్త్రకళా నిభంబులగుఁ జర్చింపంగ సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఒనరన్ = ఒప్పిదంగా; చిత్తము శుద్ధిలేని నరుడు = చిత్తశుద్ధిలేని మానవుడు; ఉద్యోగంబునన్ = ప్రయత్నపూర్వకంగా; కోరి = కాంక్షించి, చేసిన = చేసినట్టి; పూజా విభవంబు = అర్చనా వైభవం; సువ్రతములున్ = మంచి వ్రతాలూ; శీలంబులున్ = ప్రవర్తనలూ; మంత్రసాధనముల్ = మంత్రాల ద్వారా చేసిన సాధనాలు; తీర్థములున్ = పుణ్యజలాలు; తపంబులున్ = తపస్సులూ, (ఇవన్నీ); మీఁదన్ = పైన; చెట్టవాఁడు = దుష్టుడు; అభ్యసించిన = సాధించిన; శస్త్రాస్త్ర కళా = ఆయుధ, అస్త్ర కళలతో; నిభంబులు అగు = సదృశాలవుతాయి.

— చిత్తశుద్ధిలేని మానవుడు ప్రయత్నపూర్వకంగా చేసిన పూజావైభవాలూ, వ్రతాలూ, ప్రవర్తనలూ, మంత్రజపాలూ, తీర్థాలను సేవించడం, తపస్సులు వేయడం, ఇవన్నీ కూడా దుష్టుడు నేర్చిన శస్త్రాస్త్రకళా సదృశాలవుతాయి ఓ సర్వేశ్వరా!

❁ చెడ్డవాడికి మంచివి సిద్ధించినప్పటికీ వాడి బుద్ధి కల్మష వంతం కాబట్టి వాడు వాటిని దుర్లక్ష్యాలకే వాడుతాడు. వానిది ఆసురీశక్తిగా పరిణమిస్తుంది. చెడ్డవాడు శస్త్రాస్త్ర విద్యల్ని నేర్చినా, వాడు వాటిని ధర్మం కోసం ఎన్నడూ వాడడు. రావణాసురాదులు ఇందుకు మంచి ఉదాహరణలు.

121. క్రమసంయుక్తి మనంబు బుద్ధియు నహంకారంబుఁ జిత్తంబు నా
యమలాంతః కరణంబు నక్షర చతుష్కావాప్తిగాఁ దీర్చి పం

చమ వర్ణంబుగ నాత్మఁగూర్చి కడువాంఛన్ యోగి పంచాక్షరీ
సుమహామంత్రముతోడ నైక్యపదవిన్ శోభిల్లు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

క్రమసంయుక్తి = క్రమంతో కూడి; మనంబు = మనస్సు, బుద్ధియు = బుద్ధి; అహంకారంబు = అహంకారం; చిత్తంబునా = చిత్తం అనే; అమల అంతః కరణంబు = నిర్మలమైన అంతఃకరణాన్ని; అక్షర చతుష్కావాప్తిగా = నాల్గు వర్ణాలు పొందేట్లుగా; తీర్చి = ఏర్పర్చి; పంచమ వర్ణంబుగన్ = ఐదవ వర్ణంగా; ఆత్మ = ఆత్మలో; కూర్చి = ఏర్పరచి; కడు వాంఛన్ = తీవ్రేచ్ఛతో; యోగి = శివయోగి; పంచాక్షరీ సుమహామంత్రము తోడ = శివపంచాక్షరి అన్న గొప్పదైన మంచి మంత్రంతో; ఐక్యపదవిన్ = ఐక్య స్థితి చేత; శోభిల్లు = ఒప్పును.

– సర్వేశ్వరా! మనోబుద్ధ్యహంకార చిత్తాలన్న నిర్మలాంతః కరణాన్ని నాలుగు అక్షరాలతో, ఆత్మను ఐదవ అక్షరంతోనూ కూర్చి తీవ్రేచ్ఛతో శివయోగి శివపంచాక్షరీ మహామంత్రంతో ఐక్యస్థితిని పొంది శోభిల్లుతాడు.

122. భవదీయానన పంచకంబు వలనం బంచాక్షరశ్రేణి యు
ద్భవమై తత్పదవర్ణ పద్ధతుల శుంభత్పంచభూతంబులు
ద్భవనంబై యఖిలంబు బుట్టెను లసత్పంచాక్షరీమంత్ర మీ
భువనాండంబులఁ దల్లియై శుభములం బొందించు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భవదీయ=నీ యొక్క; ఆనన పంచకంబు వలనన్=ఐదు ముఖాల నుంచి; పంచ అక్షరశ్రేణి=ఐదు అక్షరాల వరుస (అంటే పంచాక్షరి అన్న మంత్రం); ఉద్భవమై=పుట్టి; తత్=ఆ; పద వర్ణ పద్ధతుల=మంత్రంలోని వర్ణాల రీతి నుంచి;

శుంభత్=శోభిస్తూ; పంచభూతంబులు=ఐదు భూతాలు; ఉద్భవనంబై=పుట్టగా, అఖిలంబు=సమస్తమున్నూ; పుట్టెను=పుట్టింది; లసత్=ప్రకాశించే; పంచాక్షరీ మంత్రము=శ్రీశివపంచాక్షరీ మంత్రం; ఈ భువనాండంబుల=ఈ పదునాలుగు లోకాల బ్రహ్మాండాలకి; తల్లియై=మాత అయి; శుభములన్=శివములను; పొందించు=కల్గించుతుంది.

— *సర్వేశ్వరా! నీ యొక్క పంచముఖాల నుంచి పంచవర్ణాల పంచాక్షరీ మంత్రమూ, అందులోంచి పంచభూతాలూ, వాటిల్లో నుంచి ఈ సమస్త జగత్తూ పుట్టింది. అందువల్ల ఈ లోకాలన్నింటికీ పంచాక్షరే తల్లి అయి, శుభాలను కల్గిస్తుంది.*

❄ *తానే కన్నది కాబట్టి తన సంతానానికి కీడు చేయక మేలే చేస్తుంది.*

❄ *శివుని పంచముఖాల నుంచి శ్రీశివ పంచాక్షరీమంత్రంలోని ఐదు అక్షరాలూ ఉద్భవించాయని ఈ పద్యం చెప్తున్నది. పరమ పాశుపతుడైన ఉపమన్యు మహర్షి శ్రీకృష్ణ భగవానునికి చేసిన శివమహాస్తోత్రం అన్న ఉపదేశం శివపురాణంలోని ఏడవ వాయవీయ సంహితలో ఉత్తర భాగంలో ఉన్నది. అందులోని పంచబ్రహ్మ ప్రార్థనలో పంచాక్షరీ మహామంత్రంలోని పంచవర్ణాలు శివుని యొక్క ఏయే ముఖాల నుంచి వచ్చినవో స్పష్టపరుచబడింది.*

❄ *శివుని ఊర్ధ్వముఖం, అంటే ఆకాశమండలంలో ఉండే ముఖం శివపంచాక్షరీ మహామంత్రంలో ఐదవదైన "య" అన్న బీజాక్షరమూలం. ఈ ముఖానికి ఈశానమని పేరు. ఇది శక్తితో కూడ పూజింపబడ్తుంది.*

❄ *పూర్వ (తూర్పు) దిశలో శక్తితో కూడా పూజింపబడ్తూ, వాయు మండలంలో ఉంటూ (మరుత్ సంస్థం) శివుని పాదకమలాలని అర్చించేది -పంచాక్షరిలో మొదటిదైన "వ" అన్న బీజాక్షరం కలిగింది ఈ ముఖము. దీనికి పేరు తత్పురుషము.*

❄ దక్షిణ దిగ్భాగంలో శక్తితో కూడా పూజింపబడ్తూ అగ్ని మండల మధ్యంలో ఉంటూ (వహ్నిమండల మధ్యగం) పంచాక్షరిలోని రెండవదైన "మ" అను బీజాక్షరం కలిగింది ఈ ముఖము. దీనిపేరు అఘోరముఖము.

❄ ఉత్తర దిక్కుగా శక్తితో కూడా పూజింపబడ్తూ ఉదక మండలం నడుమన ఉంటూ (వారి మండల మధ్యస్థం) పంచాక్షరిలోని నాలుగవదైన "వా" అనే బీజాక్షరం కలిగింది ఈ ముఖం. దీనిపేరు 'వామదేవ ముఖము'.

❄ శివునికి పశ్చిమ దిక్కుగా శక్తితో కూడా పూజింపబడ్తూ, భూమండలంలో ఉంటూ (పృథివ్యాం సమవస్థితమ్:), పంచాక్షరీ మంత్రంలోని మూడవ దైన "శి" అనే బీజాక్షరం కలిగిందీ ముఖం. దీనిపేరు సద్యోజాత ముఖం.

– ఈ వివరణ ద్వారా తెలిసే విషయం శివునికి ఈశాన, తత్పురుష, అఘోర, వామదేవ, సద్యోజాతాలనే ఐదు ముఖాలున్నాయనీ ఈ ఐదు ముఖాలు ఒక ఊర్ధ్వముఖంగాను, తక్కిన నాలుగు ప్రాక్పశ్చిమోత్తర దక్షిణ దిశలుగానూ ఉంటాయని. ఈ ఐదింటి ఉనికి ఆకాశ, వాయు, అగ్ని, ఉదక, పృథివీ మండలాల్లో. నిజానికి పృథివ్యాపస్తేజోవాయురాకాశా లనే పంచభూతాలు శ్రీ పంచాక్షరీ మహామంత్రంలోని ఒక్కొక్క వర్ణంలోంచే పుట్టాయి. దీన్ని తెలుపుతూ అన్నమయ్యగారు 'తత్ పదవర్ణ పద్ధతుల శుంభత్ పంచ భూతంబులుద్భవనంబై యఖిలంబు ‹బుట్టెను' అని అన్నారీ పద్యంలో. పృథివ్యాపస్తే జోవాయురాకాశాలన్నవి పంచభూతాలు. సమస్త సృష్టీ ఈ మూల ద్రవ్యాలతోనే చేయబడింది. ఈ మూల ద్రవ్యాలేమో ఈశ్వరుని పంచముఖాలలోంచి పుట్టిన పంచ అక్షరాలలోంచి ప్రభవించాయి. ఈ పద్యంలో ఇంత విషయాన్ని అన్నమయ్య కవి నిక్షేపించారు.

123. పటు శాస్త్రాగమ దృష్టి నివ్విధమునన్ భావించి వీక్షించి యు
ద్భట వృత్తిన్ భవదీయ భక్తి నికర బ్రహ్మాండకుండైన నా

దటలోఁ గాచు కొనంగ వచ్చు విదితోద్దండ ప్రతాపోత్కట
స్ఫుటకోపానల మూర్తియై యముఁడు కొంపోకుండ సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

పటు=పటిష్ఠమైన; శాస్త్ర, ఆగమ దృష్టిన్=శాస్త్రములు, ఆగమములు నిర్దేశించిన దృక్పథంతో; ఇవ్విధంబునన్=ఈ తీరుగా; భావించి, వీక్షించి=భావన చేసి, చూసి; ఉద్భట వృత్తిన్=అధికరీతిగా; భవదీయ=నీయొక్క; భక్తినికర=భక్తి సమూహమనే; బ్రహ్మాండకుండు ఐనన్=బ్రహ్మాండంలో ఉన్నవాడైనట్లయితే; విదిత=తెల్లమవుతున్న; ఉద్దండ=భీషణమైన; ప్రతాప ఉత్కట=అధిక శౌర్యం చేత; స్ఫుట=విస్పష్టమైన; కోప అనల మూర్తి ఐ=రౌద్రాగ్ని రూపం కలిగిన వాడై; యముడు=మృత్యుదేవత; కొంపోకుండ=తీసికొని పోకుండ; ఆదట=ప్రేమతో లోకాచుకొనంగ వచ్చు=లోపల రక్షించుకోవచ్చును.

— *సర్వేశ్వరా! శాస్త్రాగమ దృష్టితో ఆలోచించి, చూసి, నీమీద భక్తి అనే బ్రహ్మాండంలో ఉన్నట్లయితే, విపరీతమైన క్రోధంతో ఉన్న యముడు తీసికొని పోకుండా, ఆ బ్రహ్మాండంలో కాపాడుకోవచ్చును.*

124. ***కలవారై, మతిమంతులై, రసికులై, గంభీరులై, ధీరులై,***
లలనా మన్మథులై, సముజ్జ్వల వచోలాలిత్యులై, నిత్యులై,
బల విభ్రాజితులై, యశోభరితులై, భాసిల్లు భాగ్యోదయుల్
తొలి జన్మంబుల మిమ్ముఁ గొల్చిన మహాత్ముల్ వారు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

కలవారై=ధనమున్నవారై; మతిమంతులై=బుద్ధిమంతులై; రసికులై=ఆనంద అనుభూతికలవారై; గంభీరులై=లోతు కల్గిన వారై; ధీరులై=స్థిరచిత్తులయి; లలనా మన్మథులై=స్త్రీలకు మన్మథులయి; సముజ్జ్వల=ప్రకాశించే; వచో లాలిత్యులై=

సుకుమారమైన వాక్కు కలిగిన వారైన; వారు; భాసిల్లు=ప్రకాశించెడి; భాగ్యో
దయుల్=భాగ్యముదయించినవారు; తొలి జన్మంబుల=మునుపటి జన్మలలో;
మిమ్ముకొల్చిన=మిమ్మల్ని సేవించిన; మహాత్ముల్ వారు=గొప్పవారు వారు.

– సర్వేశ్వరా! ఐశ్వర్యవంతులయి, బుద్ధిమంతులయి, రసికులయి, ధీరులయి, స్త్రీలకు మన్మథులయి, వాఙ్మాధుర్యం కలిగిన వారయి, శాశ్వతులయి, బలిష్ఠులయి, కీర్తి మంతులయి, ప్రకాశించే భాగ్యవంతులు గత జన్మలలో మిమ్మల్ని గొల్చిన మహాత్ములు.

125. ఖలులై యాచకులై విరుద్ధ వికటాకారాంగులై పంగులై
బలహీనాతురులై రుజాపటల తాపచ్ఛన్నులై ఖిన్నులై
చలనాందోళిత చిత్తులై మలినులై జాత్యంధులై మందులై
యిల జన్మించెద రాత్మ నిన్నిడని వారీక్షింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఆత్మ=ఆత్మలో; నిన్ను ఇడనివారు=నిన్ను పెట్టుకోని వాళ్లు; ఈక్షింప=పరిశీలిస్తే; ఖలులై=దుష్టులై, యాచకులై=బిచ్చగాండ్రయి; విరుద్ధ వికటాకార అంగులై=అసమానమైన వికృతరూపమైన అవయవాలు కలిగిన వారై; పంగులై=కుంటివాళ్ళయి; బలహీన ఆతురులై=నిర్బలురైన వ్యాధిగ్రస్తులయి; రుజాపటలత=రోగ సమూహంచేత; అవచ్ఛన్నులై=కప్పబడిన వారై; ఖిన్నులై=దుఃఖితులై; చలన ఆందోళిత చిత్తులై=చాంచల్యం చేత ఊగిసలాడే చిత్తం కలిగిన వాళ్లయి, మలినులై=కల్మషులై; జాత్యంధులై= పుట్టుగ్రుడ్డులయి; మందులై=జడులై; ఇల=ఈభూమి మీద; జన్మించెదరు=జన్మిస్తారు.

– సర్వేశ్వరా! ఆత్మలో నిన్నుంచుకోని వాళ్లు ఈ భూమి మీద దుష్టులుగా, బిచ్చగాళ్లుగా, విరుద్ధ వికటాకారంతో అవయవాలు కలిగిన వాళ్లుగా, కుంటి

వాళ్ళుగా, బలహీనులైన రోగులుగా, దుఃఖితులుగా, చంచల చిత్తులుగా, కల్మషులుగా, జాత్యంధులుగా, బుద్ధిహీనులుగా పుడ్తారు.

126. ఏయే వేళల నే వయస్సున నరుండే భూమి నేయూరిలో
నేయే కర్మము నాచరించు నశుభంబేనిన్ శుభం బేనిఁ దా
నా యా వేళల నా వయస్సున నరుండా భూమి నా యూరిలో
నా యా కర్మ ఫలంబు లెల్ల కుడుచున్ సొంతంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

నరుండు=మానవుడు; ఏయే వేళలన్=ఏ యే సమయాలలో; ఏ వయస్సున=ఏ వయస్సులో; ఏ భూమి=ఏ ప్రాంతంలో; ఏ ఊరిలో= ఏ ఊళ్లో; ఏయే కర్మమున్=ఏయే కర్మని; అశుభం బేనిన్=అమంగళం కాని-పాపం; శుభంబేని=మంగళకరం కాని-పుణ్యం; ఆచరించు=చేస్తాడో, తాను; ఆయా వేళల=ఆయా సమయాలలో, ఆ వయస్సున =ఆ వయస్సులో; నరుండు=(ఆ) మానవుడు; ఆ భూమి=ఆ ప్రాంతంలో; ఆ ఊరిలో= ఆ ఊళ్లో; ఆయా కర్మఫలంబు లెల్ల=(ఇంతకుముందు చేసిన) కర్మల ఫలితాలన్నిటినీ; సొంతంబు= మొత్తంగా; కుడుచున్=అనుభవిస్తాడు.

— సర్వేశ్వరా! మనిషి ఏ కాలంలో, ఏ వయస్సులో, ఏ దేశంలో, ఏ ఊళ్లో, శుభాశుభకర్మలను వేటి వేటిని ఆచరిస్తాడో అదే కాలంలో, అదే వయస్సులో, అదే దేశంలో, అదే ఊళ్లో, ఆయా కర్మఫలాలను మొత్తంగా అనుభవిస్తాడు.

127. ఆడంబోయిన చోట బాలురు వినోదార్థంబు పాషాణముల్
కూడంబెట్టి శివాలయంబనుచు బేర్కొన్నంతటం జేసి, వా

రాడంబోయి సురాంగనా కలిత దివ్యారామ చింతామణి
క్రీడాశైల విహారులై వెలయుటల్ గీర్తింతు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఆడన్‌పోయిన చోట=ఆడుకోవడానికి వెళ్లిన స్థలంలో; బాలురు=పిల్లలు; వినోదార్థంబు=వినోదం కోసం; పాషాణముల్=రాళ్లను; కూడన్‌పెట్టి=కూర్చి; శివాలయంబు అనుచు=శివాలయం అంటూ; పేర్కొన్న అంతటన్ చేసి=పేరు పెట్టినంత మాత్రంలోనే, వారు=ఆ పిల్లలు; ఆడన్‌పోయి=ఆడుకోవడానికి వెళ్లి; సురాంగనాకలిత=దేవతా స్త్రీలతో కూడిన; దివ్య ఆరామ=దివ్య భూములలోని; చింతామణి=చింతామణి అనే; క్రీడాశైల=వినోదార్థమైన పర్వతం మీద; విహారులై=విహరించే వాళ్ళుగా; వెలయుటల్=ఆవిర్భవించడాలు; కీర్తింతు= ప్రశంసిస్తాను.

– *సర్వేశ్వరా! పిల్లలు ఆడుకోవడానికి వెళ్లిన చోట వినోదం కోసం కొన్ని రాళ్లను పేర్చి దాన్ని శివాలయం అని అనగానే, ఆ పిల్లలు తత్ఫలితంగా దేవతా స్త్రీలున్న దివ్యారామంలోని చింతామణి అనే క్రీడా పర్వతంపై ఆడబోయి, విహరించేవాళ్లుగా వెలుస్తారు (అక్కడ అట్లా కన్పిస్తారు)*

❄ *పోయింది మామూలుగా ఆడుకొనే భూమి మీది ఆట స్థలానికి. కాని చేరింది చింతామణి మీదికి! కారణం వినోదార్థంగా రాళ్లతో శివాలయాన్ని పేర్చడం!*

128. కానీ దారసమన్వితుండు మిగులంగానీఁడు కందర్పునిన్
గోనీ మానవకోటిలో మరులు పై కోనీఁడు మోహంబునున్
రానీ రాజిత రాజ్య వైభవము పై రానీఁడు గర్వంబునున్
లో నీవైన మహాత్ముఁ డన్యమునకున్ బోనీఁడు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

దార సమన్వితుండు=భార్యతో కూడిన వాడు; కానీ=అయినప్పటికినీ; కందర్పునిన్=మన్మథుని; మిగులంగా నీడు=(తనను) జయంపనీయడు; మానవ కోటిలో=మనుష్య సంఘంలో; కానీ మోహంబునున్=మోహాన్ని; మరులు పైకోనీడు= ఆశ పెట్టనీయడు; రాజిత=ప్రకాశించే; రాజ్యవైభవము=రాజ్య ఐశ్వర్యం; రానీ=వచ్చినప్పటికీ; గర్వంబునున్=అహంకారాన్ని; పైరానీడు= తనమీదకు రానీయడు; లో=తన అంతరంగం; నీవుఐన= (ఈశ్వరుడవైన) నీవు అయినట్టి; మహాత్ముడు=గొప్పవాడు; అన్యమునకున్=ఇతర విషయాల మీదకు; పోనీడు=(మనస్సుని) పోనీయడు.

— *సర్వేశ్వరా! భార్యా సమేతుడయినా మన్మథునికి లొంగడు. మానవకోటిలోనే ఉన్నా మోహం తనని ఆకర్షింపనీయడు. రాజ్యవైభవం వచ్చినా అహంకారం రానీయడు. తన అంతరంగం నీవే అయిన మహాత్ముడు ఇతర విషయాల మీదికి దాన్ని పోనీయడు.*

129. *తమ లింగార్చన కంటె జంగమము సౌందర్యంబుతోఁ గొల్చు టు*
త్తమ భక్తి స్థితి లింగ జంగమముల న్సామ్యంబుగాఁ జేత మ
ధ్యమ భక్తి స్థితి లింగపూజ నధికుండై జంగమోపాసనా
క్షముఁడై యుండుట భక్తి యందది కనిష్ఠత్వంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

తమ లింగ అర్చనకంటె=(ఇష్ట) లింగారాధన కంటె, జంగమము= జంగమలింగాన్ని (అంటే మనుష్య రూపంలోని మహేశ్వరుణ్ని) సౌందర్యంబుతో= రమణీయంగా; కొల్చుట=భజించడం; ఉత్తమ భక్తి స్థితి=ఉత్తమమైన భక్తి యొక్క ఉనికి; లింగ జంగమములన్=ఇష్టలింగాన్నీ, మాహేశ్వరుణ్నీ; సామ్యంబుగా చేత

= సమానంగా అర్చించడం; మధ్యమ భక్తి స్థితి = నడిమి స్థాయి భక్తి; లింగపూజన్ = ఇష్ట లింగార్చనలో; అధికుండై= ఎక్కువ అయి; జంగమ ఉపాసన = మాహేశ్వరార్చనకు; అక్షముడై = సహించనివాడై (ఇష్టపడనివాడై); ఉండుట=ఉండటం; భక్తి అందు=భక్తిలో; అది; కనిష్ఠత్వంబు=తక్కువది.

– *సర్వేశ్వరా! తన ఇష్టలింగార్చన కంటె కూడా జంగమార్చనను ఎక్కువగా చేస్తే అది ఉత్తమ భక్తి. అట్లాకాక ఇష్టలింగార్చననూ, జంగమార్చననూ సమానంగా చేస్తే అదిమధ్యమ భక్తి. శివలింగ పూజను ఎక్కువగా చేస్తూ జంగమార్చనకు ఇష్టపడకపోతే అది కనిష్ఠస్థాయి భక్తి!*

❋ ఈ పద్యంలో శ్రౌత శైవులకూ, వీరశైవులకూ సంబంధించిన మతాచారమూ, మత దృష్టీ ఉన్నాయి. పూర్వ పద్యాలలో రాసిన అష్టావరణాలలోని జంగమార్చనా ప్రాధాన్యాన్ని ఈ పద్యంలో తెల్పుతున్నారు.

130. ఏ నిన్నే శరణందు బాంధవులు గానీ యెల్లవారుం బగే
కానీ మృత్యువు తల్ల క్రిందు పడనీ కాలుండు గీ వెట్టనీ
నానా కర్మ చయంబు గింజుకొననీ నాకేమి నేరాజ నిం
తే నీ చాటున దాగి యున్నపుడు చింతే యింక సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ఎల్లవారున్=అందరూ; బాంధవులు కానీ=బంధువులే అవనీ; (లేక) పగే కానీ=విరోధమే కానీ; మృత్యువు తల్లక్రిందు పడనీ=మృత్యువు తలక్రిందులుగా అంటే, అడ్డం పడినప్పటికీ; కాలుండు=యముడు; గీవెట్టనీ=అరవనీ; నానా కర్మ చయంబు=అనేక కర్మల సమూహం; గింజుకొననీ=తన్నుకులాడినా (విదిలించుకొననీ); నాకేమి=నాకేమి అవుతుంది?; ఏ=నేను; నిన్నే=సర్వేశ్వరుడవైన

నిన్నే; శరణుఅందు=ఆశ్రయం అంటాను; నే రాజన్ ఇంతే=నేను ప్రభువును-ఇంతే; నీ చాటున=నీమాటున; దాగి ఉన్నప్పుడు=దాగుకొని ఉన్నపుడు; ఇంక చింతే=ఇంక దుఃఖమేమి ఉంటుంది!

— *సర్వేశ్వరా! నేను నిన్నే శరణంటాను. అందరూ బంధువులే కానీ- శత్రువులే కానీ, మృత్యువు అడ్డం వచ్చినా, యముడు గీపెట్టి అరచినా, నానా కర్మల సమూహం తన్నుకులాడినా, నాకేమి ఔతుంది? నేనే రాజును. అంతే. నీ మాటున దాగి ఉంటే ఇంకేమి చింతనాకు.*

131. *బాలుండాడెడు మాట లెల్లనుపమింపం దండ్రికిం బ్రౌఢ భా*
వాలాపంబుల కంటె మించుగతి నేనజ్ఞాన భావంబునం
దాలోచించి రచించినట్టి కృతి ఇంపారంగ నీకున్మహా
లాలిత్యస్తుతి కంటెఁ గైకొను (గదా శ్లాఘ్యంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

బాలుండు ఆడెడు=పిల్లవాడు మాట్లాడే; మాటలు ఎల్లన్=మాటలన్నీ; ఉపమింపన్=పోలిస్తే; తండ్రికిన్=జనకునికి; ప్రౌఢ భావాలాపంబుల కంటె=ప్రౌఢమైన భావాలను మాట్లాడిందానికంటే; మించుగతి= అతిశయించినట్లుగా; నేను అజ్ఞాన భావంబునందు=నేను జ్ఞాన రహిత స్థితిలో నుంచి; ఆలోచించి=వితర్కించి; రచించినట్టి కృతి=రాసిన (ఈ) కావ్యం, ఇంపారంగ= ప్రేమకలుగగా; నీకున్; మహాలాలిత్య స్తుతికంటె=ఎంతో లలితంగా చెప్పిన స్తోత్రం కంటె కూడా; శ్లాఘ్యంబు=ప్రశంసార్హతను కైకొనుకదా= పొందుతుంది కదా.

— *సర్వేశ్వరా! పిల్లవాడి మాటలన్నీ కన్నతండ్రికి ప్రౌఢవాక్కుల కన్నా ఎక్కువగా ఎట్లా అనిపిస్తుందో, అట్లాగే నేనజ్ఞానంతో రాసిన ఈ కృతి నీకు ప్రేమ*

కలిగేటట్లుగా ఎంతో గొప్పలాలిత్యంతో రాసిన స్తుతి కంటె కూడా శ్లాఘ్యం అవుతుంది.

132. పరమార్థంబుగఁ దత్త్వమున్నెఱుఁగ నొప్పందీర్చి డెందంబు నీ
కరుణా స్థానముఁ జేర్పలేక తన వంకం బాఱిపోనిచ్చిరే
నరకాబ్ధిం బడవైచు తత్క్షణములోనం గానఁ దత్త్వక్షయం
బరయం జిత్తము శూకలాశ్వము నిభంబై యుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

పరమార్థంబుగ=అసలయిన అర్థంతో; తత్త్వమున్=పశుపతి సంబంధ విషయము; ఎఱుగన్=తెలియను; ఒప్పన్ దీర్చి= సరిగా తీరిచి; డెందంబు= హృదయాన్ని; నీకరుణా స్థానము=నీ అనుగ్రహ స్థానానికి; చేర్పలేక; తనవంకన్= దానివైపునకు; పాఱిపోనిచ్చిరే=పారిపోనిచ్చినట్లయితే; (అది) నరకాబ్ధిన్=నరకమనే సముద్రంలో; తత్క్షణములోనన్=అదే క్షణంలో, పడవైచు=పడవేస్తుంది; కాన=కాబట్టి; అరయన్=పరిశీలిస్తే; తత్త్వక్షయంబు=తత్త్వరాహిత్యం ఐన (జ్ఞానం లేకపోవడం); చిత్తము=మనస్సు; శూకలాశ్వము నిభంబై=దుష్టాశ్వంతో సదృశమై; ఉండు=ఉంటుంది.

– సర్వేశ్వరా! అసలైన అర్థంతో తత్త్వాన్ని తెలిసికోలేదు. నా హృదయాన్ని నీ అనుగ్రహం వైపుకి చేర్పలేక దాని ఇష్టం వచ్చిన వైపుకి పోనిస్తే తత్క్షణమే అది నరకంలో పడవేస్తుంది. కాబట్టి, తత్త్వజ్ఞానంలేని చిత్తం దుష్టాశ్వం లాంటిదని తెలుతుంది.

133. భవదంఘ్రి ద్వితయార్చనంబును భవత్ ప్రఖ్యాత సద్భక్త పుం
గవ గోష్ఠీ విభవంబు నీ విమల సూక్ష్మధ్యాన యోగంబు నా

నివి సంపూర్ణ సుఖంబులెన్న మఱి దేవేంద్రాది భూతాఖిలో
త్సవ సంబంధము లెల్ల దుస్స్థితులు తథ్యం బెన్న సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

భవత్=నీయొక్క; అంఘ్రి ద్వితయ అర్చనంబును=రెండు (కాలి) బొటన వ్రేళ్లను పూజించడమూ; భవత్=నీయొక్క; ప్రఖ్యాత=సుప్రసిద్ధులైన; సత్‌భక్త=మంచిభక్తులనే; పుంగవ=శ్రేష్ఠుల; గోష్ఠీవిభవంబు=సత్‌సంగ వైభవమూ; నీ విమల=నీయొక్క నిర్మలమైన; సూక్ష్మధ్యాన యోగంబు=సూక్ష్మమైన ధ్యాన యోగమూ; నాన్=అనేవి; ఇవి; ఎన్న=పరిగణిస్తే; సంపూర్ణ సుఖంబులు=పూర్తి అయిన సుఖాలు; మఱి; దేవేంద్రాది భూత=దేవేంద్రుడు మొదలైన ప్రాణుల; అఖిల=సమస్త; ఉత్సవ సంబంధములు ఎల్ల=ఉత్సవాలతో పొత్తులన్నీ; ఎన్న=పరిగణిస్తే; దుఃస్థితులు=చెడ్డవి; తథ్యంబు=(ఇది) నిజం.

— *సర్వేశ్వరా!* నీ పాదద్వయార్చనం, ప్రఖ్యాతులైన నీ భక్తులతో గోష్ఠి, నిర్మలమైన నీ సూక్ష్మ ధ్యానమూ- అన్నవి సంపూర్ణ సుఖాన్ని కల్గిస్తవి. అంతేతప్ప దేవేంద్రాదుల వైభవాలతో పొత్తులన్నీ దుస్థితులను కల్గిస్తవి. ఇది నిజం.

134. *సమయోద్దిష్ట సహస్ర పంకరుహ పూజా పూరణార్థంబు నే*
త్రము విష్ణుండు సుభక్తి యేర్పడ భవత్పాదంబు లర్చించి చ
క్రము నీ చేఁ గొని దైత్య కోటి ననిలో ఖండించెఁ దా నీ పద
క్షమతా సేవ సమస్త దేవతలకున్ సత్త్వంబు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సమయ=పూజావేళ; ఉద్దిష్ట=ఉద్దేశించబడిన; సహస్ర పంకరుహ పూజా

పూరణార్థంబు=వేయి కమలాలతో చేసే పూజలో నింపుట కోసం; విష్ణుండు=శ్రీ మహావిష్ణువు; సుభక్తి ఏర్పడ=సద్భక్తితో; నేత్రము=తనకంటితో; భవత్ పాదంబులు=నీయొక్క పాదాలను; అర్చించి=పూజించి, నీ చే=ఈశ్వరుడవైన నీచేత; చక్రము కొని=సుదర్శన చక్రాన్ని పొంది; అనిలో=యుద్ధంలో; దైత్య కోటిన్=రాక్షస సమూహాన్ని; ఖండించె=నరికినాడు; తానీ పదక్షమతా సేవ=ఆ నీ పాదార్చనా సేవ; సమస్త దేవతలకున్=దేవతలందరికీ; సత్త్వంబు=ఉనికి(ని కలిగించేది)

— సర్వేశ్వరా! పూజావేళ అనుకొన్న సహస్ర కమల పూజలో (ఒకటి తక్కువ కాగా) లోప పూరణార్థం తన కంటితోనే (పంకరుహానికి బదులుగా) భక్తితో విష్ణువు నీ పాదాల నర్చించి నీ నుంచి సుదర్శన చక్రాన్ని పొంది, దాన్తో రాక్షసుల సమూహాన్ని నరికి వేశాడు. ఆ నీ పాద సేవ సమస్త దేవతల ఉనికికి కారణమయింది.

❋ విష్ణువు సుదర్శన చక్ర ప్రయోగం చేయకపోతే రాక్షసుల వల్ల దేవతలకు ఉనికి లేకుండా పోయేది. సుదర్శన చక్రం ఆయనకు ఇచ్చింది నీవు. కాబట్టి సమస్త దేవతలకు నీ పాదార్చనా సేవయే వారి ఉనికికి కారణం.

❋ ఈ పద్యంలో విష్ణుమూర్తికి శివుడు సుదర్శన చక్రాన్ని ప్రసాదించిన ఘట్టం ప్రస్తావించారు కవి. శ్రీమహావిష్ణువు అనుదినమూ మానస సరోవరంలో నుంచి సహస్ర కమలాలను కోసి శివునికి, ఆయన అనుగ్రహం కోసం పూజ చేసేవాడు. ఒకనాడు శివుడు విష్ణువుని పరీక్షించడంకోసం వేయి కమలాల్లో ఒక దాన్ని తగ్గించాడు. పూజాంతంలో సహస్రనామాలలోని చివరి నామం చదువుతూ శివుని పాదపద్మాలపై ఉంచడానికి కమలం మాత్రం లేకపోవడం గమనించాడు శ్రీ మహావిష్ణువు. పూజ అసాంతం కానిది లేవడానికి వీలులేదు. కాబట్టి వేయవ కమలం తేలేడు. అందుచేత తీవ్ర భక్తితో ఆయన తన కంటినొక్కదాన్ని తీసి వేయవ కమల దళంగా

శివునికి అర్పించి పూజ ముగించాడు. అప్పుడు శంకరుడు సంతోషించి ప్రత్యక్షమయి వరం కోరుకోమని అనగా విష్ణువు, దేవతలు రాక్షసుల బాధలు పడలేకుండా ఉన్నారనీ, వాళ్లను రక్షించాలనీ వేడుకొనగా పరమ శివుడు సుదర్శన చక్రాన్ని ప్రసాదించాడు.

"ఇతి శ్రుత్వావచో విష్ణోర్దేవదేవో మహేశ్వరః

దదౌ తస్మై స్వకం చక్రం తేజోరాశిం సుదర్శనమ్" (శివపురాణం)

ఆ చక్రం తేజోరాశి. దానికి వేయి మొనలు. సుదర్శన ప్రాప్తితో పాటు, పూజార్థం ఇచ్చిన కన్ను కూడా శ్రీ మహావిష్ణువునకు ప్రాప్తించింది.

❊ మూఢ భక్తుడైన కన్నప్ప శివునికి ఆర్తితో, శివనేత్ర రుగ్మతను చూడలేక తన కంటినే పెరికివేసి లింగడికి పెట్టాడు. ఈ పై కథలోనేమో శ్రీ మహావిష్ణువు పూజార్థం తన కంటిని పెరికివేసి శివ పాదములపై ఉంచుతాడు. ఒకరు మూఢుడు-మరొకరు అసదృశజ్ఞాని. ఇద్దరూ చేసిన పని ఒక్కటే. ఇద్దరిలోనూ ఉన్నది తీవ్ర శివభక్తియే.

❊ ఈ పద్యానికి పుష్పదంతుని మహిమ్నస్తవములో మూలం ఉన్నది.

హరిస్తే సాహస్రం కమల బలిమాధాయ పదయో

ర్యదేకో నేతస్మిన్ నిజముదహరన్నేత్ర కమలమ్

గతో భక్త్యుద్రేకః పరిణతి మసౌ చక్రవపుషా

త్రయాణాం రక్షాయై త్రిపురహర జాగర్తి జగతామ్.

ఇవి కాకుండా ఇంకా ఎనిమిది పద్యాలను మహిమ్నస్తవ శ్లోకాలకు అనువాదం చేశారు కవి.

❊ స్కాంద పురాణం శ్రీ మహావిష్ణువీ కమలార్చన కాశీక్షేత్రంలో చేసి నట్లుగా చెప్పింది.

❊ విద్యాభూషణ, సాహిత్య రత్న, శ్రీశైవ మహాపీఠాధ్యక్షులు శివయోగి నిర్మల శంకరశాస్త్రుల వారు దీనికి సంబంధించి ఇంకా అనేక ప్రమాణాలు చూపారు (తమ సహస్ర కమలార్చనలో).

విష్ణుర్యస్య సహస్రనామ నియమాదంభోరుహాణ్యర్చయన్
నేకేనోపచితేషు నేత్రకమలం నైజం పదాబ్జద్వయమ్
సంపూజ్యాసుర సంహతిం విదళయన్ త్రైలోక్య పాలోభవ
త్తస్మిన్ మే హృదయం సుఖేన రమతాం సాంబే పరబ్రహ్మణి

- ఆది శంకరులు

– నేత్రాంభోజ సమర్పణేవ హరయే ఽ భీష్టం రథాంగందదా
వార్తత్రాణ పరాయణః భగవాన్ గంగాధరో మే గతిః

- అప్పయ దీక్షితులు

– మురారి నేత్రార్పిత పాదపద్మం నమామి శంభుం విషనీలకంఠం

- జైమిని మహాముని

135. అమరన్ వేదపురాణ శాస్త్రములు మున్నాకాంక్షఁ దత్త్వ ప్రభే
దము రూపింపఁగ నేరవన్న; మఱి యా తత్త్వంబు లెట్లన్నను
త్తమ సంతోషమె కోరునన్న; నరుఁడుత్సాహించి నీ భక్త స
త్తమ పూజారతి నేరునే నతఁడు తత్త్వజ్ఞుండు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమరన్=పొందికగా; వేద పురాణ శాస్త్రములు; మున్ను=ముందుగా; ఆకాంక్ష=కోరికతో; తత్త్వ ప్రభేదము=జ్ఞానశాఖలను; రూపింపగ నేరవు అన్న=నిరూపించలేవు అనగా; మఱి; ఆ తత్త్వంబు= ఆ జ్ఞానము; ఎట్లు అన్నను=ఏమి అంటుందీ?; అన్న=అనగా; ఉత్తమ సంతోషమె=పరమానందాన్నే; కోరున్=వాంఛిస్తుంది; నరుడు=మానవుడు; ఉత్సాహించి=ఉత్సాహంతో; నీ; భక్త సత్తమ=శ్రేష్ఠభక్తుల యొక్క; పూజారతి నేరునేన్=పూజలో ఆనందించ గల్గినట్లయితే; అతడు=అలాంటి పూజారతుడు; తత్త్వజ్ఞుండు=జ్ఞాని.

— సర్వేశ్వరా! మునుపు వేదపురాణ శాస్త్రాలు ప్రయత్నించి జ్ఞాన స్వభావాన్ని నిరూపింపలేకపోయాయి. మఱి ఆ తత్త్వాలు ఎలాంటివి అని అంటే అవి పరమానందాన్నే కోరేవి అని సమాధానం. మానవుడుత్సాహంతో నీ భక్త శ్రేష్ఠులకు పూజ చేయడంలో ఆనందించ గల్గితే మరి అతడే తత్త్వజ్ఞుడౌతాడు.

136. అమితోద్యద్భవదీయ తత్త్వము మహీయస్తోత్రవాణీవిలా
సములై యొప్పు సమస్త వేదములు శాస్త్ర శ్రేణియున్ దివ్య వి
భ్రమ నాదంబులు నెన్ని చూడ నివి నీ పంచాక్షరీమంత్ర భా
వములై యుండు సమస్త లక్షణములన్ వర్ణింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమిత=అవధి లేకుండా; ఉద్యత్=పైకి లేచిన; భవదీయ తత్త్వము=నీ యొక్క తత్త్వం; మహీయ=గొప్పవైన; స్తోత్రవాణీ విలాసములై=స్తోత్ర వాఙ్మయములకు సౌందర్యం కలిగించేవి అయి; ఒప్పు; సమస్త లక్షణములన్= అన్ని లక్షణాలను బట్టి; వర్ణింప=వర్ణిస్తే (వితర్కిస్తే); సమస్త వేదములు=అన్ని వేదాలు; శాస్త్ర శ్రేణియున్=శాస్త్రాల వరుసలు; దివ్య విభ్రమ నాదంబులు= ఆశ్చర్యం కలిగించే దివ్య నాదాలు; ఎన్ని చూడన్=ఎన్నింటిని చూసినప్పటికిన్నీ; ఇవి=ఇవి అన్నీ; నీ పంచాక్షరీ మంత్రభావములై=నీ యొక్క శివపంచాక్షరీ మంత్రం యొక్క భావాలే అయి; ఉండు=ఉంటాయి.

— సర్వేశ్వరా! నీ అపరిమిత తత్త్వం మహాస్తోత్రాలకు వన్నె దెచ్చేవిగా ఉన్నాయి. లక్షణాలన్నింటినీ చూస్తే వేదాలూ, శాస్త్రాలూ, మంత్రాలూ-ఇవన్నీ శివపంచాక్షరీ మంత్రభావంతోనే ఉంటాయి.

❋ స్తుతులన్నీ శివతత్త్వమే చెప్తాయి. వేద శాస్త్ర పురాణమంత్రాలన్నీ పంచాక్షరీ మంత్రసారాలే.

137. సంకీర్ణాకలితాక్షర త్రయము భాస్వన్నాద బిందు క్రమా
లంకార ద్వితయంబుతోఁ గలిసి లీలన్ దివ్యయోగీంద్ర హృ
త్పంకో ద్భూతములందు రూఢమగుచుం బంచాక్షరీ మంత్రమ
య్యోంకారాత్మకమౌ లసన్ముని గణం బూహింప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

సంకీర్ణ అకలిత=అక్షరం మరొక అక్షరంతో కలియని; అక్షర త్రయము= మూడు అక్షరాలు (శివాయ); భాస్వత్=ప్రకాశించే; నాదబిందు=నాదబిందువులనే; క్రమాలంకార=క్రమ పద్ధతితో కూడిన అలంకారమనే; ద్వితయంబుతో= రెండింటితో; కలిసి=కూడి; లీలన్=స్వాభావికంగా; దివ్యయోగీంద్ర= దేవతా యోగుల; హృత్=హృదయమనే; పంకోద్భూతములందు=కమలములలో; రూఢమగుచున్=పెరుగుతూ; పంచాక్షరీమంత్రము= శ్రీశివ పంచాక్షరి సమూహం; ఊహింప=భావించగా, ఆ ఓంకారాత్మకమౌ=ఆ ప్రణవాత్మ కలిగినది అవుతుంది.

- సర్వేశ్వరా! సంకీర్ణం కాని మూడక్షరాలు నాదబిందువులతో క్రమంగా కలిసి దివ్యయోగిశ్రేష్ఠుల హృదయ కమలాలలో పంచాక్షరీ మంత్రం, మునిగణం భావింపగా, ఓంకారాత్మకం అవుతుంది.

❄ శివాయ అనే మూడక్షరాలు. బిందువు శక్తి, నాదం శివుడు. నాద బిందు సంయోగమే జగత్సృష్టి.

❄ ప్రణవం అంటే ఓంకారం. శివపంచాక్షరి 'నమః శివాయ'. ప్రణవాన్ని సూక్ష్మ పంచాక్షరని అంటారు. నమః శివాయను ఓంకారానికి స్థూల రూపమంటారు.

❄ శివ పురాణంలో పంచాక్షరిని గురించి ఇట్లా ఉన్నది.

"ఈ పంచవర్ణంబులు వేర్వేరుగా బ్రయోగించునెడల బిందునాదములతో జేర్చి ప్రయోగింపవలయును. అందు బీజం బర్ధచంద్రాకృతిగను నాదము

దీప శిఖాకారముగ నుండును. ఇట్టి ఈ మంత్రమునకు 'మం' అనునది బీజము 'వాం' అనునది కీలకము. 'యం' అనునది శక్తి..."

పంచాక్షరికి 'ఓం'కారం వదనం. 'వా' 'య' కారాలు బాహువులు. 'శి' కారం నడుము, 'నమ' కారాలు అంఘ్రియుగం - అన్న అర్థాన్ని కలిగిన

"ఓంకార వదనా దేవీ। వాయకార భుజద్వయీ!
శికార దేహమధ్యాచ। నమకార పదద్వయీ!!
పంచాక్షరీ పరావిద్యా సతారా లింగరూపిణీ!
శివమంత్రాభిధా శైలీ మమాంగే సుప్రతిష్ఠితా!!"

శ్లోకాలున్నవి.

138. *అమల జ్ఞాన వికాస భాసురత నయ్యష్టాంగ పూజావిధి*
క్రమ యోగంబుల నిన్ను నెల్లపుడు జోకం గొల్వఁగానేల ని
క్కము నీ భక్తుల గోష్ఠి చాలుఁ గడు వీఁకన్ ఘోర సంసార దుః
ఖము లెల్లం బెడవాప నిన్ను వెలయంగాఁ జూప సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అమల=నిర్మలమైన; జ్ఞానవికాస=జ్ఞానం యొక్క వికాసమనే; భాసురతన్=ప్రకాశంచేత; ఆ అష్టాంగ పూజావిధి=ఆ ఎనిమిది విభాగాల పూజా పద్ధతి యొక్క; క్రమయోగంబులన్=వరుసగానున్న యోగాల చేత; నిన్నున్; ఎల్లపుడు=ఎప్పుడూ; జోకన్=బాగా; కొల్వఁగాన్ ఏల=సేవించడం ఎందుకు; ఘోర=భయంకరమైన; సంసార దుఃఖము లెల్లన్=సంసార దుఃఖాలన్నింటినీ; పెడవాప=పోగొట్టడానికీ; నిన్ను; వెలయంగా = స్పష్టంగా చూపడానికీ; నిక్కము= నిజం; నీ భక్తుల గోష్ఠి=నీ భక్తులతో సత్సంగం; చాలు=శక్తి కలిగి ఉన్నది.

— సర్వేశ్వరా! నిర్మల జ్ఞాన ప్రకాశంతో అష్టాంగ యోగాలతో పూజలతో నిన్ను సేవించడం ఎందుకు? నిజం. ఈ సంసార దుఃఖాలన్నిటినీ పోగొట్టడానికీ, నిన్ను స్పష్టంగా దర్శింపచేయడానికీ నీ శివభక్తులతో సత్సంగం ఒక్కటే చాలును.

139. శాకాబ్దంబులు వార్ధి షట్క పురజిత్సంఖ్యం బ్రవర్తింప సు
శ్లోకానంద కరంబు గా మహిమతో శోభిల్ల సర్వేశ్వర
ప్రాకామ్యస్తవ మొప్పఁజెప్పె శుభకృత్ ప్రవ్యక్త వర్షంబునన్
శ్రీ కంఠార్పితమై వసుంధర పయిం జెన్నొంద సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

శాకాబ్దంబులు=(శాలివాహన)శక సంవత్సరాలు

వార్ధి=సముద్రాలు (నాలుగు)4

షట్క=(ఆరు) 6,

పురజిత్=(పదకొండు) 11,

సంఖ్యన్ ప్రవర్తింప=అంకె కాగా (1164వ శక సంవత్సరమన్న మాట) సుశ్లోకానంద కరంబుగా=మంచి పద్యాలతో ఆనంద దాయకంగా; మహిమతో= గొప్పదనంతో; శోభిల్ల=ఒప్పగా, శుభకృత్ ప్రవ్యక్త వర్షంబునన్= శుభకృన్నామ సంవత్సరంలో; శ్రీ కంఠార్పితమై=నీలకంఠుడైన శివునకు సమర్పణగా; వసుంధరపయిన్=భూమిమీద; చెన్నొంద=రమ్యం కాగా; సర్వేశ్వర=సర్వేశ్వరుడనే; ప్రాకామ్య=ఐశ్వర్యం యొక్క; స్తవము=స్తుతిని; ఒప్పచెప్పె=ఉచిత రీతిన చెప్పినాడు.

— సర్వేశ్వరా! 1164 శక సంవత్సరం, శుభకృన్నామ వత్సరంలో, మంచి పద్యాలతో ఆనందదాయకంగా, శివార్పితమై లోకంలో ఒప్పునట్లుగా సర్వేశ్వర సంపద స్తుతిని చెప్పినాడు.

— 1164వ సంవత్సరానికి 78 సం॥లు కలిపితే క్రీ.శ. 1242 అవుతుంది. అన్నమయ్యా కవి యుక్తిగా ఈ స్తుతిని రచించిన కాలాన్ని చెప్పిన పద్యం ఇది.

— దీన్ని సర్వేశ్వర ప్రాకామ్యస్తవ మనడం విశేషం. అష్టవిధైశ్వర్యాలు (1) అణిమ(2) మహిమ(3) గరిమ(4)లఘిమ(5) ప్రాప్తి(6) ప్రాకామ్యము(7) ఈశిత్వము(8) వశిత్వము. వీటిల్లో ప్రాకామ్యం ఒక్కటి. ఐనా ఇక్కడ సర్వైశ్వర్యాలను ఈ శబ్దం ఉద్దేశిస్తున్నది.

140. అభిరమ్యంబుగ దూదికొండ మహనీయారాధ్య సోమేశ్వర
ప్రభుకారుణ్య వసంత సంజనిత మత్పద్య ప్రసూనావళిన్
విభవం బొప్పఁగఁగూర్చి యెంతయు లసద్విఖ్యాతి సంపత్ సుఖ
ప్రభవం బైన భవత్ పదద్వయము నారాధింతు సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

అభిరమ్యంబుగ=రమణీయంగా; దూదికొండ=దూదికొండ అనే గ్రామంలోని; మహనీయ ఆరాధ్య=గొప్పవాడూ, ఆరాధ్యుడూ అయిన; సోమేశ్వర ప్రభు=సోమేశ్వరుడనే గురువు యొక్క; కారుణ్య వసంత=దయ అనే వసంతం నుంచి; సంజనిత=పుట్టిన; మత్=నా; పద్యప్రసూనావళిన్=పద్య కుసుమరాశిని; విభవంబు=వైభవం; ఒప్పఁగ=కల్గేటట్లుగా; కూర్చి=పేర్చి, ఎంతయు=ఎంతో, లసత్=విలసిల్లే; విఖ్యాతి=ప్రఖ్యాతి; సంపత్ సుఖ=ఐశ్వర్యమనే సుఖాలకు;

ప్రభవంబు=జన్మస్థలి; ఐన; భవత్=నీయొక్క; పదద్వయమున్=పాదద్వయాన్ని; ఆరాధింతు=పూజిస్తాను.

— సర్వేశ్వరా! దూదికొండలోని మహనీయుడూ ఆరాధ్యుడూ ఐన సోమేశ్వరుని కారుణ్యమనే వసంతం వల్ల జనించిన నా పద్య కుసుమాలను వైభవంగా పేర్చి, కీర్తి సంపత్సుఖాలకూ జన్మస్థానమైన నీ పాదద్వయాన్ని ఆరాధిస్తాను.

❄ గురువుగారి ఊరి పేరు దూదికొండ. కర్నూలు జిల్లాలో ప్రత్తికొండ అని కొందరి అభిప్రాయం.

❄ ఆరాధ్యులు అన్నది శ్రౌత శైవ బ్రాహ్మణ కుల శాఖ.

❄ గురుకృప చేత ఈ పద్యాలను చెప్తున్నాను ఈ పద్య కుసుమాలతో సర్వేశ్వరుణ్ని అర్చిస్తున్నానంటున్నాడు కవి. గురుకృపతో పుట్టిన పద్యాలలో గురువు నర్చించకుండా మరొకరిని అర్చించడం ఎందుకంటే గురువుకీ ఈశ్వరుడికీ భేదం లేదనేదే శైవ మతాభిప్రాయం కాబట్టి అని సమాధానం.

141. ధాత్రిన్ భక్త జనాను రంజితముగాఁ దత్త్వ ప్రకాశంబుగాఁ
జిత్రార్థాంచిత శబ్ద బంధురముగా సేవ్యంబుగా సజ్జన
శ్రోత్రానందముగా శుభాన్వితముగా శోధించి సర్వేశ్వర
స్తోత్రంబన్నయ చెప్పె నిజ్జగములో శోభిల్ల సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

ధాత్రిన్=భూమి మీద; భక్తజన అనురంజితముగా=శివభక్తులకు ప్రీతి కలిగేటట్లుగా; తత్త్వ ప్రకాశంబుగా=శివజ్ఞానం తేటతెల్లం అయ్యేట్లుగా; చిత్ర అర్థఅంచిత=విశిష్టార్థాలతో కూడుకొన్న; శబ్ద బంధురముగా=శబ్దాలతో సుందరంగా; సేవ్యంబుగా=ఉపాసించతగిందిగా; సజ్జన శ్రోత్ర ఆనందముగా= సత్పురుషుల వీనులకు ఆనందం కలిగేటట్లుగా; శుభాన్వితముగా=శివంకరంగా;

శోధించి=పరిష్కరించి; ఈ జగములో=ఈలోకంలో; శోభిల్ల=శోభకలిగేటట్లుగా; అన్వయ=యథావాక్కుల అన్నమయ్య; సర్వేశ్వర స్తోత్రంబు=సర్వేశ్వరుని గురించిన స్తుతిని; చెప్పె=చెప్పినాడు.

— *సర్వేశ్వరా! భువిపై భక్త జనులకు ప్రీతి కలిగేటట్లుగా, శివతత్త్వం విశద మయ్యేటట్లుగా; చిత్రమైన అర్థాలతో కూడిన శబ్దాలతో ఒప్పునట్లుగా; సేవించదగిందిగా, సజ్జనుల వీనులకు ఆనందం కలిగేటట్లుగా; శుభంకరంగా, ఈ జగత్తులో శోభిల్లేటట్లుగా అన్నమయ్య కవి సర్వేశ్వర స్తోత్రం చెప్పాడు.*

❄ *దీన్ని ఈ పద్యంలో కవి సర్వేశ్వర స్తోత్రమనే అంటున్నాడు కాని, శతకం అనడం లేదు. 108 పద్యాలు కాకుండా 142 పద్యాలుండడం చేత దీన్ని శతకం అనడం లేదు. ఐతే శతకానికుండే 'మకుటం' అన్న లక్షణం ఈ అన్ని పద్యాలకీ ఉన్నది. శతకంలో ప్రధానంగా ఉండే భక్తి తత్పరత ఈ స్తోత్రంలో ప్రతి పద్యంలోనూ ఉన్నది.*

142. *జయశక్తిన్ రవిచంద్రతారకముగాఁ జల్పెన్ యథావాక్కులా*
న్వయదుగ్ధాబ్ధిజుఁడన్న మార్యుఁడవని న్వర్ణించి నీ సత్కథన్
బ్రియ సంబోధన నీదుభక్తిని మహానిర్ణీత విశ్రాంతిగా
భయ విభ్రాంతులు లేక యీ శతకముం బ్రఖ్యాతి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జయశక్తిన్=విజయశక్తితో; రవిచంద్ర తారకముగా= సూర్యచంద్రులుండేటంత వరకు; యథావాక్కుల అన్వయ=యథావాక్కుల వంశమనే; దుగ్ధాబ్ధిజుడు=క్షీర సముద్రంలో పుట్టినట్టి; అన్నమార్యుడు=అన్నమయ్య; అవనిన్=భువిపై; నీ సత్కథన్=నీయొక్క పుణ్యకథను; వర్ణించి=వివరించి; ప్రియ సంబోధన=ప్రేమ పూరితమైన పిలుపుతో; భయవిభ్రాంతులు లేక; నీదు భక్తిని=ఈశ్వర భక్తిని; మహా నిర్ణీత విశ్రాంతిగా=నిర్ణయింపబడిన గొప్ప

విరామస్థలిగా; ఈ శతకమున్=ఈ శతకాన్ని; ప్రఖ్యాతి చల్పెన్=ప్రఖ్యాతి చేశాడు. (కల్గించాడు)

— సర్వేశ్వరా! విజయశక్తితో ఆచంద్ర తారార్కంగా యథావాక్కుల వంశమనే పాల సముద్రంలో పుట్టిన అన్నమయ్య నీ సత్కథను వర్ణించి భయవిభ్రాంతులు లేక నీపై భక్తిని గొప్ప విశ్రాంతి స్థలంగా, ప్రేమపూరితమైన సంబోధనతో ఈ శతకానికి కీర్తి కల్గించాడు.

సర్వేశ్వర శతకం సంపూర్ణం.

శివార్పణమస్తు

☆ ☆ ☆

శోధించి=పరిష్కరించి; ఈ జగములో=ఈలోకంలో; శోభిల్ల=శోభకలిగేటట్లుగా; అన్నయ=యథావాక్కుల అన్నమయ్య; సర్వేశ్వర స్తోత్రంబు=సర్వేశ్వరుని గురించిన స్తుతిని; చెప్పె=చెప్పినాడు.

— *సర్వేశ్వరా! భువిపై భక్త జనులకు ప్రీతి కలిగేటట్లుగా, శివతత్త్వం విశద మయ్యేటట్లుగా; చిత్రమైన అర్థాలతో కూడిన శబ్దాలతో ఒప్పునట్లుగా; సేవించదగిందిగా, సజ్జనుల వీనులకు ఆనందం కలిగేటట్లుగా; శుభంకరంగా, ఈ జగత్తులో శోభిల్లేటట్లుగా అన్నమయ్య కవి సర్వేశ్వర స్తోత్రం చెప్పాడు.*

❋ *దీన్ని ఈ పద్యంలో కవి సర్వేశ్వర స్తోత్రమనే అంటున్నాడు కాని, శతకం అనడం లేదు. 108 పద్యాలు కాకుండా 142 పద్యాలుండడం చేత దీన్ని శతకం అనడం లేదు. ఐతే శతకానికుండే 'మకుటం' అన్న లక్షణం ఈ అన్ని పద్యాలకీ ఉన్నది. శతకంలో ప్రధానంగా ఉండే భక్తి తత్పరత ఈ స్తోత్రంలో ప్రతి పద్యంలోనూ ఉన్నది.*

142. *జయశక్తిన్ రవిచంద్రతారకముగాఁ జల్వెన్ యథావాక్కులా*
న్వయదుగ్ధాబ్ధిజుఁడన్న మార్యుఁడవని న్వర్ణించి నీ సత్కథన్
బ్రియ సంబోధన నీదుభక్తిని మహానిర్ణీత విశ్రాంతిగా
భయ విభ్రాంతులు లేక యీ శతకముం బ్రఖ్యాతి సర్వేశ్వరా!

సర్వేశ్వరా !

జయశక్తిన్=విజయశక్తితో; రవిచంద్ర తారకముగా= సూర్యచంద్రు లుండేటంత వరకు; యథావాక్కుల అన్వయ=యథావాక్కుల వంశమనే; దుగ్ధాబ్ధిజుడు=క్షీర సముద్రంలో పుట్టినట్టి; అన్నమార్యుడు=అన్నమయ్య; అవనిన్=భువిపై; నీ సత్కథన్=నీయొక్క పుణ్యకథను; వర్ణించి=వివరించి; ప్రియ సంబోధన=ప్రేమ పూరితమైన పిలుపుతో; భయవిభ్రాంతులు లేక; నీదు భక్తిని=ఈశ్వర భక్తిని; మహా నిర్ణీత విశ్రాంతిగా=నిర్ణయింపబడిన గొప్ప

విరామస్థలిగా; ఈ శతకమున్=ఈ శతకాన్ని; ప్రఖ్యాతి చల్పెన్=ప్రఖ్యాతి చేశాడు. (కల్గించాడు)

– సర్వేశ్వరా! విజయశక్తితో ఆచంద్ర తారార్కంగా యథావాక్కుల వంశమనే పాల సముద్రంలో పుట్టిన అన్నమయ్య నీ సత్కథను వర్ణించి భయవిభ్రాంతులు లేక నీపై భక్తిని గొప్ప విశ్రాంతి స్థలంగా, ప్రేమపూరితమైన సంబోధనతో ఈ శతకానికి కీర్తి కల్గించాడు.

సర్వేశ్వర శతకం సంపూర్ణం.

శివార్పణమస్తు

☆ ☆ ☆